# కథామంజరి



శ్రీ శుభకృత్ నామ సంవత్సరం ఉగాది
ప్రత్యేక సంచిక
ఏప్రిల్-2022

# కథామంజరి

## పది కథల సమాహారం



కథా మార్గదర్శి

జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకటరావు
ప్రచురణ కర్త

ఏప్రిల్ 2022 ఉగాది ప్రత్యేక సంచిక

© Copyright 2020 - Editorial Board Kathamanjari

# మా జట్టు


సంపాదకుడు

**జయంతి ప్రకాశ శర్మ**

ప్రచురణ కర్త

**అవసరాల వెంకటరావు**

సంపాదక సహకారం

**ఎం.ఏ. పద్మనాభరావు**
**కృపాకర్ పోతుల**

ప్రచురణా సహకారం

**ఎం.ఎల్. కాంతారావు**

సాంకేతిక సహకారం

**Harbinger Publishing**

బొమ్మలు

**కొయిలాడ రామ్మోహనరావు**
**కొచ్చెర్ల వి.ఆర్.**
**సూరంపూడి చలపతిరావు**

ముఖచిత్రం అందించిన బాలి గారికి కృతజ్ఞతలు

# కథామంజరి శ్రావ్యసంచిక

**ఈ ఉగాది ప్రత్యేక సంచికకి**
**'గళ' సహకారం అందించిన కళాకారులు**

- శ్రీ పప్పు భోగారావు గారు
- శ్రీ వెంపటి కామేశ్వర రావు గారు
- శ్రీ భువనపల్లి రంగనాథం గారు
- శ్రీమతి కరవది సరస్వతి గారు
- శ్రీ బి ఎస్ మూర్తి గారు
- శ్రీ అవసరాల రాఘవరావు గారు

**శ్రావ్యసంచిక కోసం ఇక్కడ నొక్కండి**

**శ్రావ్యసంచిక సబ్ స్క్రైబ్ చేయడానికి ఇక్కడ నొక్కండి**

# కథామంజరి

## శ్రీమతి పోడూరి నాగమణిశ్రీ స్మారక ఉగాది 2022 కథల పోటీ

### బహుమతులు పొందిన కథల జాబితా

| క్ర సం | కథ పేరు | రచయిత | వచ్చిన బహుమతి |
|---|---|---|---|
| 1. | తలపాగా | సింహప్రసాద్ | ప్రథమ బహుమతి |
| 2. | శంభుని పెళ్ళాం | భాగవతుల భారతి | ద్వితీయ బహుమతి |
| 3. | బోడి మావ | బట్టేపాటి జైదాస్ | తృతీయ బహుమతి |

### ప్రోత్సాహక బహుమతులు

1. నారు పోసిన వాడు .. రాపాక కామేశ్వర రావు
2. విలయం .. రాంభక్త పద్మావతి
3. ఐ వాంట్ జస్టిస్ .. పెనుమాక నాగేశ్వర రావు
4. గిరీశం@గంధవరం .. బి. వి. రమణమూర్తి
5. అమ్మా! ఆశ!! .. దత్త శర్మ
6. కొండపరియ .. ఈతకోట సుబ్బారావు
7. నూటికి నూట పది .. వి. పూర్ణ కామేశ్వరి
8. సహజ రంగుల ప్రకాశం .. దేవులపల్లి దుర్గాప్రసాద్
9. శిశిరాన్ని వెన్నంటిన వసంతం .. రేణుక జలదంకి
10. అనుదీప .. పి.వి.ఎస్. కృష్ణకుమారి
11. సునయన .. డా. ఎమ్. సుగుణరావు
12. మిథునం .. మణి వడ్లమాని

### సాధారణ ప్రచురణకు తీసుకున్న కథలు

1. గరీబీ(బ్) హటావ్, ద్విభాష్యం రాజేశ్వరరావు
2. మారని సమాజం, ఓట్ల ప్రకాష్ రావు
3. ఆచూకీ చెపుతారా ..?, బాడిశ హనుమంతరావు
4. అభిమన్యు, సింహప్రసాద్
5. జీవిత పరమార్థం, కె. వి. లక్ష్మణరావు
6. ప్రాణం, తులసి బాలకృష్ణ
7. వృత్తి ధర్మం, డి. మహబూబ్ బాషా
8. డామిట్ కథ అడ్డం తిరిగింది, వసుంధర
9. కానుక, ఎమ్ . విజయకుమార్
10. ఇచ్చట ఓట్లు అమ్మబడును, బలభద్రుని ఉదయ్ శంకర్
11. బంతి, కిరణ్ విభావరి
12. కాదేది కల్తీ కీ అనర్హం, కోయిలాడ రామ్మోహన్ రావు
13. ఇది సమంజసమా..? ఉమాబాల చుండూరు
14. నాస్తి బుద్ధి మతాం శత్రువు:, గంటి రమాదేవి
15. ఆకలి కేక, వేలూరి ప్రమీలాశర్మ
16. విద్యాదరి–కుక్క పిల్ల, చాగంటి ప్రసాద్
17. అత్తయ్య చీర, గొర్తి వాణి శ్రీనివాస్
18. తొలి అడుగు, సరస్వతి కరవది
19. టెండ్ వద్దు స్టాండర్డ్ ముద్దు, జ్యోతి సుంకరణం
20. రంగులమయం, శానపతి ప్రసన్న లక్ష్మి
21. అక్షరకాష్టం, బి. నర్సన్
22. వానప్రస్థం, రాధిక మంగిపూడి
23. శ్రమకి నీరాజనం, సింగరాజు శ్రీనివాసరావు
24. దిశ నిర్దేశం, కె. రవికుమార్
25. జగమంతా కుటుంబం, చలపాక ప్రకాష్
26. తమసోమా జ్యోతిర్గమయే!, డా. జడా సుబ్బారావు
27. శిక్ష, సుజన నామాని

*(ఈ కథలు తప్ప, మిగతా కథలను స్వీకరించడం లేదని రచయితలు గ్రహించగలరు. ఆ విషయమై వేరుగా మెయిల్ కూడా పంపబడదు.)*

# ఇదీ వరస

## శీర్షికలు


| | | |
|---|---|---|
| కథాకీయం | | i |
| విశిష్ట అతిథి | | iii |
| కథా మార్గదర్శి | | v |


## కథలు


| | | |
|---|---|---|
| తలపాగా | సింహప్రసాద్ | 1 |
| శంభుని పెళ్ళాం | భాగవతుల భారతి | 7 |
| బోడి మావ | బట్టేపాటి జైదాస్ | 12 |
| నారు పోసినవాడు | రాపాక కామేశ్వరరావు | 18 |
| విలయం | రాంభక్త పద్మావతి | 24 |
| ఐ వాంట్ జస్టిస్ | పెనుమాక నాగేశ్వరరావు | 28 |
| గిరీశం@గంధవరం | బి.వి. రమణమూర్తి | 33 |
| అమ్మో! ఆశ!! | పాణ్యం దత్తశర్మ | 38 |
| కొండ పరియ | ఈతకోట సుబ్బారావు | 43 |
| నూటికి నూట పది | వి. పూర్ణ కామేశ్వరి | 47 |
| సహజరంగుల ప్రకాశం | దేవులపల్లి దుర్గాప్రసాద్ | 52 |
| శిశిరాన్ని వెన్నంటిన వసంతం | రేణుక జలదంకి | 57 |
| అనుదీప | పి. వి. ఎస్. కృష్ణకుమారి | 61 |
| సునయన | డా. ఎమ్. సుగుణరావు | 66 |
| మిధునం | మణి వడ్లమాని | 70 |
| కథా మార్గదర్శి కథ<br>దగా పడిన తమ్ముళ్ళు | అంగర సూర్యారావు | 74 |

ఈ నెల కథామంజరి సంచికకి

వదాన్యులైన కథాభిమాని

## శ్రీ పి.వి.ఎస్.ఎల్.ఎన్.(పోడూరి) మూర్తి గార్కి

మా హృదయపూర్వక

# కృతజ్ఞతలు



"మా బాంక్ మిత్రులు చేస్తున్న
తెలుగు కథా సేవకి, ఒక చిన్న
ఊతగా ఈ బహుమతులు
అందచేస్తున్నాను. ఈ అవకాశం
నాక్కూడా బహుమతే!"

- పి.వి.ఎస్.ఎల్.ఎన్. మూర్తి

# కథాకీయం

మొత్తం మీద ఉగాది కథల పోటీలు విజయవంతంగా ముగిసాయి. సుమారుగా పదిహేను పత్రికలు, సంస్థలు ఈసారి పోటీలని నిర్వహించాయి. అంటే సుమారుగా రెండు వేల కథలు కొత్తవి వచ్చి, కథాప్రపంచంలో చేరాయన్నమాట! ఇందులో ఎనభై వసంతాలు పైబడిన రచయితల దగ్గర్నుంచి, కొత్తగా కథలు రాస్తున్న యువరచయితల వరకు కథలను పోటాపోటీగా సంధించారనే చెప్పాలి. ఇది చాలా ఆనందదాయకమైన విషయమే! 'అసలు రచయితలు మామూలుగా కథలు రాసి పంపడం లేదు, పోటీలకే కథలు రాస్తున్నారని' ఓ సాహితీ ద్రష్ట తను సేకరించిన విషయాల గురించి ఈ మాట చెప్పారు. కొంతవరకు నిజమే కావచ్చు.. కాని కథలు రాసేవారికి ఓ అర్ధ శతాబ్దం కిందటే.. ఈ సంచిక కథా మార్గదర్శి కీ.శే. అంగర సూర్యారావుగారు మంచి సూచనలు చేసారు. ఆయన మాటలను కథమార్గదర్శిలో పొందుపరిచాం! అలాగే నేటి విశిష్ట అతిథి, తెలుగు కథలను క్షుణ్ణంగా కాచి, వడబోసిన కథా విశ్లేషకులు డా. రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డిగారు కూడా ఎప్పటికప్పుడు కథల విషయంలో దశ దిశ నిర్దేశాలను సూచిస్తూనే ఉన్నారు. ఏదేమైనా సరే.. తెలుగు కథ ఇప్పటి మారిన సాంఘిక పరిస్థితులలో కూడా బాగానే నిలదొక్కుకుని ముందుకు ఠీవిగా నడుస్తోందనే చెప్పాలి!

ఎందుకంటే... రాశిలోనూ, వాసిలోనూ మంచి కథలే వచ్చాయి! పోటీకి వచ్చిన కథలలో మూడు వడబోతలు పట్టడం కష్టమే అయింది. ఆఖరి రౌండుకి న్యాయనిర్ణేత డా. రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డిగారికి పంపడం.. వారు చదివి చక్కటి, చిక్కటి ఫలితాలతో పాటు, వారి అభిప్రాయం కూడా ఇచ్చారు.

"ఈ పోటీకి వచ్చిన కథలు వర్తమాన సామాజిక వాస్తవికతనే వస్తువుగా తీసుకున్నాయి. చాలా కథలు వర్తమాన రాజకీయ వ్యవస్థను విమర్శనాత్మకంగా ప్రతిబింబించాయి. ఎన్నికల సమయంలో పార్టీలు ఓట్లకు డబ్బును పంచడం, ఓటర్లు అమ్ముడుపోవడం ....వీటి పర్యవసానాలను 'మారని సమాజం', 'ఐ వాంట్ జస్టిస్', 'కానుక',' ఇచ్చట ఓట్లు అమ్మబడును' వంటి కథలు అనేక రకాలుగా చిత్రించాయి. అయితే కొన్ని కథలు పార్టీలిచ్చే డబ్బును తీసుకొని, దాంతో గ్రామాభివృద్ధిచేయడం గురించి చెప్పాయి. అది అంత సబబుకాదు. అది డబ్బు తీసుకోవడాన్ని ప్రోత్సహించడమే ఔతుంది! 'అభిమన్యు' ప్రజాకళాకారులను బూర్జువా రాజకీయాలు ఎలా భ్రష్టు పట్టిస్తాయో చెప్పింది. ముఠారాజకీయాలను 'డామిడ్ కథ అడ్డం తిరిగింది' కథ ప్రదర్శించింది. రైతు ఆత్మహత్యను అనివార్యం చేస్తున్న స్థితిని 'బోడిమావ' కథ చెప్పగా, ముంపుగ్రామ ప్రజావేదనను 'తలపాగ' కథ ఆవిష్కరించింది. చెప్పులు కుట్టుకునే దళితుల జీవితాన్ని 'శంభుని పెళ్ళాం' కథ ప్రతిబింబించగా, దళితుల రాజకీయ చైతన్యాన్ని 'నారుపోసినవాడు' కథ ప్రతిఫలిస్తుంది. గిరిజన ఆదివాసీల జీవితసమరాన్ని 'కొండపరియ', 'అనుదీప' కథలు చిత్రించగా, గ్రామంలో పెత్తందారీ వాతావరణాన్ని 'విలయం' కథ ప్రదర్శించింది. సమాజంలోని దళారి వ్యవస్థను 'గంధవరం@గిరీశం' కథ అధిక్షేపిస్తుంది. యుద్ధోన్మాదాన్ని, దాని దుష్ఫలితాలను 'ఆచూకి చెబుతా', ' తుపాకి స్పర్శ' కథలు ప్రదర్శించాయి. దేశంలో మతతత్వం ముదిరి, అమానుషంగా, అనాగరికంగా మారుతున్న సమయంలో 'నూటికి నూటపది', 'సహజరంగుల ప్రకాశం' 'సునయన' కథలు మతసామరస్యాన్ని ప్రబోధించాయి. 'సునయన' విద్యాసంస్థల్లో ముస్లిం బాలికల డ్రెస్ కోడ్ వివాదాన్ని విమర్శించి, వ్యక్తి స్వేచ్ఛను సమర్థించింది. 'అమ్మ ఆశ' కథ తెలుగు రాష్ట్రాల్లో అధికార ప్రతిపక్షపార్టీలు నిరంతరం పరస్పరాహరణోద్యోగంలో నిమగ్నం కావడాన్ని విమర్శించి, రెండు పార్టీల మధ్య నిర్మాణాత్మక సంబంధాన్ని ప్రతిపాదించింది. ఇది ఉటోపియా కథ. 'మిథునం' వృద్ధదంపతులు ఊరి రోడ్ల మరమ్మత్తు చేపట్టిన తీరును చిత్రించిన ఆదర్శకథ. అత్తాకోడళ్ళ సంబంధాలను చిత్రించి, కోడలు పశ్చాత్తాప పడడాన్ని చూపినకథ 'శిశిరాన్ని వెన్నంటిన వసంతం' కథ. సంక్షేమ దృష్టితో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత పథకాలను అధిక్షేపిస్తూ 'గరీబీ హటావో', ' ప్లాస్టిక్ సర్జరీ' కథలు వచ్చాయి. ఈ విషయంలో రచయితలు సంయమనం పాటించాలి. పేదలకు అమలు చేసే కార్యక్రమాల వల్ల

రాష్ట్రం వెనిజులా అయిపోతుందని అనడం హేతుబద్ధం కాదు. పేదలపథకాలను విమర్శించే ముందు విమర్శించవలసినవి చాలా ఉన్నాయి. వాటిని విస్మరించి, పేదల పథకాలతో రాష్ట్రం చెడిపోతుందనడం ప్రజావ్యతిరేక ఆలోచన.

కథా రచయితలందరికీ అభినందనలు. పోటీ నిర్వాహకులకు అభినందనలు. విజేతలకు శుభాకాంక్షలు."

అలా.. పోటీకి వచ్చిన కథలలో ఓ ఎనభై శాతం కథలను వెనక్కి తిప్పాలనిపించలేదు. కాని వాటిని ప్రచురించే సరికి చాలా కాలం పడుతుంది. అందుకే బహుమతుల కథలతో పాటు, మరో ఇరవై ఏడు కథలను మాత్రమే సాధరణ ప్రచురణకు తీసుకున్నారు. వచ్చే ఆరు నెలలో వాటి ప్రచురణ జరుగుతుంది!

ఇక.. పోటీకి ఆర్థిక సహకారం అందించిన శ్రీ పి.వి.యస్.యల్.యన్. మూర్తిగారు భారతీయ స్టేట్ బ్యాంక్ లో చీఫ్ జనరల్ మేనేజర్ గా పదవి విరమణ చేసారు. ప్రస్తుతం.. "నార్త్ ఈస్టర్న్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్, ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ గా అస్సాంలో సేవలందిస్తున్నారు. కుటుంబసభ్యులందరూ సాహితీప్రియులే!

దిగ్విజయంగా ముగిసిన కథాసంబరానికి న్యాయనిర్ణేతగా వ్యవహరించిన డా. రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డిగారికి, నగదు బహుమతులు అందచేస్తున్న శ్రీ పి.వి.యస్.యల్.యన్. మూర్తిగారికి కథామంజరి కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నాం.

**సంపాదకుడు**

# విశిష్ట అతిథి



**డా. రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు**

ఆయనతో మాట్లాడినది.. కొన్ని నిమిషాలే... అది కూడా చరవాణిలో! అలా కొద్ది నిమిషాలు మాట్లాడినా.. అనంతమైన విజ్ఞానంతో మూర్తీభవించిన ఓ సాహితీమూర్తితో సంభాషించడం ఓ అపూర్వమైన విషయం నా బోటి వాడికి! తర్వాత ఆయన గురించి చదివినప్పుడు, ఆయన చెప్పిన ఓ మాట మనసుకు హత్తుకుంది. "సమాజం మనకేమిచ్చింది' అని అలోచించడం కంటే, మనం ఏం చేయగలమో చెప్పగలగాలి. అదే సాహిత్యం అందించే జీవ లక్షణం!" ఈ మాటలన్నీ చేతలలో చూపించి, కవిగా, కథారచయితగా, విమర్శకునిగా, విలువలతో కూడిన సాహిత్యాన్ని అందించిన ఓ స్ఫూర్తి ప్రదాత డా. రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డిగారు!

డా. చంద్రశేఖర్ రెడ్డిగారికి చిన్నతనం నుండి పుస్తకాలు.. ముఖ్యంగా కథలు చదవడం ఓ అలవాటుగా మారడంతో, ఆ రోజుల్లోనే ఆ కథాంశాల మీద మిత్రులతో చర్చలు నిత్యం జరుపుతూ ఉండేవారు. ఈ అలవాట్లు కథా సాహిత్యం మీద ఆశక్తి, జిజ్ఞాస కలగడానికి ప్రేరణ కలిగించాయి. ఆ విషయమే అడిగినప్పుడు.. గురజాడ అప్పారావుగారి కథా సాహిత్యం తన మీద చాలా ప్రభావం చూపెట్టాయని తెలియచేస్తూ... "ఒకప్పుడు కథా సాహిత్యమంటే సంప్రదాయరీతిలో అన్నీ ఒకేలా ఉండేవి. కాలక్రమేణా వాటికి కాలం చెల్లి, సమకాలిన సమస్యల మీద కథలు రూపుదిద్దుకున్నాయి. ఇప్పుడు నా కథా వస్తువు తొలినాళ్లలో ఉన్నట్టు కాకుండా ఒరవడి మారింది" అంటారు. కథలు రాయడంతో రచయిత పని అయిపోయిందని భావించడం సరియైనది కాదని గ్రహించి, తన కలంత... వికృత చేష్టలు చేస్తున్న సమకాలీన విషయాలను ఎత్తి చూపెట్టే రచనా వ్యాసంగం సాగిస్తూ, మరోవైపు వాటి పరిష్కార మార్గాలను కూడా సూచించే మార్గం చేపట్టారు.

తిరుపతి సమీపంలో కుంట్రపాకంలో 1948లో అత్యంత నిరుపేద కుటుంబంలో జన్మించిన డా. చంద్రశేఖర్ రెడ్డి గారు బాల్యం నుంచే పొలం పనులు చేసుకుంటూ పాఠశాల, కళాశాలల్లో చదువు విజయవంతంగా ముగించారు. ఆరు కిలోమీటర్లు రోజు నడుచుకుంటూ వెళ్ళి, యూనివర్సిటీలో ఎం. ఏ., పి.హెచ్.డి. లు చేసారు. "అప్పటి గురువులకు పాఠలు చెప్పడమే పనిగా ఉండేది. శిష్యులను తీర్చిదిద్దడమే పరమావధిగా ఉండేది. ఆ స్ఫూర్తితోనే నేను కూడా నా దగ్గర చదువుకున్నవారిని తీర్చిదిద్దడానికి కృషి చేసాను. నేను ఆశించినట్టే... కీర్తి ప్రతిష్టలు సాధించుకున్న శిష్యులు ఉన్నారనే తృప్తి నాకిప్పుడుంది!" అంటూ ఆనందంగా చెప్పుకునే.. డా. చంద్రశేఖర్ రెడ్డి గారు 1977 ఆగస్టులో.. అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో లెక్చరర్‌గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించి, 2008 లో ఆచార్యుడుగా ఉద్యోగ విరమణ తర్వాత, యోగి వేమన యూనివర్సిటీలో ఆరు

సంవత్సరాలు ప్రొఫెసర్ గా పని చేసారు. అరసం రాష్ట్రాధ్యక్షులుగా, జన విజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షులుగా, రాష్ట్ర అధికార భాషా సంఘం సభ్యులుగా, నేషనల్ బుక్ ట్రస్టు తెలుగు సలహా మండలి సభ్యులుగా సేవలు అందించారు. ప్రస్తుతం కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యుడుగా ఉన్నారు.

నిత్య జీవతంలో ఎదురయే సమస్యలు, కరువు కాటకాలు, ఫ్యాక్షనిజం, రాజకీయాలు.. కవితా వస్తువులుగా 'రెండు ప్రపంచాలు, స్వర్ణభారతి సాక్షిగా, సీమ నానీలు, పొలి' వంటి కవితా సంకలనాలు, 'గురజాడ తొలి కొత్త కథలు, చర్చ మరో చర్చ, విమర్శ 2009' వంటి విమర్శనా గ్రంథాలు వీరి కలం నుంచి జాలువారినవి. "శిల్పప్రభావతి" నుండి విమర్శావరణం" దాకా 30 విమర్శ గ్రంథాలు, దూర విద్యావాచకాలకి పాఠాలు రాసారు. అనేకమంది రచయితల ప్రసిద్ధ కథలపై వీరు రాసిన గ్రంథం "ప్రతిఫలనం" పండిత పామరులను కదిలించింది. అలాగే వీరి మరో అద్భుతమైన రచన "మన నవలలు – మన కథానికలు" పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడమీ –2014 పురస్కారం లభించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవలే "వైయస్సార్ లైఫ్ టైం అచీవ్ మెంట్" పురస్కారంతో వీరిని గౌరవించింది. ఎంతోమంది విద్యార్థులు వీరి పర్యవేక్షణలో పి.హెచ్.డి చేస్తే, వీరి గ్రంథాలమీద మరి కొంతమంది విద్యార్థులు వివిధ యూనివర్సిటీల నుంచి పి.హెచ్.డి.లు చేసారు.

"నాలోనూ మంచి రచయిత ఉన్నాడని గుర్తించి ప్రోత్సహించిన తొలి వ్యక్తి శ్రీ తుమ్మపూడి కోటేశ్వరరావు గారు. అలాగే ఆచార్య జి.యన్. రెడ్డి, జాస్తి సూర్యనారాయణ, తిమ్మావఝుల కోదండరామయ్య, మద్దూరు సుబ్బారెడ్డి, ఆచార్య నాగయ్య వంటి ఎంతోమంది గురువులు నన్ను తీర్చిదిద్ది, వెన్నుతట్టి ముందడుగు వేయడానికి ప్రోత్సహించారు.

"రచయితలు ముఖ్యంగా నిబద్ధతతో ఉండాలి. సమస్యలను రచనల ద్వారా ఆవిష్కరించడమే కాదు, ఆ సమస్యలకు పరిష్కారం కూడా చూపాలి. మన చుట్టూ ఉన్న సమాజాన్ని అర్థం చేసుకోవాలి. ఒక్కరోజులోనే గొప్ప పేరు వచ్చేయాలనుకోవడం మంచిది కాదు. బాగా చదవాలి, చదివినదాన్ని ఆకళింపు చేసుకోవాలి. ఆ తర్వాత రాస్తే, తప్పకుండా అది మంచి రచన అవుతుంది, ప్రజల్లోకి వెళ్తుంది! అప్పుడే రచనకు సార్థకత వస్తుంది!" అని రచయితకు సూచనలు అందించే డా. చంద్రశేఖర్ రెడ్డిగారు గత ఐదు దశాబ్దాలుగా విమర్శన రంగంలో కృషి చేస్తూ, విస్తృతంగా విమర్శాగ్రంథాలు రాసారు.

ఇలా ఎంత చెప్పుకున్నా తరగని సాహితిసంపదతో, సౌమ్యంగా, హుందాగా తెలుగు సాహిత్య రంగంలో ఎనలేని కృషి చేస్తున్న డా. రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి గారు ఈ సంచికకు విశిష్ట అతిథిగా విచ్చేయడమే కాకుండా, ఉగాది కథల పోటీకి న్యాయనిర్ణేతగా వ్యవహరించినందులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం! వారినుంచి మరిన్ని కథా సాహిత్య రసగుళికలూ, విశ్లేషణా ఔషధాలూ వెలువడాలని ఆశిస్తున్నాం!

**కథామంజరి బృందం**

# కథా మార్గదర్శి



**శ్రీ అంగర సూర్యారావు గారు**

సమాజంలో కనీ కనిపించని సజీవపాత్రల్ని తన కథల ద్వారా జనరంజకం చేసి, కుటుంబ సమస్యలే కాకుండా తనకి కనిపించిన సమస్యలన్నిటినీ కథల మాలలు అల్లి, పేరు గడించిన సాహితీవేత్త కీ.శే. అంగర సూర్యారావు గారు. అయితే కథలలో పాత్రలు, సంఘటనలు కొంతమేర వాస్తవ స్థితిగతులను సమాజానికి అందించగలవు గాని, రంగస్థలంలో మరింత మేలైన రీతిలో ఆయా విషయాలని దృశ్యరూపంలో చూపెట్టగలమనే మరో ఆలోచనతో సూర్యరావుగారు నాటక రచయితగా కూడా అవతారం ఎత్తారు. రంగస్థలంపై సహజమైన జీవితాలను చూపెట్టడానికి కొన్ని పరిమితులున్నా, తన నాటికల ద్వారా తన ఆశయ సిద్ధికి కృషి చేసి విజయాలు పొందారు.

ఆ రోజుల్లో "చిత్రగుప్త" పత్రికలో కథ ప్రచురణమవడం ఓ గుర్తింపుగా ఉండేది. రచయితలకు ఓ వేదికగా ఆ పత్రికకు పేరుంది. కాళీపట్నం రామారావుగారు, రావిశాస్త్రిగారు, గొల్లపూడి మారుతీరావుగారు.. వంటి ప్రముఖ రచయితలు తమ రచనావ్యాసంగాన్ని "చిత్రగుప్త" ద్వారానే ప్రారంభించినట్టు.. అంగర సూర్యారావుగారు కూడా అదే అల వరసలలో రచనా వ్యాసంగంలోకి అడుగు పెట్టారు.

సూర్యారావుగారు 1927 జూలై 7 తేదిన మండపేట (తూగోజి)లో జన్మించారు. అక్కడ హైస్కూల్ లో విద్యాభ్యాసం జరుగుతున్నపుడు, రెండవ ప్రపంచం యుద్ధం జరిగింది. దాంతో చదువు సాగలేదు. ఆ సమయంలోనే ఊర్లో ఉన్న గ్రంథాలయంలోని ఉన్న పుస్తకాలను ఆశ్రయించారు. 1945 వ సంవత్సరంలో "మా గ్రామం" అనే వ్యాసం రాసి పంపితే, కృష్ణాపత్రిక లో ప్రచురించారు. దరిమిలా 1948లో సర్వీసు కమిషన్ పరీక్ష పాస్ అయి, విశాఖపట్నంలో డి.ఇ.ఓ. ఆఫీసులో గుమస్తాగా చేరారు. మరోవైపు తన ప్రవృత్తిగా ఎంచుకున్న రచనా వ్యాసంగంలో అనతికాలంలోనే మంచి గుర్తింపు సంపాదించి, సమకాలికులు, మంచి స్నేహితులైన రావిశాస్త్రి గారు, కారా మాష్టారు వంటి మేటి రచయితలతో కలసి 1958లో 'విశాఖ రచయితల సంఘం' స్థాపించారు. ఆరు దశాబ్దాల చరిత్రతో ఈ రోజు కూడా ఈ "విశాఖ రచయితల సంఘం" సాహితీ కార్యక్రమాలు జరుపుకుంటున్నదంటే... అది ఆనాడు సూర్యారావుగారు వేసిన పునాదే అని చెప్పాలి.

వీరి మొదటి కథ "ద్రోహి" వినోదిని పత్రికలో 1947లో ప్రచురితమయింది. అభిసారిక పత్రికలో ప్రచురితమైన కథకు, తొలిసారిగా సూర్యారావుగారు పారితోషికం అందుకున్నారు. అయితే ఆ పారితోషకంతో 'చాంబర్స్ ట్వంటియత్ సెంచరీ'

డిక్షనరీ కొన్నారుట.. ఇప్పటికి అది వారింట పదిలంగానే ఉంది. అప్పట్లో విశాఖ రచయితల సంఘంలో సీనియర్ రచయితలు ఎవరూ కథల పోటీలలో పాల్గొనకూడదనీ, యువరచయితలకు, వర్ధమాన రచయితలకు ఆ అవకాశాన్ని విడిచిపెట్టాలనీ నిర్ణయం తీసుకున్నారు. ఆ తర్వాత రోజుల్లో.. "అడవి గోల" కథని ఆంధ్రజ్యోతి వారపత్రికకు పంపితే, వారు ఆ కథను "అమెరికా ఆంధ్ర సంఘం" వారు నిర్వహించిన కథల పోటికి పంపడం.. అందులో రెండవ బహుమతి రావడం జరిగింది. ఆంధ్రజ్యోతి వారికి నిరసన వ్యక్తపరచమని స్నేహితులు చెప్పనా సరే, 'దాని వలన ప్రయోజనం లేదు. ఎడిటర్ ని ఇబ్బంది పెట్టడమే అవుతుందని' సూర్యారావు గారు పెద్దమనసుతో ఊరుకున్నారుట!

సూర్యారావుగారి కథలలో.. అడవి గోల, ఏడడుగుల వ్యాపారబంధం, కాలం మారినా కథ ఒక్కటే, కొత్త కథలో బొరుసు, గాలి మేడ, జరిగిన కథ, దొంగలు పడిన రాత్రి, పరాజితులు, సంతాప సభ, సలహా ఖరీదు వెయ్యి రూపాయలు వంటి కథలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. రెండు శతాబ్దాల విశాఖ చరిత్ర, తెలుగు సాహిత్య చరిత్రలో విశాఖపట్నం, తెలుగు సాహిత్య చరిత్రలో ఉత్తరాంధ్ర..' మొదలగు వ్యాస సంపుటిలు ఆయన కలం నుండి జాలువారినవే. ఇక నాటికలు, నాటకాల మాట చెప్పుకోస్తే.. కళోద్ధారకులు, శ్రీమతులు – శ్రీయుతులు, నీలి తెరలు, పాపిష్టి డబ్బు, ఇది దారి కాదు, చంద్రసేన.. ఇలా ఆయనవన్నీ జనాన్ని అలరించినవే. ఆయన వ్రాసిన నాటికలు ఇతర రాష్ట్రాల్లో కూడా ప్రదర్శింపబడి, పేరు తెచ్చాయి. "కథలు, గల్పికలు, స్కెచ్ లు రాయడం కన్నా, నాటికలు రాయడం కష్టం! సమాజానికి సూటిగా సందేశం ఇవ్వగలిగే శక్తి నాటకానికి ఉంది. నాటక రచనకు వీలుగాని మంచి ఇతివృత్తాలు తట్టినప్పుడు, వాటిని కథలుగా వ్రాసేవాడ్ని!" అంటూ తన రచనానుభవం గురించి చెప్పే సూర్యారావు గారికి 'కథా రచయిత' కంటే 'నాటక రచయిత' గానే ఎక్కువ పేరు వచ్చింది. దీనికి నిదర్శనంగా.. వీరి 'చంద్రసేన' నాటకానికి 1978లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు లభించింది.

ప్రఖ్యాత నాటక ప్రయోక్త అత్తిలి కృష్ణారావు గారి సోదరి పద్మావతి గారితో వీరికి ప్రేమ వివాహం జరిగింది. అరవై ఏళ్ల వైవాహిక జీవితంలో ఆవిడ ప్రోత్సాహం, సహకారంతోనే నేను ఇన్ని రచనలు చేయగలిగాను. మాకు సాహిత్యమే లోకం. అచ్చేసిన పుస్తకాలే సంతానం!" అంటూ ఎప్పుడూ సాహిత్యం గురించే చింతన చేస్తూ, ఎన్నో కొత్త సంగతులతో రెండు పుస్తకాలు వ్రాస్తూ.. వ్రాస్తూ.. 2017 సంవత్సరంలో తుదిశ్వాస విడిచారు!

"నా దగ్గర చాలా విలువైన గ్రంథాలున్నాయి. వాటిలో అరుదైన సమాచారం ఉంది. వాటిని భావి తరాలకి అందించాలన్నదే నా లక్ష్యం! అలాగే వర్ధమాన రచయితలు.. ఏం రాసినా ప్రజల కోసం రాయాలి. ఏదైనా అంశం మీద రాసేటపుడు, అంశాన్ని పూర్తిగా చదివి తెలుసుకుని, రచనలు చేస్తే సమాజానికి మంచి జరుగుతుంది! లేకపోతే ఆ రచనలు ప్రజలకి కీడే చేస్తాయి.. చరిత్రని వక్రదారి పెడతాయి! అంతకంటే రాయకుండా ఉండటమే మేలు!" అని సూర్యారావు గారు నిత్యం చెపుతునే ఉండేవారు.

ఉత్తరాంధ్ర సాహిత్య చరిత్రలో చెప్పుకోదగ్గ కథా రచయిత, తెలుగు నాటక రంగంలో మంచి పేరు తెచ్చుకున్న నాటక రచయిత.. వెరసి తెలుగు సాహిత్య రంగంలో మరో మెరుపుతీగ కీ.శే. అంగర సూర్యారావుగారిని ఈ నాలుగు మాటల ద్వారా తలుచుకోవడం వారికి ఘనమైన నివాళిగా భావిస్తూ, వారి ఆదర్శాలు, సందేశాలు తప్పకుండా వర్ధమాన రచయితలకు ప్రేరణ కలిగిస్తాయని ఆశిస్తున్నాం!

**కథామంజరి బృందం**

# తలపాగా

**సింహప్రసాద్**



శ్రీ శుభకృత్ నామ సంవత్సర ఉగాది సందర్భంగా కథామంజరి నిర్వహించిన శ్రీమతి పోడూరి నాగమణిశ్రీ స్మారక కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన కథ – "తలపాగ" రచన: సింహప్రసాద్

తెలుగు కథాప్రియులకు పరిచయం చేయనవసరం లేని జగమెరిగిన కథారచయిత 'సింహప్రసాద్' గారు. రాసిన కథలలో నాలుగో వంతు కథలకు బహుమతులు వచ్చాయంటే, రాసితో పాటు వాసి ఉన్న కథలు రాయడంలో సింహప్రసాద్ గారి నిబద్ధతని తెలియచేస్తుంది. ఇంతవరకు 445 కథలు, 70 నవలలు, నాటికలు రాస్తే, అందులో 112 కథలకు, 18 నవలకు, రెండు నాటకాలకు బహుమతులు వచ్చాయి. ఈ మధ్యనే బహుమతులు వచ్చిన వంద కథలతో ఓ సంకలనం కూడా వెలువడింది. సింహప్రసాద్ గారి కొన్ని రచనలు కన్నడం, ఇంగ్లీషు లోకి అనువదింపబడితే, వారి కథల మీద పలువురు పరిశోధనలు చేసి, పి.హెచ్.డి. పొందారు. 1948 లో ప.గో.జి. లో పుట్టి, పెరిగి ఇండియన్ బ్యాంక్ లో సీనియర్ మేనేజరుగా పదవి విరమణ చేసి, హైదరాబాదు లో స్థిరనివాసంలో సాహితీ సేవలు అందిస్తున్నారు.

సింహప్రసాద్ గారి కథ "తలపాగ" వారి బహుమతి వచ్చిన కథలలో 113 వ కథ!

కథామంజరి... సింహప్రసాద్ గారికి అభినందనలు అందిస్తూ, వారు త్వరలో బహుమతులలో డబుల్ సెంచరీ చేయగలరని ఆశిస్తున్నాం!

నీటి పారుదల ప్రాజెక్టుకు అనుబంధంగా జలాశయం నిర్మిస్తూ, రెండు గ్రామాలని సేకరించింది ప్రభుత్వం.

గత పది పదిహేను రోజుల్నుంచీ ఆ ఊళ్ళని ఖాళీ చేయిస్తున్నారు. వారికోసం రీహాబిలిటేషన్ అండ్ రీసెటిల్‌మెంట్ కాలనీ ప్రత్యేకంగా నిర్మించారు. ఆసక్తి కనబరిచిన ముంపు గ్రామాల జనానికి అందులో ఇళ్ళు కేటాయించారు. నెల రోజుల్నుండీ త్వరగా గ్రామాన్ని వీడి తరలి వెళ్ళిపోవాలని ప్రభుత్వాధికారులు ఒత్తిడి తెస్తున్నారు. దాంతో నష్టపరిహారం పూర్తిగా అందకపోయినా సరే, కోర్టులో పరిహార పెంపు కేసులు నలుగుతున్నందున ఆందోళన బాట వదిలేశారు. మరి గత్యంతరం లేదని గ్రహించి మూటా ముల్లె సర్దుకున్నారు.

ఊళ్ళోని మూడువందలు ఏభై మూడు గడపల్లో మూడొందల ముప్పై చిలుకు తరలి వెళ్ళారు. మిగతావారు ఇదిగో.. ఇప్పుడు వదలలేక వదలి వెళ్తున్నారు. ఆ రాత్రికే ముంపు నీరు వదులుతారనీ, ఊరు సమూలంగా మునిగిపోతుందనీ హెచ్చరించడంతో వూరొదలక తప్పటంలేదు.

ప్రభుత్వం ఏర్పాటుచేసిన టొయోటా మీద, వివిధ బళ్ళ మీద కాందిశీకుల్లా వెళ్తున్నారు.

అంతా నీరసంగా నిస్తేజంగా వున్నారు. కని, పెంచి, పెద్దచేసిన తల్లిదండ్రులిద్దరికీ ఒకేసారి తలకొరివి పెట్టి వస్తున్నట్లుగా వున్నారు. ఆడవాళ్ళకు ఎక్కడా దుఃఖం ఆగటం లేదు. ఒకర్నొకరు కావలించుకుని బావురుమంటున్నారు. బేలగా చూస్తూనే ఒకర్నొకరు ఓదార్చుకుంటున్నారు.




గ్రామ పొలిమేర దాటుతూంటే ఒక అవ్వ ఒంటేలు వంక పెట్టి వాహనం దిగింది. ఆ మరుక్షణం, “నేను రాను. మీరు పోండి...” అంటూ విసవిసా ఊరివైపు నడవసాగింది.

ఆమె కొడుకూ కోడలూ పరుగున వచ్చి ఆమెని ఆపారు. ఎంత నచ్చచెప్పినా పంతం వీడలేదు. ‘పుట్టిన గడ్డని వదల్లేను. ఈ మట్టిలో కలిసిపోతాను’ అంటూ నేలమీద చతికిలబడింది కన్నీరు మున్నీరవుతూ. మిగతా జనమంతా వచ్చారు. కావలించుకున్నారు. కంటనీరు పెట్టుకున్నారు. ఆమెని ఓదారుస్తూనే లేవదీసి తీసుకువెళ్ళారు. ఎవరి మనసూ మనస్సులో లేదు. కన్నీటితో తడవని కన్ను ఒక్కటీ లేదు. వెనక్కెనక్కి తిరిగి ‘కడచూపు’ చూస్తూ వీడలేక వీడుతున్నారు. దు:ఖం పొగిలి వస్తోంది. గుండె రాయి చేసుకుని భారంగా కదిలారు.

వారంతా ఊరు దాటుతోంటే ఒక పెద్దాయన ఊళ్ళోకి వెళ్తూ కన్పించాడు. ఆశ్చర్యచకితులయ్యారు. చిత్రంగా చూశారు.

“బాలయ్యలా వున్నాడే?” ఒకరు కళ్ళపైన చేయి అడ్డం పెట్టుకుని చూస్తూ అన్నారు.

“బాలయ్యే!” అన్నాయి నాలుగు గొంతులు.

“బాలయ్యా! బాలయ్యా!” గొంతెత్తి పిలిచారు. అతడు వినిపించుకోలేదు. తల తిప్పి చూడలేదు. అన్యమనస్కంగా వడివడిగా సాగిపోతున్నాడు.

“వాళ్ళు వూరొదిలి వెళ్ళిపోయి వారం రోజులవ్వదూ! మళ్ళీ ఎందుకొచ్చాడబ్బా!”

“ఇంట్లో ఏదైనా మరచిపోయాడేమో. దాని కోసం వచ్చుంటాడులే!”

"ఈ రాత్రికి ఊరు మునిగిపోద్దని పాపం తెలుసో లేదో?"

"తెలియకుండా ఎలా వుంటుందిలే!"

కనుమరుగవుతున్న అతడి వంక సానుభూతిగా బాధగా చూస్తూ కదలిపోయారు.

విసురుగా నడుస్తున్న బాలయ్య అమ్మవారి గుడి ముందు ఆగాడు. దగ్గరికి వెళ్ళి గుడి గుమ్మం ముందు కూలబడ్డాడు. వారం రోజుల క్రితం గ్రామస్తులంతా కలిసి అమ్మవారికి మేకపోతు బలిచ్చి జాతర చేశారు. 'మేం ఎక్కడున్నా చల్లగా వుండేట్లు దీవించు తల్లీ' అని ప్రార్థించారు.

రాతి అమ్మవారిని అలానే వదిలేసి ఊరొదిలారు.

'ఇన్నేళ్ళూ మమ్మల్ని కాచి రక్షించిన నిన్ను ఇప్పుడెవరు రక్షిస్తారు తల్లీ. ఈ రాత్రికే ఊరు మునిగిపోద్ది. పొలాలూ, ఇళ్ళూ, చెట్లూ చేమలూ అన్నీ నీట మునిగిపోతాయి. నువ్వూ నీ గుడీ కూడా...!'

ఏడుపు తన్నుకొచ్చింది. పై పంచె నోట్లో కుక్కుకున్నాడు.

కాస్సేపు అమ్మవారినే తదేకంగా చూస్తూ కూర్చున్నాడు. ఆమె తన వంక వేదనగా చూస్తున్నట్టు అనుభూతించాడు.

మెల్లగా లేచి, అమ్మవారి ఎర్రని బొట్టు నుదుటికి పెట్టుకున్నాడు. దణ్ణం పెట్టుకుని, ఊరవతలకి పొలాలవైపు వేగంగా అడుగులేశాడు బాలయ్య. పొలానికెళ్తూనే మరి శక్తి లేనట్టు కూలబడిపోయాడు. దు:ఖం పెల్లుబికింది. మట్టిని చేతుల్లోకి తీసుకుని బావురుమన్నాడు. నిన్నమొన్నటిదాకా ఆ భూమి తనదే. దాన్ని జలాశయం కోసం ప్రభుత్వం తీసేసుకుంది. నోట్లో మన్ను పోసినట్టు భావించి విలవిల్లాడాడు.

అతడో చిన్నకారు రైతు. మూడెకరాల భూమి వుంది. మరికొంత కౌలుకి చేసేవాడు. పండినా పండకపోయినా, నాలుగు రూపాయలు మిగిలినా మిగలకపోయినా వ్యవసాయాన్నే నమ్ముకుని వస్తున్నాడు. ఆ జీవనాధారం ఇప్పుడు పోయింది. కాదు, లాగేసుకున్నారు. అతడి తాత, తండ్రీ రైతులే. ఈ నేలనే దున్నారు. వారి వారసత్వం తను అందుకున్నాడు. చిన్నప్పుడే తండ్రి అడుగుల్లో చిట్టిపొట్టి అడుగులేస్తూ ఈ పొలానికి వచ్చాడు. తండ్రి అరక దున్నుతూంటే, తనూ వెళ్ళి నాగలి మేడి పట్టుకున్నాడు. అప్పుడు తండ్రి అతడ్ని ముద్దు పెట్టుకుని, భుజం చరిచి, ఎంతగా మురిసిపోయాడో తనకిప్పటికీ గుర్తే! తనూ అమాంతం పెద్దవాడైనట్టు భావించాడు. తలకు తలగుడ్డ చుట్టుకుని తండ్రికి చేదోడు అయినట్టు పొంగిపోయాడు. తండ్రి పోయినప్పుడు ఈ భూదేవే తనని ఓదార్చింది. తనకి తల్లీ తండ్రీ అయింది. ఆమెకు సేవ చేస్తూ ఎలాగో బతుకు బండి ఈడ్చుకొచ్చాడు. పిల్లల్నిద్దర్నీ చదివించాడు. పట్నానికి వలసబోయి చెరో పనిలో స్థిరపడ్డారు.

ఊరికి దగ్గర్లో నది మీద నిర్మిస్తోన్న నీటిపారుదల ప్రాజెక్టు పూర్తయింది. ఎన్నో వేల ఎకరాలకు నీళ్ళిస్తామనీ, ఆ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామనీ, ఇక వానొచ్చినా రాకపోయినా పంటలకు నీటి ఇబ్బంది వుండనే వుండదని ప్రభుత్వం ప్రకటించింది. రైతు జనం పొంగిపోయేలోపునే ఇంకో వార్త మొత్తం గ్రామాన్నే ఎత్తి కుదేసింది. ప్రాజెక్టు నీటిని సాగు, తాగు నీటి అవసరాలకు గాను 50 టి.ఎం.సి.ల సామర్థ్యంతో ప్రభుత్వం జలాశయం నిర్మిస్తుందట! దానికోసం ముంపుకు గురయ్యే రెండు గ్రామాల్లో తమదీ ఒకటిట!

దిక్కుతోచక, ఊరంతా రచ్చబండ దగ్గర సమావేశమైంది.

'తరతరాల్నుంచీ ఇక్కడే వుంటున్నాం. ఊరుని వదిలే ప్రసక్తే లేదు!'

'ఈ చుట్టుపక్కల ఎన్నో ఊర్లుండగా మన ఊరినే ఎందుకు ముంచెయ్యాలి?'

'ఈ ప్రాంత రైతుల బాగు కోసం మనల్ని బలిపశువుల్ని చేస్తారా?'

యువకులు ఆవేశపడ్డారు. పెద్దలు సర్దిచెప్పజూశారు గాని ఎవరూ వినే స్థితిలో లేరు.

"మనం కొంచెం పెద్ద మనస్సు చేసుకుని ఆలోచిద్దాం. మనకోసం గాకపోయినా మనలాంటి పదిమందికి మేలు జరుగుతున్నందుకు సంతోషిద్దాం..." సర్పంచ్ మాటలకు 'కయ్'మన్నాడో యువకుడు.

"ఈ చుట్టుపక్కలి రైతులకు లాభం. భూస్వాములకు ఇంకా ఎక్కువ లాభం. వారి పొలాల్లో బంగారం పండుద్ది. ఎకరం ఏభై వేలు ఉన్నాదల్లా, అయిదు లక్షలవుతుంది. ముందు ముందు ఏభై లక్షలవుతుంది. చిన్నరైతులకీ, వ్యవసాయ కూలీలకీ, చేతివృత్తుల వారికీ ఏం లాభం? ఎక్కడికి పోతారు, ఎలా బతుకుతారు?"

"నలుగురి కోసం మనం కొంత నష్టపోయినా భరించాలి. మన పొలాలకీ, ఇళ్ళకీ, చెట్లకీ, అన్నిటికీ ఖరీదుకట్టి ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తుంది. దాన్నింకా ఎక్కువ చేయమని గొడవ చెయ్యడంలో అర్థం వుంది గాని, మనం మోకాలొడ్డటం వల్ల ప్రయోజనం ఏమీ లేదు"

అంతా రాబోయే పరిహారం గురించీ, లాభనష్టాల గురించీ తర్జనభర్జనలు పడుతోంటే బాలయ్య లేచాడు. అందరివంకా బాధగా, దిగులుగా చూశాడు. శుష్కహాసం చేశాడు. అంతా అతడి వంక అయోమయంగా చూశారు.

"రూపాయల లెక్కలేసుకుని మురిసిపోతారేంట్రా. మన మీద రాకాసిలా పడబోయే ముప్పు గురించి ఆలోచించరేంటి? మన భూమి పోద్ది. భుక్తి పోద్ది. ఆధరువు పోద్ది. ఉనికి పోద్ది. వృత్తీ పోద్ది. ఇంక మనం మనలా వుండలేం రా పిచ్చోళ్ళూ! తాత, మామ్మ, పిన్ని, బాబాయి, అత్త, మావ

య్య, అన్న, వదిన అనే ఆప్యాయపు పిలుపులు విన్పించవొరే. అనుబంధపు పలకరింపులుండవు. తిన్నావో లేదో, బతికే వున్నావో, లేదో అడిగే దిక్కుండదు. ఈ మట్టితో, ఈ ఊరితో అనుబంధమూ వుండదు. ఇక్కడ మూటగట్టుకున్న తీయని జ్ఞాపకాలు జలసమాధి అయిపోతాయి. మన ఊరు అన్నదే లేకుండా పోతుంది. ఎవరికి వారే అయిపోతాం. చెట్టుకొకరు పుట్టకొకరు అయిపోతాం. ఎవరికి వారే యమునా తీరే...!" బిగ్గరగా ఉద్విగ్నుడై చెప్పి రోదిస్తూ వెళ్ళిపోయాడు.

అంతా నిశ్చేష్టులయ్యారు. రేపటి చిత్రం కళ్ళముందు ఆవిష్కరింపబడినట్టు అన్పించి ఆందోళనాభరితులయ్యారు.

"ఇక్కడ ఇల్లు పోయినా ప్రభుత్వమే చక్కని ఇళ్ళు కట్టిస్తుంది బాబాయ్. అందరం అక్కడే కలిసుంటాం!" గట్టిగా అరిచి చెప్పాడు సర్పంచ్.

"ఇల్లంటే ఇటుకలూ సిమెంటే కాదురా వెర్రోడా!" తల తిప్పకుండానే సమాధానమిచ్చాడు బాలయ్య.

రెండు ముంపు గ్రామాల జనమూ కలిసి చర్చించారు. నాయకుల్ని కలిశారు. మహాజర్లు సమర్పించారు. రిలే నిరాహారదీక్షలూ, ధర్నాలూ చేశారు. ప్రభుత్వం హామీల మీద హామీలు గుప్పిస్తూనే, మరో పక్క జలాశయం పనులు మొదలుపెట్టేసింది. మెల్లగా జనం వాస్తవంతో రాజీపడ్డారు. కొందరు కోర్టు గుమ్మం తొక్కారు. మరికొందరు పరిహారం పెరిగేలా చూడమని నాయకుల చుట్టూ ప్రదక్షిణలు మొదలుపెట్టారు.

బాలయ్య దంపతులు బాగా కృంగిపోయారు. కాళ్ళ కింది భూమి కళ్ళెదుటే కదలిపోతున్నట్టు మథనపడ్డారు. వారి ఇద్దరబ్బాయిలూ వచ్చి, రాబోయే పరిహారపు సొమ్ము గురించి లెక్కలేసుకెళ్ళారు.

"ప్రభుత్వం కట్టే ఇళ్ళు నాసిరకంగా వుంటాయి. తీసుకోవద్దు. ఇల్లు అక్కర్లేనివారికి ప్లాటూ డబ్బూ ఇస్తారట. పూర్తిగా డబ్బు ఇమ్మందాం. పట్నంలో అన్ని సౌకర్యాలతో చక్కని ఇల్లు కట్టుకుందాం!"

"అప్పుడది మీ ఇల్లు అవుతుంది గాని, మా ఇల్లు అవ్వదు కదురా!" దిగులుగా అన్నాడు బాలయ్య.

"మీరెన్నాళ్ళు బతుకుతారు? ఏటెల్లకాలం ఇంటి చూరు పట్టుకుని వేళ్ళాడలేరు కదా. పైగా ప్రభుత్వం కట్టే ఇళ్ళు గృహ ప్రవేశం చెయ్యకుండానే బీటలు వారతాయి. అలాంటి వింతలు ఎన్ని చూడట్లేదూ!"

దాంతో మరింతగా కలవరపడ్డారు. కొడుకుల పంచన ఒదిగి వుండాలన్న ఊహ ఆ వృద్ధ దంపతుల్ని ఉక్కిరి బిక్కిరి చేసింది. మరో చోట భూమి కొందామన్న బాలయ్య మాటల్ని నిర్ద్వంద్వంగా తోసి పుచ్చేశారు కొడుకులు.

"వ్యవసాయం శుద్ధ దండగ. కష్టం విత్తి అప్పుల పంట కోసుకోవాలి. అలాంటి పిచ్చిపనులు తలపెట్టొద్దు. ఇన్నేళ్ళూ భూమి దున్ని ఎంత సంపాదించావో ఎవరికి తెలీదూ! ఇంకా యావ కట్టిపెట్టేయండి. ఈ ముసలి వయస్సులో కృష్ణారామా అనుకుంటూ ఎక్కడో అక్కడ కాలం వెళ్ళబుచ్చేద్దురుగాని లెండి!" అన్నారు.

మొదలు తెగిన మానులయ్యారు బాలయ్య దంపతులు. ఆ బెంగతోనే చనిపోయిందతడి భార్య. ఒంటరి పక్షి అయిపోయాడు బాలయ్య. తమ దారి సుగమం అయిందని సంతోషించారు కొడుకులు. ఆశ, ఆసక్తి నశించగా ముభావిగా మనోవ్యాధి పీడితుడిగా మారిపోయాడు. క్రితం వారం కొడుకులొచ్చారు. చెక్కులు తీసుకున్నారు. అప్పులకు శ్రీరామ చుట్టేయమన్నాడు బాలయ్య. శేర్ సైతం ఒత్తిడి తెచ్చాడు.

"ఇప్పుడు కొంతే కదా వచ్చింది. అత్యవసరాలున్నాయి. రెండో విడత సొమ్ము రాగానే అణాపైసల్తో చెల్లిస్తాం" అని చెప్పి ఒప్పించారు.

పశువుల్ని అమ్మేశారు. ఇంటి సామాన్లతో బాటు బాలయ్యనీ ఓ సామానులా ట్రక్కు కెక్కించి తీసుకుపోయారు. ఇంట్లో వూరికే కూర్చునేకన్నా ఏదో ఒక కూలిపని చేస్తే నాలుగు డబ్బులొస్తాయని బాలయ్యని తరిమాడు కొడుకు.

తలకి పాగా చుట్టుకుని, "రైతుని బాబయ్యా" అని సగర్వంగా చెప్పిన తను, తలగుడ్డ చంకలో పెట్టుకుని వంగి నిలబడి, "ఏం పని చేయాలి సామీ" అనలేకపోయాడు.

"పరాయి చోటుకి వచ్చాక కూడా డాబు దర్పాలెందుకూ!" చిర్రుబుర్రులాడాడు కొడుకు. గుడ్లనీరు కుక్కుకున్నాడు బాలయ్య.

'కృషీవలుడి ఆత్మాభిమానం గురించి నీకేం తెలుస్తుందిరా! ఎన్నడైనా అరక దున్నేవా, విత్తనం నాటావా! ఎండలో, వానలో రాత్రీ పగలూ అని లేకుండా పనిచేశావా! చెమట చిందించి నేలని తడిపిన వాడికే చెమట చుక్క విలువా, గౌరవం తెలుస్తాయిరా!' తనలో తను మధనపడ్డాడు.

మరి నాల్రోజులకే కొడుకింట్లో ఊపిరాడట్లేదని గ్రహించాడు బాలయ్య. ఊరు జ్ఞాపకాలు వెంటాడటం మానలేదు. ఊరు రారమ్మని పిలుస్తున్నట్టు పదేపదే అనుభూతించాడు. నిద్రలో, మెలకువలో అదే ధ్యాస! అవే భ్రమలు! ఇంట్లో చెప్పకుండా ఊరికి తిరిగొచ్చేశాడు బాలయ్య!

అదంతా గుర్తుచేసుకుని గాఢంగా నిట్టూర్చాడు. పొలం నుంచి కాళ్ళీడ్చుకుంటూ ఇంటికెళ్ళాడు. బోసిగా కళాహీనంగా పాడుబడినట్టుగా వున్న ఇంటిని చూసి బావురుమన్నాడు. ఇంటిచుట్టూ ప్రదక్షిణ చేశాడు. గోడలూ, తలుపులూ ఆప్యాయంగా నిమిరాడు. తన చిన్నప్పుడు ఆ ఇంటిని తండ్రి కట్టాడు. మొదట తాటాకు కప్పు ఉండేది. తన పెళ్ళయ్యాక, పైసా పైసా కూడబెట్టి పెంకుటి కప్పు వేశాడు. అప్పుడు తండ్రెంత గర్వపడ్డాడనీ! నా కొడుకు ప్రయోజకుడయ్యాడని ఊరందరికీ చెప్పి పొంగిపోయాడు!

"సొంతింటి దారి వేరురా అబ్బాయ్. అందులో నివసించినప్పుడు కలిగే సుఖంతో సంతోషంతో భరోసాతో మరేదీ సాటి రాదనుకో! మేం ఇవాళుంటాం. రేపు పోతాం. కానీ ఈ ఇల్లు నీ జీవితాంతం నిన్ను కనిపెట్టుకునే వుంటుందిరా! కలలో కూడా దీన్ని విడిచి ఎక్కడికీ పోకు. పట్నాలకు వలసపోవడం గొప్ప అనుకుంటున్నారు కొందరు. ఎక్కడో పరమాన్నాలు తినేకన్నా, కన్నఊళ్ళో కలో గంజో తాగడం మంచిదొరే. నువ్వు మాత్రం ఈ నేలనీ, ఈ ఇంటినీ వదలమాకు. నేనెందుకు ఇంతగా చెబుతున్నానో విను. నేలను విడిచిన మొక్క బతకలేదని బాగా జ్ఞాపకం పెట్టుకో!"

ఒకనాడు తనని పక్కన కూర్చోబెట్టుకుని తండ్రి చెప్పిన మాటలు బాలయ్య చెవిలో మార్మోగాయి. పొర్లి పొర్లి ఏడ్చాడు. కళ్ళు తుడుచుకోవాలన్న ధ్యాసే లేకుండా గోడకు జేరబడి రాయిలా వుండిపోయాడు.

బయటేదో కోలాహలం వినిపించింది. అయినా కదల్లేదు.

“ఇంట్లో ఎవరైనా వుంటే బయటికి వచ్చేయండి. ఊరు మునిగిపోతోంది...” అరుగు మీద, తలుపుల మీద కర్రతో కొట్టి అరిచారు. అన్ని ఇళ్ళూ చెక్ చేస్తూ వెళ్ళిపోయారు.

బాలయ్యకి అంతా వినిపిస్తూనే వుంది. అయినా వినబడనట్లు మౌనిలా కూర్చుండిపోయాడు.

మెల్లగా చీకట్లు ముసిరాయి.

ఆ రాత్రంతా జ్ఞాపకాల వానలో తడిసి ముద్దవుతూనే వున్నాడు బాలయ్య.

తెలతెలవారుతుండగా నీటి సవ్వడి వినిపించింది.

“అయ్యో మా ఊరు!’ విలవిల్లాడాడు. చిన్నపిల్లాడిలా విలపించాడు. దు:ఖోద్విగ్నుడయ్యాడు. రోదించి రోదించి అతడి గుండెలు అలసిపోయాయి. నిర్వికారుడయ్యాడు.

‘ఇక్కడే బతికాను. ఇక్కడే చస్తాను. బతుకిచ్చిన ఈ మట్టిలోనే కలిసిపోతాను’ అనుకున్నాడు.

ఇంట్లోకి నీళ్ళు రాసాగాయి. వాటికి నమస్కరించి ఒక గుక్కెడు తాగాడు.

‘నాయనా!’ ప్రేమగా ఆర్తిగా వేదనగా విన్పించిందో పిలుపు.

తుళ్ళిపడి లేచాడు. ఇల్లంతా వెదికాడు. ఎవరూలేరు.

మరి... ఆ పిలుపెవరిది? అమ్మదా? కాదు... మరి... నేలతల్లిదా?

ఒళ్ళు గగుర్పొడిచింది.

అవునామెదే. నాగలితో గుండెల్ని చీల్చినా, నవ్వుతూ ఫలసాయం అందించే భూమాతే. ప్రకృతి వైపరీత్యాల్ని ఆర్థిక బాధల్ని ఎదురొడ్డి మరీ ఢీ కొనే భూమిపుత్రుడు పలాయనం చిత్తగిస్తున్నాడని విలవిల్లాడుతోంది!

వరి నారుని మడిలోంచి పీకి మరో చోట నాటినా నిలబడుతుంది. నిలదొక్కుకుంటుంది. పచ్చగా మారుతుంది. మరి తనేవిటిలా పిరికిగా... వూహూ వెన్నిచ్చి పారిపోవడం పరిష్కారం కాదు! ఇక్కడ కాకపోతే మరోచోట, ఈ ఊళ్ళో కాకపోతే మరో ఊళ్ళో రైతుగా కాకపోతే కౌలురైతుగా సేద్యం చేస్తాడు. తలెత్తుకుని బతుకుతాడు. అవసరమైతే మళ్ళీ తనను తాను విత్తుగా భూమిలో విత్తుకుని వికసిస్తాడు. ఊపిరున్నంతవరకూ తల్లి భూదేవిని సేవిస్తాడు!

ఒక నిశ్చయానికొచ్చాడు. చటుక్కున లేచి ఇంట్లోంచి బయటపడ్డాడు. వరదనీరు ఉరకలేస్తూ తరుముతోంది. అయినా నిబ్బరంగా ఉషోదయం వైపు అడుగులేశాడు బాలయ్య.

అతడి అడుగుల్లో ప్రతిన వుంది. శక్తి వుంది. విశ్వాసం వుంది. కొండంత ఆశ వుంది!

మనిషికి నోరున్నంతకాలం రైతే రాజు!

# శంభుని పెళ్ళాం

భాగవతుల భారతి






శ్రీ శుభకృత్ నామ సంవత్సర ఉగాది సందర్భంగా కథామంజరి నిర్వహించిన "శ్రీమతి పోడూరి నాగమణిశ్రీ స్మారక కథల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన కథ – "శంభుని పెళ్ళాం" రచన: శ్రీమతి భాగవతుల భారతి.

ఇటీవల కాలంలో తెలుగు కథా ప్రపంచంలో తరుచు అర్థవంతమైన కథలతో కనబడుతున్న వర్ధమాన రచయిత్రి శ్రీమతి భాగవతుల భారతి. పురుషులు చేసే పనులు స్త్రీలు కూడా చేయగలరనే స్త్రీ సాధికారిత వైపు అడుగులు వేస్తూ... నిత్యాగ్నిహోత్రం, వేదాధ్యయనం, స్వాధ్యాయం చేస్తూ, మరోవైపు సాహితీ ప్రక్రియలన్నింటిలోను తన ఉనికి చాటుకుంటున్నారు. వేద మంత్రాలను నేర్చుకుంటూ, నేర్పిస్తూ స్త్రీ పురోహితులు గుర్తింపు సాధించే దిశలో కృషి చేస్తున్నారు. భర్త శ్రీనివాసు గారు ఇంజనీరుగా పని చేస్తున్నారు. శ్రీమతి భారతి గారి పలు కథలు బహుమతులు అందుకున్నాయి. సాహితీ సేవలకు సత్కారాలు కూడా అందుకుంటున్నారు.

ఖమ్మంలో నివాసం ఉంటున్న శ్రీమతి భాగవతుల భారతి గారికి కథామంజరి అభినందనలు తెలియచేస్తూ, వారి కలం నుంచి మరెన్నో కమ్మటి కథలు జాలువారగలవని అభిలషిస్తున్నాం!

మనసు దిగులు మబ్బులు వీడి, ప్రసన్నత సంతరించుకుంటోంది, ఇప్పుడిప్పుడే. కాలం దాని పని అది చేయటంలో నిమగ్నమౌతోంది .

నేనూ అంతే.. కాలంతో పాటే ప్రయాణిస్తూ స్కూటీ మీద, స్వీటీని స్కూల్లో దింపటానికి వెళ్ళాను.  అవే రోడ్లు, అదే దారి, అదే జనం, ఏం మార్పూ లేదు. కానీ అతను లేడు.  అటు... ఆ చోటువైపు చూసాను.  బోసిగా, భర్తీ చేయలేని వెలితిలా ఉంది.

అతను లేడుగా మరి!.. 'మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః – బంధానికైనా మోక్షానికైనా మనసేగా కారణం...' మరి! మామధ్య బంధానికి కారణమేమిటీ?

వైరాగ్యంతో కూడిన నవ్వు నాలో...  అతడు నాకు బంధువూ కాదూ...  రక్త సంబంధువూ కాదు.  కానీ ఇద్దరి బంధమూ సామాజిక సంఘటనా బంధమే.  ఈ సంఘటనా బంధమేమిటీ? ఆశ్చర్యంగా!

నిట్టూరుస్తూ.... స్కూటీ మీద ఇంటిదారి పట్టాను. మనసంతా మళ్లీ కందిరీగల తుట్టెలాగా తయారయింది.  సాధారణంగా స్కూల్ దగ్గర అనిరుద్ధే దింపుతారు ప్రపూర్ణని. కానీ ఈమధ్య అతడు ఆఫీస్ వర్క్ లో బిజీగా ఉండి..  నేనే బయలుదేరాను. ప్రపూర్ణ ని దింపేసి వస్తుండగా చెప్పు తెగిపోయి ఇబ్బంది అనిపిస్తే, చెప్పులు కుట్టే వ్యక్తి కోసం వెతికాను.

అరే!  ఈ టర్నింగ్ లోనే ఉన్నాడు. ఇన్ని రోజులూ గుర్తించలేదు!

'తలనొప్పి వచ్చినప్పుడే తల అనేది ఓటి ఉందనేది గుర్తుకువస్తుంది.' నవ్వుకుంటూ...

"చెప్పులు కుట్టాలి ... ఎంతసేపు పడుతుంది బాబూ?" అడిగాను.



“టైం పడుతుందమ్మా. ఎవరివో కుడుతున్నాను. వారు పనిమీద పోతూ ఇచ్చారు. వచ్చేసరికి రెడీ సేయాల!” తన పని తను చేసుకుంటూనే చెప్పాడతను.

వయసు 70 సంవత్సరాలుంటుంది. అందుకే నిదానంగా కుడుతున్నాడు. చూపు కూడా మందగించిందనుకుంటా. అందుకే ఏకాగ్రతనంతా కేంద్రీకరించి నైపుణ్యంతో కుడుతున్నాడు. ఎంతసేపు నుంచోవాలీ? అందుకే అతణ్ణి సంభాషణ లోకి దింపాను.

“తాతా! నువ్వు ఎక్కడుంటావ్? “

“రఘునాధపాలెం!”

“రఘునాధపాలెం ఇక్కడికి మూడు కిలోమీటర్లు కదా! ఎలా వస్తావ్? “

“ఆటోలో!” ముక్తసరి జవాబు

“పిల్లలా?” నా ప్రశ్న

“ఆ... ఆరుగురు!” మళ్లీ అతని ముక్తసరి జవాబు.

వాళ్ళ చెప్పులు ఐపోయాక నావీ కుట్టాడు.

“ఎంత?” అడిగాను.

“ఇరవై!” అన్నాడు.

యాభై రూపాయలు ఇచ్చి “ఉంచుకో తాతా!” అని వెళ్ళిపోయాను.

కానీ తరచుగా ఈయన పనిలో బిజీగానే ఉండటంతో, నేనే ప్రపూర్ణ ని స్కూల్ లో దింపటం, తీసుకురావటం మొదలయింది. వెళ్ళినప్పుడల్లా, తాత దగ్గర ఆగడం “తాతా! ఏంటి సంగతులు?” అడగటం, రోజూ నన్ను చూస్తూ ఉండటం, పని కోసం తప్ప ఇలా పలకరింపులు ఎరగడేమో!

నెమ్మదిగా, నాతో సంభాషణ పొడిగించటం మొదలెట్టాడు. నేనూ నాకు తోచినంత డబ్బులు తన చేతిలో పెట్టేదాన్ని, వందల్లో వేలల్లో కాకపోయినా, పదుల్లో! ‘కష్టపడే వారికి ఎంత సొమ్మైనా ముట్టచెప్పవచ్చు’ అనేది నా సిద్ధాంతం.

“ఏం తాతా! బాగున్నావా? ఏంటి సంగతులూ “ నేను మళ్లీ పలకరించాను.

“ఏం ఉంటాయ్ మాకాడ! రోజూ పొద్దుగాల మా ఇంటిది వణ్ణం కట్టి ఇస్తది. దగ్గరుండి ఆటో ఎక్కిస్తది. వచ్చి ఈడ కూకుంటే.. చీకటి పడకముందే వచ్చేయమంటాది మాయింటిది. “

“పిల్లలు ఆరుగురు అన్నావూ.. మరి?” అర్ధోక్తితో ఆగిపోయాను.

"అవునమ్మా! నలుగురు మగపిల్లలు.. ఇద్దరు కాంట్రాక్ట్ పనీ, ఒకడు సినిమా హాల్ కాడ.. ఇంకోడు... తాపీ మేస్త్రి..."

"మరి అల్లుళ్ళు" అడిగాను.

"అల్లుళ్ళు గవర్నమెంట్ ఉద్యోగం.. అందులో ఏటో నాకూ తెల్దు.." అన్నాడు.

"తాతా! పిల్లలంతా బాగానే స్థిరపడ్డారు... మరి నువ్వు.. ఇలా?" అన్నాను.

"ఎవరి బతుకులు ఆరియి.. నేనూ మా యింటిదీ బతకాలిగా.. మా యింటిదానికి మోకాళ్ళ నొప్పులూ.. నాకు బి. పి. సుగరూ, ఇంకా ఏవో రోగాలు. మా యింటిది మొన్నటిదాకా, అందరిళ్ళలో పాసిపని సేసేది. ఇప్పుడు లెగలేక పోతోంది! ఇద్దరికీ మందులకే అయితాండాయ్. ఇద్దరికిద్దరం... కుంటుకుంటూనూ తోడూనీడాలా ...." అదమ్మా సంగతీ అన్నట్లుగా చూసాడు.

"మందులూ ... అంటే ..ఆ మందు కూడానా?" అని మోచేతి దగ్గర చేయిపెట్టి,అడిగాను నవ్వుతూ .

"లేదమ్మా!" అన్నాడు తనూ నవ్వుతూ.

ఆ రోజూ నేనే ప్రపూర్ణ ని దింపేసి "తాతా! బాగున్నావా? అప్పుడే వచ్చేసావా" అని పలుకరించి వచ్చేస్తుండగా, నా వెనుక పెద్ద శబ్దం.. లారీ, దూసుకొచ్చి నన్ను దాటుకుని ముందుకెళ్ళింది. స్థంభానికి గుద్దుకుని, ఎవరిమీదో ఎక్కింది! జనం ఆర్తనాదాలు, గోల, క్షణాల్లో అంతా గందరగోళం అయింది.

ఓ క్షణం నా మనసు పనిచేయటం మానేసింది. వెళ్ళిపోదామనుకున్నాను. ఏదో శక్తి ఉత్సుకత రూపంలో నన్ను ఆపింది. స్కూటీని వెనక్కి తిప్పి, సంఘటనా స్థలానికి వెళ్ళాను.

గుంపుగా జేరిన జనం మధ్యలోంచి, ఎవరో నీళ్ళ కోసం పరుగెత్తారు. ఎవరో ఆంబులెన్స్ కి, ఫోన్ చేస్తున్నారు. ఏమై ఉంటుంది. కొద్దిగా సందుచేసుకుని తొంగి చూస్తే.. ఆ దృశ్యానికి నా గుండె ఆగిపోయిందేమో అనిపించింది.

రక్తపు మడుగులో తాత, నాకు తెలీకుండానే, అప్రయత్నంగా 'తాతా' అంటూ అరిచాను.

చుట్టూ ఉన్నవాళ్ల సపర్యలకో, నా అరుపుకో కళ్ళు విప్పి, చూసి నాకేదో సైగ చేసాడు. అక్కడ అంతమంది ఉండగా నాకేదో చెప్పాలని ప్రయత్నం చేయటం అందరూ విచిత్రంగా చూస్తున్నారు.

పోలీసు జీపు వచ్చింది. స్కూల్ జోన్ లోకి భారీ వెహికల్స్ నిషిద్ధం. కాబట్టి పోలీస్ కేసు.

ఆంబులెన్స్ వచ్చేసింది. తాత నన్నే చూస్తున్నాడు. దగ్గరకు రమ్మని సైగ చేస్తున్నాడు. ఏదో చెప్పాలని ప్రయత్నిస్తున్నాడు. తన బాధ ఏమిటో, ఏం చెప్పాలనుకుంటున్నాడో, ఎవరూ పట్టించుకోరేం? నన్ను పోలీసులు దూరంగా నెట్టేస్తున్నారు.

"హలో! తాత ఏదో చెప్పాలని ప్రయత్నిస్తున్నాడు. ప్లీజ్ విందాం సార్.." మొత్తుకున్నా ఎవరు పట్టించుకోలా!

"ఇది పోలీసు కేసమ్మా! అదీగాక ముందు మెడికల్ ఎమర్జన్సీ. చాలా అవసరంగా హాస్పటల్ కి తీసుకుపోతున్నాం. వీలైతే మీరూ రండి. అతని తాలూకు వాళ్ళా మీరు. అతనికేమవుతారు? రండి మీ దగ్గర స్టేట్ మెంట్ తీసుకుంటాం. పదండి పదండి " అని అక్కడివాళ్ళందర్నీ తొందర పెట్టారు పోలీసులు.

తాతను ఆంబులెన్స్ లోకి ఎక్కించారు.

ఆ క్షణంలో తలతిప్పి తాత నన్ను చూసిన చూపుకు, 'రాత్రిపూట రోడ్డుమీద పోతూ, భారీ వాహనాల ఫ్లెడ్ లైట్ కాంతి కి బెదిరిన బట్టె చూపు' గుర్తుకు వచ్చి, భయం, బాధ మనసును కకావికలం చేసాయ్.

ఆంబులెన్స్ శబ్దం చేసుకుంటూ దూసుకుపోయింది.. గవర్నమెంట్ హాస్పటల్ వైపు.

అక్కడ అంతమంది ఉండగా, ఎవ్వరికీ ఏం జరక్కుండా, తాతకి మాత్రమే ఇలా జరిగిందేమిటీ? ఇప్పుడు నేనేం చేయాలి? మా లాంటి వాళ్ళు, ఇలాంటి వాటిల్లో ఇరుక్కోవచ్చా? నా లాంటి వాళ్ళంటే? ఇలాంటి వాటిల్లో అంటే? పోనీ ఎలాంటివి చేయాలీ? ఏమిటీ ఆలోచనలూ? కానీ ఆ చూపు మరిచిపోలేకపోతున్నానే! ఏం చెప్పాలనుకున్నాడు? ఊరికే.. పరిచితురాలిగా కళ్ళతో పలుకరించాడా?

ఆలోచన కందిరీగలను తలలోనుండి విదిల్చి... ఇంటికే చేరాను.

రెండు రోజులూ తాతే గుర్తుకువచ్చి, నా భర్త అనిరుద్ధ్ చెవిలో, జోరీగల్లే తాత గురించే చెపుతున్నాను.

నా గోల భరించలేక "యాక్సిడెంట్స్ అయిన చోట ఎంక్వైరీ చేసి తాత ఏమయ్యాడో తెలుసుకునిరా ఫో" విసుగ్గా అన్నా, మంచి మాటే చెప్పాడుగా.

సంఘటనా స్థలానికి వెళ్ళాను. అక్కడ 'ఎవర్ని అడగాలీ?' అని చుట్టూ చూసాను.

సంఘటన జరిగినప్పుడు నన్ను అక్కడ చూసిన ఓ వ్యక్తి దగ్గరకు వచ్చి, "మీకు తెలిసిందా.. ఆరోజు యాక్సిడెంట్స్ అయిందే ఆ తాత చనిపోయాడండీ.."

"అయ్యో!" అన్నాను అప్రయత్నంగా.

"...పోక ఏమవుతాడండీ! ఇందులో ఎన్ని రాజకీయాలండీ.. అదే సమయంలో గాంధీ చౌక్ లో, మన ఎమ్.ఎల్.ఎ. వర్గానికి, వేరే వర్గానికి, భారీగా గొడవ జరిగింది. తలలు పగలగొట్టుకున్నారు. ఆ గ్యాంగ్ నంతా ఈ గవర్నమెంట్ హాస్పటల్ కే వేసుకొచ్చారు. గందరగోళం... ముందు వాళ్ళకి ట్రీట్ మెంట్ జరగటానికి రికమెండేషన్స్.... పోలీస్ ఎక్వైరీలూ... మీడియా వాళ్ళూ... ఆ గందరగోళంలో పాపం ఇతనిని పట్టించుకునే నాధుడేడీ? ట్రీట్మెంట్ లేటయింది! నేనూ వెళ్ళా.... గంట తర్వాత ఆసుపత్రి కాడ ఆంబులెన్స్ లోంచి దింపుతుండగా కళ్ళువిప్పి.. 'మాయింటిదీ..' అన్నాడండి. అంత కంటే ఏం మాట్లాడలేదు. వాళ్ళ యిల్లూ, యింటావిడా మీకేమన్నా తెలుసా?" అనడిగాడు.

"అయ్యో! ఇలాజరిగిందా?" అని మాత్రం అనగలిగాను. "రఘునాధపాలెం అని తెలుసు..అంత కంటే ఏం తెలియదు!" అన్నాను చిన్నగా.

ఇంటికి తిరిగి ఎలా వచ్చానో తెలీదు.

"అనీ! ఏం జరిగిందో తెలుసా!" అంటూ నా భర్త అనిరుద్ధ్ తో ఈ విషయం చెప్పాను, బాధపడుతూ...

"తాత నాతో చెప్పాలనుకున్న విషయం అదన్నమాట.. ఇప్పుడేం చేయటం " అన్నాను.

"కాలోహి దురతిక్రమ: కట్టెవంకర పొయ్యి తీర్చినట్లు.. అన్నీ కాలమే తీరుస్తుంది " అన్నాడు అనిరుద్ధ్.

"జరిగినదానికీ, నువ్వు చెప్పిన సామెతకీ సంబంధం ఏమైనా ఉందా.. అసలూ.." విసుక్కుంటూ అవతలికి వెళ్ళిపోయాను.

ఏ వెలితినైనా, వేరేదేదో వచ్చి పూరిస్తూనే ఉంటుంది. అందుకే "పూర్ణమేవా వశిష్యతే"అని వేదోక్తం. మంచిగా ఉన్నప్పుడు ప్రపంచాన్ని మరిచిపోతాం. ఇలాంటి సమయంలో మాత్రం వేదాలూ, వేదాంతాలూ గుర్తుకు వస్తాయి.

నెల రోజులు గడిచినాయి.

యధాప్రకారం ఈరోజు.. ఇదే దారి, అదే స్కూల్. అప్రయత్నంగా అటు చూసాను.

ఎవరో ఆ ఖాళీని భర్తీచేస్తూ, అక్కడ కూర్చుని ఉన్నారు. దగ్గరకెళ్ళి చూద్దునూ... ఓ స్త్రీ!

"నువ్వా... మీరూ .." అన్నాను.

"శంభుని పెళ్లాన్ని" అంది.

"శంభుడంటే?" అడిగాను.

"ఈణ్ణే సెప్పులు కుట్టేటోడుగా... పోనాడుగా!"

"ఇదేమిటీ? మీరు... ఈ రోడ్డుమీద.... తనకు ఆరుగురు పిల్లలని తాత చెప్పాడూ... "

'ఐతే' అన్నట్లు చూసింది.

"తాత పోయి నెలరోజులన్నా కాలేదు.... ఇక్కడకొచ్చి కూర్చుని... గుర్తుచేసుకుంటున్నావా? నేను రోజూ తాతని పలకరిస్తూ ఉండేదాన్ని!"

"గాపకాలూ, గుర్తులూ కాదమ్మా! నా పెనిమిటి చేసే సెప్పులు కుట్టే పని నాను సేద్దామనీ!" అంది.

నేను ఉలిక్కిపడ్డాను. స్త్రీ సాధికారతలాంటి మాటలు ఈ రోజుల్లో చాలా చిన్న మాటలు. ఏ పనినైనా ఆడా, మగా తేడా లేకుండా అందరూ చేస్తూనే ఉన్నారు.

తాతతో మాటల సందర్భంలో ఓసారి "మీ ముసలమ్మని ఓ సారి తీసుకురారాదూ చూడాలనుంది" అప్రయత్నంగా అన్నాను గానీ, అదే నిజమౌతుందని ఆ క్షణం నేనూహించనేలేదు. ఊహించి ఉంటే అనేదాన్ని కాదేమో.

"కాదూ! శంభుడు యాక్సిడెంట్ లో పోయాడు గదా! గవర్నమెంట్ లారీ వాళ్ళచేత, భరణం ఇప్పిస్తుంది... ప్రయత్నం చేయకపోయావా?"

"పయత్నం చేసినా, మన దాకా ఏడవత్తయ్.. మధ్యలో నాయకులకీ, దళారులకీ ఎంతియ్యాలీ? తీరా మనకాడికి వచ్చేతలికి, పదో ఇరవయ్యో, దానికోసం... ఎన్నిసార్లు కోర్టుకెళ్ళాలా?... "

"మరి.. తనకి ఆరుగురు పిల్లలని చెప్పాడూ తాత?...." మళ్ళీ అదే ప్రశ్న రిపీట్ చేస్తూ అర్థోక్తితో ఆగాను.

"ఉండారమ్మా! ఐతే ఎవరి బతుకులు ఆళ్ళయ్యి.. నా కాడ ఇంకా సత్తువుందిగా!" పిల్లలని బయట పడేయకుండా ప్రతీ తల్లీ చెప్పే సమాధానమే.

"వేరే ఏదైనా పని... అంటే.. కూరలమ్మడం.. ఇళ్ళల్లో పాచిపని చేసేదానివని.. తాత చెప్పాడూ... ఆ పనిగానీ..."

"మోకాళ్ళ నొప్పులు.. ఇది కూకుని సేసేపనేగా అమ్మా! సర్కారోళ్ళు బరత సనిపోతే ఆ నౌకరీ, ఆళ్ళ ఆడోళ్ళకీ, కొడుకులకూ, ఇత్తారంట. ఇది సర్కారీ నౌకరీ కాకపోయినా, నా బరత వదిలేసిన పని నానేగా సేయాలీ?" లా పాయింట్ తీసింది, శంభుని పెళ్ళాం.

"ఫర్వాలేదు! ఇంత తెలివి చాలు, బ్రతకటానికి. నీ భర్త భయపడ్డట్టు... నీ బ్రతుకుకేం ఢోకాలేదు. సమాజంలో పదిమందికీ, ఆదర్శంగా బ్రతికేయగలవు!" అంటూ ఓ వంద రూపాయలు ఆమె చేతులో పెట్టి స్కూటీ స్టార్ట్ చేయబోయాను..

"ఊరికే వద్దు తల్లి.. మీ సెప్పులు ఇవ్వండి.. పాలిసు సేస్తా.." అంటూ నా వైపు తలెత్తి ఆమె చూసిన చూపు, ఆంబులెన్స్ ఎక్కుతూ శంభుడు చూసిన చూపుకు సమాధానమా?

# బోడి మావ

**బట్టేపాటి జైదాస్**






శ్రీ శుభకృత్ నామ సంవత్సర ఉగాది సందర్భంగా కథామంజరి నిర్వహించిన శ్రీమతి పోడూరి నాగమణిశ్రీ స్మారక కథల పోటీలో తృతీయ బహుమతి పొందిన కథ — “బోడి మావ” – రచన: బట్టేపాటి జైదాస్.

పువ్వు పుట్టగానే పరిమళంతో వికసించడం అంటే సాహిత్య ప్రక్రియలో భాల్యంలోనే కథలు రాసే సౌభాగ్యం కలగడం! ఆ కోవకి చెందినవారు శ్రీ బట్టేపాటి జైదాస్ గారు. చిన్నప్పుడే చందమామ, బొమ్మరిల్లు వంటి పుస్తకాలను చదివి, ఉత్తేజితుడై.. చరిత్రకారులు ‘తానాజీ’, ‘పృథ్వీరాజ్’ల గురించి తెలిసింది రాసి,’బాలజ్యోతి’ పత్రికకు పంపడం, వారు ప్రచురించడంతో.. ఇక వెనక్కి చూడవలసిన పనిపడలేదు. అలనాటి అన్ని వార మాసపత్రికలలో విరివిరిగా కథలు ప్రచురింపబడ్డాయి. మరోవైపు కొంచెం చేతిలో కుంచె, మస్తిష్కంలో హాస్యం మిళితమై కార్టునులు కూడా వేయటం ప్రారంభించారు. ఈ రోజు పాఠకులకు  లభ్యమవుతున్న అన్ని పత్రికలలో శ్రీ జైదాస్ గారి కథలు, కార్టునులు ప్రచురితమవుతున్నాయి. కథలకు, కార్టూన్లకు బహుమతులు అందుకుంటూనే ఉన్నారు. ‘హాస్యకథలకు ప్రాధాన్యత ఇచ్చినా, అన్ని కథలు తన అనుభవాలలోనుంచే పురుడుపోసుకున్నావే’ అని ఆనందంగా అంటారు శ్రీ జైదాస్ గారు.

పుట్టి పెరిగింది నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం. ఖమ్మం, మధిర ప్రభుత్వ జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ గా ఉద్యోగం చేస్తూ, భార్య కుమార్తెలతో విజయవాడలో నివాసం ఉంటున్నారు.

కథామంజరి ... శ్రీ జైదాస్ గారికి అభినందనలు తెలియచేస్తూ, వారి సాహితీ ప్రస్థానం దిగ్విజయంగా సాగుతూ, మరిన్ని అవార్డులు రివార్డులు అందుకోగలరని ఆశిస్తున్నాం!

“అన్నా.. అధికారపార్టీ అంటే అస్మదీయులకే అన్నీ అమరేలా చూసేదికాదన్నా...అధికారంలోకి రాగానే అయినవాళ్లక్కూడా అందకుండా పోయేదీ కాదన్నా. అందల మెక్కించినవారి అవసరాలు తీర్చేది కూడా. ఆ మాటకొస్తే రాజకీయాలుండేది రాబడి కోసం కాదన్నా.. సేవకోసం.. ప్రజాధనంతో ప్రజలకు సేవచేయడం కోసం. అంతే గాని ప్రజల సొమ్మును రాబందుల్లా దోచి ‘రాజకీయ బంధువుల’కి పంచడానిక్కాదన్నా... మీరు తల్చుకుంటే ఊరివాళ్ల అవసరాలు తీర్చి, బాగుపరచడం పెద్ద కష్టమేమీ కాదన్నా....ఇందులో మీ సొత్తేం పోయేది లేదు కదన్నా.  నాకోసం ఇంకొక్కసారి బాగా ఆలోచించన్నా....!

“........”

“అన్నా......!

“......!?”

“ఉన్నోడు లేనోడికి పెట్టడం ప్రకృతి ధర్మం!  కానీ లేనోడి రక్త, మాంసాలను పీల్చి, పైసల్ని పోగు చేసుకోవడమనే వికృత క్రీడ ఒక్క రాజకీయాల్లోనే చూస్తున్నాను. రాజ్యాంగం రూపుదిద్దిన ‘వ్యవస్థీకృత నేరగాళ్లు’గా మారి లేనోళ్ళ నోళ్లు కొట్టి సంపాదించే మీరు, కాయకష్టంతో సంపాదించుకుని, దర్జాగా బతికే దరిద్రుడి కాలిగోటిక్కూడా సరిపోలరు!  శ్రమజీవులు చెమటోడ్చితే వచ్చిన ఆదాయాల దోపిడీతో,  దొరల్లా దర్పం వెలగబెట్టే మీరు..  కష్టమంటే తెలీని, కాణీకి కొరగాని కోటీశ్వరులు!  పథకాల

పేరుతో పేదల కష్టార్జితాన్ని పీక్కు తినడానికీ, బజారునపడి అడుక్కు తినడానికీ పెద్దగా తేడా ఏం లేదు! ఆఖరికి అడుక్కుతినేవాడు కూడా తిండి లేకపోతే, పనిచేసి పొట్ట నింపుకోవడమో, లేక ఆకలితో చావడమో చేస్తాడు. కానీ ఇతరుల నోటికాడది మాత్రం దోచుకోడు! తరాల తరబడి తిన్నా తరగని ఆస్థులున్నా, ఇంకా ఈ సంపాదించడాలెందుకన్నా? ఒక్కసారి మనసుపెట్టి ఆలోచించండన్నా! కొంతలో కొంతన్నా ప్రజలకు సహాయపడకపోతే .. ప్రజా ప్రతినిధులుగా మన మనుగడే దండగ. నీకాళ్ళు మొక్కుతానన్నా.. నీకెలా వుందో కానీ సర్పంచ్ గా ఊరి రైతుల కనీసావసరాలన్నా తీర్చలేకపోతే, వారి కోసం ఏర్పాటు చేసిన పధకాలన్నా వారికి చేరేలా చేయలేకపోతే ఈ జన్మలో వారికి నా ముఖం చూపించలేనన్నా..!

"..............!?"

★★★



ఆత్రంగా మోరెత్తి ఆశగా ఆకాశం కేసి చూసేడు యలమంద. 'టప్..'మని మళ్ళీ అదే శబ్దం. సందేహంలేదు.. అది తొలకరి తొలి చినుకే. దాహంతో అల్లాడుతున్నవాడి నోట్లో అమృతపు చుక్కలు రాలినట్టుగా మళ్ళీ 'టప టప'మని మరికొన్ని వానచినుకులు యలమంద మొహమ్మీద పడ్డాయి. చినుకులు పెరిగేకొద్దీ యలమంద చిత్తం కూడా సంతోషంతో చిందేస్తున్నట్టుగా ఎగిసెగిసి పడసాగింది! జీవితంలో తొట్టతొలిసారిగా, పుడమి తల్లి పులకించేలా తగిన సమయంలో తోడుగా వచ్చిన ఆ తొలకరి చినుకుల్లో తడుస్తుంటే తనువు, మనసూ పరవశిస్తూ, పులకరింతగా వుంది యలమందకి. ఇన్నేళ్ల తన రైతు జీవితంలో ఏనాడూ సమయానికి వచ్చిన పాపానపోని వరుణుడెందుకోగాని, ఈసారి వడివడిగా వచ్చేస్తున్నాడు. అదే యలమందకి ఎక్కడలేని ఆనందాన్నిస్తోంది.

"ఏరా ఎలమందా..! ఏందిరా కత..? యమా వుశారుగుండావ్..!" అడిగేడు రంగన్న ఆనందంతో ఆకాశానికేసి చూస్తోన్న యలమందని.

"ఆ.. ఏముంది రంగన్నా! జనమానికో శివరేత్తిరన్నట్టు, అన్కోకుండానే అన్నీ అక్కరకొచ్చాస్తుంటే ఆనందమెయ్యదా! ఈ పెబుత్వం పేమతో ఇస్తున్న పైసలతో పొలంకి పెట్టుబడి దొరికిందా. దానికెప్పుడూ లేనంత సరిగ్గా తొలకరి గూడా తోడొచ్చిందా. ఆ 'బోడెత్త, బోడిమావ'ల దయవల్ల నా ఒక్కగానొక్క కూతురికి సక్కటి సమ్మందమూ కుదిరిందా! ఇట్లాగే అన్నీ అమిరిపోతే ఇంకో మూడ్నెలల్లో పంట చేతులోకి రాంగానే అమ్మేస్తా. నా కూతురికి కట్నమిచ్చి, పెళ్ళిజేసేసి పంపించేస్తా. నా గుండెల

మీద కుంపటి దింపుకుంటా!" చెప్పేడు తన సంతోషానికి కారణమైన 'బోడెమ్మ','బోడిమావ'లకు మనసులోనే దండాలు పెట్టుకుంటూ!

యలమంద కూతురికి సంబంధాన్ని కుదిర్చింది వాళ్లే. సంతానం లేని ఆ దంపతుల అసలు పేర్లేమిటో ఇప్పటోళ్లకెవరికీ తెలీదు. బోడెమ్మ వచ్చిన వేళావిశేషమేమోగాని వాళ్ళాయనక్కూడా 'బోడెమ్మ మొగుడ'నే పేరొచ్చి, ఊరివాళ్ళంతా 'బోడెత్త' 'బోడిమావ' అంటూ ప్రేమగా పిలుచుకోవడానికే అలవాటుపడిపోయారు. అందుకు కారణం వాళ్ళ మంచితనమే. ఊర్లో ఎవరికి ఏ అవసరం వచ్చినా మేమున్నామంటూ ఆదుకోవడంలో ముందుంటారు. పార్టీలకతీతంగా ఆ ఊరికి సదా 'సకలజనుల సర్పంచ్'గా ఉంటూ నీతి, నిజాయితీలకు మారు పేరైన బోడిమావ మాటంటే నియోజకవర్గంలో కూడా అందరికీ వేదవాక్కు! బోడిమావ నిస్వార్థ సేవలకు, అనుకోకుండా అధికారపార్టీ అండదండలు కూడా దొరికాయి. అసలు రాజకీయాలకన్నా, తనకున్నంతలో స్వచ్ఛందంగా సహాయపడటమే అతనికిష్టం. కాని ఏమయిందో ఏమోకానీ ఈ మధ్య జరిగిన ఎన్నికల్లో 'రాజకీయం'గా కూడా చురుగ్గా మారేడు. బోడిమావలో ఈ మార్పుకు కారణం ప్రస్తుత అధికారపార్టీ ఆశయాలు అతని ఆశయాలకు దగ్గరగా వున్నాయనిపించడం! 'ఓటు బ్యాంకు మాటకారులై'న పార్టీనేతల 'పాలి'ట్రిక్స్'లో 'మంచితనంలోని మాయకత్వం' తెలీక పోవడం వల్ల 'రాజకీయ బోడితనం'తో 'రంకురణాల రొచ్చు'లో దిగబడిపోయాడు. బోడిమావ ఎన్నికల్లో పార్టీలు ఓటింగ్ మిషన్లలో చేస్తున్న 'పొలిటికల్ పొల్యూషన్' గురించి జనాలను హెచ్చరించి, నిరక్షరాస్యులు ఎక్కువగా ఉండే నియోజక వర్గంలో బ్యాలెట్ పద్దతినుపయోగించాలని పట్టుబట్టేడు. మూకుమ్మడిగా అందరూ వ్యతిరేకించడంతో ప్రభుత్వం కూడా ఒప్పుకోక తప్పలేదు. ఊరు బాగుపడుతుందనే ఆశతో, ఎన్నికల ప్రక్రియ సక్రమంగా జరిగేలా చూడటమేగాక, తన సర్వశక్తులూ ధారబోసి అధికారపార్టీ అభ్యర్థిని గెలిపించాడు. కొత్త ప్రభుత్వం కొలువుదీరాక కూడా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ పోవడం, గ్రామీణ రైతులకు ఉపయోగపడే అనేక రకాల పథకాలతో లబ్ది చేకూరేలా చేస్తుండడంతో యలమందలాంటి వాళ్లంతా పండగ చేసుకుంటున్నారు. ఇంతలో యలమంద ఆనందం ఆవిరయ్యేలా "ఓ..రంగన్నా .. యలమందకన్నా .. మన సూరిబావలేడూ .. ఆయనిందాకే 'ఎండ్రిన్' తాగిసచ్చిపోయిండంట. రాండ్రాండి... తొందరగా బొదం!" అంటూ ఎంకట్రాముడు రొప్పుతూ, రోస్తూ పరుగెత్తు కొచ్చేడు

"ఏమైందిరా ఎందుకనంట..?" ఇద్దరూ ఒకేసారి అడిగేరు ఆశ్చర్యంగా

"ఇంకెందుకన్నా.. అప్పులోళ్లు పెట్టే ఆరళ్లు తట్టుకోలేకనేగదా! కాయకష్టం జేసేటోళ్లకు జబ్బులు రావడం లేదనో..ఏమోగానీ, ఈ అప్పులోళ్ళొచ్చి, డబ్బులిచ్చి దొలుగా పేణాలు పీక్కుపోతుండారు. పీనుగులమిందే పైసలేరుకుంటా వుండారు. వాళ్ళేం బాగుపడతరో..ఏమో.. !"

'నిజమే అవసరంలో ఉన్నోడికి అర్జంటుగా అప్పులైతే దొరకతుండాయ్ గానీ, వాటిని తీర్చడానికి ఆదాయాలొచ్చే పని దొరకడం లేక, పస్ల గురించి పట్టించుకునే వోళ్లే లేక, ఆదాయం రాక అప్పుల్దీసుకున్నోళ్ళ ఉసురే బోతుంది'! అనుకుంటూ కదిలేరు.. జోరు పెరుగుతోన్న వానలోనే సూరిబావ కడచూపుకోసం.

★★★

యలమంద భయం భయంగా ఆకాశానికేసి చూసేడు .'టప్..' మంటూ రాలిందో చినుకు యలమంద నడినుదుటి మీద. ఈసారి వానచినుకులా లేదది. దాహం తీరి, తీరిగ్గా విశ్రమించినవాడి ఊపిరాడనివ్వని వరద చినుకులా ఉందది. ఉలిక్కిపడ్డ యలమంద గాభరాగా మళ్ళీ పైకి చూసేడు. అంతే టపటపమని వరుసగా ఆగకుండా ఒకటే చినుకులు ముఖం నిండా పడసాగేయి. గబుక్కున ఇంటి వసారాలోకెళ్లి నిలబడ్డాడు. చూస్తుండగానే వానచినుకులన్నీ ఉధృతమై రైతన్న గుండె పగిలినపుడు ఉబికివచ్చే వరద ఉప్పెనలా మారిపోయాయి. ఉరుములు, మెరుపులేవీ లేకుండా ఉన్నపళాన ఒక్కసారిగా వర్షం పడటంతో దారినపోతున్నవాడల్లా యలమంద ఇంటి వసారాలోకొచ్చేడు రంగన్న తల దాచుకోడానికని. మాటామంచీ లేకుండా ఇంటి ముందు వసారాలో చేరి నిర్వేదంతో వర్షంకేసి చూస్తోన్న యలమందని చూడగానే పరిస్థితి అర్థమైంది రంగన్నకి! కానీ ఏమనాలో తెలీని నిరాశతో "ఏరా ఎలమందా..! ఏందిరంత ఇచారంగా ఆలోచిస్తా వుండావ్?" అంటూ అడిగేడు,

"ఏం జెప్మంటావన్నా! రోజురోజుకీ రైతన్నల బతుకే రొచ్చు రొంపిలా మారతా రావణకాష్టమయిపోతావుంటేన" అన్నాడు బాధగా.

రంగన్న "మొన్ననే గదరా పెభుత్వమే రైతులకు బంధువై పోయిందని తెగ పొగిడేసినావు..'అన్నదాతా సుఖీభవ'మంటా ఆరువేలొచ్చిందన్నావూ.. ఇంక పంటకష్టాలన్నీ తీరిపోతాయని యమా కుశాలగా కులికినావూ.. పంటేసేనాడున్న ఆనందం పంట కోసేనాటికేమై పోయిందిరా..?" అంటూండగానే యలమంద అందుకుని "మన కష్టాలకంతేముంటుందిలే రంగన్నా. ఆ గవరమేంటోళ్లు కరుణించినా ఈ వరుణుడు దయతలచడం లేదు కదా! వరుణుడు దయతలిస్తే మన గవరమేంటోళ్లు కరుణించరుగదా! మనకెప్పుడూ 'ఏదోఒకపక్క వుండాల్సిందేగదా బొక్క'. అసలే కాలంగాని కలికాలం. వరణదేవుడు ఉరాలేస్తే సేతికొచ్చిన పంటగూడా పోతాదని, గతిలేక పట్నంబోయి 'వరికోతమిసను' తెప్పిచ్చినానా... ఇన్ని కర్సులు జేసి కుప్పేసి పెట్నానా.. తీరా జూస్తేనే భయపడినంతా అవనే అయ్యింది గదా. నువ్వూజూస్తానే వుండావుగదా! అకాలంగా కురస్తున్న ఈ మాయదారి వానని. పంటంతా తడిసిపోయనే .. ఇంక గింజలేం మిగల్తాయో, ఏమో? వాట్నేవురుగొంటారో, ఏమో? కొనకపోతే డబ్బులొచ్చేదెట్టా.. నా కూతురి పెళ్లయ్యేదెట్టా? ఈ బాధలన్నీ భరించలేక అప్పులపాలై సచ్చేలాగుండాన్నేను.!" అన్నాడు యలమంద కన్నీటి పర్యంతమైపోతూ.

"దానికంత బాధపడటమెందుకురా ఇదేమన్నా కొత్తా మనకు? తలకాయుండి ఉపయోగించుకోవాల్నే గాని ఈ భూపెపంచంలో అన్నీ అవకాసాలే గదరా. ఆఖరాకి సావుగూడ.. మనలాంటోళ్లు బాగుపట్టానికి అది కూడా ఓ అవకాసమే గదరా!" విరక్తిగా అన్నాడు రంగన్న.

"ఏంది రంగన్న... అట్లాగంటావు?"

"ఇంకేమని అనాల్రా..? మొన్నటికి మొన్న మన సూరిబావ అప్పులకు తట్టుకోలేక మందు తాగి పోతే అయిదు లచ్చలొచ్చాయి గదరా! మనమూ అలాగే ఏ మందో, మాకో తాగి పోయుంటే మనకీ బాధలుండేయా? దానిగ్గూడా రాతుండాలేమోరా..?" నిరాశగా అన్నాడు రంగన్న.

"ఛత్..ఊర్కో రంగన్నా ఇంటికి పెద్దదిక్కు పోయాక వచ్చిన పైసలు దీసుకుంటే పెభుత్వానికి పేణాలమ్ముకున్నట్టే గదా!. ఇంతకన్నా ఎదవతనమింకేవన్నా ఉందా? ఆ డబ్బుల్తో ఏ మొఖం బెట్టుకొని, ఎంత కాలమని సుఖపడతారు? పెబుత్వం ఉండేది ఆపదలో ఉన్నోళ్లను ఆదుకోడానికా, లేక 'చచ్చిన బతుక్కి బేరం గట్టి, వచ్చిన డబ్బుల్తో అప్పులు గట్టించి, ఇంట్లోవాళ్లను గూడా సంపాయించే దిక్కులేక, ఆకలితో అల్లాడించి చంపడానికా? ఆ పెబుత్వం ఇచ్చే డబ్బు కూడా మనకేమన్నా మిగల్తా ఉందా? ఇట్లాగూడా అప్పిచ్చిన ఆ వున్నోళ్లకే బోతుందిగదా. బతికుండగా బాగుపడేందుకు సాయంజెయ్యనప్పుడు, ఇయ్యన్నీ ఎందుకు? ఐనా ఆ పనికిరాని పైసల కోసం, ఇలాంటి యదవపన్లు జేయడం ఎంత నామర్దా? ఏదో ఒక దారన్నా జూసుకుంటాను గానీ, ఇట్లాంటి వాట్లికి నేనొప్పుకోను గాక ఒప్పుకోను! నాగొంతులో ప్యాణం వుండగా అట్లాంటి పన్లు చెయ్యను గాక చెయ్యను" అన్నాడు దృఢంగా. కానీ 'తానొకటి తలిస్తే, దైవమొకటి తలుస్తుంద'నే విషయం ఆ సమయంలో తెలియలేదు పాపం యలమందకి.

★★★

ఉదయం లేచీ లేవంగానే బోడిమావ ఇంట్లో చెప్పాపెట్టకుండా ఎటో వెళ్ళిపోయాడనే వార్త విని అదిరిపడ్డాడు యలమంద. అందరూ కలిసి ఊరంతా గాలించినా లాభం లేకుండా పోయింది. ఆ తర్వాత రోజే బోడిమావ కనిగిరి రిజర్వాయర్లో శవమై తేలడంతో ఊరంతా తల్లడిల్లిపోయింది. యలమందకి అసలేమయిందో అర్థం గాకుండా వుంది. గత కొద్దిరోజుల నుంచీ బోడిమావ మునుపటిలా హుషారుగా లేకపోవడం గమనిస్తూనే వున్నాడు. ఎప్పుడూ లేనిది, పరధ్యానంగా ఏదో పోగొట్టుకున్న వాడిలా ఆలోచిస్తూ వుంటున్న విషయం తాను గమనించి అడిగినా, మాట దాటేశాడు తప్ప విషయమేమీ చెప్పలేదు! మరిప్పుడేమో ఇలా... 'అసలు ప్యాణాలు దీసుకోవాల్సినంత కష్ట మేమొచ్చింది?' అనుకుంటుండగా సరిగ్గా అప్పుడే వచ్చాడు రంగన్న. . అతని ముఖమంతా జేపురించివుంది కళ్ళు ఎర్రబడిమండి పోతున్నాయి. మొహం చూస్తేనే తెలిసి పోతోంది ఆవేశం,

ఆవేదనలను బలవంతంగా కూడా అపుకోలేక పోతున్నాడని.

“ఏమైంది రంగన్నా..?” అంటూ ఆతృతగా అడిగేడు యలమంద

“ఇంకా ఏం గావాల్రా..జరగ్గూడనిదంతా జరిగిపోతేన. అసలు బోడిమావ ఎందుకు సచ్చిపోయిండో తెల్సా నీకు?” తెలియదన్నట్టు తలూపేడు యలమంద.

“అది తెలిసిన దగ్గర్నుండే నా గుండె మండి పోతావుందిరా! ఎంత రాజకీయం. ఎంత దగా!” అంటూ జరిగిందంతా చెప్పుకొచ్చేడు

“ఎమ్మెల్లేగారి ఇయ్యంకుడు ఇత్తనాలు, ఎరువులషాపు పెట్టిండంట. ఈసారి ఎరువులు, ఇత్తనాలు లేవని పెభుత్వం చేత ఏవేవో కుంటిసాకులు జెప్పించి, ఆపుజేసింది వాడి యాపారం నడిపించడానికేనంట. బయటెక్కడా దొరక్కుండా అన్నీ ఆ ఇయ్యంకుడి షాపుకే అమ్మిచ్చి, వాట్నే మనకు ఎక్కువ రేట్లకి అమ్మేటట్టు జేసిండు. పైగా.. అయి గొనుక్కోడానికి అవసరమైన డబ్బుల్నిగూడా పెభుత్వంతో ‘అన్నదాతా సుఖీభవ’ అంటా మనకిప్పిచ్చి, తక్కువ రేటుకి ఇయ్యాల్సినయి గూడా ఎక్కువ రేటుకే, మన్లాంటి లేనోళ్ళచేత గూడా కొనిపిచ్చిండంట. పతీ పథకమూ రాజకీయ బంధువే. వాటిల్లో వుండే తిరకాసు తెల్వక, వాటి కోసం మనవందరం ఎగబట్టుకు పోతుండాం.. పెబుత్వం ఇచ్చిన డబ్బులు సరిపోకున్నా అప్పోసప్పోజేసి మరీ కొనుక్కుంటుండాం. ఇయ్యన్నీ తెలిసి తట్టుకోలేకే బోడెమ్మని ‘బోడి’దాన్ని చేసిపోయినాడ్రా బోడిమావ. తన కుటుంబాన్ని దిక్కులేనిదాన్ని చేస్తుండాననేదానికన్నా, నావల్ల ఊళ్ళో ఇంతమంది బాధలు పడాల్సొస్తుందనే ఆలోచన్తోనే బోడిమావ ఎక్కువ కలతపడినాడ్రా! తన మాటలు నమ్మి అందరూ ఓటేసినారని, తీరాజూస్తే పెభుత్వం చేసే పన్లన్నీ మనోట్లతో గెల్చి, మనల్నే దోసి, రాజకీయ రాబందులకు పెట్టేటట్టుండాయని తెలియంగానే, ఏం జేయలేక, తన బాధను ఎవరితోనూ జెప్పుకోలేక, లోపల్లోపలే కుమిలిపోయి ఉడికిపోయి పొయ్యిండ్రా! ఎమ్మెల్లేని ఊరోళ్ల అవసరాల్ని కొన్నయినా తీర్చమని, లేకపొతే వారికి నా మొహం చూపించలేనని ఎంత బతిమిలాడినా, ఇనలేదని బాధతో చెరువులో దూకేసిండ్రా! నమ్మకద్రోహంతో వంచనజేసే ఇలాంటి పెభుత్వాల్ని ఎన్ను కొన్నందుకు, దానికి తానూ కారణమయినందుకూ తట్టుకోలేకనే ఎళ్లిపోయిండ్రా..! ఇక మనబతుకు లింతేన్రా. ఓట్లేసి గెలిపిచ్చడం వరకే మన పని. ఆపట అన్నీ వాళ్లే జూసుకుంటార్రా, వాళ్ళోళ్ళకే దోసిపెట్టుకుంటా వుంటార్రా! ఆఖరికి మనం పండించిన పంట్ల వల్ల గూడా మనకొచ్చేదేం లేదు. వాళ్ల దగ్గర కొంటే వాళ్ళు చెప్పిన రేటుకే కొనాలి. గవరమెంటు కూడా అలాగే కొనిపిస్తాది. అదే మనం అమ్మితే మాత్రం వాళ్లు కొనాలనుకున్న రేటుకే కొంటారు. పైగా మీకు రవాణా ఖర్చుగూడా లేకుండా మేమే కల్లంలోకే వచ్చి తీసుకుపోతుండామంటారు. అన్నీ చెప్పి అట్లజేసి, ఇట్లజేసి మనకింకేం గతి లేదని గుర్తుజేసి, బేరం లేకుండానే వాళ్లనుకున్న రేటుకే తీసేస్కుంటారు. అంతా నటనే, అన్నిట్లో మోసమే! లాభాలన్నీ వాళ్ళకి, కష్ట, నష్టాలన్నీ మనకి మిగల్తాయి! ఆ పరిహారాలు గూడా మనం సస్తే వడ్డీలయాపారం జేసే వాళ్లోళ్లకి నష్టం గలక్కుండా అప్పులు తీర్చించడానిక! పెభుత్వ సొమ్ము రైతుల గుండా నాయకుళ్లు కొట్టేయ్యడానికే ఈ పథకాలన్నీ! అందుకోసమే మధ్యలో మనముండాల గాబట్టే మనమింద ఈ కల్లిబొల్లి పేమలన్నీ...”

“ఏందేందీ..మళ్లాజెప్పు.. పెబుత్వం బెట్టే ఈ పథకాలన్నీ మన కోసం గాదా?” మధ్యలోనే అడ్డుపడుతూ అడిగేడు యలమంద.

రంగన్న ఓ వెర్రినవ్వు నవ్వి “ఓరె పిచ్చోడా..! పెజాసేవా పథకాలన్నీ గూడా ఫక్కాగా అమలు జేసే పార్టీ నాయకుళ్ల సంక్షేమ పదకాలేరా! సంక్షేమ పథకమంటేనే అసలర్థం రైతులు, పేద పెజల ద్వారా ‘నాయకుళ్లు సంక్షేమం పొందడ’మని! ఈ ఇషయం దెలీని ఎర్రిగొర్రెలైన జనాలు చంకలు గుద్దుకుంటా మద్దతిస్తారు! పైగా పెబుత్వం పవేశపెట్టిన పథకాలను పొగడతా వుంటారు. నాయకుళ్లను దేవుళ్ళలా కొలస్తా ఉంటారు! మన్లాంటోళ్లని అడ్డం బెట్టుకొని ఒరగబెట్టించుకోవడమే వాళ్ళు జేసేది. ఇంక వాళ్ళు మనకు ఒరగబెట్టేదేముందిరా.. బోడి!”

అంతా విన్న యలమంద బోడిమావ అందరి బాగుకోసమని రాజకీయాల్లో దిగాడనీ, కానీ అంతా మోసమని గ్రహించాక ఏమీ చేయలేక, ఊరివాళ్ళకు ముఖం చూపలేక చెప్పాపెట్టకుండా చెరువుదారి బట్టేడని తెలియగానే కుప్పకూలిపోయాడు.

★★★

యలమందకి ఎంతకీ ఆలోచనలు తెగిచావడంలేదు. అనుకున్నవన్నీ అనుకున్నట్టే జరిగితే ఇక జీవితమేముంది? కూతురి పెళ్లి కుంపటిలా తయారైందతనికి. అది ఆరే దారే దొరకట్లేదు. అకాలవర్షానికి పంట తడిసినపుడే సగం దారి మూసుకుపోయింది. బోడిమావ పోవడంతో మిగతాదీ మూసుకుపోయింది. తడిసిన పంటకు తగిన ధర రాక కూతురికి పెళ్లి చేయడం ఇబ్బందిగా మారింది. వియ్యంకుడిని తర్వాత సర్దుతానని బ్రతిమాలినా ఒప్పుకోక పోవడంతో యలమందకేమీ దిక్కు తోచడం లేదు! ఇక తను సస్తే గాని అవి తెగేలా లేవనిపిస్తోందతనికి. ఈ ప్రభుత్వ పథకాలొచ్చాక పెళ్ళికొడుకులూ పెట్రేగిపోతున్నారు! ఒకప్పుడు లేనివాళ్ళంతా ఒకరి మీద ఒకరికున్న సానుభూతితో ఆడపిల్లల తల్లిదండ్రుల బాధలను అర్థం చేసుకుని, కట్నం వంటి లాంఛనాలు పెద్దగా లేకపోయినా పెళ్లిళ్ళు చేసుకునేవాళ్ళు. అందుకే అప్పట్లో పెళ్లిళ్లకు పెద్దగా ప్రయాసలుండేవి కావు. కానీ ప్రభుత్వ 'ప్రత్యేక పథకాల' పుణ్యమాని ఒక్కసారిగా కట్నకానుకలకూ డిమాండు బాగా పెరిగిపోయింది. 'కళ్యాణ లక్ష్మీ' కాసులు కానుకగా వస్తుండడంతో, పేదింటి పెళ్ళికొడుకులక్కూడా పంట పండిపోతోంది. అంతో ఇంతో ఉన్నోళ్ళయినా, లేనోళ్ళయినా ప్రభుత్వమిచ్చిన దానికి ఎంతో కొంత కలిపివ్వాల్సి వస్తోంది. ఇవ్వలేని వారంటూ లేకుండాపోవడంతో, మానవత్వాన్నికూడా మర్చిపోయి, కట్నం లేకపోతే 'ఒక్కనా పెళ్లికొడుకూ' పెళ్ళికొప్పుకోలేకపోతున్నాడు. దీనితో కట్నాలు లేని పెళ్ళిళ్లే కనుమరుగై పోయాయి. ఈ ధోరణే యలమంద లాంటివారి పాలిట శాపంగా మారుతోంది. బోడిమావ ఉండుంటే ఏదో ఒక దారి చూపించేవాడు. ఇంత గడ్డు పరిస్థితి వచ్చేది కాదు. కానీ అర్ధాంతరంగా బోడిమావ వెళ్లిపోవడంతో యలమంద దిక్కులేనివాడై పోయాడు. బోడెత్త కూడా తట్టుకోలేక జీవచ్ఛవంలా తయారైంది. ఆమె పరిస్థితీ దుర్భరంగావుంది. అందుకే ఇప్పుడేం చేయాలో పాలుపోవడం లేదు యలమందకి! .పెళ్లి అర్ధాంతరంగా ఆగిపోతే బిడ్డ జీవితం రోడ్డున పడుతుంది. ఇక వేరే దారేదీ కనబడ్డం లేదు. ఉన్నది ఒకే ఒక దారి. అదీ తాను నడవకూడదనుకున్న దారి. ఆ దారిలో వెళితేనే తన బిడ్డన్నా బాగుపడేది! చివరకు ఓ నిర్ణయానికొచ్చిన వాడిలా, ఉన్నఫళాన లేచి వడివడిగా పొలం వైపు అడుగులేశాడు యలమంద. వర్షాలకి దారులూ, పొలాలు కూడా అతని జీవితం లాగే ఛిద్రం కావడంతో అస్తవ్యస్థమై పోయున్నాయి. గాలివానకు కరెంటు తీగలు కూడా తెగి పడిపోయున్నాయక్కడ. యలమంద ఇంకేమీ ఆలోచించకుండా నేరుగా ఆ తీగలవైపు నడిచేడు. ఆ మరుక్షణమే దిక్కులు పిక్కటిల్లేలా భయంకరమైన ఓ చావుకేక ఆ ప్రాంతమంతా ప్రతిధ్వనించింది. ప్రభుత్వాల రాక్షస విధానాలతో రంపపుకోతకు గురైన రైతు గుండె రోదనలా వుందది. అన్నీ ఆలోచించి, ఇక ఎటూ గతిలేక ఇంతకాలం తానేదైతే వ్యతిరేకిస్తూ వచ్చాడో, అదే పనికి సిద్ధపడ్డ యలమంద, తాను పోతేనన్నా వచ్చేదాంతో తన బిడ్డ పెళ్లి చేసుకొని చల్లగా వుంటుందని, పరిహారం కోసం ప్రాణ త్యాగానికి సిద్ధపడ్డాడు. కానీ ఆఖరిక్షణంలో కూడా దురదృష్టం వెంటాడుతూ అతని ఆశల్ని అడియాశలు చేసేసింది. ప్రభుత్వం అనుసరిస్తున్న అస్తవ్యస్త, అవసరార్థ, అనుచిత చర్యలవల్ల ఖజానా ఖాళీ అయి, ముఖ్యమైన అవసరాలక్కూడా ఆదాయం దొరక్క అవస్థపడుతూ, ఎక్కడెక్కడి నిధులన్నీ బదలాయించి వాళ్ళ అవసరాలకు వాడుకుంటూ, ఇలాంటి నష్టపరిహారాలను ఇవ్వరాదని నిర్ణయించుకుందనీ, ఆమేరకు ఓ రహస్య సర్క్యులర్ జారీ చేసిందనీ యలమందకు తెలియదు పాపం. 'ఈ' కాలపు ప్రభుత్వ విధానాలు ఏ క్షణంలో ఎలా మారుతాయో ఎవరికి తెలుసు? అందుకే యలమంద న్యాయం జరక్కుండానే అన్యాయమై పోయేడు. మబ్బుల్ని నమ్ముకున్నా ఫలితముండేదేమో కానీ ప్రభుత్వాల్ని నమ్ముకొని ప్రాణాలమ్ముకో జూపినందుకు పైసా దక్కకపోగా, యలమంద కుటుంబం దిక్కులేక రోడ్డున పడాల్సొచ్చింది.

ఇవన్నీ చూసి తానున్న పరిస్థితిలోనూ మనసు చలించిన బోడెత్త, తనకున్న స్థిరాస్థులన్నీ తెగనమ్మి యలమంద కూతురి పెళ్ళి జరిపించింది. మిగిలిన సొమ్మంతా యలమంద కూతురి పేరుమీద డిపాజిట్ చేసి, భవిష్యత్ లో ఆ ఊరిపేదలకు అత్యవసరమైన వాటికి ఖర్చు చేసేలా ఆమెనే ట్రస్టీగా పెట్టింది. రాజకీయాలు రాబడి కోసం కాదని, సేవ చేయడానికేననీ నిరూపించాకే బోడిమావ దగ్గరికెళ్లిపోయింది.

# నారు పోసినవాడు

శ్రీమతి సోమూరి నాగమణిశ్రీ స్మారక కథల పోటీ
ప్రోత్సాహక బహుమతి పొందిన కథ
శుభకృత్ వత్సర ఉగాది - 2022

**రాపాక కామేశ్వరరావు**

"అయ్యా పది పైచాలియ్యవా?" సుమారు ఆరడుగుల దేహం చాలీ చాలని ముతక అంగ వస్త్రముతో తన మానాన్ని కాపాడుకుంటోంది. బోడి గుండు పై మొలిచిన వెంట్రుకలు ఒక ఇంచి సైజులో పెరిగున్నాయి గాని తైల సంస్కారము ఎన్నడు ఎరగనివి. చెయ్యి చాచి అర్థిస్తుంది ఒక తెల్ల కమీజు వేసుకున్న పెద్దాయన్ని.



ఆమె పక్కనే ఒక పిల్లవాడు సుమారు నా వయసుంటుంది. బొత్తములు లేని సగం చిరిగిన చొక్కా మరియు చిన్న చెడ్డీతో ఉన్నాడు. ఎండిన డొక్క వెన్నునంటినట్లుంది. వెనుక వైపు కప్పిన చొక్కా ముందున్న ఎముకల గూడును కప్పలేక అవస్థపడుతోంది. ఆ పిల్లవాడి వస్త్రాలకు దానము చేసిన వారింట్లోనే ఆఖరి ఉతుకు అయ్యుంటుంది.

ఆ పిల్లవాడు కూడ ఆ పెద్దాయన మోచేతిని తన చిన్ని మునివ్రేళ్ళతో నిమిరి ఆయన చూడగానే చెయ్యి చాచాడు.

ఆ పెద్దాయన విసుక్కుంటు తన కమీజుకు ఆ పిల్లవాడి చేతి మురికి అంటిందేమోనని ఒక సారి చూసుకుని, వారికి దానము చేసి వెళ్ళిపోయాడు.

ఆ గుడి వద్ద ప్రతి సోమవారము ఇలాంటి దృశ్యాలు కనబడతాయి. కార్తీక మాసము అయితే భక్తులు ఎక్కువగా ఉంటారు. మరియు వేకువ జామునే దర్శనాలు మొదలవుతాయి కాబట్టి, బిక్షనాశించే వాళ్ళు కూడ వేకువనే వచ్చి, గుడి దారిలో ఇరువైపుల కూర్చుంటారు.

నేను మా తాతగారితో కలిసి మా ఊరిలో సోమేశ్వర ఆలయముకి వెళ్ళినప్పుడు అక్కడ చూసినది పై దృశ్యం. నాకప్పుడు ఎనిమిదేళ్ళు. ఆ దృశ్యం మాత్రం నా మదిని కలచివేసింది. ఎందుకంటె.......ఆ పిల్లవాడు లచ్చిగాడు.

★★★

"నీ పేరేమిట్రా?" మాస్టారు అడిగిన ప్రశ్నకు బిత్తరచూపులు చూస్తున్నాడు ఆ పిల్లవాడు.

"సెప్పురా" అని తనతో వచ్చిన ఒక ముసలాయన గదమాయింపు. ఆ పిల్లవాడికి తాత అయ్యుండొచ్చు

"లచ్చిగాడు!"

"ఏ వీధి?"

"జగ్గిలీధి!"

మాస్టారు తల చివ్వున పైకి లేచింది.

"కొద్దిగ దూరము ఉండు, మీద పడకు!" మాస్టారి హూంకరింపు.

"మీ తండ్రి పేరు?"

మళ్ళీ ఆ పిల్లవాడు ప్రశ్నార్ధకముగా ముఖము పెట్టి ఆ ముసలాయన వైపు చూసాడు.

"మీ అయ్య పేరు సెప్పురా!" అన్నాడు తాత.

"పోతుగాడు."

మాస్టారు అడ్మిషన్ ఫారం పూర్తి చేసి "ఈ పిల్లవాడికి ఏమవుతావు నీవు? " అని అడిగారు.

"తాతౌతాను!"

"సంతకం పెట్టగలవా?" అని అడిగారు మాస్టారు.

"సదువు రాదండి, సెయ్య సంతకమెడతాను!" అని తన ఎడమ చేతి బొటన వ్రేలు చాపాడు.

అడ్మిషన్ ఫారం పై ఆ ముసలాయన వేలిముద్రను తీసుకున్న మాస్టారు "నీ పేరేమిటి?" అని అడిగారు.

"రామిగాడు" తాత సమాధానం.

అడ్మిషన్ ఫారం లో తాత పేరుని కూడ రాసుకున్న మాస్టారు అంతటితో ఆ తతంగం పూర్తి చేసారు.

లచ్చిగాడు తరువాత రోజు నుండి స్కూలుకి రావడం మొదలు పెట్టాడు. అందరి పిల్లలు ఎత్తైన ఒక అరుగు మీద కూర్చునేవారు. లచ్చిగాడు లేట్ అడ్మిషన్ అయినందున మరియు ఆ అరుగుపై ఎవరు చోటివ్వక పోవడం వలన కింద మెట్టుపై కూర్చునేవాడు.

ఎక్కడ దొరికిందో ఎవరిచ్చారో కొద్దిగా విరిగిపోయిన బోడి పలక పట్టుకుని వచ్చేవాడు.

★★★

ఒక ఏడాది నుండి లచ్చిగాడు స్కూల్ కి రావడం మానేసాడు. ఏ కారణమో తెలియదు గాని నాకైతే "కింద మెట్టు" పై కూర్చోవడం అతనికి బాధ కలిగించేదేమోనన్న అనుమానం.

★★★

లచ్చిగాడు ఇప్పుడు వాళ్ళమ్మతో కలిసి గుడి వద్ద భిక్ష కోసమై చెయ్యి చాస్తున్నాడు.

"తాతగారు, వీళ్ళెందుకిలా అడుక్కుంటున్నారు? వాళ్ళకి డబ్బులు లేవా?"

"లేవు!" ముక్తసరిగా తాతగారి సమాధానం

"మనకి ఉన్నాయి కదా, వాళ్ళకెందుకు లేవు?"

"మనకి డబ్బులెలా వస్తున్నాయి?" తాతగారి ప్రశ్న

"నాన్నగారు ఉద్యోగం చేస్తున్నారు కాబట్టి డబ్బులొస్తున్నాయి"

"మరి వాళ్ళ నాన్నగారు ఉద్యోగం చెయ్యరు కాబట్టి డబ్బులు లేవు!" అని చెప్పారు తాతగారు

"ఎందుకు చెయ్యరు?"

"ఎందుకు చెయ్యరంటె వాళ్ళు చదువుకోలేదు, ఎందుకు చదువుకోలేదంటె, వారి ఖర్మ!" అన్నారు తాతగారు.

తాతగారికి కోపం తెప్పించానని అర్థమయింది. ఇంకా పొడిగిస్తె తాతగారు తిడతారని ఊరుకున్నాను.

రాత్రి నిద్రపోయినా ఆ దృశ్యమే కళ్ళముందు. అదే ఆలోచన.

కొన్నాళ్ళు పోయాక నానమ్మని అడిగాను "ఖర్మ అంటే ఏమిటి నానమ్మా?"

"ఆ మాట ఎక్కడ విన్నావురా? నీకిప్పుడు నేను చెప్పినా అర్థం కాదు. పెద్దయ్యాక నీకే తెలుస్తుంది!" అని చెప్పి దాటవేసింది.

★★★

మా ఊరి గాంధి మండపం జంక్షన్ దగ్గర మండపానికి ఆనుకుని చెప్పులు కుట్టేవారు వరుసగా కూర్చొని ఉంటారు. నేను హైస్కూల్ లో చదువుతున్న రోజుల్లో ఒకసారి మా తాతగారి చెప్పులు తెగిపోతే, కుట్టించడానికి వెళ్ళాను. ఒకాయన దగ్గరికి వెళ్ళి ఇచ్చాను. వేరెవ్వరివో చెప్పులు రిపేర్ చేస్తుండడం వలన గంట తరువాత రమ్మని చెప్పి నా చెప్పులు పక్కన పెట్టాడు.

గంట తరువాత వెళ్ళి చూడగా ఆ స్థానములో "లచ్చిగాడు" కూర్చొని ఉన్నాడు. వాడి ముందు వరుసగా పేర్చి ఉన్న చెప్పుల జతలలో తాతగారి చెప్పులు గుర్తించి "ఇవి మా చెప్పులు, డబ్బులు ఇంతకు ముందు కూర్చున్న మనిషికి ఇచ్చేసాను!" అని అన్నాను.

"తీసుకో, మా అయ్య సెప్పాడు" అన్నాడు లచ్చిగాడు.

లచ్చిగాడు వాళ్ళ నాన్నకి చెప్పులు కుట్టడం పనిలో సాయం చేస్తుంటానని చెప్పాడు.

అప్పటినుండి నేను ప్రతిరోజు హైస్కూల్ కు వెళ్ళినప్పుడు దారిలోనున్న గాంధి మండపానికి ఆనుకుని కూర్చున్న చెప్పులు కుట్టేవారి వైపు చూసేవాడిని. లచ్చిగాడు, వాళ్ళ నాన్న కనబడేవారు. కొన్నాళ్ళుగా లచ్చిగాడు కనబడ్డం లేదు. అప్పుడు నేను పదో క్లాస్ చదువుతున్నాను. ఒక రోజు నా చెప్పులు రిపేర్ కోసం లచ్చిగాడు వాళ్ళ నాన్న దగ్గరికి వెళ్ళాను.

"మీ అబ్బాయి ఈమధ్య కనబడ్డం లేదండి!" అని అడిగాను.

"ఎప్పుడో ఇంటినుంచి పారిపోయాడు బాబు! మూడు సమచ్చరాలు అయింది. మొన్నే ఒక ఉత్తరమొచ్చింది. మెద్రాస్ లో ఉన్నాడట."

"బాగానే ఉన్నాడా?" అని అడిగాను

"ఆ ఏదో పని సేసుకుంతున్నాను అని రాసాడు!"

"ఆహా" అని నేను ఇంటికొచ్చేసాను.

ఆ రాత్రి నాన్నమ్మను మళ్ళీ అని అడిగాను "ఖర్మ అంటే ఏమిటి?" అని.

"నేనిప్పుడు పెద్ద వాడినయ్యాను. కొద్ది రోజుల్లో కాలేజికి వెళ్తున్నాను, నీవు చెప్పేది నాకు అర్థమౌతుంది" అన్నాను.

"సరేరా చెబుతాను విను. మనము చేసే ప్రతి పనిని కర్మ అంటారు. కర్మలకు ప్రతిఫలం ఉంటుంది కదా. దానిని కర్మఫలం అంటారు. ప్రతి జన్మలో మనము చేసే మంచి కర్మలకు మంచి కర్మఫలం లభిస్తుంది. చెడు కర్మలకు చెడు కర్మఫలం ఉంటుంది. పూర్వ జన్మలో మనము చేసే మంచి లేదా చెడ్డ కర్మల మూలముగా ఈ జన్మలో మనము కర్మఫలంను అనుభవిస్తాం. చెడు కర్మఫలంనే ప్రారబ్ధం అని కూడ అంటారు!" నాకు అర్థమయ్యేటట్టు టూకీగా చెప్పింది నాన్నమ్మ.

“తాతగారు లచ్చిగాడి విషయంలో ‘ఖర్మ’ అన్నారేమిటి?” అడిగాను.

“అంటె చెడు కర్మఫలంను అనుభవించేటప్పుడు మనుషులు ఎక్కువ బాధపడతారు కదా, అందుకే తాతగారు కర్మని అలా వత్తి పలికారు!” అంది నాన్నమ్మ.

“అయితే లచ్చిగాడు, వాళ్ళ కుటుంబం పూర్వ జన్మలో చెడ్డ పనులు చేసుంటారన్నమాట. అయితే ఈ జీవితాంతం బిక్షగాళ్ళుగానే ఉండిపోతారా? ఆహారం కోసం ప్రతిరోజు అడుక్కోవడమేనా? ఎవరు దానం చెయ్యకపోతే ఆకలితో బాధపడాల్సిందేనా?” నా చిన్ని మెదడులోని ప్రశ్నల పరంపర బయట పెట్టాను.

“అలా కాదురా, ‘నారు పోసిన వాడు నీరు పోస్తాడు’ అంటారురా... అంటే పుట్టించిన భగవంతుడు ఏదో రూపములో వాళ్ళకి కడుపు నింపుతాడు!” నన్ను ఊరడించడానికన్నట్టు చెప్పింది నాన్నమ్మ.

“నీరు పొయ్యడమంటే అడుక్కు తినమని చెప్పడమా?” అనుకున్నాను మనసులో.

నేను పదో క్లాస్ పాస్ అయ్యాక, పై చదువుల నిమిత్తం మా ఊరు విడిచి వెళ్ళిపోయాను. ఆ తరువాత ఉద్యోగరీత్యా ఎక్కడెక్కడో తిరిగి రిటైర్ అయ్యాక విశాఖపట్టణంలో స్థిరపడ్డాను.

★★★

ఈ సంవత్సరం కార్తీక మాసంలో ఒకసారి మా ఊరిలోని సోమేశ్వరాలయముకి వెళ్దామనిపించింది. మా ఊరిలోనే ఉంటున్న మా పిన్నిగారబ్బాయి మన్మథరావుకు ఫోన్ చేసాను.

“ఒరేయ్ తమ్ముడు... రెండవ సోమవారం మన ఊరి సోమేశ్వరాలయం దర్శనం కోసం వద్దామనుకుంటున్నానురా!”

“అన్నయ్యా! ఈ మధ్యన బాగా డబ్బు వెచ్చించి ఆ గుడిని పునరుద్ధరించారు. మన చిన్నప్పుడు ఈశ్వరుడి కోవెల ఒక్కటే ఉండేది కదా ఇప్పుడు సకల దేవుళ్ళ విగ్రహాలతో బయటి ప్రాంగణమంతా సుందరముగా తీర్చిదిద్దారు. కార్తీక మాసం మొదటి రోజునే ప్రారంభోత్సవం. అందువలన నీవు ఆ రోజుకుండేటట్టు వచ్చెయ్!” అన్నాడు.

మా స్వంత ఊరు కాబట్టి, సహజముగా నాలో ఉండే ఉత్సుకత వలన ఒక రోజు ముందుగానే చేరుకున్నాను.

మరుసటి రోజు ఉదయం భక్తులు విరివిగా గుమిగూడారు. కొన్ని భజన బృందాలు మేళ తాళాలతో ఊరేగింపుగా వస్తున్నారు. చివరిగా సన్నాయి మేళము వస్తుంది. దాని వెనుక ఆలయ కమిటీ చైర్మన్ అనుకుంటాను.. తలపై వెండి పళ్ళెంలో దేవుడికి నూతన వస్త్రాలు కానుకగా ఇవ్వడానికి పట్టుకొస్తున్నారు. తమ్ముడిని అడిగాను “ఆలయ కమిటీ చైర్మన్ ఎవరురా?”

“మన పంచాయతి సర్పంచ్ లక్ష్మణరావు. ఇప్పటి నిబంధనల ప్రకారం పంచాయతి సర్పంచే ఆలయ కమిటీ చైర్మన్” అన్నాడు.

‘ఆ మొహం చూస్తే.. ఎక్కడో చూసినట్టుంది!’ అనుకున్నాను. చాలసేపు బుర్రకు పదును పెట్టాను. నా జ్ఞాపకాల దొంతరలో అట్టడుగున దాగిన లచ్చిగాడు గుర్తొచ్చాడు.

‘ఆ.....! అతడేనా!!! ఎంత మార్పు!! నా చిన్నప్పుడు స్వామినాయుడుగారని పెద్ద భూస్వామి, ఆలయ కమిటీ చైర్మన్ గా ఉండేవాడు. ఆయన పోయాక వారి ఆస్తి హారతి కర్పూరంలా హరించుకు పోయింది. పిల్లలు చెట్టుకొకరు పుట్టకొకరు అన్నట్టు ఎక్కడెక్కడో ఉన్నారు. ఓడలు బళ్ళు, బళ్ళు ఓడలు అవుతాయంటారు, నిజమే! కలిసొచ్చే కాలంలో నడిచొచ్చే కొడుకు పుడతాడు.. అన్న మాట కూడ నిజమే. కాలం కలిసొచ్చి లక్ష్మణరావు ఎవ్వరు ఊహించని స్థాయిలో ఉన్నాడు.’ అతడ్ని చూస్తూనే అనిపించింది.

ఒకసారి అతడితో మాటలాడాలి అనుకున్నాను. గుడిలో హడావుడి ముగిసాక ఆయన ఒంటరిగా ఉన్నప్పుడు, దగ్గరగా వెళ్ళాను.

"నమస్తే అండి. నాపేరు వెంకటరత్నం. నేను బేంక్ లో మేనేజర్ గా చేసి ఈ మధ్యనే రిటైరయ్యాను. ఇప్పుడు వైజాగ్ లో ఉంటున్నాను. ఇది మా స్వంత ఊరు. నేను చిన్నప్పుడు ఈ గుడికి ఎక్కువగా వచ్చేవాడిని. అందుకని ఒకసారి మళ్ళీ స్వామి వారి దర్శనం చేసుకుందామని వచ్చాను!" అన్నాను.

ప్రతి నమస్కారం చేసి "ఆ రండి కూర్చోండి" అని ఆయన పక్కనున్న కుర్చీ చూపించారు.

"ఇప్పుడు మీకు పాత విషయాలు గుర్తుచెయ్యాలని కాదు గాని... మీలో మార్పును చూసాక ఉండబట్టలేక అడుగుతున్నాను."

అడగండి.. అంటున్నట్టు చూశాడతను.

"నేను గుర్తున్నానా? చిన్నప్పుడు మీ నాన్నగారి దగ్గరికొచ్చి చెప్పులు కుట్టించుకునే వాడిని. ఒకసారి మీరు కనబడకపోతే, మీ గురించి మీ నాన్నగారితో వాకబు కూడ చేసాను. మీరు మద్రాస్ వెళ్ళిపోయారని చెప్పారు. ఇప్పుడు ఇలా కనిపించారు. ఇంత మార్పు.. ఎలా?" ఆదుర్దాతో అడిగాను.

"నాదో పెద్ద కథండి! అయినా మాలాంటి వారి కథల్లో ఏముంటాయి ఆకలి కేకలు, ఆర్తనాదాలు తప్ప. అప్పటి మా పరిస్థితి మీకు తెలుసు కదా.. చెప్పులు కుడితే ఏమొస్తుంది! అలాగని ఇళ్ళల్లో గాని, షాపుల్లో గాని పనులు చేద్దామంటే మాకు పనిచ్చేవారు కాదు! సుమారు పన్నెండు సంవత్సరాల వయసులో నేను ఇంటినుండి పారిపోయాను. మన రైల్వే స్టేషన్ లో హౌరా మద్రాస్ మెయిల్ ఎక్కాను. ఎక్కడికెళ్ళాలో తెలియదు. నాలాంటి వాళ్ళు చాలా మంది కనిపించారు ట్రైన్ లో. సుమారు నా ఈడు వాడు ఒక అబ్బాయి, తెలుగు మాటలాడుతుంటె.. 'ఎక్కడికెల్తున్నావు' అని అడిగాను. 'ఏమో ట్రైన్ ఎక్కడికెల్తె అక్కడికి' అన్నాడు. అయితే 'నేను కూడ నీతో వస్తాను' అన్నాను. మరుసటి రోజు తెల్లవారు జామున నాలుగు గంటలకి ట్రైన్ మద్రాస్ చేరింది. స్టేషన్ బయటికిరాగానే 'ఆంధ్ర టిఫిన్స్' అని ఒక టిఫిన్ సెంటర్ కనిపించింది. అక్కడికి వెళ్ళాం. ఏదైనా పని ఉంటే ఇమ్మని ఓనర్ ని అడిగాం. 'నా దగ్గర ఒకరికి పని ఇస్తాను. ఇంకొకరికి ఎనిమిది గంటల తరువాత చెబుతాను, ముందు టిఫిన్ తినండి' అని వేడి ఇడ్లీలు ఇచ్చారు. ఆ ఇడ్లీలు చూడగానే ప్రాణం లేచి వచ్చింది." ఒక్క నిమిషం ఆగి మళ్ళీ అన్నాడు.

"ఎనిమిది గంటలకి ఒకాయన వచ్చారు. ఆయనతో నన్ను వెళ్ళమన్నారు. ఆయన ఆ ఏరియాలో హోల్ సేల్ ఎగ్ డీలర్. ఆయన షాప్ "ఫిరోజ్ ఎగ్ సెంటర్" కు నన్ను తీసుకెళ్ళారు. నా అదృష్టం కొద్ది తొలి రోజునే నాకు పని దొరికింది. 'కష్టాలు కలకాలం కాపురముండవు' అని మా నాన్న అన్న మాటలు గుర్తొచ్చాయి. ఫిరోజ్ గారు ప్రతి శుక్రవారం అతనితో పాటు నన్ను మసీదుకు తీసుకెళ్ళే వారు. నమాజ్ కూడ చెయ్యించేవారు! అలా మూడేళ్ళు గడిచాయి. నా దురదృష్టం మళ్ళీ వెంటాడింది. ఫిరోజ్ గారు గుండెపోటుతో హఠాత్తుగా చనిపోయారు. ఆ వార్త వినగానే భయమేసింది. కాళ్ళ కింద భూమి పగిలి జారిపోతున్నట్టు అనిపించింది. ఏమి చెయ్యాలో అర్థం కాలేదు. రెండు రోజులు ఆ షాప్ దగ్గరే ఇటు అటు తిరిగాను. మా ఎగ్ సెంటర్ పక్క ఇంట్లో జోసెఫ్ గారని ఒక కేరళ వాసి ఉండేవారు. ఆయన నా కష్టం చూసి నన్ను పిలిచి 'ఎర్నాకుళంలో మా స్నేహితుడు చర్చ్ లో ఫాదర్, ఆయనకి ఒక సహాయకుడు కావాలట వెళ్తావా' అని అడిగారు. నేను సరేనని ఎర్నాకుళం వెళ్ళాను."

"ఎర్నాకుళం చర్చ్ లో ఫాదర్ కు సహాయకునిగా పని చేసాను. అక్కడ ఫాదర్, అందరితో పాటు నాతో కూడ ప్రేయర్ చెయ్యించేవారు. ఫాదర్ కు వ్యక్తిగత సహాయకురాలిగా ఉన్న "ప్రీతి జేమ్స్" తో పరిచయమైంది. తరువాత కొన్నాళ్ళకు ఆమెను పెళ్ళి చేసుకున్నాను. స్వంతముగా, నాకు తెలిసిన గుడ్ల వ్యాపారం మొదలుపెట్టాను. ఇద్దరు పిల్లలు పుట్టారు. వాళ్ళు అక్కడే చదువుకుని ఉద్యోగాలు చేసుకుంటున్నారు. పదేళ్ళ క్రితం మా నాన్నగారు పోయారని తెలిసి, నాకు కూడ స్వంత ఊరికి వచ్చెయ్యాలనిపించి, నా భార్యతో కలిసి పెర్మనెంట్ గా ఇక్కడికి వచ్చేసాను!"

"మరి మీ అమ్మగారు?" అని మధ్యలో అడిగాను

"అమ్మగారు ఎప్పుడో పోయారు. మా పెద్దమ్మ పిల్లలు ఇన్నాళ్ళు నాన్నగారిని చూసేవారు! నా జీవితానికి మార్గం చూపిన

ఫిరోజ్ గారి పేరు మీదే ఇక్కడ 'ఫిరోజ్ ఎగ్ సెంటర్' స్టార్ట్ చేసాను. అది చూసి చాలమంది నన్ను ముస్లిం అనుకునేవారు. కాని మీలాంటి పాత వాళ్ళకి నేనెవరో తెలుసు కదా. ఇప్పుడు దేవుని దయ వలన వ్యాపారం బాగుంది. మూడేళ్ళ క్రితం మన పంచాయతి ఎన్నికలలో రిజర్వ్ స్థానములో సర్పంచ్ అయ్యాను. మన చిన్నప్పటి స్కూలు.. అద్దె బిల్డింగ్ లో ఉండేది. నేను సర్పంచ్ అయ్యాక ప్రభుత్వ గ్రాంట్లతో మా వీధి చివర ఉన్న పంచాయతి స్థలంలో స్కూలు బిల్డింగ్ కట్టించాను. స్కూలు పిల్లలు వచ్చి వెళ్ళడానికి వీలుగా సిమెంటు రోడ్లు వేయించాను. ఇప్పుడు మా వీధి కూడ శుభ్రం అయింది. సర్పంచ్ అయ్యాక ఊళ్ళో పెద్ద వారిని సంప్రదించి మన గుడి కోసం చందాలు వసూలు చేసి ఈ కార్యక్రమం నిర్వహించాము!"

"పూర్వం ఈ గుడి ప్రాంగణములో ప్రతి ఆదివారం అన్నదానం చేసేవారు కదండీ" అని అడిగాను.

"అవునండి, కొన్నాళ్ళు మూత పడింది. ఇప్పుడు మళ్ళీ మొదలు పెట్టాం!" అని చెబుతున్న లక్ష్మణరావు మొహంలో విజేతలు పొందే విజయగర్వం తొణికిసలాడింది.

"అభినందనలు సార్, చాలా మంచి పనిచేస్తున్నారు!" అని చెప్పి నా వంతుగా పదివేల రూపాయలు అన్నదానంకు విరాళం ఇచ్చాను.

అతని దగ్గర శెలవు తీసుకుని బయలుదేరాను. నా ఆలోచనలు అమ్మమ్మ మాటల వైపు దారితీసాయి.

'లక్ష్మణరావు తలిదండ్రులు ప్రారబ్ధకర్మను పూర్తిగా అనుభవించారేమో గాని, లక్ష్మణరావుకు మాత్రం, పూర్వజన్మ ప్రారబ్ధం కన్నా.. పూర్వజన్మసుకృతం ఎక్కువగా ఉందేమో!' అనుకున్నాను.

నాన్నమ్మ చెప్పినట్టు 'నారుపోసిన వాడు నీరు పోసాడా?' ఏమో! ఒక్క లక్ష్మణరావు విషయంలో అది నిజమయ్యిండొచ్చు, మరి ప్రపంచములోని కోట్లాది నిరాశ్రయులు, నిర్భాగ్యులు, ఆకలి రక్కసికి బలైపోతున్న అనాథల సంగతేమిటి?'

'లక్ష్మణరావు చేసిన సర్వమత ప్రార్థనలు విన్న దేవుళ్ళలో.. ఏ దేవుడు నారు పోసాడు? ఏ దేవుడు నీరు పోసాడు? పెద్దలు చెప్పే 'అందరికీ ఒక్కడే దేవుడు' అనుకోవాలా?

అతని దగ్గర శలవు తీసుకుని బయలుదేరాను.

అలా సోమేశ్వరాలయము నుండి బయలుదేరి వస్తుండగా, ఆ వీధిలో ఇంటి నుండి "సబ్ కా మాలిక్ ఏక్ హై" అని వినిపిస్తుంది. నాలో రగులుతున్న అంతులేని ప్రశ్నలకు సమాధానంగా.. ఆ పాట ఎంతో హాయిని ఇచ్చింది.

# విలయం

ప్రోత్సాహక బహుమతి పొందిన కథ

శ్రీమతి పోడూరి నాగమణిశ్రీ స్మారక కథల పోటీ * శ్రీ శుభకృత్ వత్సర ఉగాది - 2022 *

**రాంభక్త పద్మావతి**

చికాగో నగరంలో కాస్కోలో గ్రోసరీస్ కొంటున్నాను. నేను ఉండే ఇంటి నుండి కాస్కోకి ఒక గంట డ్రైవ్. కానీ ఇక్కడ చవక కాబట్టి పదిరోజులొకసారి ఇక్కడకే వచ్చి కొనుక్కుని వెడతాను. ఇండియాలో అయితే పచారీసామాన్లు అనే అందును.. కానీ అమెరికాలో కదా నేను ఉన్నది! అందుకే గ్రోసరీస్ అనే అంటాను, బ్రేక్ ఫాస్ట్ కి అవకాడో టోస్ట్ తిన్నానని కూడా అంటాను. ఇక్కడ పొద్దున్నే ఊతప్పాలు దోశలూ చట్నీలు చేసుకునే సమయం ఎక్కడుంటుంది! ఉదయం లేచిన దగ్గర నుండీ వారమంతా పరుగులు, వీకెండ్ మాత్రం పూర్తిగా ఎంజాయ్ చెయ్యడమే. అదిగో అప్పుడు దేశీ దోశలో, రవ్వదోశలో వేసుకుని తిని లొట్టలు వేస్తూ ఉంటాను, విదేశీ దోశలను ఇక్కడ పాన్ కేక్ లని అంటారని నేనే అప్పుడప్పుడు జోకుతుంటానులెండి. దాదాపు ప్రతి భారతీయుడి జీవన విధానం ఇక్కడ ఇలాగే ఉంటుంది!

భారతీయుడు, భారతదేశం అనగానే లక్ష్మీనరసయ్య మాష్టారు వెంటనే గుర్తుకురాక మానరు. ఆయన గుర్తురాగానే అప్పటి స్కూలు చదువుల రోజులలోకి మనసు పరుగులు తీయకా మానదు. అంతెందుకు.. ఆయనని నేను గుర్తుచేసుకోని రోజు లేదంటే మీరు నమ్మరు. ఆయన అంతగా నన్ను ప్రభావితం చేసిన మనిషి. తెలుగు పాఠం ఆయన చెబితేనే వినాలి, పద్యాలు ఆయన పాటలా పాడుతుంటే ఆ అనుభూతే వేరు. ఎంతో ఓపికగా మరెంతో చక్కగా ప్రతి విషయాన్నీ విడమరచి చెప్పేవారు. ఆయన పాఠం విన్నాక మా క్లాసంతా తెలుగు పరీక్షకు పుస్తకాలు తీసి చదివితే ఒట్టు. అలా వెళ్ళి ఆయన చెప్పింది చెప్పినట్టు పరీక్షలో రాసేసి మంచి మార్కులు తెచ్చుకునేవాళ్ళం! నవయవ్వనంతో మిసమిసలాడుతూ ఐదు అడుగుల ఎనిమిది అంగుళాల ఎత్తుతో, చామనఛాయతో చూపరులను సమ్మోహితులు చేసేవారు. ఇక ఆయన మాట్లాడుతుంటే అంతా మంత్రముగ్ధుల్లా వింటూ ఉండేవారు. దానితో పాటూ ఆయన తన శిష్యులకు ఎంతగా దేశభక్తిని నూరి పోసేవారో మాటలలో చెప్పలేను.




“భారతదేశం నా జన్మభూమి, భారతీయులంతా నా సహోదరులు!” అంటూ పదే పదే ఆ వాక్యాలు చెప్పించేవారు.

ఆయన చెప్తూ పోతుంటే ఒక గగుర్పాటు కలిగి మిలటరీలో అమాంతం చేరిపోయి, దేశం కోసం ప్రాణాలు అర్పించాలనిపించేది. అంత బాగా దేశభక్తి పాఠాలు చెప్పేవారు! దానితో పాటు మంచి మంచి దేశభక్తి గీతాలు కూడా నేర్పేవారు. ఏ చుట్టాలింటికో పెళ్ళిళ్ళకో వెళ్ళినపుడు.. నాన్నగారు నా చేత ఆ పాటలన్నీ పాడించేవారు. అందరూ నా బుగ్గలు చిదిమి బాగా పాడావంటూ మెచ్చుకోవడమే కాక, నేర్పిన మాష్టారి గురించి కూడా అడిగి తెలుసుకుని ఆయనను గొప్పగా అనుకునేవారు. తమ పిల్లలకి అటువంటి మంచి గురువు దొరికితే బావుండునని ఆశ పడేవారు.

కానీ ఆయన దేశభక్తిని ఎంత నూరి పోసినా నేను ఇలా విదేశం వచ్చి ఇక్కడే ఉండిపోవడానికి నిర్ణయించుకున్నానని ఆయనకు తెలిస్తే ఎలా ఫీలవుతారా అని అప్పుడప్పుడు ఆలోచిస్తూ ఉంటాను. కానీ నా పరిస్థితులకు తలవంచి ఆర్థిక కారణాలతో ఇక్కడకు వచ్చాను. మొదట్లో చాలా అవస్థపడినా ఇప్పుడు నాకు సరిపడా సంపాదించుకోవడమే కాక, ఇండియాలో ఉన్న అమ్మానాన్నలకు ఒక చిన్న గూడు ఏర్పాటు చేసాననే తృప్తి మిగిలింది. కానీ గురువుగారి ముఖం నా జ్ఞాపకాలలో

కదలాడినపుడల్లా ఏదో తప్పు చేసాననే చిన్న బాధ నా మనసు లోతుల్లో కదలాడుతూ ఉంటుంది. ఒకోసారి తప్పదు మనం ఒకటి అనుకుంటే జీవితం మరొక వైపుకు తీసుకెడుతుంది కాబట్టి జీవితంతో రాజీ పడక తప్పదు.

గ్రోసరీస్ వేసుకున్న ట్రాలీ తోసుకుంటూ పార్కింగ్ లాట్ లో ఉన్న నా కారు దగ్గరకు వచ్చి డిక్కీ తెరిచి అన్నీ అందులో పెడుతున్నాను. ఉన్నట్టుండి టమాటాలు రెండు కిందపడి ఒకవైపుగా దొర్లుకుంటూ వెళ్ళిపోయాయి. అవి వెళ్ళిన వైపుకు నడిచి వాటిని ఏరుకుని కవర్ లో వేస్తూ తలెత్తి చూసేసరికి.. కాస్కోకి బయట దూరంగా నిలబడి ఉన్న ఒకాయన అచ్చంగా మాష్టారిలా అనిపించారు. 'అబ్బే మాష్టారు ఇక్కడెందుకుంటారు నా పిచ్చి గానీ, అలా ఆయన గురించి ఆలోచించడం వల్ల నాకు అలా కనబడి ఉంటారు' అనుకున్నాను. కారు స్టార్ట్ చేసి అటువైపు నుండి వెడుతూ మళ్ళీ పరధ్యానంగా అటు చూసి షాక్ కి గురయ్యాను. నేను పొరపాటు పడలేదు, ఆయన మా మాష్టారే. వయసు తెచ్చిన మార్పులున్నా ఆయన ముఖం నేనెలా మార్చిపోగలను. అటువైపు ఎవరో కారు తీసిన చోట గబగబా నా కారు పార్క్ చేసి ఆయన వైపు పరుగు తీసాను.

“మాష్టారూ నమస్తే, నేను గుర్తున్నానాండీ!!” అన్నాను చేతులు జోడిస్తూ ఆయన ఎదురుగా నిలబడి.

“నువ్వు.... నువ్వు శివవి కదూ!” అన్నారు కళ్ళజోడును సవరించుకుని నన్ను పరిశీలనగా చూస్తూ.

ఆయన ముఖంలో ఆశ్చర్యం దాగాలన్నా దాగలేదు, నా మటుకు నాకు అంతకన్నా ఆశ్చర్యంగా ఉందని వేరే చెప్పక్కరలేదు. ఆయనని అలా కలిసినందుకు, నన్ను వెంటనే గుర్తుపట్టినందుకు.

“మాష్టారూ, మిమ్మల్ని ఇక్కడ ఇలా కలవడం చాలా ఆనందంగా ఉందండీ. మీకు ఇక్కడ చుట్టాలెవరైనా ఉన్నారా చికాగోలో?” అని అడిగాను ఉత్సుకతను ఆపుకోలేక ఖంగారుగా.

“నా సంగతి సరే, నువ్వు ఇక్కడ ఉంటున్నావా? ఎప్పుడు వచ్చావు ఇక్కడకి?” అన్నారాయన శాంతంగా.

“ఏడెనిమిది ఏళ్ళవుతోంది మాష్టారూ!” అన్నాను ముక్తసరిగా.

“అది సరే కానీ ఇక్కడే ఉంటున్నావా?” అన్నారు.

ఆయన అన్నదానికి అవునంటూ మొహమాటంగా తలూపాను.

“మా అబ్బాయి కూడా ఇక్కడే ఉంటున్నాడు. నేను మా అబ్బాయి ఇంటికి వచ్చి అప్పుడే రెండు నెలలు అవుతోంది!” అన్నారు నేను ముందడిగిన ప్రశ్నకు సమాధానంగా.

ఆయన అన్నదానికి నేను అదిరిపడ్డాను.

'అదేమిటి మాష్టారుగారి అబ్బాయి విదేశంలోనా' అని మనసులో ఇలా అనుకున్నానో లేదో,

“మాష్టారుగారి అబ్బాయి ఇక్కడ అమెరికాలో ఏమిటని, అందునా నేను ఈ గడ్డ మీద అడుగుపెట్టడం ఏమిటా అని ఆలోచిస్తున్నావు కదూ!” అన్నారు నా మనసును చదివేసినట్టు.

మళ్ళీ అటూ ఇటూగా తలూపాను.

“ఇప్పుడు మూడు ముక్కల్లో అదంతా చెప్పడానికి కుదరదు కానీ మనం మళ్ళీ కలుద్దాం!” అని నేను ఎక్కడ ఉంటున్నానో కనుక్కుని, వాళ్ళ అబ్బాయి అడ్రసు ఇచ్చి దానితో పాటు అతడి ఫోన్ నంబర్ ఇచ్చి, నా ఫోన్ నంబర్ కనుక్కున్నారు.

ఒక నాలుగు రోజుల తరువాత నేనే ఫోన్ చేద్దామనుకుంటూ ఉండగా ఆయనే ఫోన్ చేసారు. కుశల ప్రశ్నల అనంతరం “ఏమయ్యా నన్ను మీ ఇంటికి ఆహ్వానించవా..” అంటూ చిన్నగా నవ్వేరు.

కాసేపు మాట్లాడి ఫోన్ పెట్టేసాక నాకెందుకో మాష్టారి మాటల్లో మునుపటి ఉత్సాహం కనబడలేదనిపించింది. అసలు మొదటిసారి ఆయనను ఇక్కడ హఠాత్తుగా చూసిన ఆశ్చర్యంలో మునిగి నేను గమనించలేదు కానీ ఇప్పుడు ఆలోచిస్తే ఆయన

మాటలలో ఒక విరక్తి ధ్వనించినట్టు కూడా నాకు అనిపించింది. సరే ఎలాగూ ఇంటికి వస్తానన్నారు కదా అని నేను ఆయనను మరే ప్రశ్నలూ వెయ్యలేదు.

అనుకున్నట్టుగానే ఆయన ఒక ఆదివారం మా ఇంటికి భోజనానికి వచ్చారు. వాళ్ళ అబ్బాయి కారులో ఆయనను డ్రాప్ చేసి వెళ్ళాడు. లోపలకి రమ్మని ఆహ్వానిస్తే అతడికి ఏదో అర్జంటు పని ఉందని చెప్పి వెళ్ళిపోయాడు. సరే అతడిని ఇబ్బంది పెట్టడం ఎందుకని నేను కూడా ఊరుకున్నాను.

మాష్టారిని కనుక్కుని ఆయనకు ఇష్టమైనవన్నీ నేను నా భార్య చంద్రలేఖ కలిపి వండాం.

నా భార్యని ఆయనకు పరిచయం చేస్తే తను చేతులు జోడించి నమస్కరించి "మీ గురించి ఈయన మాట్లాడని రోజు ఉండదండీ!" అంటూ ఆయన గురించి నేను చెప్పిన విషయాలన్నీ చెప్పింది.

"అంతా మీ ఆయన గురుభక్తి తల్లీ. ఈ కాలంలో గురువును, గురువు చెప్పిన చదువును ఎవరు గుర్తుంచుకుంటారు. ఒక శిష్యుడు ఇలా ఇంతలా నన్ను గుర్తుంచుకున్నాడంటే అది నా గొప్పదనం కానే కాదు. అంతా శివ పెద్ద మనసని ఘంటాపథంగా చెప్పగలను!" అన్నారు.

భోజనం చేసాక ఆయనకు ఇష్టమైన తాంబూలం కూడా అందిస్తే చిరునవ్వు నవ్వి వాత్సల్యంగా నా భుజం తట్టారు.

చంద్రలేఖ కాసేపు నడుం వాలుస్తానని బెడ్ రూం లోకి వెళ్ళి మా ఇద్దరికీ ఏకాంతం కల్పించింది. నేను ఆయనతో పాత జ్ఞాపకాలలోకి ప్రయాణం కట్టాలనుకుంటున్నానని తనకి తెలుసు.

"మాష్టారూ చెప్పండి మీరు ఎలా, ఎందుకు ఇక్కడకు వచ్చారు?" ఆగలేక అడిగేసాను.

ఆయన ఏదో చెప్పేలోగానే.. "నన్ను క్షమించండి, ఇంట్లోని ఆర్థిక సమస్యల వల్ల నేను పరిస్థితులకు లొంగిపోయాను. ఇక్కడకు రాక తప్పలేదు. ఒకోసారి ఆత్మవంచన చేసుకుంటూ ఇక్కడ బతకడం అవసరమా అనిపిస్తూ ఉంటుంది. కానీ మీరు చెప్పిన పాఠాలు మాత్రం నేను మరవలేదు. ఏం చేస్తాం, నేను అశక్తుడిని అయిపోయాను మాష్టారూ. చెల్లి పెళ్ళి, తమ్ముడి చదువు, నాన్నగారి అనారోగ్యం వీటన్నిటికీ నేను తలవంచక తప్పలేదు" అన్నాను.

అప్పటికే నా గొంతు పూడుకుపోయింది.

"పరవాలేదయ్యా. నేను అర్థం చేసుకోగలను. నువ్వేమీ తప్పు చెయ్యలేదులే. అంతా పరిస్థితుల ప్రభావమని నాకు తెలుసు" అన్నారు.

ఆ తరువాత కాసేపు మౌనంగా ఉండిపోయారు. నేను కూడా ఆయన నిశ్శబ్దాన్ని భగ్నపరచలేదు.

ఆయన ఉన్నట్టుండి చెప్పడం మొదలుపెట్టారు.

"శివా నీకు తెలుసుగా నాకు ఇద్దరు కొడుకులు. ఇక్కడున్నది చిన్నవాడు. పెద్దవాడిని ఆ రోడ్డు మింగేసిందయ్యా. ఎంత పెద్ద యుద్ధం చేసాననుకున్నావు. కానీ ఓడిపోయి అలసిపోయాను!" అన్నారు.

ఏమైందా ఆయన పెద్దకొడుక్కి అని ఆలోచిస్తూ, ఆయన ముఖంపై కమ్ముకున్న నీలినీడలను అలా చూస్తూ ఉండిపోయాను.

"నువ్వు స్కూలు వదలి వెళ్ళాక, మేము చిన్న ఇల్లు కొనుక్కుని ఆ ఏరియాకు మారాం. ఎక్కడకు వెళ్ళాలన్నా ఆ వీధిని దాటుకునే వెళ్ళాలి. ఆ వీధి చివర ఒక గుడ్డి మలుపు, దానిని ఆనుకుని ఒక పెద్ద గొయ్యి ఉన్నాయి. సమస్యేమిటంటే బాగా దగ్గరకు వెళ్ళేవరకూ ఆ గొయ్యి కనబడదు. ఆ గొయ్యిని ఏ కరెంటు వాళ్ళో లేక మరెవరో, ఏ రిపేరు కోసం తవ్వేరో మరి. ఆ ఏరియాలో కూడా ఎవరికీ తెలీదన్నారు. ఏదైతేనేం ఎంత నెమ్మదిగా బండి మీద వచ్చినా ఆ గొయ్యి దగ్గర ప్రతి రోజు ఎవరో ఒకరు బోల్తా పడేవారు. అలా రెండు నెలలలో నలుగురు కుర్రాళ్ళు ప్రాణాలు కోల్పోయారు. నాలుగో కుర్రాడు చచ్చిపోయాకే ఆ సమస్య నా

దృష్టికి వచ్చింది. నీకు తెలుసు కదా నేను బస్సులలో తిరిగే పాతకాలం మనిషినని, అందుకే అది నా దృష్టికి వెంటనే రాలేదు. నేను నాకెందుకని ఊరికోలేని మనిషిని మరి. అందుకే ఆ విషయం మా ఏరియా కార్పొరేటర్ దగ్గరకు వెళ్ళి చెప్పాను. నాలుగు నిండు ప్రాణాలు బలయ్యాయనీ చెప్పాను. అలాగే అని తలూపాడు కానీ ఏమీ పట్టించుకోలేదు! నేను వదలకుండా రోడ్లు మరియు బిల్డింగుల శాఖలో తెలుసున్న ఇంజనీరుని కలిసాను. అతడు గౌరవంగా మాట్లాడుతూనే తన చేతుల్లో ఏమీ లేదని చెప్పి, ఎక్సిక్యూటివ్ ఇంజనీరుని కలవమన్నాడు. ఇరవైసార్లు తిరిగితే ఒకసారి ఆయనగారి దర్శనం అయింది. ఆయన అంతా విని చూస్తానని హామీ ఇచ్చాడు. కానీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది! నేను ఊరుకోకుండా ఒక తెలిసిన అతడి ద్వారా స్థానిక ఎమ్మెల్యేని కలిసాను. నేను చెప్పింది అసలు విన్నాడో లేడో కూడా నాకు అర్థం కాలేదు. అతడి నిర్లక్ష్యానికి నాకు చాలా విసుగనిపించింది. ఇక్కడ మనుషుల ప్రాణాలు పోతుంటే ఎవరూ పట్టించుకోవట్లేదని బాధగా కూడా అనిపించింది. ఆ బాధలో నేనుండగానే పెద్దాడు సరిగ్గా అదే చోట ప్రాణాలు పోగొట్టుకున్నాడు.

తన స్నేహితుడు బండి నడుపుతుంటే వీడు వెనకాల కూర్చున్నాడు. బండి నడుపుతున్న అబ్బాయికి కాలు చెయ్యి విరిగాయి, అదృష్టం బాగుండి అతని ప్రాణాలు దక్కాయి. నేను కంప్లైంట్ చేసినపుడైనా వారు సకాలంలో స్పందించి ఉంటే, మా వాడి ప్రాణాలు దక్కేవి కదా అన్న విషయం నా మనసును మెలిపెట్టింది!"

ఆయన చెప్పడం ఆపి పక్కనున్న సీసాలోని నీళ్ళు తాగి కళ్ళజోడు తీసి కళ్ళు తుడుచుకున్నారు.

మాష్టారి జీవితంలో ఇంత విషాదం జరిగిందా అని నాకు బాధ కలిగింది. నాకే ఇలా అనిపిస్తే ఇక ఆయనకు ఎలా ఉంటుంది.

"ఆ తరువాత నేను తెలిసిన పేపర్ రిపోర్టర్ ను పట్టుకుని ఈ విషయాలన్నీ చెప్పాను. అదృష్టం కొద్దీ ఆ పేపర్ లో ఒక చిన్న వార్తగా ఆ విషయాన్ని రాసారు. ఏదో చిన్నగా నా ప్రయత్నం ఫలించింది అనుకునేంతలో.. ఆ రిపోర్టర్ కు పైవాళ్ళ నుండి చివాట్లు పడ్డాయిట. అది చెప్పి ఆ విలేఖరి గొల్లుమన్నాడు. నేను వదలకుండా చేసిన ఎంక్వయిరీలో తేలిందేమిటంటే ఆ గొయ్యి ఏ కరెంటు వాడో తవ్వితే పడింది కాదు. రోడ్డు దానంతట అదే దిగిపోయిందని తెలిసింది. తక్కువ నాణ్యతతో చేసిన పని వల్ల ఈ రోడ్డే కాదు, ఆ కాంట్రాక్టు ప్రకారం చేసిన రోడ్లన్నిటికీ అదే గతి పట్టిందని తేలింది. నేను నాకు దొరికిన ఇమెయిల్ అడ్రసులకు జరిగింది వివరిస్తూ దీనిపై విచారణ చెయ్యాలని మెయిల్స్ పంపడం మొదలుపెట్టాను.

ఈలోగా నాకు బెదిరింపులు మొదలయ్యాయి. అప్పుడు నాకు ఈ స్కామ్ లో చాలా పెద్ద పెద్ద తిమింగలాలు ఉన్నాయని అర్థమైంది. అక్కడి నుండే నాకు విపరీతంగా బెదిరింపులు మొదలయ్యాయి. ఇక ఇంట్లో వాళ్ళు నా మీద వదిలెయ్యమని ఒకటే వత్తిడి తెచ్చారు. ఈలోగా చిన్నవాడు ఇక్కడ ఉద్యోగం సంపాదించాడు. దేశభక్తి అని ఉపన్యాసమిస్తూ.. వాడిని ఎలా ఆపను. దేశాన్ని పంచుకు తినేసే బకాసురుల మధ్య వాడిని ఎలా ఉండమనగలను. వాడికి ఏమైనా అయితే నేను భరించగలిగినా నా భార్య మాత్రం మరొక పుత్రశోకాన్ని తట్టుకోలేదు. భారతదేశం నేడు అవినీతిపరుల చేతుల్లో నలిగిపోతోందయ్యా. మన వంటి సామాన్యులం చూస్తూ ఉండడం తప్ప ఏం చెయ్యగలం. ఎప్పుడో కాలం కలిసొస్తే ఒక నిజాయితీ కలిగిన నాయకుడు పుట్టి పుళ్ళు పడ్డ వ్యవస్థను ప్రక్షాళన చెయ్యాలి. అంత వరకూ నిస్సహాయంగా వేచి చూడాల్సిందే!" అన్నారు గద్గదస్వరంలో.

ఇంత జరిగిందా మాష్టారి జీవితంలో. మాకు ఎంతో మంచిని బోధిస్తూ ఆశాజనకంగా ధైర్యాన్ని నూరిపోసే మాష్టారుకే ఎంత విషమ పరీక్ష ఎదురైంది.

ఆయన నేర్పిన ఆదర్శాలను పక్కకు పెట్టి ఇక్కడకు వచ్చాననే సంగతి నాకే ఇంత బాధ కలిగిస్తే పాపం మాకు బోధించిన వాటిని తనే ఆచరణలో పెట్టలేకపోయాననే దుఃఖం ఆయనను లోపల్లోపల ఎంత తినేస్తోందో అని మనసులో అనుకుంటూ ఉండగా చంద్రలేఖ వేడివేడిగా టీ పట్టుకుని మా వైపు నడిచి వచ్చింది.

# ఐ వాంట్ జస్టిస్

శ్రీమతి పోడూరి నాగమణిశ్రీ స్మారక కథల పోటీ
ప్రోత్సాహక బహుమతి పొందిన కథ
శ్రీ శుభకృత్ వత్సర ఉగాది - 2022

పెనుమాక నాగేశ్వరరావు

నూట ఇరవై కిలోమీటర్ల వేగంతో వెళుతున్నది కారు. నడుపుతున్న డ్రైవరు రాయడుకు ఇరవై ఏళ్ల అనుభవం వుంది కారు నడపటంలో.. అంతకు ముందు చాలా కాలం లారీ నడిపాడు. కొంతకాలం ఆటో నడిపాడు. కొద్ది సంవత్సరాలు టాక్సీ నడుపుకున్నాడు. అక్కడినుంచీ కారే! కారు నడపటంలో ఆరితేరాడు. ఊళ్ళో అయితే మరొకర్ని మరొకర్ని డ్రయివరుగా అంగీకరిస్తారేమో తెలీదు గాని, బయటి ఊళ్ళకి వెళ్ళేటప్పుడు, దూరపు ప్రయాణాలప్పుడు మాత్రం రాయడు ఉండాల్సిందే.. కారు నడపాల్సిందే! యం.యల్.ఏ. దేవసేన పక్కన ముఖ్యమైన ఫైల్స్ ఒకటో, రెండో వుంటై, ముందు సీట్లో పి.ఏ. ప్రభాకర్ ఓ చేతిలో సెల్ ఫోన్ పట్టుకుని కూర్చుని వుంటాడు. అతని కాళ్ళ దగ్గర లెదర్ బ్యాగ్ వుంటుంది. వెనుక సీట్లో రిలాక్స్ అవుతూ కూర్చుంటుంది దేవసేన.



దారిలో దేవసేన అడిగిన ప్రశ్నలన్నింటికీ వెంటనే సమాధానాలు చెబుతూ, అవసరం అనుకుంటే తన అభిప్రాయాలు చూచాయగా బయటపెడుతూ లౌక్యంగా మాట్లాడుతుంటాడు ప్రభాకర్. అతను నమ్మకస్తుడిగా ఆమె దగ్గర గుర్తింపు పొందాడు. అతని వినయానికి, సమయస్ఫూర్తికి మనసులోనే మెచ్చుకుంటుంటుంది దేవసేన. అతనెప్పుడూ చనువు తీసుకోవటం కానీ, చొరవ చేసుకోవటం కానీ చేయడు. ఆ లక్షణమే దేవసేనకు అతనంటే మరింత గురి కుదరటానికి కారణం అయింది.

రాయడు కొంచం వాగుడుకాయ. జోకులేస్తుంటాడు. ఒదిగిపోయి మాట్లాడుతుంటాడు. అప్పుడప్పుడు కొంచం చొరవ తీసుకుని మాట్లాడుతుంటాడు, కానీ అవన్నీ మామూలు విషయాల్లోనే! అధికారిక విషయాల వూసే ఎత్తడు. ఆ అవకాశం ఆమె ఇవ్వదు. రాయడు అమాయకత్వం ఆమెకు బాగా నచ్చుతుంది. అందుకే అతనిపట్ల ఉదాసీనంగా వుంటుంటుంది. ప్రయాణంలో గానీ, వాహనం నడపటంలో గానీ, ఆమెకు ఏమాత్రం ఇబ్బంది కలుగనీయకుండా కంటికి రెప్పలా చూసుకుంటాడు రాయడు. కారు నడపటంలో అతని నైపుణ్యం, సమయస్ఫూర్తి దేవసేన ఎప్పుడూ గమనిస్తూనే వుంటుంది.

"జనం అంతా ఆవేశంగా వున్నారని తెలిసింది మేడం. మీరు కారు దిగి వాళ్ళ మధ్యలోకి వెళ్ళటం ..." అంటూ నసిగాడు ప్రభాకర్.

"వాళ్ళంతా గట్టిగా నిలదీయటానికి నిర్ణయించుకున్నారట. ధర్నాలు, నినాదాలు చేస్తూ నల్లగుడ్డలు చూపెడుతూ, రోడ్డుపైన కూర్చున్నారట. ఇప్పుడే పోలీసు డిపార్టుమెంట్ నుంచి కబురొచ్చింది మేడం!" తన మనసులో మాటల్ని అనునయంగా బయటపెట్టాడు ప్రభాకర్.

"మీరు సరే అంటే ఇదిగో ఇక్కడినుంచి ఓ రెండు కిలోమీటర్లు వెళితే, అక్కడి నుంచి వేరే దారి వుంది మేడం! రోడ్డు కూడా ఇంతకంటే బాగానే వుంటుంది. అటుగా వెళ్దాం మరి!" చెప్పాడు రాయడు

"పారిపోదాం అంటావా!" నవ్వు బయటకు రానీయకుండా అడిగింది దేవసేన.

“పారిపోవటం కాదమ్మా... నెగ్గటం కాదు తగ్గటం తెలియాలి అని కదా ఇప్పటి లేటెస్ట్ పాపులర్ డైలాగ్!” అని నవ్వాడు రాయడు

అతని చతుర సంభాషణకి నవ్వు వచ్చింది ఆమెకు.

“అంత అవసరం లేదు. నువ్వు ఈ దారిగుండానే వెళ్లనీ!” కారు అద్దాల్లో నుంచి బయటకు చూస్తూ నిర్భయంగా, నిశ్చయంగా చెప్పింది దేవసేన.

అంతలోనే ప్రభాకర్ ఫోన్ మళ్ళీ మోగింది.

“గుడ్ మార్నింగ్ సర్.... అవును సార్, ఇస్తున్నాను సర్, “ అంటూనే ఫోన్ దేవసేనకు అందించాడు ప్రభాకర్

“చెప్పండి... వెరీ గుడ్ మార్నింగ్! చెప్పండి. ఏం పరవాలేదండీ. నేను వాళ్ళని శాంతింప చేస్తాను. మీరేం టెన్షన్ పడకండి. అవునా... అయినా పర్లేదు. నేను మేనేజ్ చేస్తాగా!’ భరోసాగా అన్నది దేవసేన.

“మీ ఇష్టం. కానీ జాగ్రత్త”

“అలాగే. థాంక్యూ వెరీ మచ్ ...వుంటాను!” ఫోన్ ప్రభాకర్ కి ఇచ్చి, సీట్లో సర్దుకుని కూర్చుంది.

“దేనికయితే నువ్వు భయపడి వెనుకడుగు వేస్తావో, అదే నిన్ను మళ్ళీ మళ్ళీ వెంటాడుతుంది. ఒక్కసారి ఎదురెళ్లి చూడు.. ఆ భయమే నీకు భయపడుతుంది!” ఏదో పుస్తకంలో చదివిన వాక్యాలు గుర్తుకువచ్చినై దేవసేనకు. ఓ చిరుదరహాసం ఆమె పెదవులపై విరిసింది, మెరిసింది. ఆమెలో పట్టుదలతో పాటు ఆత్మవిశ్వాసం కూడా పెరిగింది. మరోసారి వాళ్ళతో ఎలా మాట్లాడాలో, ఏం మాట్లాడాలో మననం చేసుకుంది.

ప్రజలు ఎప్పుడూ సక్రమంగానే ఆలోచిస్తారు. వాళ్ళకు చెప్పటంలోనే వుంటుంది కిటుకు. సహజంగా వాళ్ళు కోపంలో వున్నప్పుడు, మనం శాంతంగా సమాధానపరచాలి, కాసేపు ప్రయత్నం చేశాక మందలింపుగా మాట్లాడి చూడాలి. సమయానికి తగినట్లు సందర్భోచితంగా మాట్లాడితే సమస్యలేమీ వుండవులే.. అనుకుంది.

కారు పరుగెడుతున్నది ఆమె ఆలోచనలతోపాటు.

“ఎన్నికలప్పుడు మీరు సప్తగిరి ఇంటికి వెళ్లటమే ఓ సాహసం మేడం గారు! అప్పట్లో ఆ విషయాన్ని జనం కథలు కథలుగా చెప్పుకున్నారు. అవతల పార్టీ వాళ్ళ ఇంటికి, అదీ మీ మీద పోటీకి నిలబడిన వ్యక్తి ఇంటికి ఎన్నికల ప్రచారం జరుగుతున్న టైములో వెళ్ళటం నిజంగా అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసిందండీ. అనుభవం లేక అలా చేస్తున్నారని కూడా కొందరు చెవులు కొరుక్కున్నారండీ. కొంతమంది అయితే మీది ఒట్టి పిచ్చిపని అని కూడా గుసగుసలాడుకున్నారు ఎలక్షన్ రిజల్ట్ రాకముందు!” అని పెద్దగా నవ్వాడు రాయడు

“అవునుగానీ, మిమ్మల్ని చూడంగానే అసలు సప్తగిరి పిచ్చెక్కిపోయి వుంటాడే!” అన్నాడు రాయడు మళ్ళీ.

“ఆ రోజు జ్వరంగా వుందని నువ్వు రాలేదు. లేకపోతే నువ్వూ మాతో పాటు మేడం పక్కనే వుండి అంతా చూసేవాడివి!” అన్నాడు ప్రభాకర్

“అవునన్నా.... ఏం జరిగిందో కొంచం చెప్పు. మళ్ళీ వినాలని నాకు చాలా ఇదిగా వుంది!” అమాయకంగా అడిగాడు రాయడు.

“ఆ రోజు కూడా మేమంతా వద్దు వద్దంటున్నా, వినకుండా సప్తగిరి ఇంటికి బయలుదేరారు మేడం గారు! మేం వెళ్ళేసరికి సోఫాలో కూర్చుని దోశలు తింటున్నాడు సప్తగిరి. భార్య శశికళ పక్కనే కూర్చుని ఏవో కబుర్లు చెబుతున్నది. ఆయన దగ్గర వుండే కృష్ణయ్య స్టూల్ మీద కూర్చుని వున్నాడు. మమ్మల్ని చూడంగానే ఆదరాబాదరాగా లేచి నుంచున్నాడు కృష్ణయ్య. తలెత్తి

మమ్మల్ని చూసిన సప్తగిరి బిక్కచచ్చిపోయినట్లు చూశాడు. ఏం మాట్లాడాలో తెలీక చేతిలో వున్న ప్లేటు టీపాయి మీద పెట్టాడు.

'నమస్కారం సప్తగిరి గారు. తినండి... తినండి. దోశలు తినండి. మాకూ పెడితే మేమూ తిని పెడతాంగా" అంటూ ఆయనకు ఎదురుగా వున్న సోఫాలో కూర్చున్నారు మేడంగారు.

"అయ్యో ఎంత మాట! సూర్యం త్వరగా టిఫెన్ తీసుకురా!" అంటూ బిగ్గరగా చెప్పాడు. రెండు నిముషాల్లో వేడివేడి ఇడ్లీ, కారంపొడి నెయ్యి, చేట్నీ, సాంబారులతో ప్రత్యక్షం అయ్యాడు సదరు సూర్యం.

"మాట వరసకు అన్నాను అన్నయ్య గారూ. ఇప్పుడే ఇంటి దగ్గర టిఫిన్ చేసి బయలుదేరాను. మీరు తినండి వదినా" అని సప్తగిరి భార్యని పలుకరించారు మేడం గారు

కళ్ళకు కట్టినట్లు చెబుతున్న ప్రభాకర్ వంక మధ్య మధ్యన చూస్తూ తలాడిస్తూ స్టీరింగ్ తిప్పుతున్నాడు రాయడు. వాళ్ళిద్దరి సంభాషణ వింటూ నవ్వుకుంటూ కూర్చుంది దేవసేన.

"అప్పుడు నేను గనక వుండివుంటే భలే వుండేది. నా సామీరంగా సప్తగిరి మొఖం ఎలా వెలవెలబోయి వుంటుందో వూహించుకుంటుంటే హాపీ హాపీ గా వుందనుకో" అని పకపకా నవ్వేడు రాయడు.

ఎన్నికలప్పుడు తన తరపు వాళ్ళు, ఇంట్లోవాళ్లు, వూళ్ళోవాళ్లు ఎంతమంది వద్దన్నా వినిపించుకోకుండా తన మీద పోటీ చేస్తున్న సప్తగిరి ఇంటికి పనికట్టుకుని మరీ వెళ్లింది దేవసేన! ఆనాడు ఇంట్లో వాళ్ళు, ఆమె శ్రేయోభిలాషులు పడ్డ టెన్షన్ అంతా ఇంతా కాదు.

రాజకీయాలంటేనే ఎత్తుకు పై ఎత్తు వేయటం కదా! దేవసేనని చూడంగానే ఖంగుతిన్నా, వెంటనే తేరుకుని ఆత్మీయంగా పలుకరించి, భార్యకు పరిచయం చేసి, బలవంతంగా కాఫీ తాగించి భార్య చేత దేవసేనకు చీరె పెట్టించి పంపాడు సప్తగిరి.

దేవసేన తెగింపు గురించి ఎంత గొప్పగా చెప్పుకున్నారో, అంతకన్నా గొప్పగా సప్తగిరి ఔదార్యాన్ని వేనోళ్ల పొగుడుతూ మాట్లాడుకున్నారు జనం. సప్తగిరి ఆలోచనకు మనసులోనే మెచ్చుకున్నది దేవసేన. అయినా ఎన్నికల్లో తనే విజయం సాధించింది. మరుసటి రోజే సప్తగిరి దేవసేన ఇంటికి వచ్చి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపి వెళ్ళాడు. ఎంత ప్రత్యర్థి అయినా అతని సంస్కారానికి, సమయస్ఫూర్తికి మెచ్చుకుంది దేవసేన.

"మేడమ్ గారూ వూరికి దగ్గర్లో వున్నాం! ప్లీజ్ బీ ఎలర్ట్. వాళ్ళంతా ఆవేశంలో వున్నారు. మన జాగ్రత్తలో మనం వుండాలి. జరగరానిదేమైనా జరిగితే తర్వాత బాధపడి లాభం వుండదు!" హెచ్చరింపుగా అన్నాడు ప్రభాకర్.

"పరవాలేదు ప్రభాకర్! మీరేం కంగారూ పడకండి!" స్థిరంగా పలికింది దేవసేన.

తమ డిమాండ్లు సాధించుకోవటానికి.. ఆవిడ రాకను అడ్డుకోవాలని, తమ నిరసనను తెలియచేయాలని ఆడ, మగ, చిన్నా, పెద్ద అందరూ ఏకమై రోడ్డు మీదకు వచ్చారు. ఆ వూరంతా సప్తగిరి అభిమానులది. అందుకే జిందాబాద్ సప్తగిరి అని, డవున్ డవున్ దేవసేన అని నినాదాలు చేస్తూ రోడ్డుకు అడ్డంగా నిలుచున్న జనం దూరం నుంచి కనపడసాగారు.

సెక్యూరిటీ ముందుగా కార్లు దిగి వాళ్ళ దగ్గరకు వెళ్ళి అదుపు చేశారు. పోలీసులు కూడా జనాన్ని వెనక్కు తోసేయటంతో ప్రతిఘటన మొదలయ్యింది.

చిరునవ్వుతో కారు దిగిన దేవసేన ముకుళిత హస్తాలతో నిదానంగా వాళ్ళ వైపు అడుగులు వేయసాగింది. సెక్యూరిటీ ఆమెకు ఇరువైపులా వున్నారు. పోలీసు అధికారులు వారి జాగ్రత్తలో వారు అప్రమత్తంగా వున్నారు. దేవసేన వారిని సమీపిస్తున్న కొద్దీ వారి నినాదాలు మరింత బిగ్గరగా వినిపించసాగినై. ఆపమన్నట్లు చేతులు ఊపుతూ వారి మధ్యకు చేరింది దేవసేన. ముందుగా మహిళలు ఆమెను చుట్టుముట్టారు. ఆ వెనుకనే మగవారు చేతులు గాలిలో ఊపుతూ నినాదాలు చేస్తూ వున్నారు.

'ఉత్సాహం సాహసం ధైర్యం బుద్ధి శక్తి: పరాక్రమ: షడతే యత్ర తిష్టన్తి తత్ర దేవ: సహాయకృత్ ....... అంటే. పూనిక, సాహసం, ధైర్యం, బుద్ధి, శక్తి, పరాక్రమం... ఈ ఆరూ ఉన్నచోట దైవం సహాయం చేస్తుంది. పూనిక లేకుండా, శ్రమ పడకుండా ఏ పనీ జరగదు. దైవం కూడా తోడ్పడదు అని అర్థం. ఏ పనైనా సానుకూల పడాలంటే మానవ ప్రయత్నము, దైవ తోడ్పాటు బండికి రెండు చక్రాల్లా వుండాలి!' అంటూ ఓసారి ఆలయంలో ఓ ప్రవచనాకారుడు చెప్పిన మాటలు బలంగా మనసులో నాటుకున్నై దేవసేనకు.

"మీ సమస్య ఏమిటో, మీకు ఏం కావాలో వివరంగా చెప్పండి. అరుపులు, కేకలతో కాని పనులు, మాటలతో పూర్తవుతాయి! ఇదిగో మీ వూరికి సంబంధించిన ఫైల్. నేనీరోజు మీతో మాట్లాడటానికే వచ్చాను!" చెప్పింది నెమ్మదిగా. ఆవిడ ఏం చెబుతున్నదో వినాలని నినాదాలు తగ్గించారు జనం. చెవులు రిక్కించారు. "ముందుగా ఆడువారు చెప్పండి!"

అంతలోనే ఎవరో కుర్చీ తెమ్మనమని హుకుం జారీ చేశారు.

"అదేం వద్దు. నేనూ మీతోపాటు నుంచోగలను!" అని నవ్వేసింది దేవసేన.

అప్పటికే ఆడువారిలో ఆవేశం సగం పైగా తగ్గిపోయింది. మగవాళ్ళు కొందరు మాత్రం ఇంకా కొంచం పెద్దగా అరుస్తున్నారు. అన్యాయం జరిగిందంటూ అరుస్తున్నారు. నవ్వుతూ వాళ్ళ వంక చూసి శాంతించమన్నట్లుగా సైగ చేసింది దేవసేన.

ఆడవాళ్ళల్లో కాస్త సమస్య పట్ల అవగాహన వున్న ఇద్దరు ముగ్గురు, ఆవిడకు పరిస్థితి వివరించారు. తాము ఏం కావాలనుకుంటున్నారో స్పష్టంగా చెప్పారు. గుంపులో నుంచి ఓ ముసలాయన ముందుకు వచ్చాడు. ఆయనతో పాటే ఓ యువకుడు. వాళ్ళని చెప్పమని అడిగింది దేవసేన. ఆడంగులు చెప్పిందే ఆయనా చెప్పాడు. మరో ఇద్దరు ముగ్గురు మగవాళ్ళు కూడా మాటలు వేరే అయినా మిగిలిన వాళ్ళు అడిగిందే అడిగారు.

ఓ చదువుకున్న యువకుడు ముందుకు వచ్చి, 'వుయ్ వాంట్ జస్టిస్ వుయ్ వాంట్ జస్టిస్' అని అరిచాడు.

"మీరే కాదు ఐ టూ వాంట్ జస్టిస్... ప్లీజ్ కీప్ క్వైట్!" అన్నది అతడ్ని ఉద్దేశించి దేవసేన.

మిగిలిన పెద్దలు కూడా అతన్ని తగ్గమని సైగలు చేశారు. వెనక్కి నెట్టే ప్రయత్నం కూడా చేశారు. ఆ ప్రతిఘటనతో, పాపం.. గాలి తీసిన బెలూన్ లా అయిపోయిన అతగాడు, ఆమెనే చూస్తూ రెండుమూడు అడుగులు వెనక్కి వేసి నిలుచున్నాడు.

"నేను అడిగే ప్రశ్నలకి సరిగ్గా సమాధానాలు చెప్పండి. మీరు నిజాయితీగా చెబితే ఇదిగో ఇప్పుడే ఇక్కడే, మీ ముందే మీ కోరికలన్నింటినీ ఆమోదిస్తూ సంతకం చేసి, ఇక్కడి నుంచి వెళతాను.... సరేనా!" అని అందరి వంకా తేరిపార చూసింది దేవసేన. కొందరు సరే అన్నారు. కొందరు సరే అన్నట్లు తలలూపారు.

సరే నేను ఎన్నికల్లో గెలిచినా, మీ వూళ్ళో నాకు ఓట్లు పడలేదు. ఎక్కువమంది సప్తగిరిగారికే వేశారు. అయినా నేనే మీకూ యం.ల్.ఏ. ని! మీ కోరికలు తీర్చాల్సిన బాధ్యత నాదే. తీరుస్తాను. తప్పకుండా తీరుస్తాను. నేను ఇంతకు ముందే చెప్పినట్లు నేను చెప్పే దానికి మీరు ఒప్పుకుంటే, ఇప్పుడే, ఇక్కడే, మీ అందరి ముందూ మీ డిమాండు ఒప్పుకుంటూ సంతకం చేస్తాను! అంతే కాదు.. సంబంధిత మంత్రిగారికి చెప్పి కావలసిన నిధులు మంజూరు కూడా చేయిస్తాను. ప్రారంభోత్సవం కూడా ఆయన చేతనే చేయిస్తాను. ఆ కార్యక్రమానికి సప్తగిరి గారిని కూడా ఆహ్వానిస్తాము!"

"మేమేం చేయాలో చెప్పండి!" ముక్త కంఠంతో అరిచారు అందరూ.

"ఈ పని పూర్తి కావటానికి సుమారు మూడు కోట్ల ఇరవై లక్షలు అవుతుంది. ఇంజనీర్లు ఇచ్చిన ఎస్టిమేషన్ ఈ ఫైల్లోనే వుంది. ఈ విషయం నేను మంత్రిగారితో మాట్లాడాను. ఆయన సానుకూలంగా స్పందించారు. ఆయన చేత అమౌంట్ శాంక్షన్ చేయించే బాధ్యత నాది. అందుకు మీరు ఏం చేయాలంటే......" అని మరోసారి అందరి ముఖాల వంకా చూసింది దేవసేన

"చెప్పండి.... చెప్పండి!" అరిచారు మూకుమ్మడిగా.

"మీరు ఎన్నికలప్పుడు ఒక్కొక్కరూ ఎవరెవరి దగ్గర ఎంతెంత తీసుకున్నారో ఆ డబ్బు వెనక్కి ఇచ్చేయాలి. అంటే.. ఇప్పుడు ప్రభుత్వం ఖర్చు చేయాల్సిన మూడు కోట్ల ఇరవై లక్షల్లో మీ వాటాగా ఆ డబ్బు ఉపయోగపడాలి. ఎందుకంటే ఓటు అమ్ముకున్న మీకు, మమ్మల్ని ఏమీ అడిగే హక్కు వుండదు. మేం మీకు ఏ విషయంలోనూ జవాబుదారీ కాదు!"

"నో..........నో.." అంటూ ఓ నలుగురు చదువుకున్న యువకులు, ముందుకు వచ్చి "వుయ్ వాంట్ జస్టిస్, వుయ్ వాంట్ జస్టిస్" అని అరిచారు

"మీరు కాదు అరవాల్సింది... నేను!" బిగ్గరగా అంటూ వాళ్ళని అరుపులు ఆపమన్నట్లు సైగ చేసింది

గుంపులో నుంచి ఓ ఇద్దరు వయసు మళ్లిన మహిళలు ముందుకు వచ్చి, "అమ్మా..నువ్వు చెప్పేది నిజమే. మేం చేసింది తప్పే. కానీ ఆ డబ్బులు మా కాడ ఏడ వున్నాయమ్మా! మా ఇంట్లో మగాళ్లు రెండు రోజులు, కాకపోతే మూడు రోజులు తాగితందానాలాడి తగలేశారమ్మా. కొందరం సగం డబ్బుతో పప్పూ, ఉప్పూ కొనుక్కున్నాం, తినేసాం! ఇప్పుడు ఎక్కడినుంచి తెచ్చి కడతాం తల్లీ!" అనునయంగా అన్నారు.

"అవన్నీ నాకు తెలీవు. మీరు నేను చెప్పినట్లు చేస్తే, నేను మీరు అడిగిన పని చేసి పెడతాను!" అంటూ చకచకా కారు వైపు నడిచింది దేవసేన.

నిస్సహాయంగా ఒకర్నొకరు చూసుకున్న జనం శూన్యంలోకి చూస్తూ నిలుచుండిపోయారు. అంతలోనే తేరుకుని వడివడిగా కారు వైపు నడిచారు.

"అమ్మా ఒక్క మాట. మీరు పెద్ద మనసు చేసుకుని ఆలోచించండి. మేం డబ్బులు తీసుకుని ఓట్లు వేయడం ముమ్మాటికీ తప్పే. ఇక నుంచి అలా చేయం. మా మాట నమ్మండి!" అంటూ ప్రాధేయపడ్డారు.

"ఇకనుంచైనా మాట మీద నిలబడండి!" అని కారు డోర్ తెరవబోయిన దేవసేన.. వుయ్ వాంట్ జస్టిస్ అని అరిచిన యువకుల వైపు చూసి "ఐ వాంట్ జస్టిస్!" అని చెప్పి కారులో కూర్చుని డోర్ వేసుకుంది.

కారు రయ్యిమంటూ దూసుకువెళ్లింది!

# గిరీశం @ గంధవరం

శ్రీమతి సోమూరి నాగమణిశ్రీ స్మారక కథల పోటీ
ప్రోత్సాహక బహుమతి పొందిన కథ
శుభకృత్ వత్సర ఉగాది - 2022

బి.వి. రమణమూర్తి

అప్పటికి ఆ సమావేశం మొదలై గంటవుతోంది.

“మాస్టారూ, ఆ గిరీశం సంగతి చూడండి. వాడు పెట్టే పితలాటకాలతో మనశ్శాంతి ఉండడం లేదు. ఏ పని కానివ్వడు, ఎక్కడా ముందుకు వెళ్లనివ్వడు, ప్రతి విషయంలోనూ తంటాలే!” సమావేశానికి హాజరైన ఊరి జనం ముక్తకంఠంతో అన్నారు.

“మీరందరూ చేయలేనిది, ఈ వయసులో నేనేం చేయగలను!” రామనాథం మాస్టారు నిస్సహాయంగా అన్నారు.

“కొడితేనో, తిడితేనో వాడు మారే మనిషి అయివుంటే, ఆ పని మేము ఎప్పుడో చేసేవాళ్లం మాస్టారు. వాడివన్నీ పుల్లిరుపు వ్యవహారాలు. పథకమైనా, ప్రయోజనమైనా చెయ్యి తడపందే ‘ఊ’ అనడు. ఆడితో ఎందుకు, మనమే చేయించుకుందామంటే కానివ్వడు. అడిగితే నంగనాచిలా మాట్లాడుతాడు. ఏం చేయగలం చెప్పండి!” నిష్ఠూరంగా అన్నాడు పెద్దవీధి వీర్రాజు.




“ఆ గిరీశం ఎవరో, మీరా సుబ్బారావుకు ఎందుకా పేరు పెట్టారో తెలీదు! వీడు మాత్రం మా పాలిట శనీశంలా తయారయ్యాడు!” ఎత్తరుగు వీరునాయుడు ఆగ్రహంతో అన్నాడు.

“ఏంటి మాస్టారు, ఊర్లో ఉన్నామా? అడవిలోనా? అన్నింటికీ ఆడి పెద్దరికమేంటండి. ఏదో ఒకటి తేలిపోవాల్సింది!” రచ్చబండ వీరాచారి కస్సుమన్నాడు.

“అవును మాస్టారు... ఏదో ఒకటి తేల్చాలి...!” గ్రామస్థులంతా ఒకేమాట అన్నారు.

“సరే వెళ్లిరండి. ఏదో ఆలోచించి చెబుతాను!” మాస్టారు నిరాశగానే చెప్పారు.

గంధవరం... వంద గడపల మారుమూల గ్రామం. ఎక్కువ మంది నిరక్షరాస్యులు, పేదవారు. మిగిలిన వారు అంతంత మాత్రం చదువరులు. ఊరికి పెద్ద దిక్కు తొంబై ఏళ్ల రామనాథం మాస్టారు. అప్పటి మనిషి కావడంతో ఆరోగ్యంగా, పిక్కలా ఉంటారు. పంచెకట్టుతో నిండైన విగ్రహం. మాటతీరులో సంస్కారం, ఆలోచించి నిర్ణయం తీసుకునే ఓర్పు, సహనం ఆయన లక్షణాలు. ఊరివారికి ఆయన అంటే ఎంతో గౌరవం. పదిహేనేళ్ల వయసులోనే స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొన్నారు. గాంధీగారి శిష్యుడినని గర్వంగా చెప్పుకుంటారు. ఎలాంటి సమస్యకైనా గాంధీగిరిలో పరిష్కారం చూపిస్తారు.

గిరీశం కూడా ఆ ఊరివాడే. నాలుగు పదుల వయసులోనే అన్ని అవలక్షణాలు ఔపోసన పట్టేశాడు. దళారీ అవతారం. పని అంటే రాబట్టుకోవడమే అతనికి తెలిసిన విద్య. తొలిరోజుల్లో సాయం చేస్తున్నాడు కదా అనుకున్నారు గ్రామస్థులు. రానురాను అది అలవాటుగా మారింది. అలవాటు కాస్తా అధికారంలా మారి, ఊరివాళ్లను పీక్కుతినడం మొదలుపెట్టాడు. డబ్బులు చేతిలో పడితేనే పని జరిగేది. మాస్టారి వద్ద గ్రామస్థుల ఫిర్యాదు అందుకే!

★★★

ఏం గిరీశం...పెందలాడే హుషారుగా బయలుదేరావు. పట్నంలో పనిపడిందా?" రామనాథం మాస్టారి పిలుపుతో ఉలిక్కిపడ్డాడు సుబ్బారావు ఉరఫ్ గిరీశం.

"నమస్కారం మాస్టారు. పట్నం వెళ్తున్నాను. కొత్తగా హుషారేముందండి. ఎప్పుడూ ఉన్నదేగా!" కంగారు దాచుకుంటూ చెప్పాడు సుబ్బారావు.

నవ్వుతూ ఆ మాటన్నా 'ఉదయాన్నే ఈయన తగులుకున్నాడేంటా?' అని తిట్టుకుంటున్నాడు.

"ఊరికి కావాల్సిన వాడివి, నీకు కాకపోతే రిటైరై ఇంట్లో కూర్చున్న నాకేం పనులుంటాయి చెప్పు!" మాస్టారు నవ్వుతూ అన్నారు.

"మాస్టారు... మీరు కోపగించుకోకపోతే మా అయ్యా అమ్మ పెట్టిన సుబ్బారావు పేరుంది కదా. గిరీశం అని పిలవడం ఎందుకు. మీరెప్పుడు అలా పిలవడం మొదలు పెట్టారో మన ఊరివాళ్లు నా పేరే మర్చిపోయారు. మీపట్ల గౌరవంతో ఏమీ అనలేకపోతున్నాను. ప్రతి ఒక్కడూ అలా పిలుస్తుంటే కోపం వస్తోంది!" నిష్టూరంగా అన్నాడు గిరీశం.

"అదేమిటి గిరీశం...అలా అంటావు. అసలీ గిరీశం ఎవరో నీకు తెలుసా? చాలా పెద్దమనిషయ్యా! ఆయన గురించి తెలిస్తే నువ్వు ఇలా మాట్లాడవు!" రామనాథం మాస్టారు నవ్వుతూ అన్నారు.

"ఆడు గొప్పోడైతే మీరు నాకా పేరు ఎందుకు పెడతారు మాస్టారు. అయినా, పేరు అరువు తెచ్చుకోవాల్సిన ఖర్మ నాకేటి. సుబ్బారావు అని పిలిస్తే సంతోషిస్తాను!" కోపం తన్నుకు వస్తున్నా నిగ్రహించుకుంటూ అన్నాడు సుబ్బారావు.

"అయ్యో... అలా బాధపడకు గిరీశం... ఓ సారీ సుబ్బారావు! నువ్వేంటో, నీ వ్యాపకాలేంటో తెలిసాకే నీకా పేరు పెట్టాను. నా శిష్యుడివి. నిన్ను తక్కువ చేస్తానా? నేను పుట్టక ముందే పుట్టాడయ్య ఆ గిరీశం!"

"మీ పాదాలకు నమస్కారం మాస్టారు! మీరు పని పడిందా అన్నా 'ఎవడి పని అయిపోయిందా' అన్నట్టు నాకనిపిస్తుంది. ఇప్పుడీ కొత్త పేరుతో ఇబ్బందిగా ఉంది. ఆ గిరీశం గాడిని నా నుంచి తీసేయండి!" సుబ్బారావు ఉడుక్కుంటున్నాడు.

"పోనీ, ఆయన గురించి నాలుగు ముక్కలు చెప్పనా?"

"అర్జంటుగా పట్నం వెళ్తున్నాను. ఇప్పుడా జంఝాటం వద్దు మాస్టారు. నా మాట మన్నిస్తే మన్నించండి, లేకపోతే మీ దయ. అయినా మీకు నేనేం అన్యాయం చేశాను చెప్పండి. ఆడెవడితోనో పోల్చుతున్నారు. మీరు నా గురువు అనుకుంటే నన్ను గురివింద అంటున్నారు. ఏనాడైనా మీ వద్ద రూపాయి పుచ్చుకున్నానా? పని చేస్తానని నమ్మించానా? మరెందుకు నామీద కక్ష!" చిరాకు బయటకు కనిపించకుండా అన్నాడు సుబ్బారావు.

"ఏదో అభిమానం కొద్దీ మాట్లాడుతున్నాగాని, నీ మీద నాకు కక్ష ఏంటయ్యా. బతకలేని బడిపంతులు ఉద్యోగానికి ముప్పై ఏళ్ల క్రితం నీళ్లొదిలేశాను. పింఛన్ అందుతోంది. భగవంతుడు ఆయుర్దాయం ఇచ్చాడు, కృష్ణారామా అంటూ కాలక్షేపం చేస్తున్న నాకు నీతో చేయించుకునే పనులేమంటాయి చెప్పు! కానీ, ఊరికి కావాల్సిన వాడివి నిన్ను ఊరికే వదిలేస్తే ఎలా.. అని అప్పుడప్పుడూ అనిపిస్తుంది!"

"ఏమో... మాస్టారు! మీ మాటల్లోని అంతరార్థం తెలుసుకునేంత తెలివితేటలు నాకు లేవు. మీ చేతికర్ర వయసు కూడా లేనివాడిని. మీతో వాదించి నేను గెలవలేను!" సుబ్బారావు దీనంగా ముఖం పెట్టాడు.

"అదేంటయ్యా... ఆఫీసుల చుట్టూ తిరుగుతూ కంచుకంఠంతో అందరినీ కడిగి పారేస్తుంటావని మనవాళ్లు చెబుతుంటారు. నువ్వేమో అలా డీలాపడి మాట్లాడుతున్నావు. అది సరేగాని.. ఏంటయ్యా పింఛన్ ఇప్పిస్తానని ఆ మహాలక్ష్మి దగ్గర వెయ్యి నొక్కేసావని ఊరంతా చెప్పుకుంటున్నారు. ఇంతకీ పనిపూర్తయ్యిందా? లేదా?"

ఉలిక్కిపడ్డాడు సుబ్బారావు. అమ్మ తొత్తుకూతురు పనిచేసి పెట్టినా పితూరీలు మానలేదన్నమాట.

"అదేం మాట మాస్టారు. డబ్బులు నాకోసమా... పైవాళ్లకు ఇవ్వకుండా పనులెలా జరుగుతాయి! నేనేదో తినేస్తున్నట్టు నిందవేయడం న్యాయమేనంటారా?" సుబ్బారావు కోపంగా ముఖం పెట్టాడు.

"అంతేనయ్యా... కాసే చెట్టుకే రాళ్లు అని ఊరికే అన్నారా. డబ్బులు తీసుకున్నాక మాటపడాలి తప్పదు. అయినా నీకిదేమైనా కొత్తా. ఏళ్ల నాటి వ్యాపకమేగా!" మాస్టారు వెటకారం దాచుకుంటూ అన్నారు.

"అదే మాస్టారు వీళ్లతో వచ్చిన సమస్య! పని పూర్తయ్యేదాకా పని చేయించమని ప్రాణం తీసేస్తారు. తీరా చేయించాక నిందలు మోపుతారు!"

"నువ్వన్నదీ నిజమేనయ్యా! కానీ పేదోళ్లు. అంత డబ్బు ఎక్కడ నుంచి తేగలరు. అప్పో సొప్పో చేస్తారు. కడుపుమంట దాచుకోలేక అలా అనేస్తుంటారు. మహాలక్ష్మినే తీసుకో. తన చెవిపోగులు తాకట్టు పెట్టి నీకు వెయ్యిచ్చిందట!"

"నిజమే మాస్టారు. ఇప్పుడు పింఛన్ వస్తుంది కదా! మన అల్లక చంద్రరావు ఉన్నాడు. వ్యాపారానికి కష్టంగా ఉంది. మా సొసైటీలో లోనిప్పించవా అన్నాడు! మూడువేలు తీసుకున్నా, ముప్పె వేలు లోను ఇప్పించా. అంతెందుకు, మన నూనె ఆడే గురవయ్య.. గానుగెద్దుతో గిట్టుబాటు కావడం లేదని మిషన్ కొనాలనుకున్నాడు. రెండు లక్షల లోను కోసం దరఖాస్తు చేసి ఏడాదైనా పని జరిగిందా?" ఆగి మాస్టారివైపు చూశాడు.

రామనాథం మాస్టారు నవ్వుతూ అతని వైపే చూస్తున్నారు.

"అవ్వదు మాస్టారు, ఇవి మీ రోజులు కావు. ఒరేయ్ గురవయ్యా పదేలు నీవి కావు అనుకోరా, లోను వచ్చిపడుద్ది అన్నాను. ఆడు 'ఊ' అన్నాడు. నెలరోజులు తిరక్కముందే ఆడి అకౌంట్లో రెండు లక్షలు జమయిపోయాయి. పనులు కావాలి, పైసా ఖర్చుకాకూడదంటే ఎలా చెప్పండి!"

మాస్టారు ఏమీ సమాధానం చెప్పలేదు.

"మన ప్రశ్నలకు ఈ ముసలోడు నోట్లో పచ్చివెలక్కాయ పడింది!" అనుకున్నాడు గిరీశం.

"అదేరా నీ గొప్పతనం. చేసినదాన్ని కుండబద్దలు కొట్టినట్లు చెప్పేస్తావు. జనమే నిన్ను అర్థం చేసుకోవడం లేదు!"

"అంతే మాస్టారు. ఎవరికోసమైతే నేను ఇంత కష్టపడుతున్నానో, వారే నా ఇజ్జత్ తీసేస్తుంటే బాధగా ఉండదా? అన్నీ తెలిసిన మీలాంటోళ్లు కూడా నమ్మతుంటే నేనెంత విలవిల్లాడిపోతున్నానో మీకేం తెలుసు!" త్యాగమూర్తిలా ముఖం పెట్టాడు గిరీశం.

"చూడు గిరీశం, మన గురించి ఎవరైనా చెప్పుకుంటున్నారు అంటే దానికో కారణం ఉంటుంది. దాన్ని మనం అర్థం చేసుకోవాలి. ఊరివాళ్లకు అర్థమయ్యేలా చెప్పాలి! పోనీ నాలాంటి వాడు జోక్యం చేసుకుని గిరీశం సేవా దృక్పథంతోనే ఈ పనులు చేస్తున్నాడని చెబితే నమ్ముతారా? నా శిష్యుడివి కాబట్టి వెనకేసుకొస్తున్నానని ఆడిపోసుకుంటారు!"

"మీ మాటల్లోనూ నిజం ఉంది మాస్టారు. కానీ..."

"అందుకేరా నేనో నిర్ణయానికి వచ్చాను!" అంటూ చెవిలో గుసగుసలాడారు మాస్టారు. గిరీశం ముఖం మతాబులా వెలిగిపోయింది.

★★★

ఊర్లో గిరీశానికి సన్మానం ఆరోజు. రామనాథం మాస్టారు ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు జరిగాయి. అదో కొత్త అనుభవంలా వుంది గిరీశానికి. ఎప్పుడూ స్టేజ్ దిగువన నిలబడడమే తప్ప, స్టేజ్ మీద కూర్చునే అవకాశం రాలేదు. పైగా ఓ వైపు తహసీల్దారు, మరోవైపు సీఐ, ఇంకోవైపు బ్యాంకు మేనేజర్, మరోవైపు సహకార సొసైటీ డైరెక్టరు...ఇలా ప్రముఖుల పక్కన కూర్చోవడం గిరీశానికి ఆనందంగా ఉంది. మనమేంటో అందరికీ తెలుస్తుందని అతని ఉద్దేశం!

కాసేపటికి సభ ప్రారంభమైంది. రామనాథం మాస్టారు మాట్లాడడం ప్రారంభించారు.

"అందరికీ శుభాభినందనలు. ఆశీస్సులు! మన ఊరి మనిషి, మనకు కావాల్సిన వాడు గిరీశం. అదే మన సుబ్బారావు. చెయ్యి తడపనిదే ఏ పనీ జరగని ఈ రోజుల్లో, మన పనిని తన పనిగా భావించి, రూపాయి ఖర్చులేకుండా అన్నీ చేసిపెడుతున్న అతన్ని సత్కరించుకోవడం మన బాధ్యత. అవునా? కాదా?"

వేదిక ముందున్న వారంతా చప్పట్లు కొట్టారు. వేదికపైన కూర్చున్న గిరీశం మాత్రం గతుక్కుమన్నాడు.

"మాస్టారి మాటల్లో ఏదో ట్విస్ట్ ఉందనిపించింది అతనికి. తానేదో డబ్బులు తినేస్తున్నానని ఊరంతా చెప్పుకుంటూ ఉంటే, ఈ ముసలోడేంటి ఇలా ఉబ్బేస్తున్నాడు. ఇందులో ఏదైనా మతలబు ఉందా?" గిరీశం అసహనంగా కదిలాడు.

రామనాథం మాస్టారు తన ప్రసంగం కొనసాగిస్తున్నారు.

"మొన్నటికి మొన్న... మన దిగువీధి మహాలక్ష్మి పింఛన్ కోసం సచివాలయానికి వెళ్లి దరఖాస్తు ఇచ్చి, కాళ్లరిగేలా తిరుగుతున్నా పని జరగలేదు! ఓ వెయ్యి ఇవ్వాలన్నారట ఎవరో. పేదరాలు మాలక్ష్మి అంత డబ్బు ఎక్కడి నుంచి తేగలదు. విచారంలో ఉండగా మన గిరీశం ఉరఫ్ సుబ్బారావు జోక్యం చేసుకుని 'ఇదిగో మాలచ్చిమి అక్కా, నువ్వేమీ ఫికరవ్వకు, నీ పని పూర్తి చేయించే పూచీ నాదీ' అంటూ ఆ దరఖాస్తు తీసుకుని రూపాయి ఖర్చులేకుండా పింఛన్ ఇప్పించాడు. అలాంటి మనిషిని సత్కరించుకోవడం మనకెంతటి గర్వకారణం!" మాస్టారు కాసేపు ఆగారు.

పింఛన్ కోసం రెవెన్యూ ఉద్యోగి ఎవరో లంచం అడిగాడని తనముందే పెద్దాయన చెప్పడంతో వేదికపై ఉన్న తహసీల్దారుకు సిగ్గనిపించింది. ఇప్పుడీ పింఛన్ గొడవెందుకని గిరీశం అనుకుంటున్నాడు.

రామనాథం మాస్టారు మళ్లీ మాట్లాడడం మొదలుపెట్టారు.

"మరో ముఖ్యమైన విషయం! మన చంద్రరావు ఏదో పథకంలో ముప్పైవేల సాయం ప్రభుత్వం అందిస్తుందంటే దరఖాస్తు చేసుకున్నాడు. కానీ ఆ సొసైటీ గుమస్తా మూడువేలు ఇస్తే గాని ఫైల్ కదపనని పట్టుబట్టాడట. అంత మొత్తం ఇవ్వలేని చంద్రరావుకు గిరీశం అండగా నిలిచాడు. రూపాయి ఖర్చులేకుండా పని పూర్తిచేయించాడు. అలాంటి గిరీశాన్ని సత్కరించుకోవడం మన బాధ్యత కాదా? మీరే చెప్పండి!"

మళ్లీ పందిట్లో చప్పట్ల మోతమోగింది.

వేదిక మీదున్న గిరీశానికి మాత్రం చెమట్లు పడుతున్నాయి. ఈ మాస్టారు నా పుట్టిముంచే ఎత్తుగడ ఏదో వేశాడని అతనిలో అనుమానం మొదలయ్యింది.

తమ సొసైటీ సిబ్బంది అవినీతి గురించి బాహాటంగానే ఆ పెద్దాయన చెప్పడంతో వేదికపై ఉన్న సహకార సొసైటీ డైరెక్టర్ చిన్నబుచ్చుకున్నాడు.

"ఇక మన గానుగ గురవయ్య సంగతి చూద్దాం! గానుగెద్దుతో వ్యాపారం గిట్టుబాటు కావడం లేదని, మిషన్ పెట్టుకోవాలనుకున్నాడు. రెండు లక్షలు అవసరమని తెలిసి బ్యాంకు రుణం కోసం వెళితే, అక్కడ ఓ పెద్దమనిషి పదిశాతం కమిషన్ కావాలన్నాడంట. పేదవాడైన గురవయ్య.. ఆ శక్తి లేక ఆశ వదులుకున్నాడు. అలాంటప్పుడు 'నేనున్నాను గురవయ్య మామా' అంటూ ఆదుకున్న మనిషి ఎవరో తెలుసా?" రామనాథం మాస్టారు ఓసారి వేదిక ముందున్న వారివైపు చూశాడు.

"గిరీశం...గిరీశం!" అని పది మంది కుర్రాళ్లు అన్నారు. వెంటనే మిగిలిన వారు చప్పట్లతో ఆమోదం తెలిపారు.

"అద్గదీ... అదీ గుర్తింపు అంటే! అటువంటి గిరీశం మన వూరివాడు కావడం, ఈ రోజు మనం అతన్ని సత్కరించుకోవడం మనల్ని మనం సత్కరించుకోవడం కాదా అని మిమ్మల్ని మరోసారి అడుగుతున్నాను!"

పందిట్లో మళ్లీ చప్పట్ల మోతమోగింది.

గిరీశంలో అనుమానం స్థిరపడుతోంది. "లేదు...ఈ ముసలోడు నా పుట్టి ముంచడానికే ఇదంతా చేస్తున్నాడు!" అనుకున్నాడు.

“ఇలా ఎన్నని చెప్పను. పోలీస్ స్టేషన్‌కి వెళితే లంచం, ఆఫీస్ కెళితే లంచం, సొసైటీకి వెళితే లంచం...ఇలా అందరి చెయ్యి తడపాలంటే పేదోళ్ల వల్ల అవుతుందా? చదువురాని వాళ్లు పనులు చేయించుకోగలరా? అలాంటి వాళ్లందరికీ నేనున్నానంటూ ఆదుకుంటున్న గిరీశంలాంటి వాళ్లు ఊరికి ఒక్కరుంటే ఎంత ఉపకారం జరుగుతుందో చెప్పడానికే ఈ సన్మానం!” అంటూ మాస్టారు ప్రసంగం ముగించారు.

అప్పటికే గిరీశం ఒళ్ళంతా చెమటతో తడిసిపోయింది. సన్మానం పేరుతో ఈ మాస్టారు నామీద కుట్ర చేస్తున్నాడని అతను భయపడుతున్నాడు. వేదికపై సీఐ కూడా ఉండడంతో ఆందోళన చెందుతున్నాడు. అసహనంగా కుర్చీలో కదులుతున్నాడు.

సహకార సొసైటీ డైరెక్టర్ ప్రసంగాన్ని ప్రారంభించాడు. అందరికీ వందనం. ప్రజలారా సహకార సొసైటీలోనే సహకారం ఉంది! రుణం కావాల్సి వస్తే ఎవరికీ రూపాయి ఇవ్వక్కలేదు.  అన్నీ అర్హతలు ఉంటే దానికదే మంజూరవుతుంది. ఎవరైనా లంచం అడిగితే నా దృష్టికి తెండి!” అంటూ ముగించాడు.

తర్వాత సీఐ మాట్లాడుతూ “ప్రజారక్షణ తమ బాధ్యతని, తప్పుచేసిన వారిని శిక్షించి తీరుతాం! ఫిర్యాదీలు..  న్యాయం కోసం ఎవరికీ రూపాయి ఇవ్వక్కర్లేదు! ఈ విషయంలో చైతన్యవంతులు కావాలి. సమస్య ఉంటే నేరుగా నాకు చెప్పండి!” అంటూ ముగించాడు.

బ్యాంకు అధికారి మాట్లాడుతూ..  “మిత్రులారా... అన్ని అర్హతలు, అవసరమైన ష్యూరిటీలు ఉంటే బ్యాంకు ఎవరికైనా రుణం ఇస్తుంది. మా వ్యాపారాభివృద్ధికి సహకరిస్తున్న మీకు మేమే రుణపడివుంటా! అందువల్ల రుణం కోసం ఎవరికీ రూపాయి ఇవ్వక్కర్లేదు. తప్పుడు ధృవపత్రాలతో రుణం పొందాలనుకునే వారు మాత్రమే ఇటువంటివి చేస్తారు.  మీరు నిజాయితీగా రుణం పొందాలనుకుంటే పొందవచ్చు. ఆటంకాలు ఉంటే నన్ను కలవండి!” అని భరోసా ఇచ్చాడు.

చివరిలో తహసీల్దార్ లేచి నిలబడ్డాడు.

“గ్రామ పెద్దలందరికీ నమస్కారం. రెవెన్యూ శాఖ అంటే అవినీతి మయం అని ముద్రపడిన మాట వాస్తవం. అది పూర్తి నిజం కాదని నా ముప్పైఏళ్ల అనుభవంతో చెబుతున్నాను! అన్ని శాఖల్లోనూ ఉన్నట్లే రెవెన్యూ శాఖలోనూ నూటికి ఒకరో ఇద్దరో అవినీతిపరులున్నారు. నిజాయితీతో పనిచేసే వారే ఎక్కువ. ఎవరైతే తప్పుడు పత్రాలతో దొంగ సర్టిఫికెట్ ప్రయోజనం పొందాలనుకుంటారో వారే లంచాలు ఇవ్వజూపుతారు. దళారీలను ఆశ్రయించి పనులు చేసుకోవాలని చూస్తారు. ఈ దళారీలు రెవెన్యూ ఉద్యోగుల పేరు చెప్పి తమ జేబు నింపుకుంటారు. మీ పనికోసం సచివాలయం నుంచో, మీసేవా కేంద్రం నుంచో దరఖాస్తు చేయండి. నిర్దేశిత సమయంలో పని పూర్తికాకుంటే నేరుగా నన్ను సంప్రదించండి, లేదా ఏసీబీకి ఉప్పందించండి!” అంటూ తహసీల్దార్ ప్రసంగం పూర్తిచేసి కూర్చున్నాడు.

అందరి ప్రసంగాలు పూర్తయ్యేసరికి గిరీశం శరీరం పూర్తిగా చెమటతో తడిసిపోయింది. ముళ్లపై కూర్చున్నట్టుంది పరిస్థితి. మాస్టారి సన్మానంలోని ఆంతర్యం అతనికి అర్థమయ్యింది.  కాసేపటికి ఊరిపెద్దలు, అధికారుల ఆధ్వర్యంలో గజమాలతో గిరీశాన్ని సత్కరించారు.  మెడలో పూలదండ కాలసర్పంలా కనిపిస్తోంది గిరీశానికి.

‘మాస్టారు... మీ ఆలోచనకు శతకోటి వందనాలు! గాంధీ కాలం నాటి బుర్ర మీది! అర్థం చేసుకోలేక నేనే తొందరపడి వెధవను అయిపోయాను. నన్ను మంచివాడిని, సాయపడేవాడినని చెబుతూనే ఊరివాళ్ల ముందు నన్ను దోషిగా నిలబెట్టారు! ఇన్నాళ్ల నా వసూళ్ల జాతకం విప్పేశారు. నన్ను మీరు సత్కరిస్తామని అన్నప్పుడే అనుమానించాల్సింది. చంకలు గుద్దుకుని ‘సై’ అన్నాను! చూడండి.. అందుకు నాకు తగిన శాస్తి జరిగింది. నాకు ఇలా కావాల్సిందే!’ గిరీశం తనను తాను తిట్టుకుంటున్నాడు.

అతని ఆత్మసంఘర్షణను అక్కడ పట్టించుకున్న వారెవరూ లేరు.

ఊరివాళ్ల వైపు అయోమయంగా చూస్తున్నాడు.

ఇప్పుడు ఎలా బతకడమా అన్న ఆలోచనలే గిరీశాన్ని భయపెడుతున్నాయి!!

# అమ్మా! ఆశ!!

ప్రోత్సాహక బహుమతి పొందిన కథ

పాణ్యం దత్తశర్మ

రాష్ట్ర శాసనసభకు హోరాహోరీగా ఎన్నికలు జరిగాయి. ఎంతో అనుభవం ఉండి, చాలా సంవత్సరాలు రాష్ట్రాన్ని పాలించిన ముఖ్యమంత్రి రామచంద్ర, ఆయన పార్టీ, ఎన్నికల్లో ఘోరమైన ఓటమి చవి చూసేరు. కొత్తగా పార్టీని స్థాపించి, రాష్ట్రమంతా పర్యటించి, గత ప్రభుత్వపు వైఫల్యాలను ఎండగడుతూ, ప్రజలతో మమేకమైన ప్రతిపక్ష నాయకుడు మదన్మోహన్, బుల్‌డోజర్ మెజారిటీతో అధికారంలోకి వచ్చాడు. ప్రమాణస్వీకరారోత్సవానికి ముందురోజు రామచంద్ర ఇంటికి ఫోన్ వచ్చింది. ఆయన పి.ఎ. ఎత్తాడు.

"హలో! ఎవరండి?"




"అయ్యా, నేను మదన్‌మోహన్ గారి పి.ఎస్ నండి! మా సారు మీ సారును కలవాలనుకుంటున్నారు ఈరోజు. ఆయనను అడిగి టైం ఫిక్స్ చేయగలరా?"

రామచంద్ర పి.ఎ. ఆశ్చర్యపోయాడు! "అలాగే నేను సారునడిగి కాసేపట్లో మీకు ఫోన్ చేస్తాను!"

విషయం విని రామచంద్ర కాసేపు ఆలోచించాడు "సరే రమ్మను!" అన్నాడు.

సాయంత్రం ఆరు గంటలకు కాబోయే ముఖ్యమంత్రి, గత ముఖ్యమంత్రి యిల్లు చేరుకున్నాడు! ఎన్నికల ముందు ప్రచారసభల్లో ఇరువురూ పరస్పరం దుమ్మెత్తి పోసుకున్నవారే, అయినా "కర్టెసీ" అనేది ఒకటుందిగా! రామచంద్ర బలవంతాన ముఖాన నవ్వు పులుముకుని మదన్‌ను ఆహ్వానించాడు. కరచాలనాలు, పుష్పగుచ్ఛాలు సరేసరి!

"అన్నా! నా ప్రమాణస్వీకారం రేపు ఉదయం పదకొండుకి జరుగుతుంది. మీ కొడుకులాంటి వాణ్ణి. మీ రాజకీయానుభవమంత లేదు నా వయసు! మీరు పెద్దమనసు చేసుకుని రేపు వచ్చి నన్నాశీర్వదించాలని మనవి. అందుకే స్వయంగా వచ్చానన్నా! మీరు ఓడినంత మాత్రాన మీ విలువ తగ్గదు. వస్తారు కదూ!"

అతని వినమ్రత రామచంద్రను కదలించింది. మనసులోని వైషమ్యం కరిగిపోయింది.

"సరే, వస్తాను!" అన్నాడాయన ఆదరంగా

★★★

ప్రమాణస్వీకారోత్సవం ఘనంగా జరిగింది. కొందరు ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు హాజరయ్యారు. ముఖ్యమంత్రి ఇలా అన్నాడు. "మాన్యులు రామచంద్రగారు నాకు పితృసమానులు! అపారమైన ఆయన పరిపాలనానుభవం మన రాష్ట్రానికి అవసరం. జాతీయస్థాయిలో ఆయనకు సన్నిహితులున్నారన్న విషయం తెలిసినదే! ఈ సభాముఖంగా ఆయనకు నా సవినయ మనవి ఏమంటే, ఆయన మా ప్రభుత్వానికి ప్రధాన సలహాదారుగా ఉండి, మాకు మార్గ నిర్దేశం చేయాలి. ఆయనకు క్యాబినెట్ హోదాకల్పిస్తాము. గౌరవంగా చూసుకుంటాము. దీనికి ఆయన దయతో అంగీకరించాలి!"

ఈ మాటలతో సభలో కరతాళ ధ్వనులు మిన్నును చేరాయి. ముఖ్యమంత్రి వేదిక మీద నున్న రామచంద్రకు పాదాభివందనం చేశాడు! రామచంద్ర కన్నుల్లో పల్చటి నీటిపొర! ముఖ్యమంత్రిని లేపి హృదయానికి హత్తుకున్నాడా రాజకీయ దురంధరుడు!

★★★

అసెంబ్లీ సమావేశాల్లో, తమ వారెవ్వరూ ప్రతిపక్షనాయకుడ్నిగానీ, వారి సభ్యులను గానీ కించపర్చడం, ఎగతాళి చేయడం, గత ప్రభుత్వాన్ని విమర్శించడం చేయవద్దని తన వారికి సూచించాడు ముఖ్యమంత్రి. వారి పాలన నచ్చకే గదా ప్రజలు వారినోడించింది! కాబట్టి శాసన సభలో వారిని ఆదరంగా చూడమన్నాడు. ఫలితంగా సభలో గొడవలు లేవు. ప్రతిపక్షం చేసే సూచనలను పరిగణనలోకి తీసుకోవడం జరుగుతోంది.

దేశంలో లబ్ధ ప్రతిష్టులైన ఆర్థిక వేత్తలను, సైంటిస్టులను, వ్యవసాయ శాస్త్రవేత్తలను, రాజకీయంగా ఒక వెలుగు వెలిగి, ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్న అన్ని పార్టీలలోని కురు వృద్ధులను, ముఖ్యమంత్రి ఆహ్వానించి వారితో చర్చలు జరిపి, ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాలు ఎలా ఉండాలో ఒక రూపకల్పన చేయించారు.

సంక్షేమ పథకాల్లో మొదటిస్థానం వైద్యానికి ఇవ్వడం జరిగింది. ప్రభుత్వ ఆసుపత్రులను బాగా అభివృద్ధి చేసి, వసతులు కల్పించి, పేదవారికి ఉచితవైద్యం అందేలా పటిష్టమయిన చర్యలు తీసుకున్నారు. "ఆరోగ్య భాగ్యం" అనే పథకం ద్వారా ప్రయివేటు ఆసుపత్రుల్లో కూడ బీదవారికి ఉచిత వైద్యం అందుతుంది. అది దుర్వినియోగం అవకుండా జిల్లా స్థాయిలో రాజకీయాలతో సంబంధం లేని మేధావులను నియమించారు.

ప్రతి విషయంలోనూ మాజీ ముఖ్యమంత్రిని సంప్రదిస్తున్నాడు మదన్. ప్రతి నియోజకవర్గం ఎమ్మెల్యే అక్కడి ప్రతిపక్ష నాయకులతో సమన్వయం చేసుకుని వెళ్లాలనే, నిబంధనతో రాష్ట్రంలో ఒక సుహృద్భావ వాతావరణం ఏర్పడింది.

రెండవ స్థానం "విద్య"కు ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో సౌకర్యాలు మెరుగుపరచాలి. ఉపాధ్యాయులు, లెక్చరర్ల ఖాళీలు నింపాలని నిర్ణయించారు. "అమ్మ దీవెన" అని ఈ పథకానికి పేరు. ప్రసిద్ధ విద్యావేత్త మక్కా సోమయ్యగారిని విద్య సలహాదారుగా తీసుకున్నారు. ప్రభుత్వవిద్యాలయాలకు హాజరయ్యే పిల్లల తల్లుల అకౌంట్లలో ప్రతి సంవత్సరం ఇరవై వేలు జమ చేయడానికి నిర్ణయం జరిగింది. సోమయ్య గారు ముఖ్యమంత్రితో ఇలా మనవి చేశారు.

"సియంగారూ, దీనికి కనీసం డెబ్బై ఐదు శాతం హాజరు, వార్షిక పరీక్షల్లో నలభై శాతం మార్కులు తప్పని సరిచేస్తే మంచిది. అంతేగాకుండా, ఇది ప్రయివేటు సంస్థలలో చేరేవారికి వర్తించకూడదు. ఈ డబ్బును కేవలం పిల్లల చదువు కోసమే వినియోగించేలా నియంత్రణ అవసరం. కొన్ని రాష్ట్రాలలో ఇలాంటి స్కీములు దుర్వినియోగమై ప్రజలు ఆ డబ్బును ఇతర అవసరాలకు వినియోగించుకోవడం జరిగింది. దిసీజ్ మై హంబుల్ సజెషన్!"

సి.యం. అంగీకరించారు. దీనివల్ల ప్రభుత్వ సంస్థల్లో హాజరు శాతం, ఉత్తీర్ణతా శాతం బాగా పెరిగాయి. టీచర్లకు, లెక్చరర్లకు, దాన్ని బట్టి ఇన్‌సెంటివ్స్ కూడ ఇవ్వసాగారు. ఈ సూచన రామచంద్రగారు చేశారు. మళ్లీ డిటెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టారు. దీనివల్ల చదువుకునేవారిలో, చెప్పేవారిలో "సీరియస్‌నెస్" ఏర్పడింది.

పిల్లలకు క్రీడలలో శిక్షణకు అధిక ప్రాధాన్యం యిచ్చారు. పి.ఇ.టి. పి.డి పోస్టులను వందల సంఖ్యలో నింపారు.

విద్యార్థులలో లైఫ్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ అభివృద్ధి చేయడానికి ప్రత్యేక ఇన్‌స్ట్రక్టర్లను నియమించారు. వృత్తి విద్యకు అధిక ప్రాధాన్యత! ఇంటర్న్‌షిప్, ట్రెయినింగ్‌ల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తారు. "ఉద్యోగమంటే ఉపాధి" అన్న సూత్రాన్ని ప్రజల మనస్సుల్లోకి ఎక్కేలా చేసింది ప్రభుత్వం.

"స్టార్టప్"లు ప్రారంభించేవారికి ఎన్నో రాయితీలు, సబ్సిడీలు ఇస్తూ యువ పారిశ్రామిక వేత్తలు తామే కాకుండా పదిమందికి ఉపాధి కల్పించేలా కార్యక్రమాలు రూపొందించారు.

ఒకరోజు క్యాబినెట్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి ఇలా చెప్పాడు. "మన పథకాలు వేటికీ నా పేరు జోడించకూడదు. ఇది నా ఒక్కడి ఘనత కాదు. మనమంతా ఒక టీం నేను "ఫస్ట్ అమాంగ్ ఈక్వల్స్" ని మాత్రమే!"

విశేషమేమంటే ప్రతి క్యాబినెట్ మీటింగ్‌కు ప్రధాన సలహాదారుగా రామచంద్రగారికి ఆహ్వానం ఉండేది.

ఇంజనీరింగ్ కళాశాలలకు అనుమతులివ్వడం బాగా తగ్గించారు. ప్రపంచంలో ఇంజనీరింగ్, మెడిసిన్ తప్ప వేరే కోర్సులే లేనట్లు జనం ఎగబడుతూండటం చూస్తూనే ఉన్నాం. లక్షల సంఖ్యలో ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రతియేటా బయటకు వస్తూండటం, వారికి తగిన స్కిల్స్ లేక "ఎంప్లాయిబిలిటీ" లేకపోవడం అనేదాన్ని నియంత్రించడానికి ప్రయత్నం జరిగింది.

ఇంగ్లీష్ మీడియం స్కూళ్లల్లో దోపిడీని అరికట్టటానికి ప్రభుత్వ స్కూళ్లల్లో మూడవ తరగతి నుండి యింగ్లీషు మీడియం ప్రవేశపెట్టారు. కానీ రామచంద్ర గారి సలహా మేరకు దాన్ని కంపల్సరీ చేయలేదు. మాతృభాషామాధ్యమంలోనూ కొనసాగవచ్చు. ప్రతిరోజూ ఒక పీరియడ్ ఇంగ్లీష్ గ్రామర్, స్పోకెన్ స్కిల్స్, కంపోజిషన్ నేర్పడానికి కేటాయించారు.

ప్రసిద్ధ వైద్యులు డా॥ ధన్వంతరిగారి ఆధ్వర్యంలో ఒక కమిటీ ఏర్పడింది. ఆలోపతి, హోమియోపతి, ఆయుర్వేదం, యునాని లాంటి వైద్య విధానాల్లో ఇంటర్ బైపిసి పూర్తి చేసినవారికి మూడేళ్ల మెడికల్ డిగ్రీ కోర్సును ప్రారంభించారు. దీంట్లో ఉత్తీర్ణులైనవారిని గ్రామాల్లో వైద్యాధికారులుగా నియమిస్తారు. పదిపడకల ఆసుపత్రి, ఇద్దరు నర్సులు, ఒక డయాగ్నాస్టిక్ సెంటరు, ఒక ఫార్మసీ అనుసంధానంగా ఉంటుంది. మెడిసిన్‌లో పి.జి. చేస్తే తప్ప కెరీర్ లేదనుకునే దుస్థితి తప్పింది.

తర్వాత, ప్రాధాన్య క్రమంలో, వ్యవసాయరంగం చేరింది. దానికి ప్రధాన సలహాదారు ప్రఖ్యాత వ్యవసాయవేత్త, విశ్రాంత వ్యవసాయ విశ్వవిద్యాలయకులపతి డా. కృషీవల్ "రైతన్నకు ఆపన్నహస్తం" అను పేరిట ఒక పథకం రూపుదిద్దుకుంది. అత్యున్నత స్థాయి సమావేశంలో రైతులకు పంట భీమాతో పాటు పంటలు వేసుకోవడానికి ఆర్థిక సాయం అందించాలని నిర్ణయం తీసుకున్నారు. డా. కృషీవల్ ఇలా అన్నారు.

"ముఖ్యమంత్రీజీ! కొన్ని యితర రాష్ట్రాల్లో ఈ విధానం ఒక ఫార్సుగా మారింది. భూమి విస్తీర్ణంతో సంబంధం లేకుండా బడా భూస్వాములకు కూడ ఇది వర్తింప చేస్తున్నారు. ఇంతకంటే హాస్యాస్పదమైన విషయం ఏముంటుంది? కాబట్టి, మనం పేద, సన్నకారు రైతులకే ఇది వర్తింపజేయాలి. పదెకరాలలోపు భూమి కలిగిన వారికే ఇస్తాము... ఎకరానికి ఇంత చొప్పున!"

వ్యవసాయ మంత్రి అన్నారు. "కొందరు బియం డబ్ల్యు కార్లలో వచ్చి పెట్టుబడి సాయం పొందుతున్న విషయం తెలిసిందే."

అందరూ నవ్వారు. రామచంద్రగారన్నారు.

"కొన్ని రాష్ట్రాల్లో కౌలు రైతులకు రైతులుగా గుర్తించడం లేదు. కష్టపడేది, పంట పండించేది వాళ్లయినా, పెట్టుబడి సాయం భూస్వామి తన్నుకుపోతున్నాడు. ఇది మా ప్రభుత్వం సవరించాలని చూసినా, ఈలోపు మా అధికారం పోయింది"

మళ్లీ నవ్వులు. మదన్ మోహన్ ఇలా అన్నారు.

"అన్నా మీ ప్రభుత్వమైనా, మా ప్రభుత్వమైనా ప్రజల సంక్షేమమే కదా కోరుకునేది! కౌలు రైతుల విషయంలో ఏం చేస్తే బాగుంటుందో చెప్పండి!"

రామచంద్ర అన్నాడిలా. "కౌలుకు భూమిని సాగుచేసే వారందరికీ ఒక గుర్తింపు పత్రాన్ని జారీ చేసి, వారికి కూడ ఈ పథకం అందుబాటులోనికి తెద్దాం. నిజానికి వారే కదా మెజారిటీ రైతులు!"

"పంట ఎక్కువగా పండించి, ధర లేక పంటను రోడ్ల మీద పోస్తున్నారు. కొన్నిచోట్ల. ప్రతి మండల కేంద్రంలో ప్రభుత్వమే ఒక కోల్డ్ స్టోరేజ్ కట్టించి, "పెరిషబుల్" పంటలను దాచుకోడానికి వీలు కల్పించాలి. ఏ పంటలు ఏ ప్రాంతంలో వేయాలో రైతులకు సూచించాలి. వ్యవసాయం చేయడానికి ముందుకొచ్చే యువతకు ప్రోత్సాహకాలు కల్పించాలి. వ్యవసాయాన్ని కూడ ఒక

ఉద్యోగంగా స్వీకరించే స్థాయికి యువత ఎదగాలి. వ్యవసాయం మీద వచ్చే ఆదాయం మీద పన్ను లేదు. మామూలుగా ఐతే ఐదు లక్షలు ఆదాయం దాటితే ఇన్‌కంటాక్స్ పడుతుంది. ఐ.టి. అన్నది కేంద్ర పరిధిలోది కాబట్టి, వందల ఎకరాలు కలిగి కోట్లల్లో ఆదాయమున్న రైతులను ఆదాయపు పన్ను పరిధిలోకి తేవడానికి మనం కేంద్రం మీద ఒత్తిడి తేవాలి. దాంట్లో రాష్ట్ర వాటా కోసం డిమాండ్ చేయాలి!"

"వ్యవసాయ భూములను రియల్ ఎస్టేట్లుగా మార్చే విధానానికి స్వస్తి చెప్పాలి. నగరీకరణను గణనీయంగా తగ్గించి, గ్రామీణ ఉపాధులను పెంచాలి"

ఇలాంటి తీర్మానాలతో సమావేశం ముగిసింది.

మదన్ మోహన్ మనసా వాచా కర్మణా నమ్మేదేమిటంటే, ఉచితంగా ఏదీ ప్రజలకు ఇవ్వకూడదనేది. దానివల్ల ప్రజల్లో "శ్రమశక్తి" పట్ల గౌరవం పోయి జడత్వం సంభవిస్తుంది. అందుకే ఆయన ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలన్నీ "ప్రొడక్టివిటీ"కి లింక్ అయి ఉంటాయి.

ఒక మీటింగ్‌లో చర్చ ఇలా జరిగింది.

"ఆటో వాళ్లందరికీ సంవత్సరానికి పదివేలు ఆర్థికసాయం వారి అకౌంట్లలో జమ చేయాలి. కాని దాన్ని వాళ్లు ఆటో మెయిన్‌టెనెన్స్‌కే ఉపయోగించేలా నియంత్రణ ఉండాలి. వారు పేదవారు. కానీ డబ్బు కనబడగానే బిర్యానీలు, బీర్లు తెచ్చుకుని ఆ డబ్బు దుర్వినియోగం చేసే ప్రమాదముంది. అలా కొన్నిచోట్ల జరుగుతూంది కూడ.  అట్లే వీధి వ్యాపారులకు ఆర్థిక సాయం కూడ. తోపుడు బండి కొనుక్కొవడానికో, సరుకు కొనుక్కోవడానికే ఈ సాయాన్ని వాళ్లు ఉపయోగించుకుంటున్నారా లేదా అన్న నియంత్రణ అవసరం. ఒక సంవత్సరం తర్వాత లబ్ధిదారుల జీవన ప్రమాణాల్లో ఏదైనా మార్పు వచ్చిందా లేదా అన్న సర్వే కూడ జరగాలి. చేనేతన్నలు, నాయీబ్రాహ్మణులు, ఇలా సమాజంలో ఎందరో వృత్తులు నెరపుతున్నారు. వారికి సాయం నిర్మాణాత్మకంగా అందాలి అప్పుడే ఈ పథకాలకు సార్థకత"

రిజర్వేషన్స్ మీద కూడ ఒక ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. సి.యం. ఇలా అన్నారు.

"కేవలం ఎంట్రీ లెవెల్‌లోనే ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లు ఉండాలి. అది సమంజసం. కాని పోను పోను ప్రమోషన్లలో కూడ రిజర్వేషన్లు పాటిస్తూన్నాం. అది సహేతుకమని నాకనిపించదు. దీన్ని సమీక్షించి, ఒక సముచిత నిర్ణయం తీసుకుందాం. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న డి.ఎ. బకాయిలు, వేతన సవరణ కోసం ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ముఖ్యమంత్రికి కొన్ని వర్గాల ప్రజల మీదే అభిమానమనీ, ఉద్యోగస్థుల మీద లేదనీ విమర్శలు వచ్చాయి. సి.ఎం. ఉద్యోగ సంఘ నాయకులతో భేటీ అయ్యాడు. చీఫ్ సెక్రటరీ, రామచంద్రగారు కూడ సమావేశంలో ఉన్నారు.  సి.ఎం. గారు ..

"అన్నా, మీ సమస్యలు నాకు తెలుసు. అన్నీ సానుకూలంగా పరిష్కరిస్తాము. కానీ ఒక్క మనవి. అవ్యవస్థీకృత రంగంలోని వారి కంటె మీ జీవన ప్రమాణాలు ఎంతో మెరుగ్గా ఉన్నాయి. రెక్కాడితే గాని డొక్కాడని వారి పరిస్థితి ఏమిటి? వారికి ఆర్థికంగా కొంత చేయూతనిస్తూంటే, నాకు వారి మీద ప్రేమ ఎక్కువనీ, మీ మీద లేదనీ అంటున్నారట. అలా ఉంటుందా అన్నా! నేను మనస్ఫూర్తిగా ముప్పై ఐదు  శాతం ఫిట్‌మెంట్ ఇద్దామనుకుంటున్నా. నేను అధికారంలోకి వచ్చిన వెంటనే ఇరవై ఏడు శాతం ఇంటెరిమ్ రిలీఫ్ ఇవ్వనే యిచ్చాను.  సరే, మీరు కోరినట్లు ఏభై శాతం ఫిట్‌మెంట్ యిస్తాను. అప్పుడు మీ జీతాలు, డి.ఎ.లు, మీ పెర్‌ఫార్మెన్స్ బేస్‌డ్‌గా ఉంటాయి. ప్రతి ఒక్కరికీ టార్గెట్స్ విధిస్తాం. అవి రీచ్ అయినప్పడే మీ శాలరీస్ పూర్తిగా అందుతాయి. లేకపోతే ఆ మేరకు కోత విధిస్తాం. ఇప్పుడు అలాంటిదేమీ లేకుండా అందరికీ పూర్తి జీతాలిస్తున్నాం. దయచేసి పేదవారితో మిమ్మల్ని పోల్చుకోకండి! కొంత మానవతా దృక్పథం చూపండన్నా"

ఉద్యోగ సంఘాల నేతలు మౌనం వహించారు. ఇదేమిటో మనకు కంటకప్రాయంగా ఉందే! అని కలవరపడ్డారు. సిం.ఎం. తో అన్నారు.

"అయ్యా! మీ దయ! మా సహకారం ప్రభుత్వానికి ఎప్పుడూ ఉంటుంది. మాకు సెలవిప్పించండి" అంటూ నిష్క్రమించారు.

జాతీయస్థాయి సామాజికవేత్త పద్మభూషన్ డా. సారంగపాణి గారి ఆధ్వర్యంలో అవినీతి నిరోధక కార్యక్రమం ఏర్పాటయింది. ఏ ప్రభుత్వ శాఖలలో అవినీతికి ఎక్కువగా ఆస్కారముంటుందో గుర్తించారు. లంచం తీసుకున్నవాడే గాక ఇచ్చేవాడు కూడ శిక్షార్హుడే అన్న సూత్రాన్ని అమలుచేస్తారు. "నాకు లంచం ఇవ్వ జూపాడు" అని ఒక ప్రభుత్వోద్యోగి ఫిర్యాదు చేయవచ్చు. "డబ్బు ఎంత ఖర్చయినా ఫరవాలేదు. పని కావాలంతే!" అన్న ధృక్పథం సమాజంలో వేళ్లూనుకుపోయింది. పెళ్లి సంబంధాలు చూసేటప్పుడు "అబ్బాయికి "పై" ఆదాయం బాగానే ఉంటుందట!" అని మురిసిపోయే తత్త్వాలు మనవి. కాబట్టి సామాజిక దృక్పథంలోనే మార్పు రావాలని తీర్మానించారు. అవినీతి కేసుల్లో ఋజువైన వారికి కేవలం జైలు శిక్షకాకుండా, ఉద్యోగంలో నుండి టర్మినేట్ చేయాలని, పెన్షన్, ఇతర బెనిఫిట్స్ వర్తింపజేయకూడదని నిశ్చయించారు.

పెద్ద పెద్ద ప్రాజెక్టులను టెండరు పాడి కైవసం చేసుకున్న బడా కాంట్రాక్టర్లను, నిర్దేశిత వ్యవధిలో ప్రాజెక్ట్ పూర్తి చేయకపోతే, పెరిగిన ప్రాజెక్ట్ వ్యయాన్ని వారే భరించే విధంగా చట్టం చేశారు. నాణ్యతా లోపాలకు భారీ జరిమానాలు, కూలిపోవడం లాంటి వైఫల్యాలకు కఠిన శిక్షలు విధిస్తారు.

అన్ని మతాలకు చెందిన పుణ్యక్షేత్రాల మీద వచ్చే ఆదాయాన్ని, సగం ఆయా క్షేత్రాల అభివృద్ధికి, సౌకర్యాల కల్పనకు, మిగతా సగం ప్రభుత్వ ఖజానాకు చెందుతుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అన్ని మతాల్లో నిరుపేదలను కొందరిని గుర్తించి, వారి వారి పవిత్ర స్థలాలకు ప్రభుత్వ ఖర్చులతో దర్శనానికి పంపుతామని చెప్పారు. పాండెమిక్స్ ప్రబలినప్పుడు సర్వమత ప్రార్థనలు ఏర్పాటు చేస్తారు.

సిఎం. మదన్ మోహన్ పాలనలో శిఖరాయమానమైనది, ఎమ్మెల్యేల, మంత్రుల జీతాలు, అలవెన్సులు ఏభై శాతం తగ్గించడం. విమాన ప్రయాణాలు కాకుండా సెకండ్ ఎ.సి. రైల్వే కోచ్‌లలో ప్రయాణించాలి వారు. ఐ.ఎ.ఎస్. ఐ.పి.ఎస్ అధికారులకు కూడ ఉన్నత స్థాయి సౌకర్యాలు తగ్గించారు.

గ్రామీణ ప్రాంతాలకు రోడ్లు అధిక ప్రాధాన్యత పొందాయి. గ్రామస్తులు శ్రమదానం చేస్తే, ప్రభుత్వం ఆ ఊరికి కొద్ది రోజుల్లోనే చక్కని రోడ్లను ఏర్పాటు చేస్తుంది.

ధర్నాలు, ఆందోళనలు గణనీయంగా తగ్గాయి!

శ్రమ జీవులు కడుపు నిండా తింటున్నారు!

అవినీతి చాలా మటుకు తగ్గింది!

ఉద్యోగులు నిబద్ధతతో పని చేస్తున్నారు!

వెరసి,

ప్రజాసంక్షేమం వెల్లివిరిసింది!

# కొండ పరియ

ప్రోత్సాహక బహుమతి పొందిన కథ

**ఈతకోట సుబ్బారావు**

చీకటి.. మంచి నిద్ర మత్తులో మునిగి ఉంది!

అడవి ఘీంకారాలు, ఊళలు ఏమాత్రం నిద్రాభంగం కావటం లేదు.  వెలుగు రేఖలు ఇంకా విచ్చుకోనే లేదు. గూడెం గుండె నిండా నెత్తురు మరకలు.

"ఓరేయ్ అప్పిగా..."

"ఓరా మొలకో..."

"ఓమ్మే లచ్చా..."

"మేయ్ చారుముడే"

ఆ మసక చీకటిలో గూడెమంతా గొంతుకలే... అరుపులు, భయం, కేకలు, పరుగులు. అడుగులు దబదబలు, పరుగుల శబ్ధాలు, గొంతుకలు తప్పించి, ముఖాలు కూడా కనిపించని చీకటి పరుగులే కానీ విషయం తెలియటం లేదు.

అన్నీ పరుగులే!

అన్ని కాళ్లు, ఎన్నో అడుగులు!

అన్నీ ఒక వైపే పరుగులు పెడుతున్నాయి.



పోరిగాడి ఇంటి ముందు కంచె కట్టి ఉంది. అది తడికలు, ముళ్ల చెట్ల కంచె కాదు. జనం కంచెలా కట్టి ఉన్నారు. గూడెం అంతా శోకాలు పెడుతోంది. వచ్చిన వాళ్లంతా చూడలేనటువంటి దృశ్యాలు. భయంతో వణుకుతున్నారు. ఆ భయానికి చీకటి కూడా చిన్నగా తప్పుకుంటూ ఉంది.

ముసల్ది కూడా నడవలేక నడుస్తూనే ఉంది. కర్ర చేత పట్టుకొని లేని సత్తువతో నడుస్తుంది... కాదు వడి వడిగా అడుగులు వేస్తుంది.

"ఏం జరిగిందిరా.. ఒక్క బట్టా చెప్పటం లేదు!" పెద్దగానే అరచింది.

ఆ ముసలి గొంతుకలో ఆందోళన భయం.

"చీకట్లో నీ వెక్కడకే ముసల్దానా... తట్టుకొలేవ్ .. నీవు కూడా సత్తావే..." మనవడు మందలింపు.

అంతే వేగంగా పరుగులంకించుకున్నాడు.

"ఒరేయ్ కొండా.. అసలేమైందిర?" ముసలి కేక.

"నీ అవ్వ.. పులే... పులి.. ఆ పోరిగాడ్ని, వాడి పెళ్లాన్ని కొడుకుని చీల్చి చంపేసిందే!"

ముసల్ధి ఒక్కసారిగా స్థాణువై పోయింది. నోట మాట పెగల్లేదు.

"ముసలీ... ఇంటికెళ్లెహె" కొండడు అంతే వేగంగా జనంలో కలసిపోయాడు.

అంతా స్మశాన నిశ్శబ్దం... కాదు, పోరిగాడు ఇల్లే స్మశానం అయింది. ఒకటి కాదు మూడు చావులు. మూడు శవాలు. ఒకే కుటుంబం. గూడెమంతా పోరిగాడి ఇంటి ముందే... ఏడుపులు, శోకాలు, కేకలు, గుండెలు బాదుకోవటాలు అంతా హృదయ విదారకం!

"ఒరేయ్ రెడ్డొత్తున్నాడు.. రెడ్డొత్తున్నాడు!" జనంలో సందడి.

సుబ్బారెడ్డి పంచె ఎగగట్టి పరుగు మీద చేరాడు. రెడ్డి ముఖంలో కూడా భయం.. ఆందోళన! ఆ దృశ్యాల్ని చూడలేక ఒక్కసారిగా కుప్పకూలి పోయాడు.

బండలాంటి వాడు పోరిగాడు. కొండల్లో ఏ దిక్కున వెళితే, ఏ పంట దొరుకుతుందో బాగా తెలిసిన వ్యక్తి. ఏ జంతువు ఎదురైనా తప్పించుకు వచ్చేవాడనే పేరుంది! ఎంత పొద్దు పోయినా.. క్షేమంగా గూటికి చేరేవాడు. అదీ లాభసాటిగా వచ్చే అడవి పంటతో!

అయ్యతోనే కొండంతా తిరగటం నేర్చుకున్నాడు. కొండలు, గుట్టలు, లోయలు వాడికి అన్నీ కొట్టిన పిండే. వాడి పెళ్లాం కూడా అంతే. వాడి వెనకే పరుగులు తీస్తుంది. "ఏందే బాసాలా... నీ వెట్టా పోతావే ఆ అడవి కొండల్లోకి" అని ఆ గూడెం అమ్మలక్కలు ఎకసెక్కాలు పడుతుంటారు.

"నట్టడవిలో భయం లేదా"

"రాత్రులు సరే పగలు కూడా పోరిగాణ్ణి వదలేవా"

"ఎప్పుడూ ఇంట్లో నాలుగు మట్టి గోడల మధ్యనే కదా, ఆ అడవిలో పోరిగాడి పక్కన గమ్మత్తు చూస్తుందేలే!" అని అమ్మలక్కలు సూటిపోట్లు పొడిచేవారు. సరసాలు పడేవారు.

సహజమైన వయసోళ్లు, సవాసగాళ్లు ఎత్తి పొడిచేవారు. అయినా 'నా పోరిగాడు పక్కన నడుస్తుంటే మొగుడుతో నడిచినట్టు ఉండదే, పులిని వెంటపెట్టుకుని పోతున్నట్టు ఉంటుందని' మనసులో మాటను ధీమాగా చెప్పేది నూకాలు!

వాళ్లు ముద్దుల బిడ్డడే అంకయ్య!

మంచి నిద్ర సమయం. అదీ అర్ధరాత్రి పులి దాడిలో ముగ్గురు చనిపోవటం పల్లెను కలచివేస్తోంది.

పీక్కుతిని, ఆ ప్రాంతమంతా రక్తసిక్తం కావటం, విడి భాగాలుగా శరీరం ముక్కలుగా పడిపోయి ఉండటం, మూడు దిక్కుల్లో మూడు శవాలు పడి ఉండటం, తప్పించుకొనేందుకు.. పోరాటం జరిపినట్టు ఆనవాళ్లు, ముద్రలు మరింతగా గూడెం ప్రజలను కలవరపరుస్తోంది.

అందరూ తలలు పట్టుకొని ఎక్కడోళ్లు అక్కడ కూలబడిపోయారు.

మూడు శవాలను అప్పటికే పోలీసులు సమాచారం, కొలతలు, గుర్తులు, ఫోటోలు లాంటివి సేకరించి తదనంతరం పోస్ట్ మార్టంకు తరలించారు.

★★★

తెల్లారగట్ల కొండపరియ వార్తల్లో నిలిచింది. 'పులి దాడిలో ముగ్గురు మృతి' అని టీవీలో ఫ్లాష్ న్యూస్ లు ప్రవాహంలా వెలువడుతున్నాయి. జిల్లా పోలీసు అధికారులు, డియస్పీ, సి.ఐ, ఎస్.ఐ. పోలీసు బలగాల, జీపులు, కార్లు కొండ పరియను చుట్టుముట్టాయి.

టీవీ ఛానళ్లు అక్కడే నివాసాలు పెట్టాయి. క్షణం క్షణం పోటాపోటీ ఫ్లాష్ న్యూస్ లు అందిచటంలో టీవీ ఛానళ్లు తమ వంతు పాత్ర పోషిస్తున్నాయి. ఆ కొండలు అడవులు, పులి వచ్చిన దారులు, డొంకలను షూట్ చేస్తున్నారు. ఎలా జరిగింది, ఎందుకు జరిగింది, ఎప్పుడు జరిగింది, ఎలా చంపింది, ముందు ఎవరిని చంపింది, వారు ప్రతిఘటించ లేదా, వారు నిద్రపోయారా, అయితే పులి శబ్ధాలు, అడుగుల చప్పుళ్లు వినలేదా అంటూ గూడెం ప్రజల నుంచి బైట్స్ తీసుకొని మరీ ప్రసారం చేస్తున్నారు.

తెలుగు రాష్టాలలోనే కాకుండ, అనేక రాష్ట్రాల ప్రజలు ఆసక్తిగా ఫాలో అవుతున్నారు.

ముఖ్యమంత్రి, జిల్లా పర్యటనలో ఉన్న మంత్రిని గ్రామ సందర్శనకు పురమాయించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నివేదిక కోరారు. జిల్లా కలక్టరు, ఆత్మకూరు ఆర్టీఓను, ఆర్డీఓ ఉదయగిరి తాసీల్దారును నివేదికలు సిద్ధం చేయాలని ఉత్తర్వులు విడుదల చేసారు .

మిట్ట మధ్యాహ్నం ఆ గూడెంలో పొయ్యి రాజేయలేదు. అంతా శ్మశాన వైరాగ్యం!

పల్లెలో నెలకొన్న భయానికి, మూడు శవాలను భరించలేని వారు.. అప్పటికే చాటుమాటుగా దొంగసారా పట్టిస్తున్న విషయం కూడా రహస్యమే.

పోస్టుమార్టం ఇంకా జరగలేదు. గూడెం పెద్దకాపులు రెడ్డి చుట్టూ చేరారు. అక్కడ పోలీసు, హాస్పిటల్ వారి చేతులు తడపందే పనులు పూర్తికావు. అవి చూడాలనే గూడెం పెద్దకాపులు రెడ్డి చుట్టూ చేరారు.

అప్పటికే గూడెంలో ఎన్ని గుడిశలు, ఎన్ని కులాలు, వృత్తి, అడవికి ఎంతదూరం, కొండకు ఎంత దూరం, పులి ఎన్ని సార్లు వచ్చింది, ఇంతకు ముందు ఎన్నిసార్లు దాడి చేసింది, ఎంత మంది చనిపోయారు, మగోళ్లు, ఆడోళ్లు, పిల్లకాయలు ఎంతమంది, అసలు ఎంతమంది చనిపోయారు.. ఇలా రకరకాల సమాచారాలు సేకరిస్తున్నారు.

పులి అడుగుల జాడలు, వాటి సైజులు కొలతలు తీయటం, దానిని పట్టి ఎంత వయస్సు గల పులి లాంటి విషయ సేకరణ, పోరిగాడి ఇంటివద్ద పడి ఉన్న ఆధారాలను రాబట్టుకోవడంలో పలు శాఖలు తమ పనిలో తాము నిమగ్నమై ఉన్నారు. ఎలక్ట్రానిక్ మీడియాకు కూడా ఇంతకు మించిన ఫ్లాష్ మేత దొరకక పోవటంతో కొండపరియ సన్నివేశాలు, సంఘటనలు టీవీలలో విస్తారంగా పండిస్తున్నారు. వండి, వార్చి ప్రజలకు వింతైన సమాచారంతో వంటకాలు అందించటంలోనే నిమగ్నమై ఉన్నారు.

రాష్ట్ర, జిల్లా, డివిజన్, తాలూకా, మండల, పంచాయితీ స్థాయిలో అదికారులు కొండపరియ నివేదికలు తయారు చేయటంలో నిమగ్నమై ఉన్నారు. పోలీసు, అటవీ రోడ్లు భవనాలు, రెవెన్యూ, ఎస్సీ, ఎస్టీ, బీసి కార్పోరేషన్, సామాజిక ఉద్యానవన లాంటి రెండంకెల శాఖలు తమ పనిని తాము చేసుకుంటూ నివేదికలు తయారీలో ఉన్నారు.

★★★

కొండపరియ –

నల్లమల దట్టమైన అడవులు, ఉదయగిరి కొండల మధ్య రాస్త్రాల వాసన సోకనంత దూరంగా విసిరేయపడ్డ కుగ్రామం, ఆదివాసులనడానికి వీల్లేదు. కోయలనడానికీ అవకాశం లేదు. నాగరికత నీడ పడని వూరే. ఐదు పదుల గడపలు దాటని చిన్న గూడెం. పంచాయితీకు చేరుకోవాలంటే కొండదిగి, నల్లమలలో ఏడు కి.మీ. అడ్డంగా నడవాలి. అదీ ఒంటరిగా నడవటానికి వీల్లేదు. కర్రా, కత్తీ, బరిసెల్లాంటివి ఆత్మరక్షణకు తీసుకెళ్లక పోతే, చిరుతలు, తోడేళ్లు, ఎలుగుబంట్లు వెంటపడి మరీ తరుముతుంటాయి. పాములకు కొరత లేకపోయినా వాగులు వంకలు దాటేటప్పుడు జెలగల కోసం కొరకంచులు అలుపూ సొలుపూ లేకుండానే మండుతూనే ఉండాలి. వాటి సెగకు, మంటకు అవి దూరంగా వెళ్లిపోతాయి. ఎన్ని ప్రమాదాల కత్తులు మొలిచినా కడుపాకలి తీర్చడానికి రోజూ అడవి బాటమ్మటా, ఉదయగిరి కొండమీదా సంపాదించిన అడవి సంపదలో చీకటి పడకముందే గూడెం వొడికి చేరుకోవాల్సిందే. కొండ క్రిందనున్న ఆరేడు గూడెం ప్రజలకు ప్రత్యక్ష దైవమే సుబ్బారెడ్డి. అడవి సంపద కొనుక్కోవటం ఎప్పటి రూకలు  అప్పుడే ఇవ్వటంతో ఆ గూడాలు చల్లగా జీవనం సాగిస్తున్నాయి. అలాంటి కొండపరియ గూడెం వాడే పోరిగాడు.

ఎలుగుబంటి దాడి, పాముకాటుతో చనిపోవటం గూడేలలో అప్పుడప్పుడు జరుగుతుండటం పరిపాటి అయినా, ఇటీవల కాలంలో కనిపించని వినిపించని పులి దాడి!  అందులోనూ పోరిగాడు వాడి పెళ్లాం, కొడుకుని చీల్చి చెండాడి ప్రాణాలు తీయటం ఆ గూడెంల ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారు. కొడుకును చదివించుకోవాలని, నాలుగు అక్షరాలు నేర్పితే, లక్షణంగా బతుకుతాడని గంపెడు ఆశతో ఆత్మకూరులో చేర్పించి, హాస్టల్ లో పెట్టాడు. కొడుకును వదిలి ఉండలేక పదిరోజులకోసారి, పోరిగాడు పెళ్లాంతో వెళ్లి చూసి వచ్చేవాడు. వెళ్లేటప్పుడు తాను సంపాదించిన అడవి సంపద అంతా ఆత్మకూరులోనే అమ్ముకుంటూ రావటం, నాలుగు రూకలు జాస్తిగా కళ్లచూస్తూ బిడ్డకోసం, బాగుకోసం, దాచుకుంటున్నాడు. కొడుకు ఇస్కూలు సీటు, హాస్టల్ సీటుకు కూడా సుబ్బారెడ్డి చేసిన సాయం కూడా గొప్పగా చెప్పుకొనేవాడు. పిల్లగాడు శలవులని రావటం ఇంతలోనే  ఈ దారుణం, ముగ్గురినీ పెద్దపులి పొట్టన పెట్టుకోవటం కలవర పరుస్తుంది.

★★★

పులి దాడి జరిగి ఆరేళ్లు పైగానే అయింది. పోరిగాడు వాడి పెళ్లాం, కొడుకుల సంగతి గూడెం మర్చిపోయింది. కానీ ఇప్పటికీ విచారణ జరుగుతూనే ఉంది. పలు శాఖలు పంచాయితీ నుంచి, రాష్ట్ర స్థాయి వరకు వందల ఫైళ్లు నివేదికలు సిద్ధం చేస్తూనే ఉన్నాయి. పులుల జాడల కోసం కృషి చేస్తూనే ఉన్నారు. ఆరేళ్లు గడిచినా వెలుగు చూడని విషయం..   మేం ఇక నుండి నగరంలోనే అమ్ముకుంటామన్న పోరిగాడి ఇంటిమీద దాడి చేసింది పులి కాదు, సుబ్బారెడ్డి..! అన్న విషయం ఇక వెలుగు చూడదేమో కదా....!!

# నూటికి నూట పది

శ్రీమతి పోడూరి నాగమణిశ్రీ స్మారక కథల పోటీ
ప్రోత్సాహక బహుమతి పొందిన కథ
శ్రీ శుభకృత్ వత్సర ఉగాది - 2022

వి. పూర్ణ కామేశ్వరి

"ఒరేయ్ హరీ. ఈ ఊరగాయ ఇచ్చిన అమ్మాయి వుందే. మహా భేషుగ్గా పెడుతుందనుకో. కారం లేని ఆ ఉప్పులో ఊరిన నిమ్మ బద్దని నాలిక్కి రాసుకుంటే, స్వర్గానికి ఒకే మెట్టు దూరంగా ఉన్నట్టుంటుందిరా" మురిసిపోతూ అంది అమ్మ.

"అవునులే, ఆ మాట నీకు అర్థమవ్వడానికి ఇన్నాళ్లు పట్టిందేఁ" మనసులోనే అనుకున్నాను. పైకంటే మళ్ళీ అలిగి తినడం మానేస్తుందని ఓ చిరునవ్వే బదులుగా ఇచ్చాను.

ఎనభైయ్యేదు పైబడ్డప్పటి నుంచీ మరీ చంటి పిల్లలా మారిపోయింది. ప్రతీ రోజూ ఏదో ఒక వంకతో పేచీలు పెట్టడం. ఒక్కోసారి ఒక్కో విషయం మీద దృష్టి పడితే దానినల్లుకునే అమ్మ ఆలోచనలు. ఆ ఆలోచనల చుట్టూనే పెట్టే పేచీలు. అమ్మకు అన్నం తినిపించడం లక్షవత్తుల వ్రతం చేసినంత పనవుతోంది.

ఈ మధ్య పేచీలన్నీ, ఊరగాయ గురించే. గుప్పెడన్నమైనా తినడంలేదు కానీ, అందులోకి నోటికి హితవుగా ఊరగాయ కావాలి. కారం లేకుండా వుండాలి. అప్పటికీ ఆన్లైన్లో కొంటూనే వున్నాను. ఏవీ నచ్చట్లేదు.

ఆఖరి చెల్లాయి పెళ్లి కూడా అయిపోయాక ఇంట్లో ఊరగాయలు పెట్టడం అన్నది ఇంచుమించు లేనట్టే. మా చిన్నతనంలో అమ్మ ఎన్ని రకాలు పెట్టేదో. శివరాత్రినాటి నుండీ ప్రారంభమయ్యే ప్రహసనం మండు వేసవి రోజుల వరకూ సాగేది. మాఘ మాసంలో నిమ్మకాయలు విరివిగా వస్తాయి. మంచి రసం వున్నవి దొరుకుతూనే ఉప్పులో వేసేసేది అమ్మ. ఇంచుమించు అప్పుడే నారదబ్బ కూడా దొరుకుతుంది. అవీ అదే పద్ధతిలో. ఆ పైన చింతకాయలూ, పండు మిరపలతో కొరివికారం, ఉసిరి, గోంగూర. ఇవన్నీ అవుతూనే మామిడికాయలు మెండుగా వస్తూనే, అన్ని రకాలూ. ఆవకాయ, మాగాయ, మెంతికాయ, బెల్లం ఆవకాయ. ఒకటేంటి అన్ని రకాలూను.

ఎండావకాయ ముక్కలు ఎండపెట్టడం తడవు, పిల్లలమందరమూ ఎగరేసుకుపోయేవాళ్ళం. వంద కాయ పెట్టాలనుకుంటే, మరో పాతిక మేమెగరేసుకుపోవడానికే లెక్కేసుకుని వేసేవారు.

"ఒరేయ్!! జాడీకెత్తడానికి ఏవైఁనా మిగులుస్తారా లేదా?" అంటూ అరుస్తుందే గానీ పాతిక్కాయ వరకూ పిల్లల కోసమే వేసే అమ్మ ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ మురిసిపోతూనే వుండేది.



ఇప్పుడు ఎనభై ఏడో ఏట, కారం లేకుండా ఉప్పులో నిమ్మకాయే అబ్బురమైపోయింది అమ్మకు.

పెళ్ళైన పదేళ్ళ వరకూ పెద్ద చెల్లెలు శ్రద్ధగా పెట్టి ఇచ్చేది. ఆ తరువాత బాధ్యతలు పెరిగి తనూ ఇలాంటి పనులు మానేసింది. రెండో చెల్లెలు ఇల్లూ, ఉద్యోగం అంటూ ఈదుకుపోతుంది. వాళ్ళమ్మాయి పై చదువులకి విదేశాలకీ, కొడుకు ఢిల్లీలో హాస్టల్లో ఉండడం వల్ల ఇంట్లో నిత్య వంటలు కూడా తగ్గించేసింది.

బ్రహ్మచారిగా ఉండిపోయిన నేను అమ్మ అన్ని అవసరాలనూ చూసుకుంటూ కాలక్షేపం చేయగలుగుతున్నానే కానీ ఈ ఊరగాయ విషయంలో మాత్రం తృప్తి పరచలేక పోతున్నాను. ఈ మధ్య ఈ విషయంపై మూడో ప్రపంచయుద్ధం వచ్చినంత పనవుతోంది మా ఇద్దరికీ.

ఏ పని చేసినా పర్ఫెక్షన్ తో చేయాలనేది అమ్మ. ముగ్గురు చెల్లెళ్ళూ అమ్మ చేతుల మీదుగా పెరిగినా ఆమె పరిశుభ్రత కానీ, పనితీరు గానీ ఎవ్వరికీ రాలేదు. ఏ పని సరిగ్గా చేయకపోయినా సహించేది కాదు. ఒబ్బిడిగా, ఇమిడిగ్గా చేయాలి అనేది. అలా పెరిగిన చెల్లెళ్ళు, వాళ్ళిళ్ళలో అలా చేసుకోవట్లేదు సరికదా, అమ్మ అడుగుతుందిలే అని అమ్మకోసం కూడా నాలుగు నిమ్మ బద్దలు ఉప్పులో వేసి తేలేకపోతున్నారు. నా మటుకు నాకు అమ్మ కోసమైనా సరే నోరు తెరిచి పదే పదే అడగడం మొహమాటంగా వుంటుంది.

ఆన్లైన్లలో ఎన్నో చోట్ల ఆర్డర్లు ఇచ్చి, తాయారు పికిల్సు అనీ, మూడో వీధిలోని మీనాక్షి గారు పెట్టి అమ్ముతున్నారనీ అప్పటికి తోచినది చెప్పి పెట్టడం, అవేవీ అమ్మకు నచ్చకపోవడం షరా మామూలే. ఈ మధ్య కాలంలో అమ్మ మాటలు కూడా తగ్గించేసింది. నోట్లోంచి మాట రాకపోయినా సరే ముఖ కవళికలతో ఆ వస్తువుకి అమ్మ ఎన్ని మార్కులు వేస్తుందో చెప్పేయచ్చు.

అలా ఎన్నో చోట్ల వెతకగా వెతకగా లభించిన పచ్చడే అది. ఆ రోజు అమ్మ ముఖం చూడాలి. పెరుగు అన్నంలో నిమ్మకాయ ఊరగాయ నంచుకుంటూ, నిమ్మబద్దని నాలికకి రాసుకోగానే, కనుబొమ్మలు ముందుగా కాస్త ముడుచుకున్నాయి. నా గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి. విద్యార్థి పేపరు దిద్దుతూ మార్కులు వేయడానికి మేస్టారు దీర్ఘాలోచనలోపడ్డట్టు మునిగి, మరో నిముషం తరువాత ఒక్కసారి భ్రుకుటిని పైకి లేవనెత్తింది. తలను సకారాత్మకంగా ఆడించింది. పదో తరగతి ఫలితాల కోసం పేపరులో నెంబరు వెదుక్కుంటూ నెంబరు కనిపించిన విద్యార్థిలా వికసించింది నా మనసు. కొద్దికొద్దిగా ఆందోళన తగ్గసాగింది. అమ్మ చేస్తున్న ఆ వ్యక్తీకరణను అర్థం చేసుకోగలిగింది నేనొక్కడినే.

"బాగానే ఉందిలే" అని దానికి అర్థం. ఓ అరవై మార్కులు పడ్డట్టే.

"హుమ్మ్, బావుంది రా" తరువాత ముద్దతో కాస్త పిండి నాలికకి రాసుకుంటూ, పొద్దున్నే టీపాయ్ మీద ఉన్న దుమ్ము నేను సరిగ్గా తుడవలేదన్న కోపాన్ని కూడా మర్చిపోయి, చిరు మందహాసం చిలికించింది.

ఈ ఊరగాయకు నూటికి ఎనభై మార్కులు పడిపోయినట్టే. మరో ఇరవై మార్కులకు ఎంత కష్టపడినా ప్రయోజనం ఉండదు అని నాకు తెలుసు. కారణం, అది పెట్టినది రిజ్వానా. ఇస్లామ్ మతస్తురాలు. చిన్నప్పటినుండీ అమ్మ మడీ ఆచారాలు చూసి పెరిగిన నేను ఆ విషయం తెలిస్తే అమ్మ మూడో కన్ను తెరిచేస్తుందేమోనన్న భయంతో చెప్పలేదు. మరో మధురా ఫుడ్స్, లేక వెంకటేశ్వరా వెరైటీల నుండి కొనుగోలు చేసినవి అనుకుందేమో. గట్టిగా అడగలేదు.

'రిజ్జు' అని అమ్మ ముద్దుగా పిలిచుకునే రిజ్వానాని ఇంట్లో పిల్లగానే చూసినా, 'మడీ–దడీ' అంటూ ఆచారాలను వదులుకోలేని అమ్మ అమాంతంగా దాని చేతి మీదుగా తయారైన వస్తువు తినేంత ఎదగాలనుకోవడం కాస్త అత్యాశే. ఇల్లంతా స్వతంత్రంగా తిరిగిన రిజ్జుకి, అమ్మ సామ్రాజ్యమైన వంటింట్లోకి మాత్రం ఎప్పుడూ ప్రవేశం వుండేది కాదు.

పదమూడేళ్ళ పిల్లగా వున్నప్పటి నుంచి రిజ్వానా మా ఇంటికి వచ్చేది. చిన్నతనం నుంచీ పనికి వస్తున్న వాళ్ళమ్మ వెంట వస్తూ అలవాటు పడిన ఇల్లు మాది. ఇంట్లో పిల్లలా మెసిలేది. అమ్మ కూడా రిజ్జూ అంటూ ఆదరంగా మాట్లాడడమే కాదు, ఈ రోజు రిజ్జు నాలుగు అక్షరాలు నేర్చుకుందంటే అది అమ్మ చలవే. బడికి పంపించడానికి ఎంతగా చెప్పినా వీలుపడని పరిస్థితిలో, తన చేతను వున్నపనే కదా అని మధ్యాహ్నం వేళ దానికి చదువు చెప్పేది. మొత్తానికి రిజ్వానా ని అక్షరాస్యురాలు అనిపించే వరకూ ఊరుకోలేదు అమ్మ.

ఆ రోజుల్లో, మా తాతగారి తిథి వచ్చినప్పుడల్లా, వారం రోజుల పని వుండేది. క్రితం రోజు ఇల్లంతా కడిగేసి ప్రక్షాళన చేసేసేది అమ్మ. మహామడి కోసం జరిగే తయారీలు అన్నమాట. ఆ యజ్ఞంలో భాగంగా ఇల్లంతా కడిగేసేవారు అమ్మా రిజ్వానా. మధ్యాన్నం భోజనం వేళ వరకూ సరిపోయేవి పనులు. అమ్మ పెట్టిన అన్నమే తిని వెళ్ళేది రిజ్జు. వాళ్ళ ఇంట్లో మాంసాహారం

వండినప్పుడల్లా దాని భోజనం మా ఇంట్లోనే. అదేంవిటో అది అస్సలు మాంసాహారం తినేది కాదు. ఇంచుమించుగా మా చిన్న చెల్లాయి పెళ్ళైనప్పుడే దాని పెళ్లి కూడా అయిపోయింది.

ఏటికోసారో పుట్టింటికి వచ్చినప్పుడల్లా అమ్మను చూడడానికి తప్పకుండా వచ్చేది. ఏటేటా రిజ్జు వచ్చినప్పుడు దాని చదువులా వారి ఇద్దరి పిల్లల చదువులూ ఆగిపోకూడదని అమ్మ వారి చదువులకని డబ్బు ఇవ్వడం అలవాటు. క్రితంసారి వచ్చినప్పుడు మాత్రం మరుపూ చెరుపుగా వున్న అమ్మ మాటలు, మారిన స్వరూపాన్నీ చూసి బాధపడింది రిజ్జు. సరిగ్గా అప్పుడే అమ్మతో నాకు పెద్ద పోరాటం జరుగుతోంది. ఆ వేళ అన్నం తిననని భీష్మించుకు కూర్చుంది అమ్మ. కారణం, తనకు నచ్చిన నిమ్మకాయో, నారదబ్బకాయ ముక్కలో లేవు. ఎన్ని చోట్లనుండీ, ఎంత ధర ఇచ్చి కొన్నా అమ్మను తృప్తిపరిచేవి దొరకక ఆ ప్రయత్నంలో విఫలుడనయ్యాను.

"ఉన్నది వేసుకుని తినాలి కానీ రోజూ ఈ పేచీ ఏమిటమ్మా" మీద పడుతున్న వయసు, అసలే చిక్కి సగమవుతున్న అమ్మతో అన్నాను. బతిమాలి అమ్మను మాటల్లో పెట్టి అన్నం తినిపించడం మొదలు పెట్టాను. ఆమెకెంతో ఇష్టమైన రాజకీయ చర్చల్లోకి దింపాను.

మానసికంగా క్షీణిస్తున్న అమ్మకు రెండేళ్ళగా రాజకీయాల గురించి చెపుతూ వచ్చాను. అప్పటి నుంచి మెదడు మహా చురుకయ్యి రోజూ మూడు నాలుగు వార్తాపత్రికలు అవలీలగా చదివి పారేసేయడంతో మరచిపోతున్న మానసిక దుర్బలతో, ఆత్మన్యూనతాభావమో రాకుండా కాపాడగలిగాను.

కాకీ పిచుకా కథలు చెప్పి చంటి పిల్లలకు అన్నం పెట్టినట్టు, కొత్తగా మొదలైన యుక్రేయిన్ దేశ సమస్య గురించి చర్చ ఆరంభించాను.

సరిగ్గా అప్పుడే వచ్చిన రిజ్జు "అదేంటి అన్నయ్యా, అమ్మతో ఇంత పోరాడుతున్నారు? భోంచేయడానికి ఎందుకు ఇంత మారం చేస్తున్నారు. క్రితంసారి నేను వచ్చినప్పుడు బాగానే ఉన్నారుగా!!" ఆశ్చర్యంగా అడిగింది.

"ఏం చెప్పమంటావు రిజ్జూ, అమ్మ పెట్టిన ఊరగాయలు మనమంతా ఎన్నేళ్ళు తిన్నామూ. ఇప్పుడు పెరుగన్నంలోకి అలాంటి ఊరగాయ లేందే తినను అని మారం చేస్తోంది. ఓ పది నిమ్మకాయలతో బద్దలు వేసి ఇచ్చే నాధుడు లేడనుకో" నిష్టూరంగా కాకపోయినా జటిల సమస్యే అన్నట్టు చెప్పాను.

యుక్రెయిన్ మీద రష్యా చేస్తున్న దాడులూ, ఆ కారణాల విశ్లేషణంత జటిలమా ఈ సమస్య" అనలేదు కానీ. అనుకున్నట్టుగా ఆమె చూపే చెప్పింది. నా సమస్య అర్థమైంది కాబోలు. కిమ్మనక ఊరుకుంది.

మారాం చేస్తున్న అమ్మ, ఆ రోజు రిజ్జూని చూసి కూడా పట్టించుకోలేదు. ఎప్పుడూ లేంది అలా జరగడం రిజ్జు తో పాటు నాకూ బాధగానే అనిపించింది. అప్పటికే అమ్మ సరిగ్గా భోంచేసి రెండు రోజులైంది. ఇంక తప్పదు. అమ్మ దృష్టి మళ్లించాలని, రాత్రి మేమిద్దరమూ కలిసి చూసిన టీవీ వార్తల ప్రస్తావన తెచ్చాను. నెమ్మదిగా రష్యా దాడుల గురించి చెప్పడం మొదలెట్టాను.

"ఆ రష్యా వారు తూర్పుదిశగా వచ్చి యావత్ ఐరోపా ఖండాన్ని ఆక్రమించాలని ఆకాక్షిస్తున్నారు" అన్నాను.

"ఎందుకంటావు" ఆశ్చర్యంగా అడిగింది అమ్మ ముద్దను తింటూ.

అంతలోనే, రష్యా వారి ఆధీనంలో వున్న ఒక ఓడను, పద్నాలుగు మంది సిబ్బందితో సహా స్వాధీనం చేసుకున్నారన్న వార్త వింటూ అమ్మ అనుమానాలూ ప్రశ్నలూ మరింత పెరుగుతూ వెళ్ళాయి.

కుల మతాల యుద్ధాలు జరిగిన రోజులు ఎన్నో చూసాము. రాజ్యాలకోసం రక్తాలు కారాయి, అధికార దాహంతో మానవత్వం మరచిపోయిన రోజులూ అమ్మకు తెలియనివి కావు. కానీ ఈ రోజెందుకో అమ్మ నిశ్శబ్దంగా ఉండి పోయింది. ఏదో దీర్ఘాలోచనలతో వెళ్ళి పడుకుండిపోయింది.

★★★

"లయా, లయా" కేకలు వినిపించాయి. అర క్షణం కూడా దాటకుండా, 'ధం' అన్న చప్పుడు వినిపించింది. అమ్మ గదిలోకి గబగబా పరుగు తీసాను. లయ మా రెండో చెల్లాయి కూతురు. ఎక్కడో చదువుతోందని అప్పుడప్పుడూ గుర్తుకు తెచ్చుకున్నా, ఈ మధ్య కాలంలో ఆమె ఊసు ఎత్తలేదు అమ్మ. ఏదీ జ్ఞాపకం ఉండటంలేదు.

నేను వెళ్ళే సరికి కింద పడిపోయి, మంచాన్ని పట్టుకుని లేచే ప్రయత్నం చేస్తోంది. శరీరం సహకరించట్లేదు. అమ్మ ఒళ్ళంతా చెమటలు. నిలువెల్లా ఒణికిపోతోంది. శూన్యంలోకి చూస్తోంది.

"దేశం కాని దేశం! వణికించే, గడ్డ కట్టించే చలి. ఆపైన యుద్ధం! ఏ క్షణాన ఏ క్షిపణి మీద పడుతుందోనన్న భయం! ఎటు వైపు నుంచి ఏ బుల్లెట్ దూసుకొస్తుందోనన్న భీతి! క్షణం క్షణం, భయం భయం! స్థానికులనే దిక్కు తోచని స్థితిలో పడేసిన యుద్ధం! మరి... ఇక్కడ చదువుకోవడానికి వచ్చిన మా పరిస్థితి చాలా దయనీయంగా వుంది.

అమ్మమ్మా! యుద్ధాల సినిమాలు చాలా చూశాను. నిజమైన యుద్ధం ఎంత బీభత్సంగా ఉంటుందో, ఎంత భయ పెడుతుందో ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నాను. నాలుగు రోజుల నుంచీ నరకం చూస్తున్నాం. చెవులు దద్దరిల్లే శబ్దంతో యుద్ధ విమానాలు, బాంబుల మోత, ఎగసిపడే మంటలు! ఇవన్నీ ప్రత్యక్షంగా చూస్తున్నాం. భయమేస్తోంది. ఉక్రెయిన్‌లోని అన్ని ప్రధాన విమానాశ్రయాలను రష్యా స్వాధీనం చేసుకుంది. సెల్‌ఫోన్లకు మెసేజ్‌లు వచ్చాయి. సైరన్ ఒకసారి మోగితే బంకర్లలోకి వెళ్లి దాక్కోవాలని, రెండుసార్లు మోగితేనే బయటకు రావాలని ఇలా ప్రకటనల హోరు మొదలయ్యింది. ఒకవైపు యుద్ధం జరుగుతుండగానే... బంకర్ల నుంచి బయటికి వచ్చి, బస్సులు, రైళ్లు, కాలి నడక ద్వారా సరిహద్దులను చేరడమంటే ఆషామాషీ కాదు. బంకర్లలో తలదాచుకుని బయటకు రావడం ఒక ఘట్టం. అక్కడి నుంచి బస్సులు ఎక్కి సరిహద్దుల వరకు రావడం మరో ఘట్టం. ఉక్రెయిన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి పోలాండ్, హంగరీ, రుమేనియా సరిహద్దులకు విద్యార్థులు రైళ్లు, బస్సుల్లో చేరుతున్నారు.

అయితే ఆయా దేశాల సరిహద్దులకు పది కిలో మీటర్ల దూరంలోనే బస్సులను ఆపేస్తున్నారు. అక్కడి నుంచి వణికించే చలిలో సరిహద్దుల వరకు నడిచి వెళ్లాల్సివస్తోంది. ఇక్కడికి చేరుకున్న వెంటనే వారిని లోపలకు బలగాలు అనుమతించడం లేదు. రోజుకు 200 మందిని మాత్రమే సరిహద్దులు దాటిస్తున్నారు. కొద్దిరోజులుగా మంచు కురవడం ఎక్కువైంది. విమానాశ్రయాలకు, రైల్వే స్టేషన్లకు చేరుకున్న విద్యార్థులు ఆకలితో అలమటిస్తుంటే, సరిహద్దుల వద్ద ఆగిపోయిన వారు మాత్రం చలికి వణికిపోతున్నారు. యుద్ధంతో భయంతో మాత్రమే కాదు, ఆకలితోనూ, చలితోనూ కూడా.

అష్టకష్టాలు పడి, స్నేహితులందరమూ ఉక్రెయిన్ సరిహద్దులు దాటి, హంగరీకి కొందరూ, రుమేనియాకి కొందరూ చేరుకున్నాము. భారత్‌కు ఎప్పుడు పంపిస్తారో తెలియదు. ఇక్కడ ఎలాంటి సౌకర్యాలూ లేవు. నాలుగు రోజులుగా విమానాశ్రయానికి పది కిలోమీటర్ల దూరంలోని ఒక షెల్టర్‌లో ఉన్నాం. రెండు రోజుల నుంచి ఆహారం లేదు. మా వద్ద ఉన్న బిస్కెట్లు తిని బతుకుతున్నాం. ఏదైనా కొనుక్కుందామనుకుంటే బయటకు వెళ్లనివ్వడం లేదు. చనిపోతామేమో అనిపిస్తోంది. చాలా భయమేస్తోంది అమ్మమ్మా.

నీకో మాట చెప్పనా అమ్మమ్మా? మా ప్రాణాన్నీ మానాన్నీ కాపాడుతున్నది ఖలీఫ్ అనే ఒక ఎన్.జీ.ఓ సభ్యుడు. ఒక ప్రేలుడు తరువాత మూర్ఛబోయి పడివున్న నన్ను, బంకరులోకి తీసుకు వచ్చి, ఊపిరి పీల్చుకోడానికి ఇబ్బంది పడుతుండగా, కృత్రిమ పునరుజ్జీవనం ద్వారా ఊపిరితిత్తులలోకి ప్రాణవాయువుని ఊది నా ప్రాణాలను కాపాడడమే కాక, రోజుల తరబడి నీరూ, ఆహారం అందించి ప్రాణాలను కాపాడాడు. నేను నేడు ప్రాణాలతో ఉండడానికి ఖలీఫే కారణం అమ్మమ్మా"

★★★

ఉలిక్కి పడి లేచిన అమ్మకు ఖలీఫ్ అన్న పేరు పదే పదే గుర్తొచ్చింది. ఇప్పుడు లయ పేరుకు బదులుగా 'ఖలీఫ్' అనీ 'రిజ్జూ' అనీ అంటోంది.

అంతకు మునుపే ఇంటికి వచ్చిన రిజ్జు ఇదంతా చూస్తూ తన పేరును అప్రయత్నంగా పలుకుతున్న అమ్మనీ, అమ్మను ఊరడిల్ల ప్రయత్నం చేస్తున్న నన్నూ తదేకంగా చూస్తున్న రిజ్జు కళ్ళు చమర్చాయి. తాను తెచ్చిన ఊరగాయ నా చేతికిచ్చింది. ఇస్లాము మతానికి చెందిన రిజ్జూ చేతి ఊరగాయ రుచిలోనైతే అమ్మ చేతి ఊరగాయలానే ఉంటుంది. కానీ, ఇరవై మార్కులూ అమ్మతో వేయించుకునే అర్హతను మాత్రం ఎన్నడూ పొందలేదు. అన్ని విషయాల్లో ప్రగతిశీల భావాలు గల అమ్మ కొద్దినెలలుగా తాను ఇష్టంగా తింటున్న నిమ్మకాయ రిజ్జు చేతులతో పెట్టినదే అని తెలిస్తే అంగీకరిస్తుందో లేదోనని భయపడుతూనే పెట్టాను. తింటేనే చాలని ఎప్పటికప్పుడు ఆ మాట దాచేసాను.

"రిజ్జూ, నీ చేత్తో కాస్త అన్నం ఒండి పెట్టవూ. ఆకలేస్తోంది. నీ కొడుకు పేరూ ఖలీఫే కదూ?" ఆర్తిగా అంది అమ్మ.

"అంత కంటే భాగ్యమేముందమ్మా" అమ్మ మాటలకు అర్థం తెలియకపోయినా ఆనంద భాష్పాలతో చమరుస్తున్న కళ్ళు తుడుచుకుంటూ రిజ్జూ అంటుండగా ఆమెను అక్కున చేర్చుకుంది అమ్మ.

నూటికి నూటపది మార్కులు పడిపోయాయి రిజ్వానా నిమ్మకాయ ఊరగాయకు.

# సహజరంగుల ప్రకాశం

దేవులపల్లి దుర్గాప్రసాద్

“హనుమాన్ షూ మార్టు” లో ప్రవేశించి ప్రొప్రైటర్ హుమాయూన్ గదిలో అతని కోసం నిరీక్షిస్తున్నాడు రవి. ఆ గదిలో పెద్ద టేబులు, దాని వెనక స్ప్రింగ్ ఛైరూ ఉన్నాయి. ముందు ఒక సోఫా, రెండు కుషన్ కుర్చీలు ఉన్నాయి. వాటి మధ్యలో టీపాయ్ ఉంది. సేల్స్ మేన్ టీ పట్టుకొచ్చి ఇచ్చాడు.

సోఫాలో కూర్చుని టీ తాగుతూ ఆ గదంతా పరికించి చూస్తున్నాడు రవి. స్ప్రింగ్ ఛైర్ వెనకాతల ఉర్దూలో రాసి ఉన్న ఖురాన్ వాక్యాలు పటం కట్టించి, గోడకి తగిలించి ఉన్నాయి. దానికెదురుగా గోడ వైపు చూసి, ఒక్కసారి ఆశ్చర్య పోయి, తదేకంగా అటే చూస్తూ ఉండిపోయాడు.

అక్కడ గోడకి పెద్ద శ్రీరామపట్టాభిషేకం పెయింటింగు తగిలించి ఉంది. ఎంతో ఆకర్షణీయంగా ఉంది ఆ చిత్రం. చుట్టూ టేకు ఫ్రేము ఉంది కానీ, మధ్యలో గ్లాస్ కానీ, లేమినేషన్ గానీ లేదు. రంగులు ఎంతో ప్రకాశవంతంగా ఉన్నాయి.

“ఆ రవి బేటా ఎలావున్నావ్?” అంటూ గదిలోకి బ్రౌన్ సఫారీ సూటు వేసుకున్న ఒక పెద్దాయన లోపలికి వచ్చాడు. ముందే ఫోన్లు, ఫొటోలతో సహా ఇద్దరి సమాచారం ఇద్దరి వద్ద ఉండడంతో ఒకరినొకరు పోల్చుకున్నారు.



టీకప్పు టీపాయ్ మీద పెట్టి లేచి నిల్చున్నాడు రవి. దగ్గరకొచ్చి రవిని గాఢంగా హత్తుకుని వీపు మీద నిమురుతూ కాస్సేపు ఉండిపోయాడు హుమాయూన్. ఆ తరువాత వెళ్ళి తన సీటులో కూర్చున్నాడు.

“మీ అమ్మా, నాన్న ఎలా ఉన్నారు? మీ మావయ్య, మా దోస్తు, మూర్తి ఎలా ఉన్నాడు? తన పిల్లలు ఎక్కడ ఉన్నారు?” అని ప్రశ్నలు గుప్పించేసాడు హుమాయూన్.

“అమ్మ నాన్నగారూ బాగున్నారు. వాళ్ళు ప్రస్తుతం స్టేట్సులో మా అన్నయ్య దగ్గిర ఉన్నారు. మూర్తి మావయ్య యు.కె.లో డాక్టర్ గా ఉన్నాడు. తనకి ఇద్దరు పిల్లలు. పెద్దవాడు ప్రకాష్ యు.కె. లోనే ప్రొఫెసర్. కూతురు మాధవి మెహర్. అక్కడే ఫైనార్ట్సులో డిగ్రీ చేస్తోంది. నేను బెంగళూర్లో ఎం.బి.ఏ చేస్తున్నాను. అందులో ఒక ప్రోజెక్టుగా మీ హనుమాన్ షూ మార్టు చైన్ ఆఫ్ షాప్స్ గురించి స్టడీ చేద్దామని వచ్చాను.” అని ఆగాడు.

“ఓహో! అంత పెద్దవాళ్ళయారా మూర్తి పిల్లలు? మూర్తి కూతురి పేరు ఏమిటన్నావ్, మాధవి మెహెర్? ఓహ్!” అని కాస్సేపు ఆగిపోయాడు ఏదో ఆలోచిస్తూ. చెమ్మగిల్లిన కళ్ళను తుడుచుకుంటూ అడిగాడు “మీ అమ్మ పార్వతికి అప్పుడేదో ఆరోగ్యం బాలేదన్నారు, ఇప్పుడెలా ఉంది?”

“ఇప్పుడు బానే ఉంది అంకుల్.” చెప్పాడు రవి.

"మీ తాతగారు చనిపోయినప్పుడు సుమారు పదేళ్ళక్రితం అనుకుంటా చూసాను మా మూర్తిని, మీ అమ్మని." అని ఏదో గుర్తుకు తెచ్చుకుంటూ "అది సరే, దేశంలో ఎన్నో కంపెనీలు ఉండగా మా కంపెనీనే ఎందుకెంచుకున్నావ్?" అడిగాడు హుమాయూన్ నవ్వుతూ.

"అతి చిన్న చెప్పుల దుకాణంగా మొదలై, ఇపుడు ఇండియా మొత్తం 120 బ్రాంచీలతో డెవెలప్ అయిన సంస్థ, అదీ ఒక్క నలభై ఏళ్ళ కాలంలో మీ హనుమాన్ షూమార్టే అంకుల్. ఇంత ఫాస్ట్ గ్రోత్ చూపించిన సంస్థ మరొకటి లేదు. అది మొదటి కారణమైతే, మీరు మా కుటుంబానికి చాలా కావాల్సిన వారని అమ్మ, మావయ్య చెప్పడం రెండో కారణం" చెప్పాడు రవి.

"మీ మావయ్య, అమ్మా నా గురించి చెప్తుంటారా ?" ఆసక్తిగా అడిగాడు.

"ఆ! చాలా సార్లు. మీ చిన్నప్పటి సంగతులు, మీరు మావయ్య తిరిగిన విషయాలు ఎన్నో చెప్తుంటారు. ఎప్పటికప్పుడు ఇక్కడకి వద్దామని ప్లాన్లు వేస్తుంటారు. కానీ కుదరదు వాళ్ళకి"

"అంతేలే. అల్లా ఎవరికి ఏది ప్రాప్తమో అది ముందే రాసి ఉంచేస్తాడు." అని నిర్వేదంగా అని, "సరే బేటా. నువ్వు మా అబ్బాయి సయ్యద్ని కలువు. వాడు నీకు అన్నీ అర్ధమయేలా చెప్తాడు. వాడు ఈ పక్క గదిలోనే ఉంటాడు." అని రవిని సయ్యద్ దగ్గరికి తీసుకెళ్ళాడు హుమాయూన్.

తిరిగి వచ్చి తన కుర్చీలో కూలబడ్డాడు హుమయూన్. ఎదురుగా ఉన్న శ్రీరామ పట్టాభిషేకం చిత్రపటాన్ని చూస్తూ రవి రాకతో వికసించిన కమలంలా అయిన తన మదిపై ఝుమ్మని తిరుగుతున్న చిన్నప్పటి జ్ఞాపకాల తుమ్మెదల రొదలో మునిగిపోయాడు.

★★★

సులేమాన్ ఆ ఊరికి కట్టుబట్టలతో, కట్టుకున్న భార్యతో, కన్నబిడ్డలు హుమయూన్, మెహరున్నీసాతో వచ్చాడు. ఆ ఊరు అతనికి కొత్త. అక్కడ మరో ముస్లిం కుటుంబం కూడా లేదు. ఆశ్రయం కోసం ఎవరిని అడగాలో తెలియని పరిస్థితిలో, ఎవరో ప్రకాశశర్మ గారిని కలవమని చెప్పారు.

ఎన్నో విషయాల్లో ఊరి బాగోగులు చూసి నేర్పుతో మాట్లాడి, అందరినీ ఒప్పించే ప్రకాశశర్మ అంటే ఆ ఊరివారందరికీ గౌరవ భావం. అతను కేవలం పంచాగం, ముహుర్తాలు చెప్పే పంతులుగారే కాదు వాళ్ళకి, వాళ్ళ ఆత్మ బంధువు కూడా. ఆయుర్వేద వైద్యం, జ్యోతిష్యం నేర్చిన పండితుడతను. అంతకు మించిన మానవతా వాది.

తనని కలిసిన సులేమాన్ని కూలంకషంగా ప్రశ్నలతో శోధించి, అతని నేపథ్యాన్ని తెలుసుకున్నాడు ప్రకాశశర్మ. అతని దృక్పథాన్ని అంచనావేసిన తరువాత, అతని నిస్సహాయ స్థితి చూసి జాలిపడి, ఆ ఊరి పెద్ద మనుషులతో మాట్లాడి ఆశ్రయం కల్పించాడు.

అప్పటికే ఊరి సెంటర్లో చెప్పులు కుడుతూ జీవనం సాగిస్తున్న బైరాగి షాపుకి దూరంగా సులేమాన్ చెప్పుల షాపుండేలా ఊరి పెద్దమనుషులతో ఏర్పాటు చేయించాడు. తద్వారా ఇతని వలన బైరాగి నష్టపోకుండా చూసాడు.

పల్లె నుండి పట్నంగా రూపాంతరం చెందుతున్న ఆ మాధవపురంలో సులేమాన్ కూడా పనిమీద శ్రద్ధతో, నైపుణ్యంతో, నమ్మకంతో తన వ్యాపారంలో నిలదొక్కుకున్నాడు.

తన కొడుకు హుమయూన్ని కూడా తన పనిలోనే పెట్టాడు తొలుత. కానీ ప్రకాశశర్మ, "చదువు చిన్న వయసులోనే నేర్చుకోవాలి. వాడికీ, నీకు అంత ఓపిక ఉంటే చదువుతో పాటు నీ పని కూడా నేర్పించు. కాని చదువు లేకుండా కాదు. చదువంటే సర్టిఫికేట్ కోసమే కాదు. జ్ఞానం కోసం, సంస్కారం కోసం." అని దెబ్బలాడి హుమయూన్ని స్కూల్లో వేయించాడు.

సులేమాన్నే కాదు ఆ ఊరిలో చాలామంది ఇలా తమ పిల్లల్ని చదువులో పెట్టని తల్లిదండ్రులని దెబ్బలాడి వాళ్ళ పిల్లల్ని స్కూళ్ళకి వెళ్ళేలా చేసాడు ప్రకాశశర్మ.

తల్లిదండ్రులు చిన్నప్పుడే చనిపోవడంతో ఇంటికి పెద్దకొడుకైన ప్రకాశశర్మ, తమకున్న పది ఎకరాల పొలం, మావిడి తోట, కొబ్బరి తోటల మీద వచ్చే ఫలసాయంతో, తన తమ్ముళ్ళిద్దరినీ, చెల్లెళ్లిద్దరినీ చదివించి, పెళ్ళిళ్ళు చేసి తనకి ముప్పై ఏళ్ళు వచ్చాక పెళ్ళి చేసుకున్నాడు. తనకి ఇద్దరు పిల్లలు. పెద్దపిల్ల పార్వతి. రెండోవాడు రమణ మూర్తి.

హుమయూన్,మూర్తి సహాధ్యాయులయారు.వాళ్ళు ఎనిమిదవ తరగతిలో ఉన్నపుడు మూర్తి అక్క పార్వతి,పదవతరగతిలోనూ, హుమయూన్ చెల్లి మెహరున్నీసా ఆరవ తరగతిలోనూ ఉండేవారు.

★★★

మూర్తి వాళ్ళది విశాలమైన ఆవరణతో గల పెద్ద పెంకుటిల్లు. ఒకరోజు రాత్రి ఎనిమిది గంటల వేళ ముందు గేటు తీసుకుని హుమయూన్ లోపలికి వెళ్ళాడు. ఎత్తరుగుల ఆ పెంకుటింటి గుమ్మాన్ని ఆనుకుని రెండు వైపులా విస్తరించిన పెద్ద వరండా ఉంది. వరండాలో అటూ ఇటూ రెండు ట్యూబ్ లైట్లు వెలుగుతున్నాయి. కుడి వైపు లైటు కింద పడకకుర్చీలో కూర్చుని ప్రకాశశర్మ పంచాంగం చూసుకుంటున్నాడు. గేటు చప్పుడవడంతో తలెత్తి పైకి చూసాడు.

"ఓ! నువ్వటోయ్ హనుమానూ!" అని నవ్వుతూ పలకరించాడు. ఆ పలకరింపుకే నవ్వేసాడు హుమయూన్.

"ఒరేయ్ మూర్తీ మీ దోస్త్ వచ్చాడ్రా!" అని లోపలి వైపు తిరిగి కేకేసాడు.

ఆ ఎత్తరుగుల ఇంటి గుమ్మం దగ్గరున్న మూడు మెట్లు ఎక్కి, ద్వారానికి మరో మూడు మెట్ల దూరంలో నిలబడ్డాడు. అక్కడే ప్రకాశశర్మ కూర్చున్న వెనకన గోడకి తగిలించి ఉన్న ఐదడుగుల పెద్ద శ్రీరామ పట్టాభిషేకం ఫోటో చూస్తూ ఉన్నాడు. అందులో దేవతా మూర్తులని ఎన్ని సార్లు చూసినా ఇంకా ఆకర్షణగానే ఉంటుంది. సహజంగా చిత్రకారుడైన హుమయూన్ని ఆ చిత్రం మరింత ఆకర్షించింది. "లోపలికి వెళ్ళవోయ్" అని, ఆ ఫొటో చూస్తున్న హుమాయూన్ వైపు తిరిగి "నువ్వా బొమ్మాలు బాగా వేస్తావుట కదా! మరి ఇంత పెద్ద బొమ్మ వెయ్యగలవా?" అడిగాడు.

"గోడకి ఎత్తులో ఉంది కదండీ. దించితే దగ్గరగా చూసి బాగా వెయ్యగలనండీ" అన్నాడు హుమయూన్.

"అబ్బో అది దించడం నీవల్లా నావల్లా కాదు. దానిలోని బొమ్మే 4 అడుగులు పొడవు, 3 అడుగులు వెడల్పు. ఇంక దాని చుట్టూ ఉన్న ఫ్రేము టేకుతో చేసినది కావడం వలన మరింత బరువు."

"మరి దీనికి గ్లాస్ వెయ్యలేదేమండీ?"

"అది సహజమైన రంగులతో చిత్రించినది. దానికి గ్లాస్ వేస్తే ఆ అందముండదు. అప్పుడప్పుడు పైపైన గుడ్డతో దుమ్ము దులిపితే సరి, మెరిసిపోతుంది. కానీ దీనికి తడి తగిలితే పాడయిపోతుంది. మా నాన్నగారికి అప్పట్లో ఎవరో బహుమానంగా ఇచ్చారు. చూసావా ఇప్పటికీ ఎంత బాగుందో. నువ్వు కూడా అలా ప్రకృతి సిద్ధమైన రంగులు వాడడం నేర్చుకో. చాలా బాగుంటాయి."

"అలాగేనండీ"

ఇంతలో మూర్తి లోపట్నుంచి పరిగెత్తుకు వచ్చాడు. "ఏంట్రా హుమా, ఏంటి కావాలి?"

"మా అమ్మగారికి బాగా దగ్గుగా ఉందిరా. మీ ఇంటి నుంచి రెండు కరక్కాయలు తీసుకురమ్మన్నారు మా నాన్నగారు"

"ఉండయితే తెస్తాను" అని లోపలికి పరిగెత్తుతున్న మూర్తితో, "ఒరేయ్, అలాగే ఆ దగ్గు మందు సిరప్ కూడా ఇవ్వు." అన్నాడు ప్రకాశశర్మ.

"వద్దండీ. మా నాన్నగారు కరక్కాయిలే తెమ్మన్నారు."

"తీసుకెళ్ళవోయ్ హనుమానూ! కరక్కాయ్ ముక్క నమిలితే కఫం కరుగుతుంది. సిరప్ తాగితే నిద్ర పడుతుంది. అలా రెండు విధాలా దగ్గు తగ్గుతుంది."

మూర్తి కరక్కాయిలూ, సిరప్ సీసా రెండూ తెచ్చి హుమయూన్కి ఇచ్చాడు. శర్మ వైపు చూసి తలవంచి నమస్కరిస్తూ మూర్తి వైపు తిరిగి "వస్తాన్రా" అని వెళ్ళాడు హుమయూన్. తనతో పాటు మూర్తి గేటు వరకు వెళ్ళాడు.

★★★

హుమయూను పదవ తరగతి చదివేటప్పుడు ఒకసారి భయంకరమైన తుఫాన్ వచ్చింది. వారంరోజుల పాటు ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు పడ్డాయి. దాంతో ఆ ఊరికి పక్కగా పారుతున్న గున్నేరుకి అకస్మాత్తుగా వరదలు వచ్చేసాయి.

ఉగ్రరూపంతో ఉరకలెత్తుతూ గున్నేరు ఊర్లోకి పొంగుకొచ్చింది. పూరిపాకలే కాదు చాలా పెంకుటిళ్ళు కూడా ఆ వరద నీటికి గోడలు పగిలిపోయి కూలిపోయాయి.

అందుకు ప్రకాశశర్మ ఇల్లు కూడా మినహాయింపు కాదు. చుట్టూ ప్రహారీతో సహా ముందు వరండా, వాటా అంతా కూలిపోయి వరదలో కలిసిపోయింది. వెనక వాటాలో గదులు నిలబడ్డాయి. వాటిల్లోనే తలదాచుకున్నారు ఆ నలుగురూ. వరండాలో ఉన్న శ్రీరామ పట్టాభిషేకం పటం కింద పడిపోతే పటానికి నీరు తగలకుండా, అతి కష్టమ్మీద తమ దగ్గరికి లాక్కుని, వెనక వాటా అరుగు మీద ఉంచారు. చుట్టూ ఎటు చూసినా జల ప్రవాహం.

అలా వరద ఉధృతి కొనసాగుతున్న ఒకనాటి పొద్దున్న ప్రకాశశర్మ కుటుంబానికి దూరంగా నీళ్ళల్లో కొట్టుకుపోతున్న హుమాయూన్ కనిపించాడు. హుమాయూన్ అప్పటికీ ఏదో ఒక ఆధారం వైపు ఈదుతున్నాడు కాని, తన శక్తి చాలట్లేదు. వెంటనే ప్రకాశశర్మ శ్రీరామ పట్టాభిషేకం పటం నీళ్ళల్లో వేసి దానిని తోసుకుంటూ హుమాయూన్ వైపు ఈదుతూ వెళ్ళాడు.

తన వైపు వస్తున్న సాయాన్ని చూసి హుమయూన్కి ధైర్యం చిక్కి, మరింత బలంగా శర్మ వైపు ఈదసాగాడు. ప్రకాశశర్మ హుమాయూన్ వైపు వెళ్తున్న కొద్దీ ప్రవాహ ఉధృతి పెరిగిపోతోంది. హుమయూన్కి కొద్ది దూరం నుండే ఆ పటాన్ని బలంగా హుమయూన్ వైపు తోసాడు శర్మ. పది నిమిషాల పెనుగులాట తరువాత, హుమయూను ఆ చిత్రపటం పట్టుకున్నాడు.

దాని ఆధారంతో ప్రకాశశర్మ ఇంటివైపు ఈదుకుని వచ్చాడు. ఇంట్లోకి వచ్చిన హుమాయూన్కి పొడి బట్టలు, వేడి జావ ఇచ్చి సాంత్వన పరిచారు. మీ అమ్మా, నాన్నా ఏమయ్యారంటే బిక్క మొహం వేశాడు హుమాయూన్. తమ ఇంట్లోకి వరద వచ్చేయడంతో దగ్గర్లో ఉన్న డాబా ఇంటి వైపు తాము వెళుతుండగా, తన చెల్లి మెహరున్నీసా జారిపోయి ప్రవాహంలో పడిపోయిందనీ, చెల్లిని వెతుకుతూ తండ్రీ, తనూ ప్రవాహంలో ఈదుకుంటూ వెళ్ళామనీ, తనేమో ఇలా కొట్టుకొచ్చేసాననీ ఏడుస్తూ చెప్పాడు హుమాయూన్. అందరూ క్షేమంగా ఉంటారులే అని ఆ నలుగురూ ధైర్యం చెప్పారు.

వరద తగ్గుముఖం పట్టే వరకు రెండురోజుల పాటు హుమయూన్ ప్రకాశశర్మ ఇంట్లోనే ఉన్నాడు. తరువాత తన ఇంటికి వెళ్ళాడు. వరద తగ్గి, నీరంతా తీసేసిన వారంరోజుల తరువాత ఒకరోజు మూర్తి ఏడుస్తూ ఇంటికి వచ్చాడు. "ఏమైందిరా?" అని ఆతృతగా అడిగారు ఇంట్లోవారు.

"మెహరున్నీసా చచ్చిపోయిందిట. వరదలో మునిగిపోయిందట" అని ఏడుస్తూ చెప్తున్నాడు.

★★★

గిర్రున తిరిగే కాలచక్రభ్రమణపు వేగానికి మనుషులు ఎక్కడెక్కడికో విసిరివేయబడుతున్నారు. పార్వతి, మూర్తుల పై చదువులకి పట్నం వచ్చేయమని తమ్ముళ్ళూ, చెల్లెళ్ళూ పట్టుబట్టడంతో, వ్యవసాయాన్ని కౌలుకి ఇచ్చేసి ప్రకాశశర్మ కాపురాన్ని పట్నానికి మార్చేసాడు.

ఇక అక్కడినుండీ చదువుల పేరుతో ఎగిరే పక్షులకు ప్రపంచమే ఒక విహార వనమయింది. రాష్ట్రాల, దేశాల సరిహద్దులను అంచలంచెలుగా దాటిపోసాగారు.

మొహరున్నీసా మరణం హుమాయూన్లోనూ, మూర్తిలోనూ జీవితం పట్ల ఒక గాంభీర్యతని తెచ్చిపెట్టింది. ఆ ఏకాగ్రతని మూర్తి

చదువులో చూపిస్తే, హుమాయూన్ తన వ్యాపారంలో చూపించాడు. ఇద్దరూ ఉన్నత శిఖరాలు అందుకున్నారు తమ తమ రంగాలలో.

తన ప్రాణాన్ని రక్షించిన ఆ శ్రీరామ పట్టాభిషేక చిత్రపటాన్ని ప్రకాశశర్మ వాళ్ళు పట్నం వెళ్ళేముందు అడిగి తెచ్చుకున్నాడు హుమయూన్. నీరు తగిలి పాడయిపోయినా ఇంకా కొంత మిగిలిన చిత్రాన్ని చూసి అలాంటిదే మరొక శ్రీరామ పట్టాభిషేక పటాన్ని చిత్రించాడు సహజమైన రంగులతో. దాన్నే తన గదిలో పెట్టుకున్నాడు.

వరదలు వచ్చి తగ్గిన ఒక నెలరోజులకి తన తండ్రికి, ప్రకాశశర్మకి మధ్య జరిగిన సంభాషణ హుమయూన్ మదిలో చెరగని ముద్ర వేసింది. "అయ్యా, మావోడి పేనాలు దక్కాయంటే మీరు, ఆ రాములోరి పటమే కారణం. నేకపోతే ఈడు కూడా దక్కకపోను. మావోడికి మీరన్నా, మీ దేవుళ్ళన్నా సానా ఇష్టమండీ. మేవు మతం మారిపోతామండీ. మీ మతంలోకి వచ్చేస్తాము."అన్నాడు ఉద్వేగంగా సులేమాన్, పక్కనే ఉన్న హుమయూన్ తల నిమురుతూ.

"ఆవేశపడకు సులేమాన్. ఆలోచించి నిర్ణయం తీసుకో. నీ మతం నీకు పూర్వీకులనుండి వచ్చినది. నువ్విపుడు ఏవో క్షణికావేశాలకి లోనయి మతం మార్చేసుకుంటే, మీ పెద్దవాళ్ళకి నువ్వు ద్రోహం చేసినట్లే. ఆపదలో అందిన సాయం నువ్వు నమ్మిన దేవుడే పంపించాడనుకో. ఆ సమయానికి పెద్ద దుంగ కానీ, పెద్ద చెట్టు కానీ సాయంగా వస్తే మరే మతంలోకి మారతావ్? ఇలా లౌకికమైన కోర్కెల కోసం, ఆకర్షణలకు, ప్రలోభాలకు లోబడి, మన తరతరాలనుండి ఆరాధిస్తున్న దేవుళ్ళను మార్చేయకూడదయ్యా. ఆపైన నీ ఇష్టం." అని ప్రకాశ శర్మ హితవు చెప్పాడు. తర్వాత ఎపుడూ సులేమాన్ మతం మారుదామనుకోలేదు.

ప్రకాశ శర్మ తరచూ చెప్తుండేవాడు "జీవితంలో వీలైనంతవరకూ సహజంగా ఉండాలయ్యా. మనకేది సహజంగా వస్తే అదే చెయ్యాలి. మాట్లాడాలి. అపుడు ఎంతో ప్రకాశవంతంగా ఉంటుంది మన జీవితం కూడా, సహజమైన రంగులు వాడి గీసిన ఈ బొమ్మలాగే" అని.

ప్రకాశ శర్మ మీది అభిమానంతో అతను, తనను సరదాగ పిలిచే "హనుమానూ" అన్నదే తన షాప్ పేరుగా పెట్టుకున్నాడు హుమాయూన్. మెహరున్నీసా మీద ప్రేమతో తన కూతురికి 'మాధవి మెహర్' అని పేరు పెట్టాడు మూర్తి.

మనసులు కలిసిన మనుషుల మమతల స్నేహపు కాంతులు ఎంత దూరంలో ఉన్నా ఒకదానినొకటి చూస్తుంటాయి. వాటిని ఏ మత, ప్రాంత బేధాలూ ఆపలేవు. సమాజంలో చైతన్యం నింపేవీ, నిలిపేవీ ఇలాంటి మనసులు కలసిన అనుబంధాలే.

ఇంతలో సయ్యదూ, రవి నవ్వుకుంటూ గదిలోకి రావడంతో తన గతస్మృతుల వీధుల్లోంచి ప్రస్తుతానికి వచ్చి పడ్డాడు హుమాయూన్, వారి నవ్వుతో తనూ శ్రుతి కలుపుతూ.

# శిశిరాన్ని వెన్నంటిన వసంతం




**రేణుక జలదంకి**

భళ్ళుమని వంటింట్లో గిన్నెలు క్రింద పడిన చప్పుడుకు గబుక్కున మేలుకున్నాను. ఉదయం ఎనిమిదయింది. సూర్యుడి తీక్షణమైన కిరణాలు కిటికీ అద్దాలగుండా లోపలకు ప్రసరిస్తూ, నులివెచ్చగా నా చెంపలను తాకుతున్నాయి. ఆఫీసు సమయమవుతూ వున్నప్పటికీ లేచేందుకు మనస్కరించక అలాగే పడుకుని వున్నాను.

"నవీన్! ప్రియా! ముందు త్వరగా హోంవర్క్ చేసి తెములుతారా? నన్ను వచ్చి నాలుగు వడ్డించమంటారా?" వంటింట్లోనుంచి నా శ్రీమతి స్వాతి స్వరం గట్టిగా, కోపంగా వినిపిస్తోంది.

పనిమనిషి ఇవాళ కూడా డుమ్మా కొట్టిందని నాకు అర్థమైంది. చకచకా లేచి బెడ్ షీటు మడత పెట్టి, ప్రక్క సరిగా సర్దాను. పనిమనిషి రాని రోజులలో ఇలాటి జాగ్రత్తలు తీసుకోకపోతే వచ్చే పర్యవసానాలు ఏమిటో నాకు బాగా తెలుసు. ఆఫీసు టైమయ్యేలోపు కాస్తో, కూస్తో పనులలో కూడా పాలు పంచుకోక తప్పదని తెలుసు.

కాఫీ కోసం లాగేస్తున్న మనసును సముదాయిస్తూ బ్రష్ తీసుకుని, స్నానాలగదికి వెళ్లాను. స్నానం చేసి తీరికగా తయారై, వంటింటి దగ్గరకు వచ్చాను.

"వచ్చారా? అప్పుడే రెడీ అయ్యారా? నేను క్యారియర్ రెడీ చేయలేదండీ! టిఫిను అయింది. తినేసి వెళ్లండి."



"అలాగే! ఏంటి? ఇవాళ కూడా గంగమ్మ రాలేదా?" పరామర్శగా పలకరించాను. నిజమే! ఇల్లాళ్లకు వారి దృష్టిలో పనిమనిషి రాకపోవడం కంటే పెద్ద కష్టం ఉండదు.

"రాలేదు! చూడండి! ఒక్కరోజు రాకపోతే సర్దుకుంటాను కానీ తర్వాత రోజు తప్పనిసరిగా రావాలని దానికి ఎన్నోసార్లు చెప్పాను. అయినా దాని పద్ధతే మారడం లేదు. వరసగా రెండు రోజులు సెలవు పెడుతుంది. ఇలా చేయడం ఇది నాలుగోసారి. ఇక భరించడం నా వల్ల కాదు. రేపు వస్తే మానెయ్యమని చెప్పేస్తాను." స్వాతి కోపంతో గుక్క తిప్పుకోకుండా అంది.

"మరి! పనిమనిషి లేకుండా చేసుకోగలవా?" ప్రశ్నార్థకంగా ముఖం పెట్టి అడిగాను.

"పక్కింట్లో పనిచేసే శంకరమ్మ బాగా చేస్తుందట. నాగాలు కూడా పెట్టదట. అడుగుతాను చేస్తుందేమో!"

"అయినా సంవత్సరంలో నలుగురు పనిమనుషులను మార్చావు స్వాతీ!" గుర్తు చేశాను.

"ఏం చేయమంటారు చెప్పండి? వాళ్లు సరిగా వుంటే నేనెందుకు మానెయ్యమంటాను?"

"మనం ఈ ఇంట్లో చేరిన కొత్తలో చేరిన మరియమ్మను ఎందుకు మాన్పించావు చెప్పు?"

"ఆదివారం అంటే చాలు చర్చికి వెళ్లాలనో, ఏదో ఒక సాకు చెప్పి సెలవు పెడుతుంది. ఆ రోజే కదా పిల్లలు, మీరూ ఇంట్లో వుండి పని ఎక్కువగా వుంటుంది. ఆ రోజే మానేస్తే ఎలా? అందుకే....!"

"సరే! ఆ తర్వాత రమణమ్మను ఎందుకు మాన్పించావు?" నేను కూడా ఎందుకో ఆఫీసు మరచిపోయి ప్రశ్నల మీద ప్రశ్నలు గుప్పిస్తూ నిలుచున్నాను.

"ఎన్నిసార్లు చెప్పినా గిన్నెల మీద సబ్బు పోయేట్లు కడగకపోతే ఏం చేయను చెప్పండి? చెప్పి చెప్పి నోరు పోయేది కానీ వినదే?"

"తర్వాత వచ్చిన లలితను ఎందుకు మాన్పించావు?" పట్టువదలని విక్రమార్కుడని నాలాటి వారిని చూసే అంటారనుకుంటా!

"ఉదయాన్నే రమ్మంటే రాదే! వస్తే తెల్లవారు ఝామున నాలుగింటికి వస్తానంటుంది. లేకపోతే పన్నెండింటికి వస్తుందట. ఎలా చెప్పండి?"

నా ప్రతి ప్రశ్నకు శ్రీమతి దగ్గర సమాధానాలు వుండడం చూసి, ఇక నా సమయం వృధా అవుతుందనిపించి, చకచకా టిఫిను చేసి బ్యాగు తీసుకుని ఆఫీసుకు పరుగులు తీశాను.

★★★

కారులో వెళ్తూ అమ్మకు ఫోను చేశాను. ఎలా వున్నావని అడగగానే, "నాకేంట్రా? బ్రహ్మాండంగా వున్నాను. నా దిగులంతా మీ గురించే! టైముకు తింటున్నారో, లేదో! పిల్లలు ఎలా వున్నారో! ఇంతకు మించి వేరే దిగులేముంటుంది చెప్పు!" అంది.

కాసేపు మాట్లాడి ఫోను పెట్టేశాక, ఎందుకో ఆలోచనలన్నీ అమ్మ మీదకు వెళ్లాయి.

ఓ ఆరునెలల క్రితం నాన్న చనిపోయిన తర్వాత అమ్మ ఒక్కత్తీ ఆ పల్లెటూరులో వుండడం ఇష్టం లేక అమ్మను బెంగుళూరుకు తీసుకువచ్చేశాను. ఓ నెలరోజుల పాటు సంతోషంగానే గడిచింది. ఆ తర్వాత ఎదురైంది నాకు క్రొత్త సమస్య!

"అత్తయ్య పిల్లల బట్టలు మన అందరి బట్టలతో కలిపి వాషింగ్ మెషీనులో వేస్తున్నారండీ! అలా వేయకండి అత్తయ్యా! అంటే, 'ఏమైందే! మనకేమైనా అంటు రోగాలున్నాయా?' అంటోంది."

స్వాతి నేను ఇంటికి రాగానే కంప్లైంట్!

"ఆ పని నువ్వే చేయవచ్చు కదా స్వాతీ...! అమ్మకు ఎందుకు చెప్పడం?" అనేవాడిని.

"ఇంట్లో తలో పనీ చేసుకోకపోతే ఎలా చెప్పండి?" మూతి విరిచేది.

"పిల్లలకు సాయంత్రం వడలు, బోండాలు, బజ్జీలు చేసి పెడుతోంది. నూనె వస్తువులు పిల్లలు ఎక్కువ తినకూడదు అత్తయ్యా, అంటే పిల్లలు ఇష్టపడేవి పెట్టకుండా, నీకు నచ్చినవి పెట్టి వాళ్లు తినలేదంటావేమిటే? అంటోంది." మరో రోజు ఫిర్యాదు.

"వాళ్లు తినేవేవో ఆరోగ్యకరమైనవి నువ్వే చేసిపెట్టు స్వాతీ! అమ్మకు ఈ వయసులో ఎందుకు శ్రమ...?" నా సెటిల్మెంట్!

"పిల్లలు అత్తయ్య మాటలు విని నన్ను అసలు లెక్క చేయడం లేదు. 'రాత్రులు ఆరోగ్యంగా అరిగించుకునే శక్తి వుండి కూడా చపాతీలు తినడమేమిటే? సుబ్బరంగా అన్నం పెట్టకుండా...?' అంటూంది. ఒకటేమిటి? ప్రతి విషయంలో తల దూర్చడమే! ఈవిడతో వేగడం నా వల్ల కావడం లేదు!" ఒక రోజు తేల్చేసింది.

"అమ్మకు తెలుసులే స్వాతీ! నన్ను, చెల్లిని జాగ్రత్తగానే చూసుకుంది. మన పిల్లలను కూడా చిన్నప్పుడు తనే కదా చూసుకుంది. నువ్వు అన్నింటికీ టెన్షన్ పడకు."

"ఆ రోజులు వేరు! ఈ రోజులు వేరు! ఆవిడ ఆ పల్లెటూరులో ఎలా వున్నా సరిపోతుంది. ఇక్కడ ఎలా కుదురుతుంది? చెప్పండి! అంతెందుకు వంట చేసేటప్పుడు ఎగ్జాస్టర్ ఫ్యాను వేసుకోమని ఎన్నిసార్లు చెప్తానో ...! అస్సలు వినరు!" స్వాతి విసుక్కుంది.

"నువ్వు వేయవచ్చు కదా...?"

"ఒకరు వంట చేసేవారు...! ఒకరు ఎగ్జాస్టర్ ఫ్యాను ఆన్ చేయడమా? అదేదో పెద్ద పనిలాగా?"

ఏం మాట్లాడాలో తెలియక నిశ్శబ్దంగా ఉండిపోయాను.

"పనిమనిషిని అప్పుడప్పుడూ మందలిస్తూ వుంటేనే అది పనిచేయడం అంతంత మాత్రం! అత్తయ్య దాని కబుర్లు విని జాలి పడుతూ ఓదారుస్తూ వుంటుంది. ఇక అది మాటేం వింటుంది? తరచుగా ఏదో ఒక సాకు చెప్పి మానేస్తోంది!" ఈసారి స్వాతి మాటలకు ఇక నేను సర్ది చెప్పడం కూడా మానేసాను.

ఓ రోజు ఆఫీసు నుండి ఇంటికి వచ్చేసరికి అమ్మ బ్యాగు సర్దుకుని వుంది.

"కొన్నాళ్లు వూరిలో వుండి వస్తాను రా! ఆదీ! ఇవాళ నన్ను బస్సు ఎక్కించు!" భారమైన ముఖంతో అంది అమ్మ.

"ఏంటమ్మా! ఇంత హఠాత్తుగా...!" అన్నానే కానీ, పెద్దగా వారించలేకపోయాను.

ఈ వయసులో మనసు ప్రశాంతంగా వుండడమే కావలసింది! అనుకుంటూ అమ్మను బస్సు ఎక్కించి, పెదనాన్నకు ఫోన్ చేసి అమ్మ గురించి జాగ్రత్తలు చెప్పి, ఇంటికి వచ్చాను.

ఊరిలో అమ్మ, ఇక్కడ స్వాతి ప్రశాంతంగానే వున్నారు. ప్రశాంతత కరువైంది నాకే! ఒంటరిగా అమ్మ ఎలా వుందో అనే బాధ కలచివేస్తుంటే, క్షోభనంతా మనసు మారుమూల గదిలో వుంచి, తాళం వేసి, బయటకు చిరునవ్వు రంగు పూతలు ముఖం మీద దిద్దుకుని, బాధ్యతలలో కూరుకుపోయాను. అప్పుడప్పుడు నేనే వెళ్లి అమ్మను చూసి కావలసినవి సమకూర్చి రావడం చేస్తున్నాను. కానీ ఎన్నిసార్లు అడిగినా తను మా దగ్గర నుంచి రావడానికి కారణం మాత్రం చెప్పలేదు. కానీ నాకైతే అర్థమైంది. స్వాతి నా ముందు చెప్తున్న అమ్మ మీద ఫిర్యాదులే కారణం అయివుంటాయని!

"నాకు కూడా నీ పిల్లలను చూసుకుంటూ నీ దగ్గరే వుండాలని వుందిరా...! కానీ ఎక్కడివాళ్లు అక్కడ వుంటే బాగుంటుందనీ...!" అంటూ అమ్మ నా ప్రశ్నకు సమాధానం చెప్పకుండా దాటేసేది.

★★★

ఉదయం నేను నిద్ర లేచి హాలులోకి వచ్చేసరికి, ఇల్లు తుడుస్తున్న మరియమ్మ కనిపించింది. స్వాతి. ఇచ్చిన కాఫీ తాగి సోఫాలో పేపరు చదువుతూ కూర్చున్నాను.

మరియమ్మ వెళ్లిపోయిన తర్వాత, స్వాతి కాఫీ కప్పుతో వచ్చి నా ప్రక్కనే కూర్చుంది.

"హమ్మయ్య! ఇవాళ కాస్త వెసులుబాటు కుదిరింది. ఈ మధ్య రోజూ హడావుడే! స్థిమితంగా కూర్చోవడానికి లేదు!" తాపీగా కాఫీ సిప్ చేస్తూ అంది.

"మరలా మరియమ్మనే రమ్మన్నావా? ఈవిడతో చాలా ఇబ్బందులు వున్నాయన్నావు?" అడిగాను శ్రీమతిని.

"నేనే సరిగా అర్థం చేసుకోలేదండీ! పాపం! తన ఇబ్బందులు తనకు వుంటాయి కదండీ! నెలకు జీతమిస్తున్నామని మన ఇష్ట ప్రకారం తనను నడవమంటే ఎలా? ఎవరితో అయినా కాస్తో కూస్తో సర్దుకుపోతే అంతా ఆనందమే!" అంటున్న స్వాతి ముఖంలోకి దీర్ఘంగా చూశాను.

"ఏంటలా చూస్తున్నారు? నేనంటున్నది నిజమే కదా..? పక్కింటి సమీర వుందా? తన అతిశయోక్తి మాటలు నచ్చక మాట్లాడడం తగ్గించేశాను కదా! మనం నిన్న అర్జెంటుగా మీ కొలీగ్ వాళ్ల నాన్నగారి అంత్యక్రియలకు వెళ్లేటప్పుడు పిల్లలను ఎక్కడ వదిలిపెట్టాలి అనుకున్నప్పుడు తనే వచ్చి వాళ్ళింటి దగ్గర వదలమని చెప్పింది కదా? సమీర మంచిదేనండీ! మన పిల్లల పట్ల చాలా ప్రేమగా వుంటుంది." స్వాతి చెప్పుకుపోతోంది. నేను మౌనంగా కళ్లు మూసుకుని సోఫాలో వెనక్కి వాలి పడుకున్నాను.

"ఏంటలా వున్నారు? ఆఫీసుకు వెళ్లరా..?" స్వాతి మాటలతో లేచి, ఆఫీసుకు తయారయ్యాను.

★★★

ఓ రెండు రోజుల తర్వాత సాయంత్రం ఇంటికి వచ్చేసరికి ఇంట్లో అమ్మ గొంతు వినిపించి ఆశ్చర్యపోయాను.

అమ్మ...వచ్చిందా? ఎన్నిసార్లు రమ్మని పిలిచినా రాని అమ్మ...! ఎలా...?

"ఏరా నాన్నా...! ఏంటి బెంగపడ్డావట! ఇద్దరు పిల్లల తండ్రివి? చిన్నపిల్లాడిలా అమ్మ గురించి దిగులు పడ్డావా? స్వాతి రెండురోజుల నుండి ఫోను చేసి ఒకటే ఏడుపు! నేను రాకపోతే ఊరుకోనంటూ పట్టుబట్టింది. ఇల్లంతా సర్దుకుని పెదనాన్న వాళ్లకు ఇల్లు కాస్త చూసుకోమని చెప్పి వచ్చేశాను." మంచినీళ్ల గ్లాసు చేతికిస్తూ అమ్మ చెప్తుంటే నా మనసంతా ఆనందంతో నిండిపోయింది.

ఆ తర్వాత అమ్మ, స్వాతి ఇద్దరూ ఒకరితో ఒకరు సంప్రదించుకుంటూ కలివిడిగా కలిసిపోవడం చాలా సంతోషాన్ని కలిగించింది. కానీ నాకు స్వాతిలో ఈ మార్పుకు కారణం ఏమిటి అన్న విషయం తెలియలేదు. అడగాలనిపించినా ఎందుకో అడగలేకపోయాను.

ఓ రోజు నేను ఆఫీసు నుండి ఇంటికి వస్తుంటే అమ్మ దారిలో గుడికి వెళ్తూ కనిపించింది.

ఇంట్లోకి అడుగు పెట్టేసరికి స్వాతి పడకగదిలో వాళ్ల అమ్మతో కాబోలు ఫోనులో మాట్లాడుతున్న మాటలు వినిపించాయి.

"బాగున్నారమ్మా! మీ అల్లుడు గారు కూడా సంతోషంగా వున్నారు. అత్తయ్య గారు లేనప్పుడు ఆయన ఎప్పుడూ ఏదో ఆందోళనగా కనిపించేవారు."

"........!"

"ఓ రోజు నేను పనిమనిషి గురించి మాట్లాడుతూ, ఎవరితో నైనా సర్దుకుపోతేనే సుఖంగా వుంటుందని చెప్తుంటే, ఆయన నా వైపు చూసిన చూపులో...కదలాడిన భావం, నా మనసును కలచి వేసిందమ్మా...! నేను ఆయన కళ్లలో ఆయన మనసును చదివానమ్మా!

'పనిమనిషితో, ప్రక్కింటివాళ్లతో సర్దుకుపోగలిగిన నువ్వు నా తల్లితో సర్దుకుపోలేక, ఈ వయసులో ఆవిడకు నన్ను దూరం చేస్తావా?' అని ఆయన అడుగుతున్నట్లనిపించింది. అందుకే అత్తయ్యకు క్షమాపణలు చెప్పి రప్పించాను. తిరిగి వచ్చిన తల్లిని చూసి ఆయన చిన్న పిల్లవాడిలా సంబరపడుతుంటే నాకు కూడా సంతోషంగా అనిపించింది." స్వాతి స్వరంలో పశ్చాత్తాపం నా మనసును మెల్లగా స్పృశించింది.

బయట పున్నాగ చెట్టు మీద వాలిన కోయిల కువకువలు వసంతం మరలా వచ్చిందని గుర్తు చేశాయి.

# అనుదీప

పి. వి. ఎస్. కృష్ణకుమారి

శ్రీమతి కోమలూరి నాగమణిశ్రీ స్మారక కథల పోటీ
ప్రోత్సాహక బహుమతి పొందిన కథ
శుభకృత్ వత్సర ఉగాది - 2022

"రాజకీయ అంశాలకి, సామాజిక అంశాలకి ముడి పెట్టకూడదు. దేనికవి విడిగా చూడాలి"

"అదెలా సాధ్యం? అసలు సమాజం గురించి ఆలోచించటమే కదా రాజకీయ వ్యవస్థ పని. రాజకీయంగా తీసుకునే ఒక నిర్ణయం సమాజానికి మేలు చేసేదిగా ఉండాలి కానీ, కీడు చేసేదిగా ఉండకూడదు"

"సమాజ శ్రేయస్సు కోసం పని చేసే క్రమంలో ఒకొక్కసారి సమాజంలోని కొందరు వ్యక్తులకి కొంత నష్టం కలుగవచ్చు"



టీ.వీ.లో ఏదో విషయమై వాడి, వేడి చర్చ జరుగుతోంది. చాలా ఆసక్తిగా చర్చా కార్యక్రమం చూస్తున్నాడు అశ్వత్థామ.

కాలింగ్ బెల్ మోగటంతో, వెళ్లి తలుపు తీసాడు. ఎదురుగా ఇరవై ఐదు సంవత్సరాల వయసు ఉన్న ఒక యువతి నిల్చుని ఉంది.

"అనూ" సంభ్రమం, వాత్సల్యం కలగలిసింది ఆ పిలుపులో.

"సర్" అంటూ అతని కాళ్ళకి నమస్కారం చేసింది అనుదీప.

ఆశీర్వదిస్తున్నట్లు తల మీద చేయి వేసి నిమిరి, అక్కున చేర్చుకుని,

"ఏమ్మా, నిన్న ఫోన్ లో కనీసం మాటవరుసకి కూడా అనలేదు ఈరోజు వస్తున్నానని" అంటూ లోపలికి నడిచాడు అశ్వత్థామ. అతని వెనుకే లోపలికి నడిచింది అనుదీప.

ఈ హడావుడికి కిచెన్ లో ఉన్న అశ్వత్థామ భార్య విద్యాధరి హాల్లోకి వస్తూనే అనుదీపని చూసి,

"ఏమ్మా ఎలా ఉన్నావు? అంకుల్ కూడా చెప్పలేదు నువ్వు వస్తున్నట్లు" అంది అశ్వత్థామ వైపు నిష్టూరంగా చూస్తూ.

"అంకుల్ కి కూడా తెలియదు ఆంటీ నేను వస్తున్నట్లు. హఠాత్తుగా వచ్చి మీకు సర్ ప్రైజ్ ఇద్దామనుకున్నాను అందుకే నిన్న అంకుల్ తో ఫోన్ లో మాట్లాడినా చెప్పలేదు" అంటూ విద్యాధరి కాళ్ళకి నమస్కారం చేసి,

"డిప్యూటీ కలెక్టర్ గా శ్రీకాకుళం లో పోస్టింగ్ ఇచ్చారు. అక్కడ జాయిన్ అయ్యే ముందు మీ ఆశీస్సుల కోసం హైదరాబాద్ వచ్చాను" అన్నది అనుదీప.

"కంగ్రాట్యులేషన్స్ అనూ. ఐ యాం ప్రౌడ్ ఆఫ్ యు" అభినందించాడు అశ్వత్థామ.

"అల్లరి పిల్ల అనూ కలెక్టర్ అనుదీప అయిందన్న మాట" నవ్వుతూ అంది విద్యాధరి..

"అమ్మా, అంతా మీ దంపతుల చలవే. ఇది మీరు పెట్టిన భిక్షే. ఆ రోజు మీరు చొరవ తీసుకుని ఉండకపోతే, నేను కూడా మాలో కొందరిలా పదిళ్ళల్లో పాచిపని చేసుకుంటూ ఉండేదాన్నేమో" భావోద్వేగంతో అన్నది అనుదీప.

"మాదేముంది, నీకు టాలెంట్ ఉంది. అవకాశం వచ్చింది. అంతే" అన్నాడు అశ్వత్థామ.

ఇద్దరికీ తను తెచ్చిన కొత్త బట్టలు పెట్టింది. అశ్వత్థామ, అనుదీపకి ఉద్యోగపరంగా ఎదురయే సాధకబాధకాలు చెపుతున్నాడు.

విద్యాధరి ఆలోచనలు పదిహేనేళ్ళ వెనక్కి వెళ్ళాయి.

★★★

"అమ్మగారు, రేపటి నుంచి ఈమె వస్తుంది పనిలోకి. ఏమేం పనులు చేయాలో చెప్పాను" అన్నది పనమ్మాయి లక్ష్మి తన కూడా వచ్చిన ఒక యువతిని చూపిస్తూ.

"ఇంతకు ముందు ఎక్కడ చేసింది? నీకు బంధువా, నమ్మకంగా చేస్తుందా?" అడిగింది విద్యాధరి. ఆమె భయాలు ఆమెవి.

నాలుగేళ్ల నుంచి పని చేస్తున్న లక్ష్మి, వేరే ఊరికి వెళుతూ, తన స్థానంలో ఒకమ్మాయిని తీసుకొచ్చింది. అసలే రోజులు బాగాలేవు. ముక్కూ మొహం తెలియని వాళ్ళని పనికి పెట్టుకుంటే, దొంగో దొరో తెలియదు. పనిచేస్తున్న ఇంట్లోనే దొంగతనం చేసారు అనే కథలు ఎన్ని వినలేదు!

"ఊళ్ళో పనులేవి దొరకటం లేదని మా ఊరోళ్ళు ఈడకి వస్తుంటే వాళ్ళతో వచ్చింది. ఆర్నెల్లు అయింది వచ్చి. చెడు బుద్ధులేవి లేవమ్మా" అంది లక్ష్మి.

సరే ఏంచేస్తాం ఎవరో ఒకరు మన జాగ్రత్తలో మనం ఉండాలి అనుకుంది మనసులో విద్యాధరి.

"నీ పేరు?" అడిగింది.

"శోభ" చెప్పింది.

కొన్ని రోజుల్లోనే విద్యాధరికి శోభ పనితీరు, ప్రవర్తన పట్ల పూర్తి సంతృప్తి కలిగింది. లక్ష్మి కంటే శోభ పని చాలా శుభ్రంగా, శ్రద్ధగా చేస్తుంది. టైం కి వచ్చేది . నాగాలు పెట్టేది కాదు. పొద్దున, సాయంత్రం రెండు పూటలా వచ్చేది.

లక్ష్మి అవసరం ఉన్నా లేకపోయినా ఏదో ఒకటి మాట్లాడేది, కానీ శోభ మాట్లాడితే తప్ప మాట్లాడేది కాదు. మొగుడు మేస్త్రి పనికి వెళతాడు. ఇద్దరు పిల్లలు.

ఒకరోజు పనంతా అయ్యాక ఏదో అడగాలని మొహమాటంగా నిలుచుంది.

"ఏమిటి శోభ, ఏమైనా కావాలా?" అడిగింది విద్యాధరి.

"అమ్మా, మేము గుడిసె వేసుకున్న జాగా ఓనర్ అక్కడ ఇల్లు కట్టుకుంటున్నాడు. మాకు తగ్గ ఇళ్ళు ఇక్కడ కిరాయికి లేవు. ఇక్కడ నుంచి వెళ్ళిపోవాలి అనుకుంటున్నాం. కానీ ఎక్కడికి పోవాలో తెలీటం లేదు" అన్నది.

విద్యాధరి గుండెలో రాయి పడింది. ఏడాది అయింది శోభ వచ్చి. ఇప్పుడు ఇది వెళ్ళిపోతే మళ్ళీ పనివాళ్ళ వేట మొదలు పెట్టాలి. విద్యాధరి ఆలోచనలో ఉండగానే , పక్కనే ఉండి అంతా వింటున్న అశ్వత్థామ,

"మా పక్క స్థలం మా స్నేహితుడిదే. వాడు ఇప్పుడప్పుడే ఇల్లు కట్టడు. వాడితో మాట్లాడతాను. ఇక్కడే ఒక చిన్న రేకులు షెడ్ మీరే వేసుకొని, నెల నెలా మీకు తోచిన అద్దె ఇవ్వండి" అన్నాడు.

ఆ తర్వాత నెలకే వాళ్ళు అశ్వత్థామ ఇంటి పక్కకి మారారు. శోభకి ఇద్దరు పిల్లలు. పెద్ద పిల్ల అనుదీప, ఎనిమిదేళ్ళు. రెండోవాడు కొడుకు చరణ్ కి ఆరేళ్ళు. అనుదీప అక్కడికి కిలోమీటరు దూరంలో ఉన్న గవర్నమెంట్ స్కూల్ లో మూడో తరగతి చదువుతోంది. చరణ్ దగ్గరలో ఉన్న చిన్న ప్రైవేటు స్కూల్ లో యూకేజీ చదువుతున్నాడు.

అనుదీపని చూడగానే భార్యాభర్తలు ఇద్దరికీ ముచ్చటేసింది. అందమైన కళ్ళు, పెద్ద జడలు, రంగు తక్కువైనా కళగల మొహం. ముఖ్యంగా ఆ పేరు వాళ్ళకి బాగా నచ్చింది.

"ఇంత మంచి పేరు ఎవరు చెప్పారు మీకు" అడిగింది విద్యాధరి.

"మా ఇంటి దగ్గర ఉన్న గుళ్ళో అయ్యగారు పెట్టారు" అన్నది శోభ.

"అంటే అర్థం తెలుసా, ఎప్పుడూ వెలుగుతూ ఉండేది అని. ఏమో నీ కూతురు కూడా అందరికీ వెలుగు పంచుతుందేమో!" అన్నాడు అశ్వత్థామ.

నవ్వింది శోభ.

తమకి ఆశ్రయం కల్పించారని విద్యాధరి, అశ్వత్థామ అంటే శోభ, దాని మొగుడు రాజుకి ఎంతో గౌరవం. ఇంటి పనులు, బయట పనులు అన్ని వాళ్ళే చేసేవాళ్ళు.

అనుదీప, చరణ్ స్కూల్ నుంచి రాగానే పుస్తకాల సంచి పట్టుకుని విద్యాధరి దగ్గర కూర్చుని హోం వర్క్ చేసుకునే వాళ్ళు. పిల్లలు లేని విద్యాధరి, అశ్వత్థామలకి వీళ్ళే పిల్లలయినారు.

మొదట్లో ఎక్కువ మాట్లాడని శోభ, ఇప్పుడు విద్యాధరితో బాగానే మాట్లాడుతున్నది. మాటల్లో శోభ గురించి తెలుసుకుంది విద్యాధరి.

రాజు, శోభ వాళ్ళది ఆంధ్రా, ఛత్తీస్గఢ్ రాష్ట్రాల సరిహద్దుల్లో ఒక గిరిజన ప్రాంతం. మేనత్త మేనమామ పిల్లలయిన వాళ్ళు చిన్నప్పటి నుంచి కలిసి పెరిగారు, తర్వాత పెళ్లి పేరుతో ఒకటైనారు.

వాళ్ళకి వారసత్వంగా వచ్చిన కొంత భూమి, ఒక ఇల్లు ఉండేవి. ఐదు సంవత్సరాల క్రితం వరకూ ప్రకృతి ఒడిలో జీవితం ఎంతో ఆనందంగా ఉండేది. భూమిలో జొన్నలు పండించుకునే వాళ్ళు. ఇంటి చుట్టూ ఉన్న ఖాళీ స్థలంలో కూరగాయలు పెంచుకునేవాళ్ళు. అక్కడే పుట్టి పెరిగిన వాళ్ళకి అడవే తల్లి, చెట్లు చేమలు తోబుట్టువులు, జంతువులే నేస్తాలు.

అటువంటి వారి జీవితంలోకి అనుకోని ఉపద్రవం వచ్చిపడింది. ఒక గవర్నమెంట్ ప్రాజెక్టు కోసం, ఆ ప్రాంతపు గిరిజనులందరినీ ఖాళీ చేయించారు. వాళ్ళకి పునరావాసం దూరంగా ఏర్పాటు చేసారు. తమ గూడెం తప్ప వేరే ప్రపంచం తెలియని వాళ్ళ బతుకులు ఇప్పుడు, చెరువులో నుండి బయట పడ్డ చేపలు పరిస్థితి అయింది.

ఇళ్ళు కట్టించి ఇచ్చారు, కానీ జీవనోపాధి లేదు. వారి భాష తప్ప మరేదీ రాదు. చదువుకోలేదు, వ్యవసాయం, అడవి ఉత్పత్తులు అమ్ముకోవడం తప్ప ఉద్యోగం అంటే ఏమిటో తెలియదు.

ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ళు వదిలి, చాలా మంది జీవనోపాధికై నగరాలు, పట్టణాలు బాట పట్టారు . స్వతంత్రంగా, స్వేచ్ఛా విహంగాల వలె అడవుల్లో, కొండ కోనల్లో తిరిగిన వాళ్ళు కూలీలుగా వేరే వాళ్ళ చేతికింద పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

శోభ చెప్పింది చాలా ఆసక్తిగా వింటున్నారు విద్యాధరి, అశ్వత్థామ.

"మాకు కావాల్సింది కడుపుకు కాసింత అన్నం, ఉండేందుకు గూడు. గూడు గవనమెంటు ఇచ్చినాదమ్మా. కానీ అన్నం ఏం పెట్టుద్ది. తలోదిక్కకీ ఎల్లిపోనారు. ఆర్నెల్ల పిల్లని తీసుకుని మేం కూడా పొరుగు బాట పట్టినాం. దర్జాగా ఉన్నది తిని మారాజుల్లా బతికిన మేము ఒకరి కింద కూలిపని చేయాల్సొచ్చింది. మొదట్లో ఎవరు ఏం మాట్లాడతున్నారో తెలిసేది కాదు. బాస రాకపోయేసరికి కూలీ పైసల్లో మోసం కూడా చేసేటోళ్ళు. మాకు తెలిసినోళ్ళు ఐద్రాబాద్ లో మేస్త్రి కింద కూలీలుగా వస్తుంటే మేం కూడా వచ్చినాం. మా అత్తమామలు ఆడనే ఉంటున్నారు. ఎప్పటికైనా మా ఊరెళ్ళాలని ఆశ" శోభ మాటల్లో తన సొంత ఊరు వెళ్ళగలను అనే ఆశావహ దృక్పథం.

"అభివృద్ధి పేరుతో గవర్నమెంట్ చేసే పనులు సామాన్యుల జీవితాలను ఎంతలా అతలాకుతలం చేస్తున్నాయి అనే దానికి నిదర్శనం కాదా ఇది" అన్నది విద్యాధరి శోభ వెళ్ళిపోయాక.

"అలా ఎందుకనుకోవాలి? ప్రభుత్వం వాళ్ళకి పునరావాసం, ఇతర సౌకర్యాలు కల్పిస్తూనే ఉంది. సమస్యల్లా నిరక్షరాస్యత వల్ల

వాళ్ళు వాటిని సద్వినియోగం చేసుకోలేకపోవడం, పథకాలని వాళ్ళ దగ్గరికి తీసికెళ్ళటంలో వైఫల్యం" అన్నాడు అశ్వత్థామ.

"మీరు ప్రభుత్వాన్ని సమర్థిస్తున్నారా లేక వీళ్ళనా" అడిగింది విద్యాధరి.

"నా సమాధానం అర్థం చేసుకో" అన్నాడు నవ్వుతూ అశ్వత్థామ.

"మొత్తానికి జర్నలిస్టు అనిపించారు" తానూ నవ్వింది విద్యాధరి.

★★★

"అమ్మా, మేము పిల్లల పరీక్షలు అవగానే మా ఊరు పోదామనుకుంటున్నాం" అంది శోభ. ఆమె వెనకాలే వచ్చాడు రాజు. రాత్రి పూట కావటంతో అశ్వత్థామ కూడా ఇంట్లోనే ఉన్నాడు.

"సరే, మళ్ళీ ఎప్పుడు వస్తారు" శోభ లేకపోతే చేయివిరిగినట్లే విద్యాధరికి.

"సార్ కి, మీకు అది చెపుదామనే వచ్చామమ్మా. మేము అక్కడే ఉంటాం ఇక రాము. మా అమ్మా, నాయనా పెద్దాళ్ళయిపోయారు. ఇక్కడికి రాలేరు. గవర్నమెంట్ కూడా మాకు ఏరే చోట సాగుభూములు ఇచ్చింది. ఆడనే ఉంటాం ఇక" అన్నాడు రాజు.

ఏం మాట్లాడాలో అర్థం కాలేదు విద్యాధరికి. మళ్ళీ ఇంత మంచి పనివాళ్ళు ఎవరు దొరుకుతారు అనే భయం.

"మా అనుదీపని మా తమ్ముడు మనువాడతానన్నాడు. ఈ ఎండాకాలంలో దాని పెళ్లి చేస్తే, చరణ్ ఆడనే స్కూల్లో చదువుతాడు" చెప్పింది శోభ.

"దానికి పెళ్ళేమిటే, నిండా పదకొండేళ్ళు లేవు. చక్కగా చదువుకుంటున్న పిల్లని పాడు చేస్తారా"

అప్పటిదాకా మౌనంగా ఉన్న విద్యాధరి అనుదీపకి పెళ్లి అనగానే తన భయాన్ని పక్కన పెట్టింది. అనూ అంటే ఇద్దరికీ ప్రాణం. అందం, తెలివి, సంస్కారం అన్నీ ఉన్నాయి అనుదీపకి. స్కూలు సమయంలో తప్ప ఎప్పుడూ విద్యాధరి వెనుకనే తిరుగుతూ ఉంటుంది.

"మైనర్ పిల్లలకి పెళ్లి చేయటం నేరం తెలుసా" అన్నాడు అశ్వత్థామ.

"సర్, మా దగ్గర ఇలాంటివి మామూలే. ఎవరూ అడగరు, పట్టించుకోరు" అన్నాడు రాజు.

"అది సరే రాజూ, ఇప్పుడు మీకు ఎన్నో అవకాశాలు ఉన్నాయి. రిజర్వేషన్ ఉంది. ఎంతవరకైనా చదివించవచ్చు. గిరిజన సంక్షేమ పాఠశాలలు ఉన్నాయి. ఇవన్నీ మీరు ఎందుకు ఉపయోగించుకోరు" అశ్వత్థామ అడిగిన దానికి రాజు దగ్గర సమాధానం లేదు.

శోభే అన్నది, " అవన్నీ ఎక్కడున్నాయో మాకు తెలీదు కదయ్యా"

"మీ ఊరి దగ్గరలోనే ఆ ఏర్పాట్లు నేను చేస్తా మీకు ఇష్టమేనా" అడిగాడు అశ్వత్థామ.

మౌనంగా వెళ్ళిపోయారు. పది రోజులు పాటు చెప్పగా చెప్పగా ఒప్పుకున్నారు.

అశ్వత్థామ తనకి తెలిసినవాళ్ల ద్వారా అనుదీపని విజయనగరంలో ఒక గిరిజన హాస్టల్లో చేర్పించి, బాలికల పాఠశాలలో ఏడో తరగతిలో చేర్పించాడు. ఇతర అవసరాలకు నెలనెలా కొంత డబ్బు పంపేవాడు.

వాళ్ళు హైదరాబాద్ వదిలి వెళుతుంటే ఆప్తులు దూరమవుతున్నట్లు బాధపడ్డారు, ముఖ్యంగా విద్యాధరి. తమ గుర్తుగా ఒడాఫోన్ ఒకటి కొనిచ్చారు. తరచూ ఫోన్ చేస్తుండేది అనూ.

టెన్త్ లో స్టేట్ రాంకు వచ్చింది. మరోసారి అనుదీప చదువు అంతటితో ఆపివేయించాలనే ప్రయత్నం చేశారు శోభ, రాజు.

అనుదీప  గొడవ చేసింది, నిరాహారదీక్ష చేసింది, కాలేజీలో చేరేందుకు. ఈసారి కాస్త ఎక్కువగానే కష్టపడాల్సి వచ్చింది అశ్వత్థామకి శోభ, రాజులని ఒప్పించడానికి. చివరికి గవర్నమెంట్ కాలేజీలో చేర్పించారు.

ఇంటర్లో కూడా మంచి పర్సంటేజ్ వచ్చింది. ఇంజనీరింగ్ లో క్యాంపస్ ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయింది. జాబ్ చేస్తూనే సివిల్స్ రాసి సెలెక్ట్ అయింది.

ఉద్యోగరిత్యా వైజాగ్ వెళ్ళినప్పుడల్లా అశ్వత్థామ అనుదీపని కలుస్తూనే ఉన్నాడు కానీ విద్యాధరి మాత్రం పదిహేనేళ్ళ తర్వాత ఇప్పుడే చూడటం.

★★★

"అంకుల్, నన్ను అందరూ మంచి సాఫ్ట్వేర్ జాబ్ వదిలి, రిస్క్ తో కూడుకున్న ఈ గవర్నమెంట్ ఉద్యోగం ఎందుకు అన్నారు. కానీ ఏదో సాధించాలనే తపన. మా ఊరు వెళ్ళినప్పుడల్లా వాళ్ళ కోసం ఏదో చేయాలి, వీళ్ళకి బయటి ప్రపంచం చూపించాలి అనే ఆరాటం కలిగేది.  నేను ఈ స్థితిలో ఉండటానికి కారణం మీరు.  అలానే వీళ్ళకీ ఎవరో ఒకరు చైతన్యం కలిగించాలి. ఆ ఆలోచనే నన్ను సివిల్స్ రాయించింది" అనుదీప చెపుతోంది.

మరోమారు ఇద్దరి ఆశీస్సులు తీసుకుని బయలుదేరింది అనుదీప.

"అందరి జీవితాల్లో వెలుగులు నింపి తన పేరు  సార్ధకం చేసుకుంటుంది" అన్నది విద్యాధరి, అనుదీప క్యాబ్ ఎక్కి వెళుతుంటే చూస్తూ.

"తను చెప్పినట్లు తమకి ఉన్న అవకాశాలు ఏమిటి, వాటిని ఎలా అందుకోవాలనే అవగాహన అందరికీ ఉండదు.  ఆ చైతన్యం కలిగించే వాళ్ళు కూడా ఉండాలి. అనూకి రెండూ కలిసి వచ్చాయి. ఇప్పుడు తను అందరికీ స్ఫూర్తిదాయకమై వారందరి జీవితాల్లో చైతన్యపు వెలుగులు నింపుతుంది" అన్నాడు అశ్వత్థామ.

# సునయన




డా. ఎమ్. సుగుణరావు

కాలేజీ గేటు దగ్గర విద్యార్థినుల నినాదాలు లీలగా వినిపిస్తున్నాయి. స్టాఫ్ రూమ్‌లో తన లేప్‌టాప్‌లో విద్యార్థులకు చెప్పవలసిన క్లాసు కోసం ప్రిపేర్ అవుతున్నాడు పాత్రో. ఇంతలో అతని సహ లెక్చరర్ గోవిందరావు వచ్చి, అతని ఎదురుగా కూర్చుంటూ "లంచ్ అవర్ డిమాన్‌స్ట్రేషన్ చేస్తున్నారు ఆడపిల్లలు" అన్నాడు.

"అవును" అన్నాడు పాత్రో.

"ఆ గుంపులో మీ అమ్మాయి కూడా ఉంది" అన్నాడు మెల్లగా గోవిందరావు.

తల ఊపి, తన పనిలో నిమగ్నమయ్యాడు పాత్రో.

అతను మళ్లీ చెప్పడం మొదలెట్టాడు. "మీ అమ్మాయి సునయన మన కాలేజీ టాపర్. క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో ఉద్యోగం వచ్చింది కదా. ఇంకో ఆరు నెలల్లో పరీక్షలు అయిపోతే ఈ కాలేజీతో బంధం తెగిపోతుంది. ఎందుకు ఈ ఉద్యమాలు? మీరు గట్టిగా చెప్పడం లేదా?" అన్నాడు గోవిందరావు.




ఆ మాటలకు పాత్రో సమాధానం చెప్పకుండా ఆలోచనలో పడ్డాడు. గోవిందరావు మేనేజ్‌మెంట్ మనిషి. కాలేజీ ప్రిన్సిపాల్ గారి కుడి భుజం. తను ఈ కాలేజీలో చేరి పదేళ్లయ్యింది. కూతురుకి గవర్నమెంటు కాలేజీలో ఇంజనీరింగ్ సీటు వచ్చినా దూరం అని పంపలేక ఇక్కడ చేర్పించాడు. తను బాగా చదివింది. క్యాంపస్‌లో రిక్రూట్‌మెంట్ వచ్చింది. అయితే నెల క్రితం కాలేజీలో గొడవైంది. ఎవరో అమ్మాయి జీన్ ప్యాంటు, టీ షర్టు వేసుకురావడంతో ఎవరో ఆకతాయి ఏడ్పించాడు. ఆమె పోలీస్ కంప్లయింట్ ఇచ్చింది. అది ప్రిన్సిపాల్ గారికి నచ్చలేదు. ఆడపిల్లలు ఒంటి నిండా కప్పుకునే దుస్తులతో రావాలని జీన్స్, టీ షర్టు, మిడ్డీలు వంటి వస్త్రాలు నిషిద్ధమని నోటీసు జారీ చేశారు. ఆ నోటీసు వెనక్కి తీసుకోవాలంటూ శాంతియుతంగా నినాదాలు చేస్తున్నారు. అదైనా లంచ్ అవర్‌లో మాత్రమే. దానికి సునయన నాయకత్వం వహిస్తోంది.

ప్రిన్సిపాల్ గారికి ఈ విషయం మింగుడు పడడం లేదు. విద్యార్థినులను పిలిచి గొడవ చేయొద్దని చెప్పాడు. ఇచ్చిన నోటీసు వెనక్కి తీసుకోవాలని విద్యార్థినుల తరపున సునయన కూడా ప్రిన్సిపాల్ గారికి గట్టిగా చెప్పింది. ఆయన ఇగో దెబ్బతింది. అందుకే రాయబారంగా గోవిందరావును పంపాడు తన వద్దకు అనుకున్నాడు పాత్రో.

"ఏంటీ మాట్లాడరు!" అన్నాడు రెట్టించి గోవిందరావు.

పాత్రో ఆలోచనలో నుండి బైటకొచ్చి "కొన్ని బలమైన సంఘటనలు మన మనసులో ముద్రలుగా ఏర్పడతాయి. వాటిని చెరిపేయలేము" అన్నాడు.

"అంటే" అర్థంకానట్టు చూశాడు గోవిందరావు.

"ఈ విషయం వివరంగా చెప్పాలంటే దాదాపు పదిహేనేళ్ల క్రితం వెనక్కి వెళ్లాలి" అన్నాడు.

"చెప్పండి, ఇంకా మన క్లాసుకు టైమ్ ఉంది కదా!" అన్నాడు గోవిందరావు.

పాత్రో కుర్చీలో వెనక్కి వాలి, చెప్పడం మొదలెట్టాడు. "మీకు తెలుసు కదా, మాది ఒరిస్సా ప్రాంతం. బాగా సాంప్రదాయం, సనాతనాచారాలు పాటించే కుటుంబం మాది. మాది ఉమ్మడి కుటుంబం. మా నాన్నది వ్యవసాయం. మా ఒక్కగానొక్క చెల్లెల్ని కటక్‌లో ఒక వ్యాపారస్తుల కుటుంబంలో అబ్బాయికిచ్చి పెళ్లి చేశాము. అతడు ట్రాన్స్‌పోర్ట్ బిజినెస్ చేసేవాడు. కొన్ని లారీలున్నాయి. డ్రైవర్ లేనప్పుడు తనే లారీ తిప్పేవాడు. అలా కటక్ నుంచి హౌరా తన లారీ లోడ్ తీసుకెళ్తున్నప్పుడు జరిగిన ప్రమాదంలో చనిపోయాడు. నలభై ఏళ్ల వయసులో ఆమెకు వైధవ్యం ప్రాప్తించింది. భర్త దశదిన కర్మలు తర్వాత ఆమెను పునిస్త్రీ నుంచి విధవరాలుగా మార్చే ప్రక్రియ జరుగుతోంది. ఆమెకు కొత్త చీర కట్టి, తలలో పూలు పెట్టి, చేతులకు గాజులు తొడిగి, భర్త అంత్యక్రియలు జరిగిన ప్రదేశంలో ఆమె గాజులను పగలగొట్టి, పూలు తీసివేసి, తెల్లచీర కడతారు. అలాగే ఆ సమయంలో క్షురకర్మకారుడు జుట్టు కత్తిరించి గుండు చేస్తాడు. ఆ సమయంలో ఆమె గాజులు పగలగొట్టినప్పుడు, పూలు తీసేసినప్పుడు ప్రతిఘటించలేదు. కానీ జుట్టు తీయడానికి మాత్రం ఒప్పుకోలేదు. ఆమెది పొడవు జడ. పాపం పూలు పెట్టుకునేది. తనకు పూలు అంటే చాలా ఇష్టం. అయితే బలవంతంగా ఆడవాళ్లంతా పట్టుకొని ఆమెకు గుండు చేయించారు. అది మా ఒరిస్సాలో, మా సామాజికవర్గంలో తరతరాలుగా వస్తున్న ఆచారం గనుక. మా చెల్లి చాలా గట్టిగా ఏడ్వడం నా కూతురు చూసింది. అప్పుడు తన వయస్సు ఐదేళ్లు. ఆ సంఘటన బలంగా తన మనసులో ముద్ర వేసుకుంది. తన అత్త అభీష్టానికి వ్యతిరేకంగా అదంతా చేస్తున్నారని ఆమెకు ఆ క్షణంలోనే అనిపించింది. ఆ తర్వాత ఆమె అత్తగారింట్లో ఒంటరిదైంది. పిల్లలు లేరు. భర్త లేడు. ఇక ఇంటి చాకిరి. తనతో పాటు విధవరాలిగా కట్టుబాట్లు. వీటన్నిటికీ భయపడి పుట్టింటికి వచ్చేసింది. ఉమ్మడి కుటుంబంలో సోదరుల మధ్య తనకు రక్షణ దొరుకుతుందని ఆశ పడింది. అయితే పుట్టింటికి వచ్చినా ఆమెకు ఆ వైధవ్యం మిగిలించిన చేదు గుర్తులు మిగిలేలాగానే ఇంట్లోవాళ్లు ప్రవర్తించేవారు. గుండు చేయించుకోమని అనడం, తెల్ల చీర కట్టుకోమని అనడం. అయితే ఆమె చేసేది ఏమీ లేక వాటికి తలొగ్గింది.

తిరిగి అత్తగారింటికి వెళ్లలేదు. ఆ నరకం కన్నా తోబుట్టువుల మధ్యే తన బతుకు కాస్త మెరుగు అనుకుంది. ఉదయమే లేచి అందరికీ కాఫీలు ఇచ్చి, టిఫిన్‌లు చేసి, బొగ్గుల కుంపటిలో స్నానానికి నీళ్లు కాచి, ఆ తర్వాత వంటగదిలో కొంగు పరచుకొని నిద్రపోయేది. అప్పటి ఆచారం ప్రకారం ఆమె ఆహారం వేరుగా వండుకొని తినేది. అది ఉప్పు, కారం తక్కువైన చప్పిడి భోజనం. ఆ లంకంత కొంపలో చెల్లి పట్ల సానుభూతి చూపించేది నా కూతురు. అందరూ రంగు రంగుల చీరలు కట్టుకుంటుంటే, వాటి వంక ఆర్తిగా చూసేది. ఇలా ఏ సుఖానికీ నోచుకోకుండానే ఆమె జీవితం గడిచిపోయింది. అలాగే చిన్న వయసులోనే చనిపోయింది. చనిపోయే ముందు తను చెప్పిన ఆఖరి మాట "నేను చనిపోయిన తర్వాత నాకొక రంగుల కోక కప్పండి..."

చెప్పడం ముగించిన పాత్రో కళ్ల వెంట నీళ్లు జలజలా రాలాయి.

"అయ్యో..." అంటూ నిట్టూర్చాడు గోవిందరావు.

తిరిగి చెప్పడం మొదలెట్టాడు పాత్రో, "మా కుటుంబాల్లో మగాళ్లే ముందు భోజనం చేసేవారు. అందరూ తిన్న తర్వాత ఆడవాళ్లు భోజనం చేస్తారు. అలాగే ఇంటికి కొత్తగా ఎవరైనా మగవారు వస్తే ఆడవాళ్లంతా లోపలికి వెళ్లిపోయేవారు. మామగార్ల ముందు కోడళ్లు కూర్చోకూడదు. నవ్వకూడదు. తల కొంగు నెత్తి మీద కప్పుకోవాలి. ఇలాంటి ఆచారాలు, సాంప్రదాయాల మధ్య నా కూతురుకి ఆలోచనలు మొదలయ్యాయి. పెరిగేకొద్దీ ఈ విషయం మీద ఘర్షణ పడేది. గట్టిగా వాదించేది. అంతవరకు నోరు విప్పని మా ఇంటి ఆడవాళ్లలో కూడా మార్పు వచ్చింది. వాళ్లలో కూడా ఆలోచనలు మొదలయ్యాయి. అంతవరకు సాంప్రదాయం పేరుతో, ఆచారాల పేరుతో తాము చీకటి గుహలో వెలుతురు లేక మగ్గిపోయినట్టుగా, ఊపిరి ఆడక విలవిలలాడినట్టుగా వాళ్లు భావించారు. మెల్లగా తమ పాత పద్ధతులకు స్వస్తి చెప్పి, స్వతంత్రంగా బతకడం అలవాటు

చేసుకున్నారు. ఇది మగవాళ్లకు మింగుడు పడకపోయినా, ఎదురు తిరుగుతున్న ఇంటి ఆడవాళ్ల ముందు వాళ్లు తలొగ్గక తప్పలేదు. ఈ పదిహేనేళ్లల్లో మా కుటుంబాల్లో చాలా మార్పులొచ్చాయి. ఆడపిల్లలు బాగా చదువుకుంటున్నారు. స్వతంత్రంగా, స్వేచ్ఛగా తమకు నచ్చిన రీతిలో బతుకుతున్నారు. ఈ నేపథ్యంలో పెరిగిన మా అమ్మాయి సునయన. ఈ కాలేజీలో జరుగుతున్న ఉద్యమానికి మద్దతు ఇవ్వకపోతే ఆశ్చర్యపడాలి గానీ తను కూడా దీనిలో భాగస్వామ్యం అవుతున్నందుకు తన గళం విప్పినందుకు నాకూ సంతోషంగానే ఉంది. మనం పురుషాధిక్య ప్రపంచంలో మనకు నచ్చిన రీతిలో బతుకుతున్నప్పుడు వాళ్లకెందుకు ఈ ఆంక్షలు....?" అన్నాడు పాత్రో.

ఆ మాటలకు గోవిందరావు వెంటనే అన్నాడు, "మీరు చెప్పింది నిజమే! మీ ఇంట్లో ఆడవాళ్ల పరిస్థితి అప్పట్లో అంత ఘోరంగా ఉండేది. అది గర్హించాల్సిందే! అయితే వేషధారణ సరిగా లేకపోతే ఆడపిల్లలకు రక్షణ ఏది?" అన్నాడు గోవిందరావు.

"అయ్యో, మీరు అలా ఆలోచిస్తున్నారా? వేషధారణ వలననే దాడులు అనుకుంటున్నారా? మరి చిన్నపిల్లలు, వృద్ధులపై జరిగే వాటి మాటేమిటి?" అన్నాడు అతడు మొహంలో సూటిగా చూసిన పాత్రో.

గోవిందరావు సమాధానం చెప్పకుండా తలొంచుకున్నాడు. ఇంతలో బెల్ మ్రోగింది. "క్లాసు ఉంది వస్తాను" అంటూ పాత్రో అక్కడి నుండి నిష్క్రమించాడు.

★★★

వారం రోజుల తర్వాత ప్రిన్సిపాల్ ఆ కాలేజీ విద్యార్థినుల తరఫున సునయనను పిలిచి చెప్పాడు, "నేను మీ నోటీసు ఉపసంహరించుకుంటున్నాను. మీకిష్టమైన దుస్తుల్లో రావచ్చు. ఇంకా ఉద్యమం ఆపేసి బాగా చదువుకోండి" అంటూ చెప్పాడు. ఆ కాలేజీలో విద్యార్థినులు అందరూ ప్రిన్సిపాల్ గారి నిర్ణయానికి సంతోషించారు. స్వీట్లూ, చాక్లెట్లు పంచుకున్నారు.

★★★

నెల తర్వాత స్టాఫ్ రూమ్‌లో పుస్తకం చదువుతున్న పాత్రో దగ్గరికి గోవిందరావు వచ్చి కూర్చున్నాడు. బైట ప్రిన్సిపాల్ గారి రూము ముందు విద్యార్థినులు నినాదాలు ఇస్తున్నారు. కుర్చీలో కూర్చుంటూ అన్నాడు గోవిందరావు, "చూసారా, మళ్లీ కొత్త ఉద్యమం..." అన్నాడు పాత్రోతో.

"ఏమైంది?" అన్నాడు ఆశ్చర్యంగా.

"మీకు తెలీదా, మీ అమ్మాయి చెప్పలేదా?" అన్నాడు గోవిందరావు.

"నిజంగా నాకు తెలీదు. నేను మా ఊరు వెళ్లి ఈరోజే వచ్చాను" అన్నాడు పాత్రో.

గోవిందరావు చెప్పడం ప్రారంభించాడు, "ఈ మధ్య కాలంలో కర్ణాటకలో ఈ గొడవ ప్రారంభమయ్యింది. మనం కూడా కర్ణాటకకు దగ్గర ఉన్నాం కాబట్టి కర్ణాటకలోని ఆ కాలేజీల అనుబంధ సంస్థ మన కాలేజీ కాబట్టి ఇక్కడ కూడా అలాంటి పద్ధతి పాటించాలని హై కమాండ్ నుంచి వచ్చిన పిలుపు మేరకు ప్రిన్సిపాల్ గారు నోటీసు పంపారు. అందుకు గొడవ..." అన్నాడు గోవిందరావు.

"మీరు చెప్పింది అర్థం అయ్యీ, అవనట్టుగా ఉంది. ఇంకాస్త వివరంగా చెప్పండి" అన్నాడు.

"అదేనండీ... వారి మతాచారం ప్రకారం ఆ దుస్తులు ధరిస్తారు. ముసుగు వేసుకుంటారు. శరీరం కనబడకుండా అంగీ తొడుగుతారు. అలాంటిది అవసరం లేదు. విద్యార్థినులందరూ సాధారణ దుస్తుల్లో రావాలని ప్రిన్సిపాల్ నోటీసు పంపాడు. అందుకు ఆ మతానికి చెందిన విద్యార్థినులు ఒప్పుకోకుండా తమ అస్థిత్వం కాపాడుకోవడం ముఖ్యమనీ, తమకు సాంప్రదాయంగా వస్తోన్న వస్త్రధారణను తాము కొనసాగిస్తామని ఉద్యమం చేపట్టారు. అందుకు మీ అమ్మాయి మద్ధతిస్తోంది" అన్నాడు గోవిందరావు.

ఆ మాటలకు ఒకసారి ఆలోచనలో పడ్డాడు. తను ఊర్లో లేకపోవడంతో జరిగిన విషయం తెలియలేదన్నమాట అనుకున్నాడు. కూతురుతో మాట్లాడడానికి నిర్ణయించుకున్నాడు. పక్కనున్న అటెండర్‌ను పిలిచి, "మా అమ్మాయి సునయనను తీసుకురామ్మా" అన్నాడు. అటెండర్ వెళ్లిన పావుగంట తర్వాత సునయన స్టాఫ్ రూమ్‌లోకి వచ్చింది. "ఏంటి నాన్నగారూ... పిలిచారట" అంది, నిల్చునే.

"కూర్చోమ్మా!" అన్నాడు గోవిందరావు.

పాత్రో కూతురి వంక చూసి, "ఏంటమ్మా మళ్లీ గొడవ మొదలుపెట్టారు?" అన్నాడు కాస్త చిరాకుగా.

"అదేంటి నాన్నా, తమకు సాంప్రదాయంగా వచ్చిన వస్త్రధారణ విషయంలో అది ఉంచాలా, తీసివేయాలా అన్నది ఆ అమ్మాయిల నిర్ణయం. అది తీసేయమని చెప్పడానికి ఎవరికీ ఎటువంటి హక్కూ ఉండదు. ఆ సాంప్రదాయాన్నించి బైటపడాలా వద్దా అనేది వాళ్లు తీసుకొనే నిర్ణయం. స్వేచ్ఛగా తమకు నచ్చిన రీతిలో బతికే హక్కు పౌరులు అందరికీ సమానమే కదా!" అంది.

ఆ మాటలకు వెంటనే గోవిందరావు, "మొన్న ఆ మధ్య స్వేచ్ఛగా వస్త్రాలు ధరించే విషయంలో మీరు ఉద్యమానికి దిగారు. ఇప్పుడు ఒక మతాచారం సాంప్రదాయాన్ని గౌరవించమని ఉద్యమానికి తెర తీస్తున్నారు. మీది అగమ్యగమ్యం" అన్నాడు గోవిందరావు, కాస్త వేళాకోళంగా.

ఆ వాక్యానికి పాత్రో ఏదో చెప్పబోయి ఆగిపోయాడు.

ఆ మాటలకు సునయన శాంతంగా "వద్దనుకున్న వారిని బలవంతంగా మతపరమైన వేషధారణ అవలంబించమనడం ఎంత తప్పో, అలాంటి సాంప్రదాయ దుస్తులను వేసుకోవడానికి సంకల్పించే వారిని వద్దనడం కూడా అంతే తప్పు! అయితే ఇక్కడ నాకొక దైన్యస్థితి కనపడింది. ఆ కోణం గురించి ఎవరూ ఆలోచించలేదు. అందుకే తమ మతాచారపరమైన వేషధారణ కావాలనుకున్నవారి స్వేచ్ఛకు భంగ కలిగించవద్దనే ఈ ఉద్యమానికి నేను మద్ధతు పలుకుతున్నాను" అంది క్లుప్తంగా.

ఆమె మాటలకు పాత్రో, గోవిందరావు ఆమె వంక ప్రశ్నార్థకంగా చూసారు.

ఆమె చెప్పడం కొనసాగించింది, "మన కాలేజీలో ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థినుల్లో కొంత శాతం మంది బాగా పేద ఆడపిల్లలున్నారు. ముఖ్యంగా ఇప్పుడు తమ మతాచార వస్త్రధారణ కొనసాగించమని ఉద్యమిస్తూన్న ఆ మైనారిటీ ఆడపిల్లల ఆర్థిక స్థితి చాలా ఘోరంగా ఉంది. తల్లిదండ్రులు రెక్కలు ముక్కలు చేసుకొని ఆ పిల్లలను చదివిస్తున్నారు. వారికి ఫీజులు చెల్లించడం, పుస్తకాలు కొనడం  వీటితోనే వారి చాలీ చాలని సంపాదన. ఇక్కడ ఆర్థికంగా పై స్థాయిలో ఉన్న మాలాంటి పిల్లలందరూ మంచి బట్టలు వేసుకొస్తారు. ఖరీదైన వస్త్రాలతో ఉల్లాసంగా కనిపిస్తారు. రోజుకో డ్రస్సు వేసుకుంటారు. కానీ నేను చెప్పిన ఆడపిల్లల పరిస్థితి అలా లేదు. చిరిగిపోయిన వస్త్రాలను కుట్టుకుని, పాతబడిన బట్టలనే తొడుక్కుంటారు. కాలేజీకి వస్తున్న ఆ పిల్లలు ఆ బట్టల్లో సిగ్గుగా, మిగతా పిల్లల బట్టలు చూసి తమ దైన్యస్థితి తలచుకొని కుమిలిపోతూ ఉంటారు. దీనికి జవాబే తమ వస్త్రాల్ని మరుగుపర్చే ఆ మతాచార వస్త్రధారణ కొనసాగించమనే ఈ ఉద్యమం" అంది సునయన మెల్లగా.

ఊహించని ఆ జవాబుకు ఆ ఇద్దరూ త్రుళ్లిపడ్డారు. ఒకసారి కూతురు వంక అపేక్షగా చూసాడు పాత్రో.

'సునయన అంటే మంచి నయనాలు కలిగింది. తను మంచి పేరే పెట్టాడు. సమాజాన్ని చూసే ఆమె దృష్టి కోణం సరైందే!' అనుకున్నాడు.

ఆ సమయంలో గోవిందరావు కూడా సునయన వంక అభినందనాపూర్వకంగా చూసాడు. ఆ ఇద్దరు టీచర్లు తాము కూడా ఆడపిల్లలకు మద్ధతుగా నినాదాలు ఇస్తే బాగుంటుందనే అనుకున్నారు, మనసులో.

# మిధునం




**మణి వడ్లమాని**

సన్నటి జల్లు పడుతోంది. ఆమె చేతిలో  సంచీ బరువుగా ఉంది. ఆయన చేతిలో పారతో  వచ్చాడు.  ఇద్దరూ ఒకరినొకరు ప్రేమగా చూసుకున్నారు. "ఇక మొదలు పెడదామా" అన్నాడు. ఆవిడ "అలాగే" అంది నవ్వుతూ.

వాళ్ళు పని చేయడం మొదలుపెట్టారు. ఇద్దరి ముఖాలు అలసటతో వాడిపోయాయి. అయినా లెక్క చేయటం లేదు. ఆ దారి వెంబడే  ఎంతో మంది వెళుతున్నారు. కానీ వీళ్ళను చూసే తీరిక ఎవరికీ లేదు.  అయినా వాళ్ళకి ఆ గుర్తింపు అవసరం లేదు, వాళ్ళకు పనే ముఖ్యం కాబట్టి. ఎంతో ఏకాగ్రత తో చేసుకుపోతున్నారు.

తెచ్చుకున్న భోజనం తిని, నీళ్ళు తాగి, కాసేపు విశ్రాంతి తీసుకుని మళ్ళీ పని మొదలుపెట్టారు. సాయంత్రం అయింది. ఇద్దరూ పని ముగించుకుని ఇంటిముఖం పట్టారు.

★★★

ఆరోడ్డు మీద బస్సులు, కార్లు తెగ తిరుగుతున్నాయి ఒక్కొక్క చక్రం అక్కడున్న గుంతలోకి పడినప్పుడల్లా, అందులో నిలువ ఉన్న బురద మట్టి నీరు  నడిచి వెళ్ళే మనుషుల పైన చిమ్ముతోంది .




కిడ్నాపులు, రేపులు, హత్యలు, ఆత్మహత్యలు, ధర్నాలు, ఆక్సిడెంట్లు, దేవుళ్ళ ఊరేగింపులు, ఎలక్షన్ల మీటింగులు, సినిమా తారలతో ప్రారంభోత్సవాలు, లేదంటే టీవీ డిబేట్లలో కాలం గడిపేసే సమయంలో  ఇలా రోడ్ల మీద గుంటలు పడి, నీరు నిండిపోతే ఎవరు పట్టించుకుంటారు? బక్కచిక్కి, మూటలు మోసుకుంటూ లేదా సైకిలు తొక్కుకుంటూ వెళ్ళే మనుషుల మీదో, స్కూల్ కి వెళ్ళే పిల్లల మీదో అవి పడితే దాని గురించి పట్టించుకునే తీరిక ఎలానూ లేదు, ఇహ ఆ రోడ్లను  ఉద్ధరించే ఓపిక అంతకన్నా ఉండదు.

అసలే ఈ ప్రపంచం  ఉరుకులు పరుగులతో పరిగెత్తుతూ అతలాకుతలం అయిపోతుంటే,  ఇక పక్కవాడి గురించి ఆలోచించే సమయము ఎక్కడుంటుంది.

★★★

అదొక  గేటెడ్ కమ్యూనిటీ  లో ఉండే అపార్ట్ మెంటుల సముదాయం. లోపలే ఉన్న పిల్లల పార్కులో చాల సందడిగా ఉంది. నిజానికి ఇపుడిప్పుడే అందరు కరోనా  భయాన్ని వీడి బయటకు వస్తున్నారు.  అయితే ఈ అపార్ట్మెంటు సముదాయం కఠినంగా కరోనా నిబంధనలు పాటిస్తూ ఉండటం వల్ల కొంతలో కొంత నయం. అందులో ఉన్న వాళ్ళందరూ కూడా వాక్సిన్ వేయించుకోవటం కూడా మరో కారణం.

వినాయక చవితి  సందర్భంగా ఏర్పాటు చేసుకున్న కార్యక్రమంలో భాగంగా ఆ రోజు అక్కడున్న క్లబ్ హౌస్ లో  ఒక నాటక

ప్రదర్శన ఏర్పాటు చేసారు. రెండు గంటల పాటు సాగిన నాటకం అందరిని అలరించింది. అది నిజానికి థియేటర్ కోర్స్ చేస్తున్న స్టూడెంట్స్, స్టేజి పెర్ఫార్మన్స్ ఇవ్వడం కోసం ప్రాక్టికల్ గా చేయడం జరిగింది.

అది నిర్వహించిన చందూ, పెద్ద వాళ్ళందరికీ ధన్యవాదాలు చెప్పాడు. నిజానికి వాళ్ళతో పాటుగా చాల మంది అక్కడున్న యువతీ యువకులు కూడా చూసి, వాళ్ళ ప్రయత్నాన్ని అభినందించారు.

"ఇప్పుడు నేనొక వ్యక్తికి ప్రత్యేకంగా ధన్యవాదాలు చెప్పుకోవాలి. పెద్దలు, పిన్నలు తేడాలేని ఒక కొత్త ఆడియో యాప్ ద్వారా మాలో కలిసిపోయారు జయరాం గారు, నిజంగా వారి వ్యక్తిత్వానికి పాదాభివందనం చేయాలి" అంటూ కాళ్ళు మొక్కాడు.

"అయ్యయ్యో ఇదేంటి చందూ! నో! నో! మనం ఫ్రెండ్స్ కదా ఇలాంటి పనులు చేయవచ్చా" అంటూ ప్రేమగా మందలించాడు జయరాం.

"ఇదిగో రాజ్యం నేను చెప్పానే చందూ .. థియేటర్ ఆర్టిస్టు" అని భార్య రాజ్యలక్ష్మిని పిలిచి పరిచయం చేసారు.

"అమ్మా, నమస్తే! మీ గురించి జయరాం గారు చెబుతూ ఉంటారు"

"నీ గురించి కూడా చెప్పారు చందు. నువ్వు మీ టీం అంతా మంచి మంచి నాటకాలు వేస్తారు. అందులో జనాలకి ఉపయోగపడే కంటెంట్ తో మరీ తొందరగా చేరుతున్నారు" అన్నారు

★★★

'బయటకు వెళ్ళిన మనిషి మరి ఇక ఎప్పటికీ రాలేదు' అని తెలిసినప్పుడు ఆ బాధ, వేదనా కూడా వర్ణనాతీతం. అది ఎవరూ పూడ్చలేనిది.

ఈ మధ్య ఇలాంటి సంఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయి, ముఖ్యంగా ఏక్సిడెంట్స్. అదీ వానాకాలంలో మరీ ఎక్కువగా అవుతున్నాయి.

ప్రకృతి బహు విచిత్రంగా ఉంటుంది. ఎంత సంతోషాన్ని ఇస్తుందో అంత వేదనను కూడా కలుగజేస్తుంటుంది. ఒక్కసారిగా వేయి నాలుకల మహాకాళిలా మారిపోతుంది. హాయిగా ఆహ్లాదంగా, చల్లగా వుండే బదులు ఆగ్రహావేశాలతో ఊగిపోతోంది.

రాత్రి కురిసిన భయంకరమైన వాన వెలిసింది. చీకటిని తోసేసి వచ్చిన దినకరునితో చైతన్యం మొదలయింది. నెమ్మదిగా అందరూ తమ రోజువారీ పనులు చేసుకోవడానికి ఆయత్తమవుతున్నారు.

అప్పుడు చూసాడతను రోడ్డు మీద జరిగిన దుర్ఘటనను. పాపం కొడుకును పోగొట్టుకున్న ఆ తల్లిదండ్రుల బాధ, డ్యూటీ ముగించుకుని వస్తున్న అతన్ని అక్కడున్న గుంట పొట్టన పెట్టుకుంది.

అది ఇంకా కళ్ళముందు చెరగనేలేదు. మరో చిన్నారి పాప కూడా తండ్రి బైక్ మీద వెళుతూ రోడ్డు మీద గుంట రావడంతో ఎగిరిపడి తలకి రాయి కొట్టుకుని చనిపోయింది.

ఇలా వరుస సంఘటనలు జరగడమే కాకుండా, ఆ రోజు పని మీద బయటకు వెళ్ళినప్పుడు చూసిన హృదయవిదారక ఘటన చూసి వికలమైన మనసుతో ఇంటికి తిరుగు ముఖం పట్టాడు. తెమ్మన్న వస్తువు తేకుండా వట్టి చేతులతో వచ్చిన భర్తను చూసి, "అయ్యో ఏమయింది అలా ఉన్నారు" అంది

అప్పుడు తను చూసిన విషయాలన్నీ ఆమెతో చెప్పాడు. కాసేపు ఇద్దరూ కూడా మౌనంగా ఉండిపోయారు.

ఏవో ఆలోచనలు వచ్చాయి. ఆమెకు ఒక రకమైన ఆవేశం కలిగింది. వెంటనే భర్తతో "ఏమండీ మనకి ఆ భగవంతుడు మంచి జీవితాన్ని ప్రసాదించాడు. పిల్లలు కూడా ఎవరి సంసారం వాళ్ళు చేసుకుంటున్నారు, అందుకు నేనొక నిర్ణయానికి వచ్చాను. మన ఇద్దరిలో ఒకరి పెన్షన్ ఇల్లు నడుపుకోవడానికి సరిపోతుంది. ఇంకోదాన్ని .." అంటూ భర్తకు తన ప్లాన్ వివరించింది. "పైగా మీకు ఇలాంటి పనులు చేయడం మీకు బాగా తెలుసాయే" అని వేళాకోళం చేసింది.

అందుకు అతను నవ్వి "అందుకే నన్ను మా వాళ్ళందరూ భార్యా విధేయుడు అనేది".

"అదే వద్దనేది మీకు కూడా నచ్చుతుంది కాబట్టే నేను ఏది చెప్పినా సరే అంటారు. మనిద్దరిదీ ఒకటే మాట అనండి" అంది చిరుకోపంగా.

"సరేనోయి. నీ మాటే నా మాట. అలాగే కానిద్దాం"

★★★

"ఎప్పుడూ వెళుతున్నట్లే ఆ రోజు కూడా వాళ్ళు బయటకు వెళ్తుండగా సెక్యూరిటీ గార్డ్ అడిగాడు. "మేడం ఆ బాగ్ ఇలా ఇవ్వండి" అంటూ లాక్కోబోయాడు. ఆవిడ వద్దు వద్దు అంటున్నా వినిపించుకోకుండా. ఆ చిన్న పెనుగులాటలో అది కింద పడింది. పెద్ద శబ్దంతో. అది చూసిన అతను వెనక్కి వచ్చి, గబగబా దాన్ని సరి చేసి తీసుకుని వెళ్ళిపోయాడు. అతనితో పాటు ఆవిడా వెనకాలే వెళ్ళింది. ఇదంతా చూస్తున్న సెక్యూరిటీ గార్డ్ కి వింతగా అనిపించింది. అదే విషయాన్ని ఇంకొక గార్డ్ కి చెప్పాడు.

★★★

ఏదో ఆలోచిస్తూ బైక్ నడుపుతున్న ప్రభాకర్ ముందున్న గుంట చూసుకోలేదు. అదుపు తప్పి పడిపోయాడు. అప్పుడే అక్కడకు చేరుకున్న వాళ్ళిద్దరూ అది చూసి, అతని దగ్గరగా వెళ్లి లేపారు. చిన్న చిన్న దెబ్బలు తగిలి, చేతుల దగ్గర కాళ్ళ దగ్గర గీరుకున్నాయి. సాయం చేసిన వాళ్ళిద్దరికీ ధన్యవాదాలు తెలుపుకుని భార్యకు ఫోన్ చేసాడు "ఇవాళ లేచిన రోజు చాలా మంచిదయింది" అంటూ జరిగింది చెబుతూ, అటు పక్కగా చూసాడు. అక్కడ కనిపించిన దృశ్యం అతన్ని ఆశ్చర్యచకితుడిని చేసింది. "ఆగు .. ఒక్క నిమిషం" అని భార్యకు చెప్పి, వాళ్ళను చూస్తూ ఉండిపోయాడు. ఆ జంట గుంటను పూడ్చేసి, సామానంతా బాగ్ లో సర్దేసుకుని, క్షణాలలో వెళ్ళిపోయారు. అవతలి నుంచి భార్య పిలుస్తూనే ఉంది. అది వినిపించుకోకుండా "నేను నీకు మళ్ళీ ఫోన్ చేస్తాను" అని కట్ చేసి, ఎవరికో ఫోన్ చేసి, ఈ విషయం చెప్పాడు.

★★★

రెండు రోజులు గడిచాయి.

వీళ్ళు యధావిధిగా మరో చోట తమ పని చేసుకుంటూ పోతుండగా ఉన్నట్టుండి ఫ్లాష్ మాబ్ వచ్చి, వాళ్ళిద్దరూ చేసే పనిని ఒక చిన్న రూపకం లా అక్కడికక్కడే ప్రదర్శించారు. ఏమి పట్టించుకోకుండా ఆ భార్యాభర్తలు తమ పనిని నిర్మాణ శిల్పులలాగ చేసుకునిపోతున్నారు..

ఫ్లాష్ మాబ్ ప్రదర్శన అయిపోగానే "జయరాం గారు, నమస్తే మేడం" అంటూ వాళ్ళిద్దరి చేతులు పట్టుకున్నాడు చందు.

"ఓహ్ చందూ! బావున్నావా? ఏమిటి ఇదంతా? నుక్కడ్ నాటకంలా ఉంది" అన్నారు.

"అవును జయరాం గారు. మీరు చేసే పనినే ఇలా చిన్నగా చేసి చూపించాము. మా స్నేహితుడొకడు వాళ్ళింటి దగ్గర మీరు గుంట పూడుస్తుండగా చూసి చెప్పాడు. ఈ రోజు మీరు ఇటు రావడం చూసాను. వెంటనే మా వాళ్ళందరికీ మెసేజ్ పెట్టడం అందరు వచ్చి చేయడం జరిగింది".

"అవును చాల బావుంది, మీరందరూ ఇలా చేయడం" అని మెచ్చుకున్నారు రాజ్యలక్ష్మి గారు .

"డెబ్బయి ఏళ్ళ వయసులో మీరిద్దరూ ఇలా ప్రజలకోసం కష్టపడి పని చేయడం మాటలో చెప్పలేను", అని ఒకతను అంటే, ఇంకొక అమ్మాయి 'సర్ నిజం మాలాంటి యువతకు మీరే ఆదర్శం" అంటే, ఇంకొక అబ్బాయి "మిగతావాళ్లు ఎలా పోతేనేం నేను హాయిగా ఉంటే చాలు అనుకునే మనుష్యులు మధ్య ఇలాంటి వాళ్ళు కూడా ఉంటారని నిరూపించారు సుమా!" అంటూ చాలా ఉద్వేగంగా మాట్లాడాడు.

ఈ లోపల విషయం తెలుసుకున్న మీడియా అక్కడకు చేరి జరిగినదాన్ని అంతా లైవ్ లో చూపించసాగారు.

★★★

ఇంటికి చేరుకున్న ఆ దంపతులకి అపార్ట్‌మెంటు వాసులందరూ కూడా ఘనస్వాగతం ఇచ్చారు. అది చూసిన సెక్యూరిటీ గార్డ్ పరుగున వచ్చి "సర్! మీరు పార, గునపం తీసుకునిపోతుంటే నాకు చాలా భయమయింది. అందుకే సెక్రటరీ సర్ కి చెప్పాను. మీరింత మంచి పని చేస్తున్నారని నాకు తెలవదు. నన్ను క్షమించండి సర్" అంటూ కాళ్ళు పట్టుకున్నాడు.

"అయ్యో అదేంటి. నీ తప్పేమీ లేదు, అసలు నీ డ్యూటీనే అది. ప్రతి వాళ్ళని చెక్ చేయడం. లే లే" అంటూ అతని భుజాల పై చేతులు వేసి లేపారు జయరాం గారు

★★★

ఆ జంట చేస్తున్న మంచి పని గురించి అన్ని టీవీలు ప్రసారం చేయసాగాయి. ఒక్క తెలుగు మీడియాయే కాదు, జాతీయ మీడియా కూడా ఈ వార్తను ప్రసారం చేసింది.

వాళ్ళు మీడియాతో చెప్పిన మాటలు – "మనిషి ఎప్పుడూ శాశ్వతం కాదు, పోయేటప్పుడు ఏదీ వెంటరాదు. అయినా తెలిసి అందరూ మాయలో పడిపోతాము. నాది అనేది ఏదీ ఉండదు. అందుకే మేమిద్దరం బతకడానికి ఉంచుకుని మిగతావాటితో ఈపని చేయాలని నిర్ణయించుకున్నాము. వాటికి తగ్గ సామగ్రిని కలిసి కొనుక్కున్నాము. మేమిద్దరమూ తోటివాళ్ళకి సాయపడాలని దృఢంగా అనుకున్నాము. అప్పటి నుంచి దాదాపుగా మన నగరంలో ఉన్న గుంటలు పూడుస్తున్నాము. అయితే ఏదో గొప్పకార్యం చేసాము అని మాత్రం అనుకోవటము లేదు."

★★★

మీడియాలో వస్తున్న జయరాం, రాజ్యలక్ష్మి దంపతులని చూపించాడు భార్యకు ప్రభాకర్. ఆ రోజు జరిగిన సంఘటన గుర్తు చేసుకున్నాడు.

నిజానికి వీళ్ళు చేసే పని గురించి మీడియాకు తెలిసింది ప్రభాకర్ ద్వారానే.

అసలు ఇలాంటి వాళ్ళు ఉంటారా అని నమ్మని వాళ్ళని వదిలేస్తే, ఆయా రోడ్ల మీద రోజూ వెళ్ళే వాళ్ళ హృదయాలకి తెలుసు. వాళ్ళెప్పుడూ నమ్ముతారు. కొంతమంది ఉంటారు, వాళ్ళకి గుర్తింపు, పొగడ్తలతో అవసరం లేదు .

ఇప్పుడు వాళ్ళకి అధికారులు కూడా మద్దత్తు ఇస్తున్నారు.

అదిగో... మరో చోట ....జయరాం ,రాజ్యలక్ష్మి గార్లు కబుర్లు చెప్పుకుంటూ పని చేసుకుంటున్నారు.

# దగా పడిన తమ్ముళ్ళు

అంగర సూర్యారావు

**కథామంజరి ప్రత్యేక కథ**

“ఇవాళకి ఇక పని చెయ్యలేనోయ్!” అన్నాడు రామ్మూర్తి రాసిన కాగితాలను ట్రేలో వేస్తూ, “టైము 5 గంటలు కానిదే పని మానేస్తే ఎలా?” అన్నాను.

“నా ఆరోగ్యం పూర్తిగా దెబ్బ తిందోయ్ రఘూ! విసుగు విరామం లేకుండా గంటలతరబడి పనిచేసే ఇదివరకటి రామ్మూర్తిని కాను నేను. లే! ఒకసారి అలా సముద్రం ఒడ్డుకుపోయి విశ్రాంతి తీసుకుందాం!” అన్నాడు.

నాకు కూడా బద్ధకంగా వుంది. విశ్రాంతి అన్న మాట నన్ను ఆకర్షించింది. లేచాను. కాఫీ తాగకండా అడుగైనా ముందుకు వెయ్యలేనన్నాడు రామ్మూర్తి. ఇద్దరం హోటలుకు వెళ్ళాం. అంతవరకు నీరసంగావున్న రామ్మూర్తి ముఖంలో కాఫీ తాగిన తర్వాత చురుకుతనం కనిపించింది. “రోజుకు యిన్ని సార్లు కాఫీ తాగడం మంచిపని కాదు” అన్నాను.

“మంచిపని కానిమాట నిజమే! కాని నేను కనీసం రెండుగంటలకు ఒకసారైనా కాఫీ తాగకపోతే పని చెయ్యలేను. ప్రతి త్రాగుబోతుకీ త్రాగుడు దురలవాటు అన్న విషయం తెలుసు. కాని వచ్చిన చిక్కు ఎక్కడ అంటే అది మానేసే దగ్గరే” అన్నాడు రామ్మూర్తి.

నిజమే! చాలామంది మనుషులు తాము చేసే పనులు చెడ్డవని తెలిసివుండి కూడా చేస్తూ వుంటారు. అది మానసిక దౌర్బల్యమో! పరిస్థితుల ప్రాబల్యమో!

సముద్రం మీదినుంచి వచ్చే చల్లని గాలి మా మనసుల్ని ఆఫీసు కాగితాల మీదినుంచి ప్రపంచం మీదికి మరల్చింది. ఇద్దరం ఇసుకలోకి దిగి కూర్చున్నాం. జీతంచాలని గుమాస్తా కుటుంబంలా మాముందు సముద్రం గోల పెడుతోంది.



రెండేళ్ళ క్రితం రామ్మూర్తీ నేనూ యీ ఆఫీసులో పనిచేసే వాళ్ళం. నిరంకుశుడైన పై అధికారిని ఎదిరించడం వల్ల రామ్మూర్తి ఐదుజిల్లాల చివరకు, నేను మూడు జిల్లాల చివరకు ట్రాన్సుఫరు చెయ్యబడ్డాం. తిరిగి కాలప్రవాహంలో యీదుకొని యీనాటికి యిద్దరం యీ ఆఫీసు చేరుకోగలిగాం. నా కంటే బలంగా వుండే రామ్మూర్తి ఎముకల గూడులా తయారయాడు.

“నీకు యీ రెండేళ్ళలో ఏమైనా జబ్బు చేసిందా?”

“ఉహుఁ! జబ్బేమీ లేదు, డబ్బులేకపోవడమే జబ్బు. చూడు! నిన్న జీతం తీసుకున్నాను. ఈవేళ నా జేబులో కానీ లేదు. యిప్పుడు యింటికి వెడితే బాకీల వాళ్లు వచ్చి పడతారు. వాళ్ళకేం సమాధానం చెప్పాలి? యింట్లో బియ్యం లేవు. రేపటి నుంచి భోజనం ఎలా? భోజనం లేకపోతే కాఫీ తాగి పడివుంటాను నేను. పాలకోసం ఏడ్చే చంటికుర్రాణ్ణి ఏంచెయ్యడం? ఒకటవ తేదీకోసం ఎదురు చూస్తూ ఇంకా ముప్ఫయి రోజులు గడపాలి” నిట్టూర్చాడు రామ్మూర్తి.

మా భారమైన జీవితాలను తలుచుకొని యిక్కడకూడా బాధపడుతూ కూర్చోవడం యిష్టం లేక ప్రసంగాన్ని మార్చాం.

★★★

ఒకరోజు రామ్మూర్తి ఆఫీసుకు రాలేదు. కారణం ఏమిటో తెలుసుకుందామని ఆ సాయంత్రము ఆఫీసునుంచి వాళ్ళ యింటికి బయలుదేరాను. కొన్ని సందులు, ఉపసందులు దాటి రామ్మూర్తి యిల్లు చేరుకున్నాను. నన్ను చూడగానే రామ్మూర్తి లోపలికి రమ్మన్నాడు. గాలి వెలుతురు రాని ఆ గదిలో సాయింత్రం ఐదు గంటలకే దీపం వెలిగించి వుంది. ఆ మసక దీపవు కాంతిలో ఒక ఆరేళ్ళ పిల్ల మంచం మీద పడుకొని మూలుగుతూ కనిపించింది. రామ్మూర్తి దిగులుగా కూర్చుని వున్నాడు.

"జ్వరం వచ్చిందా?" అన్నాను.

"అవునోయ్! దానికి మూడు రోజుల్నుంచి జ్వరం వస్తోంది. అదే పోతుందని వూరుకుంటే యీ రోజు మరీ ఎక్కువయ్యింది" అన్నాడు నిరుత్సాహంగా.

"ఏమందూ వెయ్యకపోతే ఎలా పోతుంది? లే! ఊళ్ళోకి వెళ్ళి ఏదైనా మందు తీసుకువద్దాం!" అన్నాను. యింతలో ఒక నాలుగేళ్ళ కుర్రాడు బయట నుంచి పరుగెత్తుకువచ్చి అణా కావాలని మారాం పెడుతున్నాడు. వాడి చేతిలో అణా పెట్టేవరకూ వాడు మాకు బయటకు వెళ్ళడానికి పర్మిషను యివ్వలేదు. నేను ఆ యింట్లో అడుగు పెట్టింది మొదలు బయటకు వచ్చేవరకూ చంటి కుర్రాడి ఏడుపు ఐదు నిముషాలకు ఒకసారి రిపీట్ అలారంలా వినిపిస్తూనే వుంది. నరకం అనేది ఎక్కడో వుందంటారు. కాని రామ్మూర్తి యిల్లు చూసిన వాళ్ళు ఆ అభిప్రాయాన్ని తప్పకుండా మార్చుకుంటారు. ఆ రాత్రి తెలిసిన డాక్టరు దగ్గర మందు తీసుకొని రామ్మూర్తికి యిచ్చి పంపించాను.

వారం రోజులు గడిచాయి. ఆరోజు ఉదయం రామ్మూర్తి నా లాడ్జికి వచ్చాడు. ఆ నాలుగేళ్ళ కుర్రాడు కూడా అతనితో వచ్చాడు. ఇద్దరం కూర్చున్నాం. కుర్రాడు మాత్రం గదిలో తనకు పనికివచ్చే వస్తువుల కోసం వెతుక్కుంటున్నాడు.

"మా ఆవిడకు రెండు రోజులనుంచి జబ్బుగా వుందోయ్. ఈ పిల్లలతో నేనొక్కడినీ బాధ పడలేకపోతున్నాను. దాన్ని, యిద్దరు పిల్లల్నీ వాళ్ళమ్మ గారి యింటి దగ్గర విడిచి పెట్టి రేపు వస్తాను. ఈ కుర్రాణ్ణి మాత్రం యీ రెండు రోజులు నీ దగ్గర వుంచుకుంటే చాలా సంతోషిస్తాను. నువ్వు తప్పకుండా నాకీ ఉపకారం చెయ్యాలి" అన్నాడు రామ్మూర్తి విచారంగా,

"ఆ మాత్రం దానికి యింతగా చెప్పాలా? వాణ్ణి రెండు రోజులే కాదు కదా ఎప్పుడూ నా దగ్గరే వుంచుకోమన్నా వుంచుకుంటాను" అన్నాను.

రామ్మూర్తి కుర్రాణ్ణి పిలిచి "ఒరేయ్ సుందరం నేను వూరి కెళ్ళివస్తాను. ఈ రెండు రోజులూ మామయ్య దగ్గర వుండు" అన్నాడు.

అణా యిస్తే వుంటానన్నాడు వాడు.

సుందరం అణా తీసుకొని నా దగ్గరే వుండిపోయాడు. రామ్మూర్తి వెళ్ళిపోయాడు. సుందరం చాలా అల్లరి చేస్తాడు. జబ్బులోవున్న వాళ్ళమ్మను యింకా బాధ పెడతాడనే వుద్దేశంతో రామ్మూర్తి వాణ్ణి నాదగ్గర విడిచి పెట్టి వెళ్ళాడు. కాని యీ రెండు రోజుల్లోనూ కుర్రాళ్ళలో సుందరం అంతటి బుద్ధిమంతుడు వుంటాడా అనిపించింది నాకు, ఏమి అల్లరి చెయ్యలేదు. మరిచిపోకుండా అణామాత్రం వసూలుచేసి బిస్కట్లు కొనుక్కునే వాడు. సాయింత్రం నాతో బీచికి వచ్చేవాడు. కలిగిన ప్రతి సందేహం నన్నడిగి తీర్చుకునేవాడు. యీ కుర్రాడు ఎప్పుడూ నాతోవుంటే బాగుంటుందనిపించింది నాకు. నా కోరిక కూడా తీరింది. రామ్మూర్తి రెండు రోజులు పోయిన తరవాత వచ్చి రమ్మన్నా వాడు వెళ్ళలేదు.

ఒకనాడు ఆఫీసులో పనిచేస్తూ రామ్మూర్తి సొమ్మసిల్లి పడిపోయాడు. నేనూ మరో యిద్దరు గుమస్తాలు ముఖం మీద నీళ్లు చల్లి ఉపచారాలు చేసిన తరవాత అరగంటకు రామ్మూర్తి కళ్ళు తెరిచాడు.

"ఎలావుంది?" అన్నాను.

"చాలా ఆయాసంగా వుంది" అన్నాడు బాధగా.

వెంటనే జట్కా మీద హాస్పిటలుకు తీసుకు వెళ్ళాం. డాక్టరు పరీక్ష చేసి "జబ్బు బాగా ముదిరిన తర్వాత తీసుకు వస్తే ఏం లాభం?" అన్నాడు.

"ఏం జబ్బు?" అన్నాను ఆశ్చర్యంగా,

"క్షయ" అన్నాడు డాక్టరు.

నా గుండెలు వేగంగా కొట్టుకున్నయ్. రామూర్తికి క్షయా? అతన్ని పట్టుకొని నెమ్మదిగా నడిపిస్తూ డాక్టరు చూపించిన 13వ నెంబరు బెడ్ మీద పడుకోబెట్టి దిగులుగా నా లాడ్జి చేరుకున్నాను.

నాటినుండి రోజూ సుందరాన్ని తీసుకొని సాయంత్రం 4 గంటలకు హాస్పిటలుకు వెళ్ళడం కూడా నా దైనిక కార్యక్రమాలలో ఒకటయ్యింది. రామ్మూర్తి రోజురోజుకూ, క్షీణించిపోతున్నాడే కాని కొంచెం కూడా గుణం కనిపించలేదు. ఒక నాటి సాయంత్రం–

"సుందరాన్ని బయటకు పంపించు. నీతో కొన్ని విషయాలు మాట్లాడాలి" అన్నాడు రామ్మూర్తి నీరసంగా. సుందరం జేబులో బిస్కట్లు వేసి ఆడుకోమని క్రోటన్సు మొక్కలదగ్గర విడిచి పెట్టి వచ్చాను.

రామ్మూర్తి ఆయాసంతో నెమ్మదిగా చెప్పడం ప్రారంభించాడు.

"రఘూ! నువ్వు నన్ను ఎంతో కాలం నుంచి సొంతమనిషిలా చూస్తూవచ్చావు. యిక నా జీవితం కొన్ని గంటలలో ముగియబోతుంది. నా చివరి కోర్కె తీర్చమని కోరుతున్నాను సుందరాన్ని మాత్రం నీ దగ్గరే వుంచుకొని పెద్దవాణ్ణి చెయ్యి. వాడి కేదైనా వృత్తి విద్య నేర్పు కాని గుమాస్తాను మాత్రం చెయ్యకు."

ఆటముగించి మా దగ్గరకు వచ్చిన సుందరాన్ని దగ్గరకు పిలిచి "ఒరేయ్ సుందరం! నేను వూరికి వెళ్ళిపోతున్నాను. నువ్వు మావయ్య దగ్గరే ఉండు." అన్నాడు రామ్మూర్తి.

"నువ్వు వెళ్ళిపో నాన్నా! నేను మావయ్య దగ్గరే ఉంటాను" అన్నాడు సుందరం ఉత్సాహంగా! రామ్మూర్తి ముఖంలో కూడా ఆనందం కనిపించింది. నా కన్నీరు ఆ తండ్రీకొడుకులకు కనిపించకుండా నేను మాత్రం ముఖం పక్కకు తిప్పుకున్నాను.

*"తెలుగు స్వతంత్ర" వారపత్రిక 20.03.1953 నుంచి పునర్ముద్రణ*



అందరికీ

శ్రీ శుభకృత్ నామ వత్సర

# ఉగాది

శుభాకాంక్షలు